

శిథిలాలయం

ారుప్ప కనుమల్లోని పర్వతారణ్య ంతాల్లో శబరజాతి వాళ్ళు నివశించే ల్లెలు అనేకం వుండేవి. వాటిలో కుంభార ట్ట అనే పల్లెకు శివాలుడు అనే వాడు యకుడు. అతడు అరవైఏళ్ళు పైబడిన ద్ధుడు. అతడికి పద్దెనిమిదేళ్ళ యీడు డైన శిఖిముఖి అనే కుమారుడున్నాడు.

శిఖిముఖి అంటే తండ్రికి పంచ ాణాలు. అందుక్కారణం అతడు శివా డికి నడివయను దాటింతర్వాత కలిగిన క సంతానం కావటం.

తన తరవాత పల్లెకు నాయకత్వం ్వాంచవలసిన వాడు శిఖిముఖి కావటం త శివాలుడు కొడుక్కు బాల్యప్రాయం ీ తగిన గురువులను పెట్టి కర్ర కత్తి సాము, అరణ్యంలో, నదుల్లో వేటాడి ఆహారం సంపాదించే విద్యలూ నేర్పించాడు. వీటన్నిటిలో శిఖిముఖి తన పదిహేనవ ఏట నుంచే నిపుణుడనిపించుకున్నాడు. కుంభార మిట్టలోనే గాక, ఆ చుట్టు పక్కల వున్న మరే శబరపల్లెలో కూడా అతణ్ణి మించిన వేటకాడూ, ధైర్యశాలీ, ఉపాయశాలీ లేడు.

శిఖిముఖిని నలుగురూ మెచ్చుకునే ప్పుడు శివాలుడు ఎంతో సంతోష పడేవాడు. కాని, అంత సంతోషంలోనూ అతడికి కొడుకును గురించి ఆవగింజంత విచారం కూడా వుండేది. తనలాగే కొడుకును కూడా చదువ రాయ నేర్చిన వాణ్ణిగా చేయాలని శివాలుడు ఎంతో ప్రయత్నించాడు. కాని, అది ఫలించలేదు.






కుంభారమిట్టకు చుట్టూ, నూరు నూట యాభై కోసుల దూరంలో చదవటం రాయటం చేతనైన శబరజాతి వాడు ఒక్క శివాలుడు తప్ప మరెవరూ లేరు. శబరులు ఆటవికులు. అరణ్యాలూ, కొండలే వాళ్ళ నివాసస్థానాలు. వేటా, పశు సంపదే వాళ్ళ జీవనాధారం. వాళ్ళకు నగర జీవితం తెలీదు, నాగరికులతో ఎలాంటి పొత్తూ లేదు. ఆ పరిస్థితుల్లో చదువు సంధ్యల్లాంటివి వాళ్ళకు కొరగాని విషయాలుగా కనబడటంలో ఆశ్చర్యం లేదు. కాని, శివాలుడు యువకుడుగా వున్నప్పుడు ఒక క్షత్రియుడి వెంట దేశదేశాలూ తిరిగి రణకౌశలం,

చదువూ రాయా నేర్చుకున్నాడు. వాటి
జీవితంలో అతడికి ఎన్నో ప్రయోజన
కనిపించినై. శిఖిముఖి మాత్రం యీ
యంలో తండ్రికి చాలా ఆశాభంగం
గించాడు.

రోజూ సూర్యోదయంతోనే శిఖిము
విల్లంబులూ, ఈటే తీసుకుని, వేటకై
ణ్యానికి పోతున్నానని తండ్రికి చెప్ప
మామూలు. తిరిగి అతను అరణ్యాన్ను
పల్లెకు రావటం సూర్యాస్తమయ
తర్వాతనే.

ఒకనాటి ఉదయం శిఖిముఖి తండ్
చెప్పి వేటకు బయలుదేరాడు. వె
ఎర్రగండు అనే అతడి వేటకుక్క వున్
దాన్ని చిన్న పిల్లగా అతడే సాకి
చేశాడు. అది ధైర్యంలో సింహం, జిత్తు
గుంటనక్క. అరణ్యంలో వాళ్ళిద్ద
ఒకళ్ళకొకళ్ళు తోడుగా తిరుగుతూ వేట
వాళ్ళు. ఎర్రగండు పసిగట్టి ముందు
చూపేది, శిఖిముఖి దాన్ని అనుసరి
పోయి మృగాలను వేటాడేవాడు.

శిఖిముఖీ, ఎర్రగండూ అరణ్యం
చాలాదూరం పోయారు. ఆ రోజెందుచే
మిట్టమధ్యాహ్నం వేళ అయినా, వాళ
ఒక్క లేడి గాని, అడవిదున్న గాని, అ






పందిగాని కనిపించలేదు. అరణ్యం ఎందు వల్లనో నిశ్శబ్దంగా వున్నది. అప్పుడప్పుడూ కోతులు చెట్లల్లో కిచకచ మంటూ అరిచి, కొమ్మల్లో దూరి దాక్కుంటున్నవి. ఎక్కడో సింహం, మరెక్కడో పులీ పరిగెత్తుతూ అరిచినట్టుగా ధ్వని ఇప్పు డిక్కడా మరు క్షణం మరో దిక్కు నుంచీ వస్తున్నది.

"ఇంత నిశ్శబ్దం ఏమిటి? అరణ్యాని కేమన్నా సుస్తీ చేసిందా? వేట జంతువు లన్నీ ఎక్కడ దాక్కున్నయి? సింహం, పులీ అలా దౌడు కెత్తుతున్నయ్యేం?" అంటూ శిఖిముఖి ఎర్రగండు కేసి చూశాడు. ఎర్రగండు నేల మూచూస్తూ కొద్ది దూరం పోయి, యజమాని వెంటరాక పోవటంతో, ఆగి చిన్నగా మొరగసాగింది.

శిఖిముఖి కుక్క కేసి గుచ్చి చూస్తూ, "ఏమిటీ, ఎండ తాపానికి నీ కేమైనా పిచ్చెత్తుతున్నదా? నీ మొరుగుడుకు చుట్టు పక్కల కోసు దూరంలో వున్న జంతువులైనా బెదిరి పారిపోతై," అన్నాడు.

ఎర్రగండు కొద్ది సేపు వూరుకుని మళ్ళీ నేలను వాసన చూసి, ముందుకు పరిగెత్తి శిఖిముఖి కదలక పోవటంతో వెనుదిరిగి వచ్చి, అతడి చుట్టూ గిరికీలు కొట్ట సాగింది. కుక్క ప్రవర్తనకు ఆశ్చర్యపడుతూ శిఖి



ముఖి అక్కడున్న ఒక ఎండు మోడు పై కెక్కి నిలబడి కుక్క పరిగెత్తబోయిన దిక్కు కేసి చూశాడు. అతడికి ఒక్కొక్కగా నొక్క జంతువు గాని, మనిషి గాని కని పించ లేదు. కుక్క మాత్రం యింకా చిన్నగా మొరుగుతూనే వున్నది.

ఎర్రగండు కున్న పశికట్టె శక్తి గురించి బాగా తెలిసినవాడు కావటంతో శిఖిముఖి, కుక్కను ఓ సారి దువ్వి అందుబాటులో వున్న ఒక చెట్టు పై కెక్కి అక్కణ్ణుంచి, అది పరిగెత్తబోయిన దిక్కు కేసి పరీక్షగా చూశాడు. అతడి దృష్టి ఒక వింత అశ్వికుడి పైన పడింది. అశ్వం, రౌతూ కూడా కప






రెండుసార్లు రాజుగారి సైనికుల్ని చూశాడు గాని వాళ్ళిలా నిలువెల్లా కవచం ధరించి కనబడలేదు.


ఆ అశ్వికుడి కేసి వింతగా చూసున్న శిఖిముఖికి మరింత ఆశ్చర్యం, భయం కొలిపే మరొక దృశ్యం కంట బడింది. ఏడెనిమిది మంది మనుషులు — వాళ్ళ దుస్తుల తీరును బట్టి దారిదోపిడిగాళ్ళలా వున్నారు — అశ్వికు డొస్తున్న మార్గానికి పైన వున్న చెట్లకొమ్మల్లోంచి, అతడికి వెనకా ముందూ ఒక్కసారిగా కిందికి దూకారు. గుర్రం బెదిరించి. అశ్వికుడు దాన్ని కళ్ళెం లాగి ఆపుతూ, పెద్దగా సింహ నాదం చేసి, ఒర నుంచి కత్తి దూసి వాళ్ళతో తలపడ్డాడు.

శిఖిముఖికి ప్రమాదంలో చిక్కుకున్న ఆ అశ్వికుణ్ణి చూసి చాలా జాలి కలిగింది. ఒకడి మీద పదిమంది కత్తులెత్తటం అధర్మం, సహించరానిది. శత్రుబలం చూసి లొంగిపోక, అంతమందినీ ఏకాకిగా ఎదిరించి పోరాటానికి ఉపక్రమించిన అశ్వికు డంటే అతడి కెంతో గౌరవభావం కలిగింది. అతడు ఎర్రగండును హెచ్చరించి, చెట్ల ఊడలు పట్టుకుని వూగుతూ, క్షణాల మీద అశ్వికు డున్న ప్రాంతం చేరాడు.

చాలు ధరించి వున్నారు. రౌతు నడుం నుంచి పొడవాటి కత్తి ఒకటి వేలాడు తున్నది. కుడిచేతిలో పెద్ద ఈటె నొకదాన్ని ఎత్తి పట్టుకుని వున్నాడు. దాని అలుగు నుంచి ఒక చిన్న పతాకం — ఎరుపూ పసుపూ రంగులు గలది, గాలికి రెపరెప లాడుతున్నది.

"ఇత నెవడో, అయ్యా చెప్పే పురాణ కథల్లోని అతిరథుడో, మహారథుడో అయి వుంటాడు. వెంట రథం లేదే? ఆహా, భలే వేషం!" అనుకుంటూ శిఖిముఖి నవ్వ సాగాడు. కవచాలు ధరించిన యోధుల్ని అత డింతవరకూ చూసి ఎరగడు. ఒకటి




CHITRA






"శబరమాతకూ, జై!" అంటూ శిఖిముఖి చెట్టు మీది నుంచి దొంగల మధ్యకు దూకాడు. ఈలోపల ఎర్రగండు ఒక దొంగ మీది కురికి, వాడి కంఠం పట్టుకునేందుకు పైకెగిరింది. అశ్వికుడు ఒక్క క్షణకాలం యీ వచ్చినవాడు శత్రువో మిత్రుడో అన్న అనుమానంతో స్థాణువులా అయిపోయి, శిఖిముఖి ఈటెను దొంగల మీదికి గురిచేయుటం చూసి, "మిత్రమా! యీ దుర్మార్గుల్లో ఒక్కణ్ణి కూడా ప్రాణాలతో పోనివ్వకూడదు," అని కేక వేశాడు.

ఈ లోపల అశ్వికుడు వాహనం మీద వుండే దొంగలను కత్తితో ఎడాపెడా కొడుతూ, "విక్రమకేసరి కత్తి బలి కోరుతున్నది! నీచుల్లారా పారిపోక నిలబడండి, నా ప్రతాపం తెలుస్తుంది," అంటూ కేకలు పెడుతున్నాడు. ఇంతలో ఒక దొంగ, చాటుగా వుండి గుర్రం కాలికి గురిచేసి కత్తి విసిరాడు. గుర్రం గాయపడి వేగంగా పక్కకు తిరిగింది. అశ్వికుడు ఆ కుదుపుకు కిందపడి, అంతలోనే లేచి నిలబడి, ఈసారి కత్తి, ఈటె రెంటినీ రెండు చేతుల్లో పట్టుకుని, పెద్దగా హుంకరించి దొంగలను ప్రతిఘటించసాగాడు.

ఇంతలో అరణ్యంలో ఎక్కడో దూరం నుంచి ఎవరో పెద్దగా ఈల వేశారు. మరు క్షణం దొంగలు అశ్వికుణ్ణీ, శిఖిముఖినీ విడిచి కలిసికట్టుగా అక్కణ్ణించి పారిపోసాగారు. బరువైన కవచం ధరించి వుండటంతో అశ్వికుడు వాళ్ళను వెంబడించలేకపోయాడు. శిఖిముఖీ, ఎర్రగండూ వాళ్ళను కొంత దూరం తరిమి, వాళ్ళు అందకుండా గుబురు చెట్లల్లోకి పారిపోవటంతో వెనుతిరిగి అశ్వికుడున్న చోటుకు వచ్చారు.

వాళ్ళు వచ్చేసరికి అశ్వికుడు తన గుర్రానికి తగిలిన గాయాన్ని పరీక్షిస్తున్నాడు. శిఖిముఖి అతణ్ణి సమీపించి, "ఆ దుష్టులు





అందకుండా పారిపోయారు. ఈ అరణ్యంలో మీరు ఒంటరిగా ప్రయాణం చేయవలసింది కాదు. మీరేం గాయపడలేదు కదా?... అదృష్టం. గుర్రం గాయానికి మందు వేద్దాం వుండండి," అంటూ దాపుల నున్న చెట్ల దగ్గిరకు పోయి ఆకులు కోయసాగాడు.

అశ్వికుడు మారుమాట్టాడ కుండా శిఖి ముఖిని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూస్తూ వుండి పోయాడు. అతడికి ఈ యువకుడు ఆటవిక జాతివాడని తెలుస్తూనే వున్నది. శబరమాతకూ, జై, అంటూ దొంగల మధ్యకు దూకాడు. బాగానే వున్నది. నిజంగా యితడు శబరుడేనా? ఇందులో మోసం ఏమీ లేదు కదా—అశ్వికు డిలా ఆలోచిస్తున్నాడు.

శిఖిముఖి అశ్వాన్ని సమీపించి దాని గాయానికి ఆకుపసరు పూస్తూ, అశ్వికుడితో, "మీ పేరేమిటి? ఒంటరిగా అరణ్యంలో తిరుగుతున్నారేం?" అని ప్రశ్నించాడు.

అశ్వికుడు జవాబు చెప్పేందుకు ఓ క్షణ కాలం తటపటాయించి, "మనిద్దరం సమాన వయస్కులం, పద్దెనిమిదీ యిరవై ఏళ్ళ వయసు వాళ్ళం, అవునా? ముసలి వాళ్ళలాగా మీరూ మీరూ అని మాట్టాడు కోవటం ఎందుకు? అది సరే. నీ ప్రశ్న



లకు జవాబిచ్చే ముందు నే నొక ప్రశ్న అడగవలసి వుంది," అన్నాడు.

"ఏమిటా ప్రశ్న?" అని అడిగాడు శిఖిముఖి, అశ్వికుడి మాటలకు కొంచెంగా ఆశ్చర్యపడుతూ.

"నీవు శబరజాతివాడివి, అవునా?" అన్నాడు అశ్వికుడు.

"అవును, నా పేరు శిఖిముఖి. మీ... నీ పేరు?" అన్నాడు శిఖిముఖి.

"శిఖిముఖి!" అంటూ అశ్వికుడు కళ్ళింత చేసుకుని తలాడిస్తూ, "అది, నీ తాత పేరు. అవునా? నా పేరు విక్రమ కేసరి, యిది మా తాత పేరు. మీ తండ్రి

శివాలుడు, ఆ విక్రమకేసరిని గురించి నీకు చెప్పే వుండాలే. ఆయన క్షేమంగా వున్నాడు గదా?" అని ప్రశ్నించాడు విక్రమకేసరి.

విక్రమకేసరి మాటలు వింటూంటే శిఖిముఖికి ఏదో కల గంటున్నట్టుగా వున్నది. తను జన్మలో అతణ్ణి చూడటం తటస్థపడుతుందని అత డేనాడూ అనుకోలేదు...


"నా తండ్రి క్షేమంగానే వున్నాడు. మీ తాతగారిని గురించి నేను చాలా విన్నాను. మీది శూరసేన దేశం కాదా? నీ ప్రయాణం మా పల్లెకే అని తెలిసిపోయింది. కాని, యిదంతా నాకు నమ్మశక్యం కాకుండా వున్నది," అన్నాడు శిఖిముఖి

"ఇంకా నమ్మశక్యం కాని సంగతు లనేకం మీ ఇంటికి చేరింతరవాత తీరిగ్గా చెబుతాను. ఇంతకుముందు నన్ను చుట్టుముట్టినవాళ్ళు కేవలం దొంగలు కాదు. వాళ్ళకు కావలసింది, యీ జీనుకు వేలాడుతున్న సంచీయే కాక, నా ప్రాణం కూడా. కనక మనం త్వరగా మీ పల్లె చేరటం క్షేమం," అన్నాడు విక్రమకేసరి.

ఆసరికి శిఖిముఖికి తామున్న ప్రదేశం ఎంత ప్రమాదకరం అయిందో తెలిసివచ్చింది. దొంగలు ఏ చెట్లచాటునో పొంచి వుండి తిరిగి మీద పడేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తూంటారు...

గాయపడిన గుర్రాన్ని నడిపించుకుంటూ శిఖిముఖీ, విక్రమకేసరీ కుంభారమిట్ట పల్లెకు బయలుదేరారు. దారిలో శిఖిముఖి ఒక అడవిపందిని కొట్టి భుజాన వేసుకున్నాడు. దొంగల నుంచి మరే ప్రమాదం ఎదురవలేదు. కాని, చీకటి పడిన కొంతసేపటికి వాళ్ళు పల్లెను సమీపించేసరికి, శివాలుడూ మరికొందరూ అరణ్యం కేసి వస్తున్నారు. శిఖిముఖిని ముందుగా చూసిన పల్లెవానులు కొందరు ఉత్సాహంగా కేకలు వేస్తూ, అతడి దగ్గరకు పరిగెత్తుకురాసాగారు. —(ఇంకా వుంది)





శిథిలాలయం

2

[శిఖిముఖి అనే శబరయువకు డొకడు అరణ్యానికి వేటకు వెళ్ళి, అక్కడ కవచం ధరించివున్న అశ్వికయోధు డొకడి మీద దొంగలు దాడి చేయటం చూసి, అతడికి సహాయం చేశాడు. ఆ యోధుడు తన పేరు విక్రమకేసరి అని చెప్పాడు. ఇద్దరూ కలిసి చీకటివేళ పల్లెను సమీపించేంతలో, పల్లెవాసులు వాళ్ళ కేసి పరిగెత్తుకు రాసాగారు. తరవాత—]

శిఖిముఖి తన కేసి వచ్చే పల్లెవాసుల్ని చూసి ఆశ్చర్యపడ్డాడు. వాళ్ళందరూ ఆయుధాలు ధరించి వున్నారు. ముందుగా అతణ్ణి సమీపించిన శబరులు అతడి చుట్టూ చేరి కేకలు వేస్తూ, పాటలు పాడసాగారు.

"ఈ గొడవంతా ఏమిటి? పల్లెపల్లెంతా కదిలినట్టుందే. ఏం జరిగింది?" అని అడిగాడు శిఖిముఖి, తన చుట్టూ చేరి గంతులు వేస్తున్నవాళ్ళను.

"అరణ్యంలో నిన్నూ, మరొక వింత మనిషినీ కొండదొంగలు చంపేశారని విని, పల్లె పెద్దతోపాటు అందరం బయలుదేరాం. అడవిలో గొడ్లను మేపే పల్లెపిల్లలు చెప్పింది అబద్ధం అయినా కావాలి, లేదా నువ్వూ, ఆ ఇనపమనిషీ కలిసి కొండ దొంగలను చంపయినా వుండాలి," అన్నారు వాళ్ళు.

శిఖిముఖి పెద్దగా నవ్వుతూ విక్రమకేసరి దగ్గిరకుపోయి, "చూశావా! మా పిల్ల



కారు వెధవలు గోరంతదాన్ని కొండంత ఎలా చేస్తారో. మనం దొంగల చేతిలో చచ్చి పోయామనే, వాళ్ళు పల్లెకుపోయి చెప్పారట. నీకు వాళ్ళు పెట్టిన పేరు ఇనప మనిషి," అన్నాడు.

విక్రమకేసరి కిదంతా మంచి వినోదంగా వున్నది. పల్లెవాసుల ఐకమత్యానికీ, తమ నాయకుడి కుమారుడంటే వాళ్ళకున్న వాత్సల్యాభిమానాలకూ అతడు చాలా సంతోషపడ్డాడు. తన తండ్రి తలపెట్టిన సాహసకార్యానికి నిజంగా తోడ్పడగలవాళ్ళు యీ శబరులన్న నమ్మకం అతడికాక్షణంలో కలిగింది.




శివాలుడు మరి కొందరితో కలిసి తన కొడుకున్న చోటుకు రాగానే, అప్పటివరకూ శిఖిముఖి చుట్టూ చేరి గడబిడ చేస్తున్న వాళ్ళందరూ పక్కకు తప్పుకున్నారు. శివాలుడు తన కొడుకును సమీపించి కౌగలించుకున్నాడు. అంతలో కాగడా వెలుగు పైన పడటంతో విక్రమకేసరి అతడి కంట బడ్డాడు.

శివాలుడు ఒక్క క్షణకాలం నిశ్చేష్టుడై పోయి, విక్రమకేసరిని కన్నార్పకుండా చూస్తూ, అతడి కేసి రెండడుగులు వేసి, "ఎవరూ, విక్రమకేసరి దొరా?" అన్నాడు ఆనందం ఆశ్చర్యం కనబరుస్తూ.

విక్రమకేసరి అతణ్ణి సమీపించి నమస్కరిస్తూ, "నేను విక్రమకేసరినే, కాని మీరు నన్నెరగరు," అన్నాడు.

శివాలుడు, విక్రమకేసరిని వింతగా చూస్తూ, "అవును, నలభైఏళ్ళనాటి మాట! ఆ దొరా నా వయసువాడే, ముసలివాడు కాకుండా ఎలా వుంటాడు? మేం యిద్దరం నీ వయసువాళ్ళమై వుండగా చక్రవర్తి సేనలో చేరి ఉత్తరాన బ్రహ్మపుత్రానదీ లోయల వరకూ జైత్రయాత్ర చేసి, చక్రవర్తికి అంతులేని ధనం, కీర్తి సంపాయించి పెట్టాం. ఇంతకూ నీవెవరు? మళ్ళీ ఆనాటి





దొర విక్రమకేసరినే చూశానని భ్రమ పడ్డాను," అన్నాడు.

"నేనా విక్రమకేసరి మనవడిని. నా పేరూ విక్రమకేసరే. నా తండ్రిగారు మీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లా డేందుకు నన్ను పంపారు," అన్నాడు విక్రమకేసరి.

"ఆశ్చర్యంగా వుంది. మీ తాతగారు చని పోయారని కూడా విన్నాను. అయినా, నీ రూపం నన్ను భ్రమింపజేసింది. మీ నాన్న గారు జయపాలుడు క్షేమమా? ఈ శబరుణ్ణి ఆయన గుర్తుపెట్టుకోవటమే గాక, తన కుమారుణ్ణి ఒక ముఖ్య విషయం మాట్లా డేందుకు పంపటం, నాకు అబ్బురం కలిగి స్తున్నది. సంస్థానాధీశులైన మీ తండ్రిగారు యీ శబర పల్లెపెద్దతో సంప్రతించవలసిన అంత గొప్ప విషయం ఏమిటి?" అని అడిగాడు శివాలుడు.

"అదంతా మీ పల్లె చేరిం తరవాత చెపు తాను. నన్ను మీ పల్లె చేరకుండా అటకా యించేందుకు కొందరు దుర్మార్గులు అరణ్యంలో చాలా పెద్ద ప్రయత్నం చేశారు," అన్నాడు విక్రమకేసరి.

"ఆ సంగతి తెలిసే మేమంతా అరణ్యా నికి బయలుదేరాం. శిఖిముఖి వెంట వున్నది,



నా పూర్వ యజమాని మనవడని మాత్రం నాకు తెలియదు. ఎవరో ఇనపమనిషి అంటూ పిల్లలు చెప్పారు. సరే, ఇద్దరూ క్షేమంగా బయటపడ్డారు. పల్లెకుపోదాం పదండి," అన్నాడు శివాలుడు.

అరగంట తరవాత అందరూ పల్లె చేరే సరికి, శివాలుడి ఇంటిదాపున చాలామంది ఆడవాళ్ళు గుంపుగా చేరి గొడవగా మాట్లాడు కుంటున్నారు. వాళ్ళందరి చేతుల్లోనూ నీళ్ళ కడవలున్నాయి. శివాలుడూ, అతడి వెంట వున్న పల్లెవాసులూ అడిగిన మీదట, తాము నీరు తెచ్చుకునేందుకు కొలను కెళ్ళామనీ, అక్కడ కొందరు కొత్తవాళ్ళ




కనిపించి, శివాలుడి యిల్లెక్కడ అని అడిగారనీ చెప్పారు. వాళ్ళు చూడటానికి దారిదోపిడిగాళ్ళలా వున్నారనీ, అందరి చేతుల్లోనూ ఆయుధాలున్నవనీ కూడా చెప్పారు.

ఒకటికి రెండుసార్లు ప్రశ్నించిన మీదట ఆడవాళ్ళు ఆ కొత్తవాళ్ళు ధరించిన దుస్తుల తీరూ అదీ వర్ణించారు. వాళ్ళు చెప్పిందానికీ, అరణ్యంలో గొడ్లకాచే పల్లెపిల్లలు దొంగల్ని గురించి చెప్పిందానికీ సరిపోయింది. శివాలుడు అక్కడ ఎవరితోనూ ఏమీ అనక, తన ఇల్లు చేరగానే విక్రమకేసరితో, "ఆ దొంగలెవరో కాని గొప్ప సాహసికులుగా వున్నారు. తా మెరగని ప్రాంతాలకు వచ్చి, శబర పల్లెపెద్ద ఇంటి మీదే దాడిచేయాలని చూస్తున్నట్టు కనబడుతున్నది. ఎంత ధైర్యం!" అన్నాడు.

"వాళ్ళు ఒక వేళ యీ ఇంటి మీదికి దాడివస్తే, మీ కోసంకాదు, నా కోసం. నేనూ, శిఖిముఖీ కలిసి పల్లె కేసి బయలుదేరటం వాళ్ళు చూసివుంటారు. వాళ్ళకి కావలసింది నా ప్రాణం కన్న యీ సంచీలో వున్న వస్తువులు," అంటూ విక్రమకేసరి గుర్రంజీను నుంచి వేలాడుతున్న సంచీ విప్పి, శివాలుడికి అందించాడు.

శివాలుడు ఆ సంచీని భద్రంగా గదికి ఒక మూలవున్న కులదేవతల విగ్రహాల ముందుపెట్టి, "రాత్రి చాలావుంది, అంతా తీరిగ్గా మాట్లాడుకోవచ్చు. ముందు తిండీ తిప్పల సంగతి చూద్దాం," అన్నాడు.

ఆ తరవాత అందరూ రకరకాల మాంసాలతో, పానీయాలతో తృప్తిగా భోజనం చేశారు. శివాలుడు గోడకానుకుని కూర్చుని గుడుగుడులో పొగాకు తుంపివేసి, నిప్పంటించి పొగపీలుస్తూ, ఎదురుగా గొంగళ్ళు పరిచిన చాప మీద కూర్చుని వున్న విక్రమకేసరీ, శిఖిముఖుల కేసి చిరునవ్వు నవ్వుతూ చూసి, "మీ ఇద్దర్నీ పక్కపక్కల చూస్తూంటే, నాకు విక్రమకేసరి దొర గుర్తు


CHITRA



కొస్తున్నాడు. ఆయన మనవడు ఒకానొక రోజు నా ఇంటికొచ్చి అతిథిగా వుండబోతాడని నే నేనాడూ ఊహించలేదు," అన్నాడు.


"నా తండ్రిగారు కూడా నేను శూర దేశం నుంచి యింత దూరం ప్రయాణం చేయవలసి వస్తుందని కలలో కూడా అనుకుని వుండడు. ఆయన మా తాతగార్ని గురించీ, మిమ్మల్ని గురించీ చాలా అద్భుత విషయాలు చెపుతూండేవాడు. కాని....మీకు యిప్పటివరకూ తెలియని సంగతొకటి పుతాను. మా తాతగారు విక్రమకేసరి ఇప్పటికి ఇరవై సంవత్సరాల క్రితం తిరిగి మరొకసారి బ్రహ్మపుత్రానదీ ప్రాంతాలవున్న




కామాఖ్య నగరం కేసి వెళ్ళాడు. ఇంత కాలమైనా తిరిగి రాలేదు. చనిపోయి వుంటాడనుకున్నాం. ఇప్పటికి రెండు నెలలక్రితం అందిన వర్తమానాన్ని బట్టి, ఆయన యింకా సజీవుడేమో అన్న అనుమానం కలుగుతున్నది," అన్నాడు విక్రమకేసరి.

ఆ మాటలు వింటూనే శివాలుడు ఆశ్చర్యపడుతూ విక్రమకేసరి కేసి తేరిపార చూసి, "కేసరిదొర మరొకసారి ఆ బ్రహ్మపుత్రానదీ ప్రాంతాల్లోని అరణ్యాల కేసి వెళ్ళారా? ఇది జరిగి ఇరవై ఏళ్ళయి వుంటే—మాటమాత్రంగా మనిషితో కబురు పెట్టివుంటే నేనూ ఆయన వెంట బయలుదేరేవాణ్ణో. ఇంతకూ ఆ దొర మళ్ళీ అంతదూరం ఎందుకెళ్ళినట్టు?" అని ప్రశ్నించాడు.

"అదేదో చాలా నిగూఢ రహస్యం అనీ, తాను చచ్చేలోపల సాధించి తీరవలసిన కార్యమనీ, మా తండ్రిగారితో చెప్పారట. అంతకన్న వివరాలేమీ చెప్పలేదు. కాని, రెండు నెల్లక్రితం మా సంస్థానం వాడే అయిన ఒక పండితుడు ఆ ఉత్తర దేశాన్నుంచి తిరిగి వచ్చి, మా తాతగారి పస్తువులంటూ కొన్ని మా నాయనగారికి ఒప్పచెప్పాడు. వాటిలో ఎక్కువ భాగం








తాళపత్ర గ్రంథాలు. అతడు చెప్పేదాన్ని బట్టి మా తాతగారు అక్కడి కొండల్లో ఎక్కడో సన్యాసిగా జీవిస్తున్నాడని తెలుస్తున్నది. అయినా అందుకు గట్టి రుజువేమీ లేదు," అన్నాడు విక్రమకేసరి.

శివాలుడు కొంచెంసేపు తల వంచుకు ఆలోచిస్తూ వూరుకుని, "నువు చెప్పేది వింటూంటే నాకు మతిపోతున్నట్టుగా వున్నది. ఆ దొర మళ్ళీ ఆ ఘోరారణ్య ప్రాంతాలకు ఎందుకెళ్ళాడు? ఆ నిగూఢ రహస్యం ఏమిటి? ఆయన వస్తువులు మీ సంస్థాన పండితుడి కెలా దొరికినై?" అని అడిగాడు. విక్రమకేసరి పండితుడు చెప్పిన దంతా శివాలుడికి కొద్దిమాటల్లో చెప్పేశాడు:


ఆ పండితుడు బాల్యంలోనే ఇల్లు విడిచి నానా దేశాలూ తిరిగి, శాస్త్రవిద్యలన్నీ నేర్చుకుని వృద్ధాప్యంలో తిరిగి ఇంటికి చేరాడు. ఆయన బ్రహ్మపుత్రానదీ ప్రాంతాల్లోని అరణ్య ప్రదేశాల్లో చాలాకాలం నివశించాడు. అక్కడ వుండే ఆటవికులకు రోగాలూ రొప్పలూ వస్తే మందుమాకు లిచ్చి సహాయపడ్డాడు. ఆ ఆటవికుల్లో అనేక జాతులవాళ్ళూ, భాషలవాళ్ళూ వున్నారట. వాళ్ళల్లో ఇభ్యు లనే ఏనుగులను మచ్చిక చేసే జాతివాళ్ళు, ఆ పండితుడి జన్మదేశం అవీ తెలుసుకుని, తమ పల్లెలో విక్రమకేసరి అనే క్షత్రియుడు కొంతకాలం తన నౌకరుతో నివశించాడనీ, అతడికి మన్నె జ్వరం రాగా అడవికి మూలికల కోసం పోయినప్పుడు పులి ఎత్తుకుపోయిందనీ చెప్పారట. ఆయనకు సంబంధించినవే అంటూ కొన్ని తాళపత్రగ్రంథాలూ, చిన్న కత్తి వగైరా ఆ పండితుడికి ఒప్పచెప్పారు. కాని, ఆయన ఆ అరణ్యంలో మరొక ప్రాంతానికి వెళ్ళినప్పుడు, విక్రమకేసరి అన్న పేరుగల సుక్షత్రియు డొకడు అఘోరీ లనే సన్యాసులతో కొండల్లో నివశిస్తున్నట్టు మరికొందరు చెప్పారట. ఆ పండితుడు



ఆ సన్యాసుల్లో చాలామందితో మాట్లాడి చూశాడు. కాని, ఉన్మాదనటమే తప్ప మా తాతగారు ఎక్కడ వున్నదీ వాళ్ళల్లో ఏ ఒక్కడూ చెప్పలేకపోయాడు. ఇదంతా విన్న మీదట మా నాయనగారు, మా తాతగారి వస్తువులనబడే వాటినన్నిటినీ యీ సంచీలో పెట్టి మిమ్మల్ని కలుసుకుని మాట్లాడితే ప్రయోజనం వుంటుందేమో అని నన్నిక్కడికి పంపారు. సంచీలో వున్న తాళపత్ర గ్రంథాల్లో కొన్ని మా తాతగారు స్వహస్తంతో రాసినవి. అవి చదివితే మీకు ఆయన ఏ నిగూఢ రహస్యాన్ని భేదించేందుకు ఆ ప్రాంతాలకు వెళ్ళాడో తెలియవచ్చు. అంతేకాక వాటిద్వారా మీరు ఆయన సజీవుడో కాదో కూడా గ్రహించగలరని మా తండ్రిగారు ఆశపడుతున్నారు.

విక్రమకేసరి చెప్పినదంతా శ్రద్ధగా విన్న శివాలుడు కొద్దిసేపు మౌనంగా వూరుకుని, హఠాత్తుగా ఏదో జ్ఞప్తికి వచ్చినవాడిలా తుళ్ళిపడి, "బహుశా, కేసరిదొర నిగూఢ రహస్యం అనేది శిథిలాలయానికి సంబంధించినదికాదు గదా? ఒకవేళ అదే అయితే, ఆ ఆలయాన్ని చేరటంకన్న హిమాలయాల్లోని కైలాసగిరి శిఖరం ఎక్కటం తేలిక. శిఖీ, ఆ సంచీ యిటు తీసుకురా," అని తన కొడుకును హెచ్చరించాడు.

శిఖిముఖి లేచి కులదేవతల విగ్రహాల ముందున్న సంచీ తీసుకుని తండ్రి దగ్గిరకు వచ్చి, దాన్ని అతడి చేతికి అందించబోయాడు. ఇంతలో వీధి వైపుకువున్న తలుపును చీకటి కమ్మినట్టయింది. నల్లని దుస్తులు ధరించిన ఒక వ్యక్తి--అరున్నరా ఏడడుగుల పొడవుగల మరీ బక్కపలచని వాడు, తల మీద గుడ్లగూబ ఆకారంలో వున్న శిరస్త్రాణం ధరించి—వాళ్ళముందు ప్రత్యక్షమయాడు. శివాలుడూ, శిఖిముఖీ, విక్రమకేసరీ ఆ వికృతాకారాన్ని చూస్తూనే నిర్విణ్ణులయారు. —(ఇంకా వుంది)





శిథిలాలయం

3

[శివాలుడి వెంట పల్లెవాసులందరూ తిరిగి శబరపల్లె చేరారు. విక్రమకేసరి, శివాలుడికి తాళపత్రాలున్న ఒక సంచి చూపి, తన తాత మరీచపాది బ్రహ్మపుత్రానదీ లోయలకేసి వెళ్ళారని చెప్పారు. శివాలుడు, శిబిరములోని సంచి తెమ్మని చెప్పేంతలో, ఒక వికృతాకారుడు వారి ముందు ప్రత్యక్షమయ్యాడు. అందరూ నివ్వెరపోయారు. తరవాత—]

వికృతాకారుడు నిశ్శబ్దంగా అడుగులో అడుగు వేసుకుంటూ శివాలుణ్ణి సమీపించి, "మీరందరూ బలవన్మరణం పాలుకాదలచకపోతే, ఆ సంచీ యిటుయివ్వండి. నేను గత వెయ్యేళ్ళుగా శిథిలాలయం పూజారిని. దాన్ని చూడదలిచి బ్రహ్మపుత్రానదీ లోయలకేసి వచ్చిన వాడెవడూ యింత వరకూ ప్రాణాలతో బయటపడలేదు," అంటూ సంచీ కోసం చేయిచాచాడు.

అంతలో శివాలుడు తాను మునిగిన భయసంభ్రమాల నుంచి తేరుకుని, వికృతాకారుడి కేసి తీక్షణంగా చూస్తూ, "ఇంటికొచ్చిన అతిథిని—పిలవని పేరంటంగా వచ్చి దుర్భాషలాడే వాడినైనాసరే—తన్ని తగిలేయటం శబరులు చేయకూడని పనుల్లో ఒకటి. కనక, మర్యాదగా చెపుతున్నాను. వెంటనే బయటికి వెళ్ళిపో," అంటూ హుంకరించాడు.





"సరే, పోతున్నాను. శిథిలాలయ పూజారి శక్తిసామర్థ్యాలు నీకు తెలియవు. ఈ అవమానానికి ప్రతీకారం చేసి తీరుతాను. ఆ సంచీలో వున్న తాళపత్రాలు నీ వంశనాశనానికీ, విక్రమకేసరి వంశనాశనానికీ మాత్రమే ఉపయోగిస్తవి," అంటూ వికృతాకారుడు ద్వారం కేసి వెళ్ళి కనబడకుండా పోయాడు.

అతడు తలుపు తెరవటంగాని, మూయటంగాని ఎవరికంటాబడలేదు.

శిఖిముఖి, విక్రమకేసరి చప్పున లేచి ద్వారం దగ్గిరకు పోయి తలుపు తెరిచి బయటికి చూశారు. బయట అంతా చీకటి. వికృతాకారుడు కనిపించలేదు. ఇంటిచుట్టూ వున్న కంచెవారి దగ్గిర యిద్దరు ముగ్గురు శబరులు నిలబడి యింటికి కాపలా కాస్తున్నారు. శిఖిముఖి వాళ్ళను సమీపించి, "పిశాచంలా—అంత పొడుగున్న నల్లదుస్తులవాడు ఎటుపోయాడు?" అని ప్రశ్నించాడు.

"నల్లదుస్తులవాడా? అలాంటివాడెవడూ యిటు రాలేదే!" అంటూ కాపలివాళ్లు ఆశ్చర్యపోయారు. అంతలో ఎర్రగండు పెద్దగా మొరుగుతూ కొలను కేసి పరిగెత్త సాగింది. విక్రమకేసరి, శిఖిముఖి దాన్ని వెంబడించారు.

వాళ్ళిద్దరూ కొలనుప్రాంతం చేరేసరికి, కొలనులో దభీమంటూ ఏదో బరువైన వస్తువు పడినశబ్దం వినబడింది. కొలను చుట్టూ ఒత్తుగా పెరిగివున్న చెట్ల చాటున నీడల్లా మానవాకారాలు కదలటం కనబడింది. విక్రమకేసరి చిన్న గొంతుతో, "శిఖిముఖీ! అరణ్యంలో నన్ను దొంగచాటుగా ముట్టడించిన దుర్మార్గులకు, ఆ వికృతాకారుడు నాయకుడని తెలుస్తూనే వున్నది. వాణ్ణిగాని లేక వాడి అనుచరుల్లో ఒక్కగా నొక్కణ్ణయినా గాని మనం పట్టుకో గలిగితే, వికృతాకారుడి ఎత్తుగడలేమిటో మనం తెలుసుకోవచ్చు," అన్నాడు.





"బాగుంది. అలా అయితే యిద్దరం ఒకే దిక్కుకేసి వెళ్ళటంకన్న చెరొకవైపుగా పోవటం మంచిది. వాళ్ళు సాహసికులు, ఈ పెట ఉపయోగించటానికి వెనుదీయరు. గాయపడినవాడు దొరికినా మన ప్రయత్నం ఫలిస్తుంది," అంటూ శిఖిముఖి కొలనుకు ఎడమవైపు వున్న చెట్ల కేసి దౌడుతీశాడు. విక్రమకేసరి కుడివైపుకు పరిగెత్తాడు.




గుబురుచెట్ల వెనక నుంచి శిఖిముఖికి దొంగల మాటలూ, వాళ్ళు నడుస్తున్నప్పుడు కాలికింద పడిన ఎండుటాకులు చేసే కరకర ధ్వని వినబడింది. ఎర్రగంతు చాలా దూరం నుంచి మొరుగుతున్నది. అది అందరికన్న ముందు పోతున్న దొంగవాసనపట్టి వెంబడిస్తున్నట్టున్నది. కుక్కను వదిలిస్తే తనకెంతో సహాయంగా వుంటుంది. కాని, దొంగలకు తను వాళ్ళను వెంబడిస్తున్నట్టు తెలిసిపోతుంది. పల్లె యువకుల్ని ముందుగా హెచ్చరించి వున్నట్టయితే, వాళ్లందరి సాయంతో దొంగలను చుట్టుముట్టి పట్టుకునేవని. తనూ, విక్రమకేసరీ ఒంటరిగా బయలుదేరటం పొరబాటే అయింది. ఇప్పుడేం చేయాలి?....

శిఖిముఖి యిలా ఆలోచిస్తున్నంతలో దొంగల్లో ఒకడు కొంచెం బిగ్గరగా, "పదండి. పదండి. పూజారి దొర మూడోకన్ను తెరిచాడు!" అన్నాడు. ఆ వెంటనే నలుగురైదుగురు దొంగలు చెట్ల మాటు నుంచి గబగబా, బయటికి వచ్చి కొలనుకు అల్లంత దూరంలో వున్న మామిడితోపు కేసి పరిగెత్తసాగారు.

పూజారి దొర మూడోకన్ను తెరవటం ఏమిటి? అని ఆశ్చర్యపడుతూ శిఖిముఖి మామిడితోపు కేసి దృష్టి సారించాడు. అక్కడ ఒక మాను పక్కగా—ఆరేడడుగుల ఎత్తున ఏదో కాంతి కనురెప్పపాటులో ఆరుతూ వెలుగుతూ అతడి కంటబడింది. అది పూజారి మూడో కన్నా? అద్భుతం!





వాడు వెయ్యేళ్ళుగా శిథిలాలయానికి పూజారిగా వుంటున్నట్టు చెప్పాడు. ఇప్పుడు మూడో కన్ను తెరిచి చూస్తున్నాడు. ఇదంతా మోసమా లేక వాస్తవమా?...

శిఖిముఖి యిలాంటి సంశయాలతో కొట్టుమిట్టాడుతూనే మామిడితోపు కేసి పరిగెత్తబోయేంతలో, ఎర్రగండు దెబ్బతిన్నదానిలా కుయ్యోమ్మంటూ పెద్దగా అరిచింది. ఆ అరుపు వింటూనే శిఖిముఖి ఉగ్రుడైపోయాడు. తన కుక్కను దొంగల్లో ఎవడో గాయపరిచి వుంటాడు. వాళ్ళ నెత్తురు కళ్ళ చూడాల్సిందే. పూజారి గుండెల్లో ఈటె గుచ్చి తీరతాను. 'జై, శబరమాతా!' అంటూ శిఖి



ముఖి కేక పెట్టి, మామిడితోపులో వెలుగు కనబడుతున్న వైపుకు సూటిగా పరిగెత్తాడు.

అతడు తోపును సమీపించ బోతున్నంతలో అంతవరకూ మాను పక్కన కనబడుతున్న వెలుగు కాస్తా మాయమయింది. ఆ వెంటనే ఎవరో చిన్నగా మాట్లాడిన ధ్వని, నలుగు రైదుగురు నడిచి పోతున్న శబ్దమూ శిఖిముఖికి వినబడింది. అతడు ఆ శబ్దం వస్తున్న వైపుకు జాగ్రత్తగా నడవసాగాడు. చెట్ల మాటు నుంచి ఏ శత్రువైనా తన మీద కత్తి విసరవచ్చునన్న భయం అతడికి కలిగింది.

శిఖిముఖికి తనకు కొంచెం ముందుగా నడిచి పోతున్నవాళ్ళు మాట్లాడు కోవటం మరింత స్పష్టంగా వినబడింది. వాళ్ళు తనను చూసే అంత నిర్భయంగా వస్తున్నారా అనుకున్నాడతను. అంతలో దొంగల్లో ఒకడు కొంచెం పెద్దగానే, "అది కుక్క కాదు, పిశాచం. పూజారి దొరను చూస్తూనే కుయ్ఁకయ్ఁ అనకుండా దాని దవడలు నొక్కుకుపోయినై," అన్నాడు.

వాడు మాట్లాడుతున్నది తన ఎర్ర గండును గురించి. దాన్ని యీ నీచులు చంపారా? ఆ అనుమానం కలగ్గానే శిఖిముఖి కోపంతో ఒళ్లు మరిచాడు. ఆ స్థితిలో



అతడు వెనకా ముందులు చూసుకోకుండా, "దుర్మార్గులారా, ఆగండి! ఈటె దెబ్బ కాచుకోండి!" అంటూ ముందు కురికాడు. కాని, అతడు నాలుగైదు అంగలు వేశాడో లేదో, ఎడమ కాలి కింద భూమి చప్పున కుంగిపోయింది. ముందుకు పడబోయిన వాడల్లా తమాయించుకుని, కుడి కాలి ఊతంతో, ఎడమకాలును పైకి లాగబోయేంతలో, కాలికి తాడులాంటి దేదో గట్టిగా బిగుసుకు పోయి పైకి గుంజింది. మరు క్షణం శిఖిముఖి చెట్టుకొమ్మ కొసదానికి ఒంటికాలి పట్టుతో తలకిందులుగా వేళ్ళాడ సాగాడు. అదృష్టం కొద్దీ అతడి కుడి చేతిలో వున్న యీటె గుప్పెట పట్టు నుంచి జారిపోలేదు.

తను ఎంత ఘోర ప్రమాదంలో చిక్కు కున్నదీ శిఖిముఖి అర్థం చేసుకునే లోపలే చెట్ల చాటు నుంచి అపహాస్యం చేస్తున్నట్టు పకపక మంటూ నవ్వు వినిపించింది. ఆ వెంటనే ఒక గొంతు, "పూజారి దొరా! కొదమసింగాన్ని అనుకునేవాణ్ణి, కుందేలు పిల్ల కింద ఉచ్చులో పట్టేశాం. ఇప్పుడేం చేద్దాం?" అని అడిగింది.

"తొందరపడి అప్పుడే వాడి చర్మం ఒలవకండి. కొంచెం ఎడం ... మరీ సమీ



పానికొస్తే, నా మూడో కంటి వేడికి భస్మమై పోతారు," అంటూ వికృతాకారుడు చెటు చాటు నుంచి బయటికొచ్చాడు. అతడు తన మూడో కన్ను అంతలోనే మూయటం తెరవటం శిఖిముఖి చూశాడు. ఈ వికృతా కారుడా శిథిలాలయ పూజారి? అను కున్నాడు శిఖిముఖి. తమ ఇంటిలోకి వచ్చి నవ్వాడు ఏదికి నిప్పులా భగ్గుభగ్గున మండుతూ అరే మూడో కన్ను వున్నట్టు తాను గమనించలేదు. వాడు ఈటె పోటుకు అందేంత సమీపానికి వస్తే ఎంత బావుం డును, అనుకుంటూ శిఖిముఖి ఈటెను బాగా చాచి, పూజారి కేసి ఊగేందుకు



శరీరాన్ని బలంగా కదిలించాడు. అతడి ప్రయత్నం ఏమిటో గ్రహించిన ఇద్దరు ముగ్గురు దొంగలు, తమ నాయకుణ్ణి ప్రమాదం నుంచి కాపాడేందుకు శిఖిముఖి పక్కకు వచ్చి నిలబడ్డారు.

"ఓహో!, ఈ ఆటవికుడు తన చేతిలోని పూచిక పుల్లతో నన్ను పొడవాలని చూస్తున్నట్టున్నదే!" అని పూజారి వికవిక మంటూ నవ్వి, "ఒరే, పిల్లకుంకా, నీ దర్పం ఇంకా అణగలేదా? తొందర పడకు," అంటూ ఒక్క క్షణం ఆగి, అంతలోనే పెద్దగా చప్పట్లు చరుస్తూ, "తల తిప్పగలిగితే చూడరా, పశీ! నీ శబర పల్లెను నా మూడో నేత్రాగ్నికి ఆహుతి చేస్తున్నాను," అన్నాడు.

శిఖిముఖి పట్టుబలమంతాన తల పక్కకు తిప్పి పల్లె కేసి చూశాడు. పల్లెలో పెద్ద మంటలు లేస్తున్నవి. పల్లె తగలబడి పోతున్నట్టు తెలియగానే అతడు ఎక్కడలేని ఉద్రేకంతో, కాలిని బిగించి పట్టి ఉన్న తాడును తెంచుకు నేందుకు పెనుగులాడుతూ, "దుర్మార్గుడా, నీ సేవకుల్ని పంపి, పల్లెకు నిప్పు పెట్టించావా? నీకు చావు తప్పదు. కొద్ది సేపట్లోనే మా వాళ్లంతా ఇక్కడికి వచ్చి నిన్ను చిత్రవధ చేస్తారు," అన్నాడు.

పూజారి వకవక నవ్వి, "మీ వాళ్లంతా ఇక్కడికి రాకుండా వుండేందుకే పల్లెకు అగ్ని పెట్టాను. అందరూ ఎవరి కొంపలు వాళ్ళు చల్లార్చుకునే ప్రయత్నంలో వుంటారు. అది సరేకాని, నిన్ను ప్రాణాలతో వదుల్తాను. ఆ తాళపత్ర గ్రంథాలున్న సంచీ నాకు తెచ్చిస్తావా?" అన్నాడు.

"తాళపత్రాలు కాదు, నీ తల నరికి విక్రమకేసరి కివ్వబోతున్నాను," అంటూ శిఖిముఖి బాగా చేయి చాచి ఈటెను పూజారి కేసి విసిరాడు. కాని, అదే సమయంలో ఒక దొంగ అడ్డు రావటంతో ఈటె



వాడి భుజంలో గుచ్చుకున్నది. వాడు ఒక దావు కేక పెట్టి విరుచుకుపడ్డాడు.

"వీడు నే ననుకున్న దానికన్నా మూర్ఖుడు, సాహసి. కాలి కట్లు విప్పి, మెడకు తగిలించి లాక్కురండి. నేను మహా వృక్షాల మీదుగా నడిచి, అడ్డదారి వెంట అరణ్యం చేరతాను," అంటూ పూజారి పెద్దపెద్ద అంగలు వేస్తూ మాను దాటుకు వెళ్ళిపోయాడు.

పూజారి కనబడకుండా పోగానే, దొంగలందరూ ఒక చోట కూడి, గాయపడిన తమ అనుచరుల గాయాలకు కట్లు కట్టారు. గాయపడిన వాళ్ళల్లో ఒకడు మూలుగుతూ, "ఒరే, అబ్బిగాళ్ళూ, ఇక మన దారిన మనం పోదాం. ఈ పూజారిని నమ్మి మన ప్రాణాల మీదికి తెచ్చుకోవటం ఎందుకు?" అన్నాడు.

"నోరు ముయ్యరా పిరికి సన్నాసి. పూజారి దొర మన కిచ్చిన బంగారం మాటేమిటి? ఆ దొరకు మనం చేసిన ప్రమాణం సంగతేమిటి? మన మేమన్నా నీతి జాతీ లేనివాళ్ళమా?" అంటూ కసిరాడు ఒక దొంగ.

"అసలు పాట్లన్నీ యీ అడివి దున్నగాడు యిక్కడికి రావటంతో మొదలయినై. వీణ్ణి వెంట పెట్టుకుపోయే శ్రమ మనకెందుకు? పారిపోవాలని చూస్తే చంపామని చెప్పొచ్చు. కత్తితో గుండెల్లో ఒక్క పోటు పొడుస్తాను," అంటూ దొంగల్లో ఒకడు మీసం మెలివేస్తూ లేచి కత్తి ఎత్తి శిలీముఖిని పొడవబోయాడు. కాని, శిలీముఖి తన యీటెతో దాన్ని పక్కకు నెట్టి, అదే సమయంలో దొంగను యీటెతో గట్టిగా పొడిచాడు. ఆ పోటు దొంగ వీపుకు తగిలింది. వాడు బాధతో అరిచాడు. మిగతా దొంగలు కోపంతో ఒళ్ళు మరిచి, "చంపండి!" అంటూ ఒక్కసారిగా శిలీముఖి మీద కత్తులు ఎత్తారు. —(ఇంకా వుంది)






శిథిలాలయం

4

[శిథిలాలయ పూజారినని చెప్పిన వికృతాకారుడి కోసం శిఖిముఖీ, విక్రమకేసరీ చెరొక మార్గాన వెళ్లారు. శిఖిముఖి మామిడితోపులో అడుగు పెట్టేసరికి, అతడి కాలి కొక తాడు బిగుసుకుపోయి, చెట్టుకొమ్మకు వేలాడదీసింది. పూజారిని శిఖిముఖి ఈటెతో పొడవ బోయాడు. పూజారి అనుచరులు అరుస్తూ, అతణ్ణి చంపేందుకు కత్తులెత్తారు. తరవాత—]

పూజారి అనుచరులు తన పైకి కత్తులెత్తటం చూస్తూనే శిఖిముఖి తనకు చావు తప్పదనుకున్నాడు. తను చచ్చే ముందు ఆ దుర్మార్గుల్లో ఒక్కణ్ణయినా చంపి తీరాలన్న పట్టుదలా, ఉద్రేకం అతడిలో పరవళ్ళు తీసింది. ఆ వెంటనే అతను 'జై, శబరమాతా!' అంటూ అరణ్యం ప్రతిధ్వనించేలా అరిచి, తన కాలిని బిగించి పట్టి వున్న తాడును ఈటెతో గురిగా ఒక్కపోటు పొడిచాడు. ఆ దెబ్బకు తాడు సగం నరుక్కుపోయింది, తతిమ్మా సగం అతడి బరువును మోయలేక పటీ మంటూ తెగింది. శిఖిముఖి ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా, అతడి తల బలంగా నేలను తాకటం జరిగేది. కాని, అతడు వానరంలా ఒక్క ఊపున కాళ్ళు రెంటినీ పల్టీకొట్టినట్టు గిర్రున భూమి మీదికి తెచ్చి, దాని తాకిడిని తట్టుకునేందుకు ఈటెను ముందుగా నేల మీద గుచ్చాడు.



పూజారి అనుచరులు అతడి లాఘవం చూసి ఆశ్చర్యపోయారు. వాళ్ళల్లో ఒకడు శిఖిముఖిని మెచ్చుకుంటూ, "శబర వెధవ బాగా సాముగరిడీలు నేర్చిన వాళ్ళా వున్నాడు. ఇలాంటివాడు మన ముఠాలో కలిసివుంటే, మనం సాధించలేం దేముంటుంది?" అన్నాడు.

"వీడు మనిషి కాదు, మర్కటం. నేలంటకుండా చెట్లకొమ్మల మీద గెంతుతూ వింధ్య పర్వతాలనే చేరగలడు. చూస్తారేం, పొడవండి!" అన్నాడు మరొక అనుచరుడు.

ఈ విధంగా ఒకటి రెండు క్షణాలు పూజారి అనుచరులు నిర్విణ్ణులైపోయి, తన మీద కత్తులు ప్రయోగించటానికి బదులు, వాచాలత చూపటం శిఖిముఖికి మంచి అవకాశం కలిగించింది. అతడు ఒడుపుగా ఒక విరోధి మోకాలి మీద బలంగా తన్ని, వాడు అరుస్తూ వెనక్కు పడబోయేంతలో మెరుపులా వాడి వీపు కింది నుంచి చర్రున జారి తన చుట్టూ వున్న శత్రువలయాన్ని ఛేదించి బయట పడగలిగాడు.

పూజారి అనుచరులు శిఖిముఖి పారిపోయే యత్నం చేస్తున్నాడని తెలిసి కూడా, కత్తులు వుపయోగించ లేకపోయారు. కత్తి పొరబాటున తమ వాళ్ళకే తగులుతుందేమో అన్న భయం వాళ్ళకు కలిగింది. శిఖిముఖి శత్రువునే తన కవచంగా వాడుకో గలిగాడు, కాని, ఒకసారి అతడు వాళ్ళ నుంచి కొంచెం దూరం పరిగెత్తగానే పూజారి అనుచరులంతా ఒక్కసారిగా, "చంపండి, పారిపోనీకండి," అని అరుస్తూ అతడి వెంటబడి చుట్టుముట్టేందుకు ప్రయత్నం చేశారు.

ఆ సమయంలో దూరం నుంచి ఈల వినబడింది. అది శిథిలాలయ పూజారి తన బంట్ల కిచ్చే హెచ్చరిక. ఆ హెచ్చరిక వింటూనే అతడి అనుచరుల్లో ఒకడు, "పూజారిదొర పిలుస్తున్నాడు, వినపడలేదా, పరిగెత్తండి," అన్నాడు.

"ఈ పారిపోతున్న శబరపిశాచంగాడి మాటేమిటి? వీణ్ణి పట్టుకు పోవద్దా పూజారి దొర దగ్గిరికి?" అని ప్రశ్నించాడొకడు.

ఆ ప్రశ్నకు మొదట మాట్లాడినవాడు జవాబు చెప్పబోయేంతలో, ఎర్రగండు పెద్దగా మొరగటం వినబడింది. ఆ వెంటనే శబరుల కేకలూ, విక్రమకేసరి, "శిఖిముఖీ! శిఖిముఖీ!" అని పిలుస్తూ అటుగా పరిగెత్తుకు రావటం దొంగల కంటబడింది.

పూజారి యీసారి మరింత బిగ్గరగా ఈల వేశాడు. వాడి అనుచరులంతా ఒకణ్ణొకడు ఎలాంటి హెచ్చరికా చేసుకోకుండానే, గాయపడిన దొంగలను భుజాన వేసుకుని గిర్రున వెనుదిరిగి, అరణ్యం కేసి పరిగెత్తసాగారు.

శిఖిముఖి ఎర్రగండును గట్టిగా కేక వేశాడు. ఆ కేక వింటూనే కుక్క అతడున్న చోటుకు పరిగెత్తు కొచ్చింది. కొంచెం వెనగ్గా విక్రమకేసరీ, నలుగురైదుగురు శబరులూ అక్కడి కొచ్చి చేరారు.

"నువ్వేదో ప్రమాదంలో చిక్కుకున్నావని, నేను భయపడ్డాను, శిఖిముఖీ!" అన్నాడు విక్రమకేసరి.

"చాలా పెద్ద ప్రమాదంలోనే చిక్కుకున్నాను. అదృష్టం కొద్దీ బయటపడ్డాను. ఆ దుర్మార్గు లీప్రాంతాన మాటుపెట్టి నన్ను



తల కిందులుగా వేలాడ దీసి చంపాలని చూశారు...అదంతా తరవాత మాట్లాడుకో వచ్చు. ముందు ఆ పూజారి బంట్లు దాగి వుండే స్తలం ఏదో మనం తెలుసుకోవాలి. ఒకళ్ళిద్దరం అయినా, వాళ్ళను వెన్నంటి పోగలిగితే, సూర్యోదయం కాగానే ఆ ముఠా నంతా అడవిజంతువుల్ని వేటాడినట్టు వేటాడవచ్చు," అన్నాడు శిఖిముఖి.

"వాళ్ళు అరణ్యంలో ఎక్కడ దాగి వుండేదీ కనుక్కోవటానికి మన ఇద్దరం చాలు. ఎర్రగండు పశికట్టి మనకు దారి చూపగలదు. తెల్లవారగానే పల్లెవాసులంతా మనకు సహాయం వస్తారు," అంటూ విక్రమ





ఎ్రగండు వాళ్ళను అరణ్యంలోని ఒకానొక కొండ ప్రాంతానికి తీసుకుపోయి, అక్కడ ఒక మహా వృక్షం కింద నిలబడి కొంచెం సేపు భూమిని మూచూసి, చెట్టు చుట్టూ గిరుగిరున తిరుగుతూ, తల ఎత్తి పైకి చూడసాగింది.

విక్రమకేసరికి కుక్క ప్రవర్తన వింతగా కనబడింది. అతడేమో మాట్లాడబోయేంతలో శిఖిముఖి అతణ్ణి వారించి, తల ఎత్తి చెట్టు కొమ్మల్లోకి పరీక్షగా చూశాడు. గుబురు కొమ్మల్లో అతడికో మానవాకారం కనబడింది. బాగా పరీకించి చూసిన మీదట శిఖిముఖికి, వాడు పూజారి అనుచరుడని తెలిసిపోయింది. వాడు, చెట్టు కొమ్మ నొకదాన్ని రెండు చేతులతో గట్టిగా కావిలించుకుని, కొమ్మ మీద బోర్లాపడుకుని నిద్రపోతున్నాడు. ఒర నుంచి కత్తి కిందికి వేళ్ళాడుతున్నది.

శిఖిముఖి వాణ్ణి విక్రమకేసరికి చూపుతూ, చిన్న గొంతుతో, "కేసరీ, వాడు శిథిలాలయ పూజారి కాపలావాడన్నమాట. చెట్టు మీద దాగి, యీ ప్రాంతాలకు వచ్చేవాళ్ళను కనిపెట్టివుండి, కబురందించమని ఆ వికృతాకారుడు వీణ్ణి యిక్కడ కాపలా పెట్టి వుంటాడు. కాని, యీ వెధవ రాత్రంతా

కేసరి తన వెంటవున్న శబరుల కేసి తిరిగి, "ఇక మీరు పల్లెకు పొండి. మరొకసారి పూజారి అనుచరులు పల్లెకు నిప్పు పెట్టకుండా చూసుకోండి. మా ఇద్దర్లో ఎవరో ఒకరు ఆ క్రూరులు అరణ్యంలో ఎక్కడ దాగి వున్నారో చూసి, పల్లెకు వార్త తెస్తాం," అని చెప్పాడు.


శబరులు వెళ్ళిపోయారు. ఆ తరవాత శిఖిముఖీ, విక్రమకేసరీ అరణ్యం కేసి బయలుదేరారు. ముందు ఎ్రగండు నేలను పశిగటుతూ నడవసాగింది. అది దొంగలు పోయిన మార్గాన్ని సరిగానే గుర్తించిందన్న నమ్మకం శిఖిముఖికి కలిగింది. క్రమంగా

అరణ్యంలో చెడ తిరిగి సూర్యోదయం వేళకు హాయిగా చెట్లకొమ్మల్లో నిద్ర పోతున్నాడు," అన్నాడు.

"వీణ్ణి మనం ప్రాణాలతో పట్టుకుని పూజారిని గురించిన రహస్యాలు లాగాలి," అన్నాడు విక్రమ కేసరి.

"ప్రాణాలతో పట్టుకోవటమే కాదు, నిద్ర మేల్కొని అరవకుండా చూడాలి. వీడు అరిచాడో పూజారికి మనం యీ ప్రాంతాల కొచ్చినట్టు తెలిసిపోతుంది. అదుగో సూర్యోదయం కూడా అవుతున్నది. నువ్వు చెట్టు కిందనే వుండు. నేను నిశ్శబ్దంగా చెట్టెక్కి వాణ్ణి కిందికి లాక్కొస్తాను," అని చెప్పి శిఖిముఖి దాపులనున్న చెట్ల మీది కొన్ని అడవి తీగలను తెంచి, అరచేతి వెడల్పు, ఒక గజం పొడవూ వుండేట్టుగా వాటిని అల్లి, మెల్లిగా చెట్టు మీదికి పాకిపోయి, పూజారి అనుచరుడి మెడను గట్టిగా ఒక చేత్తో పట్టుకుంటూనే, రెండో చేత్తో యీటెను అతడి కళ్ళ ముందు ఆడించాడు.

పూజారి అనుచరుడు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. ఎదురుగా వాడికి ఉదయసూర్య కిరణాల్లో తళతళా మెరుస్తున్న ఈటె అలుగు కనిపించింది. వాడు భయ కంపితుడై అరవబోయేంతలో, శిఖిముఖి



చేతి పట్టును మెడమీంచి గొంతు మీదికి మార్చి, "నోరెత్తావో, ఈటె గుండెల్లో దించుతాను. కొద్ది రోజులపాటైనా బతక దలిస్తే, కిక్కురు మనకుండా నాతోపాటు చెట్టు దిగు," అని చెప్పి, వాడి ఒర నుంచి కత్తి లాక్కొని చెట్టు దిగాడు. పూజారి అనుచరుడు గడగడ వణికిపోతూ అతడి వెనకగా చెట్టు దిగి వచ్చాడు.

శిఖిముఖి, పూజారి అనుచరుణ్ణి చెట్టు బోదెకు ఆనుకు కూర్చోమని ఆజ్ఞాపించి, "నువ్వా ప్రేతాకారంగాడి బంటువేగదా? నిజం చెప్పకపోయావో నిన్ను ప్రాణాలతోనే ఎర్రగండుకు ఆహారంగా వేస్తాను. వాడి



కొండ ప్రాంతాల ఏ గుహలో వుంటున్నాడు?" అని ప్రశ్నించాడు.

పూజారి అనుచరుడు ప్రాణభయంతో కంపించిపోతూ, "అయ్యో, నన్ను చంపకండి, నిజం చెపుతాను. పూజారి దొర యీ కొండ ప్రాంతాల పూట కొకచోటు మారుతూంటాడు. నిన్న సాయంకాలం ఆ దొర వున్న చోటు—ఒంగున్న రాక్షసిలా కనబడే ఆ గండశిల వెనక వున్న చీకటి గుహ. ఇప్పుడింకా అక్కడే వున్నాడో లేదో నాకు తెలీదు," అన్నాడు.

"నువ్వు నిజమే చెపుతున్నావా?" అని గద్దించి అడిగాడు శిఖిముఖి.



"పూజారి పెద్ద అబద్ధాలకోరు. వాడి బంటు మరొక విధంగా ఎందుకుంటాడు? ఎర్రగండును ఉసికొలుపు, శిఖిముఖీ," అన్నాడు విక్రమకేసరి.

శిఖిముఖి ఊఁ అనగానే ఎర్రగండు పూజారి అనుచరుడి మీదికి ఎగిరి దూకి, వాడి గొంతు పట్టుకోబోయినదల్లా ఆగి, తల తిప్పి యజమాని కేసి చూసింది. "ఆహాఁ, యిది కుక్క కాదు, ఇంగితం ఎరిగిన మనిషి," అన్నాడు విక్రమకేసరి.

పూజారి అనుచరుడు ప్రాణభీతితో అరవబోయే సరికి శిఖిముఖి అతడి మీదికి ఈటె గురి చేసి, "అరవకు. ఇప్పటికైనా అబద్ధాలాడక, నిజం చెప్పు. ఎర్రగండు నిన్నేమీ చేయదు," అన్నాడు.

"నేను నిజమే చెప్పాను, రక్షించు దొరా!" అంటూ పూజారి అనుచరుడు కళ్ళ నీళ్ళు పెట్టాడు.

దొంగవాడి కళ్ళ నీళ్ళు చూడగానే విక్రమకేసరికి అతడి మీద జాలి కలిగింది. అతడు శిఖిముఖి భుజం పట్టుకుని, "శిఖీ! పాపం, వాణ్ణి చంపకు. నిజమే చెప్పాడు, తెలియటం లేదా? మనం వీడు చెప్పే ప్రాంతానికెళ్ళి చూద్దాం. పూజారి పెద్ద ముచ్చువెధవ. వాడు తనను నమ్మి సేవ


CHITRA

చేసే వాళ్ళతో అయినా మనసిచ్చి మాట్లాడతాడని నేననుకోను," అన్నాడు.

శిఖిముఖి ఎఱ్ఱగండును యివతలికి పిలిచి, దొంగతో, "ఒరే, నిన్ను కొంతసేపయినా కాళ్లూ చేతులూ కట్టి, నోరు బిగించి, ఆ పొదల్లో దాచి పోక తప్పదు. మీ యజమాని ఎక్కడున్నాడో చూసి తిరిగొచ్చేప్పుడు నీ కట్లు విప్పుతాను," అంటూ వాడి కాళ్ళూ చేతులూ కట్టి, నోటికి అడ్డంగా అడవి తీగలతో అల్లిన వల నొకదాన్ని బిగించి, మూటలా ఎత్తుకుపోయి గుబురుగా వున్న పొదల్లో పడవేశాడు.

తరవాత శిఖిముఖీ, విక్రమకేసరీ, ఎఱ్ఱగండూ దొంగ చెప్పిన కొండ ప్రాంతాని కేసి బయలుదేరారు. వాళ్ళ కా ప్రాంతాల్లో మనుషులు సంచరించిన గుర్తులు కనిపించినై. వాటిని చూస్తూ వాళ్ళు మరికొంత ముందుకు పోయేసరికి, నలుగురైదుగురు మనుషులు పక్కపక్కన నడవటానికి వీలుగా వున్న ఒక కొండదారి మీద—అంత ఎత్తున ఒక కొయ్యబొమ్మ కనిపించింది. దాని చేతుల్లో రక్తంలో తడిసి వున్న ఒక త్రిశూలం వున్నది.

విక్రమకేసరి ఆ భయంకర విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపడుతూ ముందుకు నడవబోయేంతలో, శిఖిముఖి అతడి భుజం పట్టుకుని వెనక్కులాగి, "కేసరీ, ఆగు. మనం ఆ దారి వెంట పోవాలంటే, ఆ కొయ్యబొమ్మ కాళ్ళ కిందుగా నడవాలి. దాని చేతిలో రక్తం ఓడుతున్న త్రిశూలాన్ని చూశావా?" అని ప్రశ్నించాడు.

వాళ్ళిద్దరూ ఇలా మాట్లాడుతున్నంతలో ఎఱ్ఱగండు కొయ్యబొమ్మను సమీపించి, దాని కాళ్ళ కిందుగా ముందుకు పోబోయింది. అంతలో బొమ్మ జవజవ మంటూ వణికింది. దాని చేతిలో వున్న త్రిశూలం మెరుపులా నేల మీదికి జూ౦మ్ అంటూ దిగసాగింది. —(ఇంకా వుంది)





5

[పూజారి అనుచరులు పెట్టిన మాటులో నుంచి బయటపడిన శిఖిముఖి దగ్గిరకు విక్రమకేసరి వచ్చాడు. అప్పుడు ఆ ఇద్దరూ కలిసి దొంగలను వెతుకుతూ కొండప్రాంతాలకు వెళ్ళారు. అక్కడ త్రిశూలం పట్టుకునివున్న ఒక పెద్ద కొయ్యబొమ్మ కనిపించింది. దాని కిందుగా ఎర్రగండు పరిగెత్తేంతలో త్రిశూలం వేగంగా కిందికి దిగసాగింది. తరవాత—]

కొయ్యబొమ్మ చేతులు కదిలినప్పుడు కలిగిన అతి స్వల్పమైన ధ్వనిని ఎర్రగండు వినగలిగింది. వెంటనే అది ఒక్క దూకున బాణంలా ముందుకు దూసుకు పోయింది. మరుక్షణం బొమ్మ చేతిలోని త్రిశూలం బలంగా నేలను తాకింది. శిఖిముఖీ, విక్రమకేసరీ నివ్వెరపోయారు.

"ఇది కొయ్యబొమ్మ కాదు, రాకసి బొమ్మ! ఎర్రగండు ప్రాణాలు దక్కించుకున్నది. అదృష్టం కొద్దీ మనం కూడా చావు తప్పించుకున్నాం," అన్నాడు విక్రమకేసరి.

శిఖిముఖి కొయ్యబొమ్మను సమీపించి, దాన్ని జాగ్రత్తగా పరీక్షించి చూస్తూ, "ఇది శిథిలాలయ పూజారి మన కోసం పెట్టిన మాటు. కాని, మన కంటె ముందుగా ఎవడో నిర్భాగ్యుడు యీ దారి వెంట ముందుకు పోయి, దీని చేతిలోని త్రిశూలం వల్ల గాయపడటమో, మరణించటమో జరి



గింది. త్రిశూలాన్ని అంటి వున్న నెత్తురు సూర్యకాంతిలో ఎలా మెరుస్తున్నదో, చూశావా!" అన్నాడు.

విక్రమకేసరి ఆ రాక్షసిబొమ్మ కాళ్ళలో ఒకదాన్ని ఈటెతో పొడిచి చూశాడు. బొమ్మ కొంచెంగా కదుల్లాడింది. అతడు శిఖిముఖి కేసి తిరిగి, "శిఖీ! మనం దీన్ని తేలిగ్గా పడకొట్టగలం అని నాకు తోస్తున్నది. దీన్ని యిలాగే వుండనివ్వటం ప్రమాదకరం. మన వాళ్ళు అజాగ్రత్తగా దీని కిందుగా నడవటం జరిగితే చావు తప్పదు," అన్నాడు.

శిఖిముఖి ఆ మాటలకు అవునన్నట్టు తల వూపి, అక్కడికి సమీపంగా వున్న ఒక




పెద్ద రాతిని విక్రమకేసరికి చూపుతూ, "మనం యిద్దరం దాన్ని కదిలించగలం అనుకుంటాను. పట్టు పట్టి ఆ రాయిని కొయ్యబొమ్మ కాళ్ళ మీదికి నెట్టగలిగామంటే, అది కుప్పలాగా కూలటం ఖాయం," అన్నాడు.

ఆ వెంటనే శిఖిముఖీ, విక్రమకేసరీ బండరాయిని బలంగా పట్టుకుని వున్న చోటు నుంచి కదిలించి, విసురుగా దాన్ని కొయ్యబొమ్మ కాళ్ళ కేసి నెట్టారు. రాయి దొల్లుకుంటూ పోయి బొమ్మ కాళ్ళల్లో ఒక దాన్ని ఢీ కొట్టింది. మరుక్షణం కొయ్య బొమ్మ కిర్రుమంటూ కదిలి దఢీమంటూ కింద పడిపోయింది. దాని చేతిలో వున్న త్రిశూలం ఎగిరి అంత దూరాన పడింది.

"అహా, మనం మహా ఘనకార్యం చేశాం. కాని, యీ రాక్షసి బొమ్మ కుప్ప కూలుతూ చేసిన ధ్వని పూజారికీ, వాడి అనుచరులకూ వినబడే వుంటుంది," అన్నాడు శిఖిముఖి.

"అందుకు సందేహం లేదు. నన్నడిగితే ఆ దుర్మార్గులు మనం యీ బొమ్మను సమీపిస్తూండటం ఏ రాళ్ళ చాటు నుంచో ముందే చూసి వుంటారంటాను. దాని చేతిలోని త్రిశూలం మన గుండెల్లో ఎప్పుడు





గుచ్చుకుంటుందా అని వాళ్ళు ఉవ్విళ్లూరి వుంటారు కూడా. కాని వాళ్ళ ఎత్తుపార లేదు," అన్నాడు విక్రమకేసరి.

"నిజమే. యిప్పుడు నాకో అనుమానం కలుగుతున్నది. మనం అమాయకంగా ఆ దుష్టులు పెట్టిన బోనులోకి నడవటం లేదు కదా! ఇంతకు ముందు మనం పల్లె వానుల్ని గూడేనికి తిరిగి పొమ్మని చెప్ప టంలో పెద్ద పొరపాటు చేశాం. అంత పెద్ద శత్రుమూకను మన యిద్దరం ఎదిరించి ఎలా నిలవగలం? వాళ్ళు యీ దాపుల నున్న ఏ కొండ గుహలోనో వుంటారు. సందేహం లేదు," అన్నాడు శిఖిముఖి.

వాళ్ళిద్దరూ యిలా మాట్లాడుతున్నంతలో కొండ గుహల కేసి పోయిన ఎర్రగండు మొరుగుతూ వాళ్ళ దగ్గిరకు పరిగెత్తు కొచ్చింది. కుక్కను చూస్తూనే శిఖిముఖికి పూజారి ముఠా ఆ దాపులనే ఎక్కడో దాగి వున్నారన్న అనుమానం కలిగింది. బహుశా వాళ్ళు తమ మీదికి దాడి రాబోతున్నారేమో!


శిఖిముఖి, ఎర్రగండు తల నిమురుతూ, "కేసరీ! మనం యిలా నిలబడి ముందుకు పోవటం ప్రమాదం. పూజారి అనుచరులు ఒక్క బాణం దెబ్బతో మనిద్దర్నీ హత మార్చగలరు. రాళ్ళ చాటుగా పాకుతూ



ముందుకు పోదాం. ఎర్రగండు మనకు దారి చూపగలదు," అన్నాడు.

ఎర్రగండు పశికట్టి ముందుకు పోవటానికి మారుగా, వెనక కాళ్ళ మీద లేచి నిలబడి పెద్దగా మొరగసాగింది. దాని ప్రవర్తన బాగా తెలిసిన శిఖిముఖి రాళ్ళ చాటున పాకుతూ పోతున్నవాడల్లా లేచి నిలబడ్డాడు. అతడి దృష్టి తమ కేసి పరిగెత్తు కొస్తున్న ఒక శబరుడి పైన బడింది. అతడు విల్లం బులు ధరించి వున్నాడు. దూరాన్నుంచి పరిగెత్తు కొస్తున్న వాడిలా కనబడ్డాడు.

శబరుడు తనను సమీపించగానే శిఖి ముఖి, "అలా పరిగెత్తు కొస్తున్నావేం?







చరులై వుంటారని శిఖిముఖీ, విక్రమకేసరీ కూడా భావించారు. శిఖిముఖి కొండ పాదంలో వున్న తిమ్మగూడెం దిక్కు కేసి చూస్తూ, ఆ గూడెంవాణ్ణి, "ఆ ధాన్యం దోపిడిగాళ్ళ వెంట అంత పొడుగ్గా శవాకారంలో వున్న వాడెవడైనా వున్నాడా?" అని అడిగాడు.

"అలాంటి వాడెవడూ లేడు. సవరల నాయకుడి పేరు గండుపోతు. ఇంత మీసాలూవాడూ-అడివి దున్నలా వున్నాడు," అని చెప్పాడు తిమ్మగూడెం వాడు.


"సరే, నువు మా పల్లెకు పోయి సంగతి చెప్పి మనుషుల్ని సహాయం తీసుకురా. మేం యిద్దరం ముందుగా మీ గూడేనికి పోయి ఆ గండుపోతు దోచుకున్న ధాన్యంతో పారిపోకుండా చూస్తాం. మీ గూడేనికి దారి నే నెరుగుదును," అన్నాడు శిఖిముఖి.

తిమ్మగూడెం వాడు, కుంభారమిట్ట పల్లె కేసి పరిగెత్తాడు. శిఖిముఖీ, విక్రమకేసరీ కొండదారుల వెంట తిమ్మగూడెం కేసి బయలుదేరారు. పావు గంట తరవాత వాళ్ళు ఆ గూడేన్ని చేరేసరికి, గూడానికి ఓ పక్కగా వున్న చెట్ల కింద చాలామంది శబరులు మందగా నిలబడి వున్నారు. వాళ్ళను అదిలిస్తూ పదీ పన్నెండుమంది

ఏం జరిగింది? నువ్వే గూడెం వాడివి?" అని ప్రశ్నించాడు.

శబరుడు రొప్పుతూ, "మాది తిమ్మ గూడెం. మా గూడెంలో వున్న ధాన్యమంతా ఎక్కడి నుంచో వచ్చిన సవరజాతి ముఠా వాళ్ళు దోచుకుంటున్నారు. సాయం కోసం మీ పల్లెకు వస్తున్నాను. పల్లె పెద్ద శివాలుడి కొడుకు శిఖిముఖివి కాదా నువ్వు? నీ కుక్కను చూసి, యీ ప్రాంతాల మీ వాళ్ళుంటారని, కుక్క వెనగ్గా పరిగెత్తు కుంటూ వచ్చాను," అన్నాడు.

శబరుడు దోపిడిదొంగలని చెప్పే సవర జాతి వాళ్ళు శిథిలాలయ పూజారి అను






సవరజాతి వాళ్ళు కాపలా కాస్తున్నారు. ఆ కాపలా వాళ్ళను చూస్తూనే, శిఖిముఖీ, విక్రమకేసరీ ఆ దొంగలు శిథిలాలయ పూజారి అనుచరులని గ్రహించారు.

శిఖిముఖికి ఆ క్షణంలో ఓ ఉపాయం తోచి, ఆ కాపలా వాళ్ళను సమీపించి, "మీ యజమాని ఆ శిథిలాలయ పూజారి ఎక్కడున్నాడు? చాలా అవసరం అయిన పనుంది," అన్నాడు.

ఆ ప్రశ్నకు కాపలా వాళ్ళల్లో ఒకడు పొట్ట రెండు చేతులతో పట్టుకుని పెద్దగా నవ్వి, "పూజారి దొరను చూసేంత ఘను డివా నువ్వు, శబరకుంకా! ఆ దొర కావా లనుకుంటే ప్రత్యక్షమవుతాడు, వద్దను కుంటే మాయమై పోతాడు," అన్నాడు.

ఇంతలో కాపలావాళ్ళల్లో మరొకడు ఎర్ర గండు కేసీ, శిఖిముఖి కేసీ గుచ్చిగుచ్చి చూసి, "అరే! వీడు రాత్రి మనం పెట్టిన మాటు నుంచి తప్పించుకు పోయిన శబర పిశాచంగాడు. మన వాళ్ళ నిద్దర్ని గాయ పరిచాడు. ఆ కుక్కను పట్టుకోబోయి మనలో నలుగురం కాట్లు తిన్నాం. ఆ పక్కన వున్న వాడి మొఖం ఎక్కడో చూసినట్టుందే!" అంటూ యీటె ఎత్తి శిఖిముఖీ వాళ్ళను సమీపించబోయాడు.



శిఖిముఖీ, విక్రమకేసరీ వాడి మీదికి యీటె గురిచేశారు: "మీ కాపలా వాళ్ళతో మాకు విరోధం లేదు. మీది మీదికి వచ్చారో మీకు చావు తప్పదు. యీలోపల మీరు మందవేసి కాపలా కాసే శబరులంతా పారి పోతారు. ఆ సంగతి తెలిసిందంటే పూజారి మిమ్మల్ని నిలువునా భస్మం చేసేస్తాడు," అన్నాడు శిఖిముఖి.

శిఖిముఖి యిలా అనేసరికి, అతడి మీదికి రాబోయిన సవరుడు ఈటె దించి, తిరిగి తన అనుచరుల దగ్గిరకు పోయి, "మనకు కుల పెద్ద గండుపోతు చెప్పిన పని వుండనే వున్నది. ఈ కుర్ర వెధవల్తో ఏం పని,"





"ఆ గండుపోతుతో మాటలు పెంచి, వాడు ధాన్యం ఎత్తుకు పారిపోకుండా కొంత సేపు ఆపగలిగామంటే, మా అయ్యతో వచ్చే మన పల్లెవాళ్ళు, యీ సవర బంది పోట్లందరినీ పట్టేస్తారు. ఆ తరవాత ఒంటరి గాడై పోయిన పూజారిగాణ్ణి దొరక పుచ్చు కోవటం ఏ మంత కష్ట కార్యం కాదు. ఏ మంటావ్, కేసరీ?" అని ప్రశ్నించాడు శిఖిముఖి.


"భలే, ఆలోచన! ఊఁ పద," అన్నాడు విక్రమకేసరి. ఆ ఇద్దరూ గ్రామం మధ్యకు వెళ్ళేసరికి, అక్కడ ఒక పెద్ద పాతర నుంచి ధాన్యం బయటికి తీసి, కొందరు సవరలు మూటలు కడుతూండటం వాళ్ళ కంట బడింది. పాతరకు ఒక పక్కగా ఒక ఆజానుబాహుడు, కోరమీసాలు సవరించు కుంటూ నిలబడి వున్నాడు.

అని చెప్పి, శిఖిముఖి కేసి తిరిగి, "పూజారి దొర ఎక్కడున్నాడో మాకు తెలీదు. ఆ దొరకు కుడిభుజంలాంటి సవరగండు పోతు గ్రామంలో ధాన్యం మూటలు కట్టిస్తు న్నాడు. చావ దలుచుకుంటే అక్కడికి పోయి పూజారి దొర సంగతి అతణ్ణడ గండి," అన్నాడు.

శిఖిముఖీ, విక్రమకేసరీ అక్కణ్ణించి కదిలి గ్రామంలోకి కొంతదూరం నడిచి, యిప్పుడేం చేయటమా అని ఆలోచించారు. కనీసం ఓ అరగంట కాలంలో తమ పల్లె నుంచి సహాయం తప్పక వస్తుందని వాళ్ళకు నమ్మకం కలిగింది.

శిఖిముఖి అతణ్ణి చూస్తూనే ఆగి పెద్ద గొంతుతో, "గండుపోతూ! నువు చేస్తున్నది అన్యాయ కార్యం. గ్రామవాసులంతా కలిసి దాచుకున్న ధాన్యాన్ని బలం వున్నది గదా అని దోచుకు పోవటం ధర్మం అనిపించు కోదు," అన్నాడు.

ఆ మాటలు వింటూనే గండుపోతు చర్రున వెనుదిగిరి, శిఖిముఖి కేసి అశ్చ




CHITRA

ర్యంగా చూసి, "ఎవడ్రా నువ్వు! శబర శివాలుడి కొడుకువా? నీ గురించి చాలా విన్నాను, ఒకసారి చూశాను కూడా. సవర కుల పెద్ద గండుపోతుకు న్యాయం, ధర్మం బోధ చేయటానికి వచ్చావా? అదేదో చెప్పటం కూడా నీకు చేత కాలేదు!" అంటూ పక్కన వున్న తన భృత్యుల కేసి తిరిగి, "అలా చూస్తారేం? వాణ్ణీ, వాడి మిత్రుణ్ణీ చెట్టుకు పెడరెక్కలు విరిచి కట్టండి," అన్నాడు.

గండుపోతు యిలా అనగానే, అతడి అనుచరులు నలుగురు ముందుకు వచ్చి, శిఖిముఖీ, విక్రమకేసరులను పట్టుకునేం దుకు, వాళ్ళ కేసి నడిచారు. కాని, శిఖి ముఖి తన మిత్రుణ్ణి హెచ్చరించి ఒక్కొక్క అడుగే వెనక్కు వేయసాగాడు. అతడి ఉద్దేశం; తమను పట్టుకో వస్తున్న వాళ్లను, ఆ ప్రదేశం నుంచి కొంత దూరంగా తీసుకు పోయి హతమార్చాలని. అలా కాకపోతే, గండుపోతు వెంట వున్న తతిమ్మా శత్రు వులు తమను చుట్టుముట్టి పట్టుకోగలరు.

శిఖిముఖి వెనకడుగు వేయటం చూసి, గండుపోతు హేళనగా నవ్వుతూ, "శబర పెద్ద శివాలుడి కొడుకు యింత పిరికి పంద అనుకోలేదు!" అన్నాడు.

ఆ మాట వింటూనే శిఖిముఖి ముందుకు రెండడుగులు వేసి, "గండుపోతూ! వయ సులో, ఎత్తులో, బలంలో కూడా నా కన్న రెండింతలున్నావు. నన్ను పట్టుకునేందుకు నీ భృత్యుల్ని పంపటం ఎందుకు? నువే, ఆ పని చేయకూడదా?" అన్నాడు.

గండుపోతు కళ్ళు నిప్పులు చెరిగినై. అతడు ఒకసారి హుంకరించి, ఎడం చేత్తో మీసం మెలివేస్తూ, యీటె పైకెత్తి, "నీవు చావుకోరి యిక్కడి కొచ్చినట్టుంది. ఇదిగో వస్తున్నాను, కాచుకో!" అంటూ, ఈటెను శిఖిముఖి గుండెల కేసి గురిచేసి, ఝుళిపించి ముందుకు దూకాడు. —(ఇంకా వుంది)





శిథిలాలయం


6

[రాకాసిబొమ్మ ప్రమాదం నుంచి బయటపడి, శిఖిముఖీ, విక్రమకేసరీ కొండగుహల కేసి పోయేంతలో, తిమ్మగూడెం పల్లెలో నవరగండుపోతు ధాన్యం దోచుకుంటున్నట్టు, ఆ పల్లెవాడి ద్వారా వాళ్ళకు తెలిసింది. వాళ్ళిద్దరూ ఆ పల్లె చేరారు. నవరగండుపోతు, శిఖిముఖిని చూసి మండిపడి, ఈటె తీసుకుని అతడి మీదికి దూకాడు. తరవాత—]

కొండప్రాంతాన శిఖిముఖీ, విక్రమకేసరులకు ఎదురైన తిమ్మగూడెంవాడు, శరవేగంతో కుంభారమిట్ట పల్లెకు పోయాడు. అతడక్కడికి చేరేసరికి, పల్లెవాసులు కాలిపోయిన తమ గుడిశెలను బాగుచేసుకుంటున్నారు. వాళ్ళల్లో ప్రతిఒక్కడి ముఖంలోనూ కోపం, దైన్యం కనబడుతున్నది.

తిమ్మగూడెంవాడు, కొత్తగా కట్టబడుతున్న ఒక గుడిశె ముందాగి, "శబరమాతకూ, జై! నేను తిమ్మగూడెం శబరుణ్ణి. పల్లెపెద్ద శివాలుడి ఇల్లెక్కడ? నవరగండుపోతు మా గూడెం మీదపడి ధాన్యం దోచుకుపోతున్నాడు. మీ పల్లె నుంచి సహాయం కావాలి," అన్నాడు.

అతడి మాటలు వింటూనే, గుడిశెపని చేస్తున్న ఒక మధ్యవయసువాడు, చేతిలో వున్న తాళ్ళనూ, కర్రలనూ కింద పడేసి, "చావుకబురు చల్లగా చెపుతున్నావా, ఏం?





తొందరగా పద. రాత్రి ఆ సవరగండుపోతు ముఠావాళ్ళే మా గుడిశెలు తగలబెట్టారు. వాళ్ళ కోసం పల్లెపెద్దకొడుకు శిఖిముఖి అరణ్యమంతా గాలిస్తున్నాడు. గండుపోతు మీ పల్లెలోవున్న సంగతి పల్లెపెద్ద శివాలుడికి వెంటనే తెలియపరచటం మంచిది," అంటూ, గబగబా శివాలుడి ఇంటి కేసి దారితీశాడు. అతడి వెనకగా తిమ్మగూడెం వాడు బయలుదేరాడు.

ఆ ఇద్దరూ శివాలుడి ఇంటిని సమీపించే సరికి, ఇంటిముందున్న పెద్ద మామిడి చెట్టు కింద శివాలుడు కొందరు పల్లె పెద్దలతో మాట్లాడుతున్నాడు. తిమ్మగూడెం వాడు అతడికి దణ్ణంపెట్టి నాలుగైదు మాటల్లో తను వచ్చినపని చెప్పి, తమ గూడెం కేసి శిఖిముఖీ, మరొకయువకుడూ వెళ్ళినట్టు కూడా చెప్పాడు.

అంతావిన్న శివాలుడు చప్పున లేచి నిలబడి, "శిఖీ, విక్రమకేసరి తిమ్మగూడె నికి వెళ్ళారన్నమాట. ఇది దుస్సాహసం. ఆ సవరగండుపోతును నే నెరుగుదును. వాడసలే దుష్టుడు. ఇప్పుడు పరమ దుష్టుడైన శిథిలాలయ పూజారితో వాడు నేస్తం కట్టాడు. సరే, వాళ్ళిద్దర్నీ మనం సర్వనాశనం చేసితీరాలి. పల్లెయువకుల్లో ఓ పాతికమంది మెరికల్లాంటి వాళ్ళను పిలవండి," అన్నాడు.

ఆ వెంటనే పల్లెపెద్దల్లో ఒకడు పక్కనున్న గుడిశెలోకి పరిగెత్తిపోయి, ఒక డప్పు తీసుకుని బయటికి వచ్చి దాన్ని బలంగా మోగించసాగాడు. ఒకటి రెండు నిమిషాలు గడవకముందే, పల్లెలోని యువకులు చాలా మంది యీటెలు పట్టుకుని అక్కడికి పరిగెత్తుకొచ్చారు. శివాలుడు వాళ్ళల్లో ఓ పాతికమందిని వేరుచేసి పక్కగా నిలబెట్టి, "ఇదిగో, యీ తిమ్మగూడెం అతడితో మీరు వెంటనే బయలుదేరిపోండి. దారిలో సవర గండుపోతు ముఠావాళ్ళు ఎదురైనా సరే,

వాళ్ళతో అట్టే జగడం పెట్టుకోక, మీరు సూటిగా తిమ్మగూడేనికే పోవాలి. నేను వెనకగా బయలుదేరివస్తాను," అన్నాడు.

తిమ్మగూడెంవాడు ముందుండి దారి తీయగా శబరయువకులు అతడి వెంట అరణ్యం కేసి పరిగెత్తారు. తరవాత శివాలుడు ఇంట్లోకిపోయి శబరనాయకుడైన వాడు శత్రువుల మీదికి దాడి బయలుదేరేప్పుడు ధరించవలసిన ఉడుపులూ, అడవి పక్షుల యీకలతోవున్న శిరస్త్రాణం ధరించి బయిటికివచ్చాడు.

ఆసరికి ఇంటి ముందు చాలామంది పల్లెవాసులు చేరారు. శివాలుడు వాళ్ళతో, "నేను తిరిగి వచ్చేవరకూ మీరంతా తగు జాగ్రత్తలో వుండండి. సవరగండుపోతుకు కావలసింది తిండిధాన్యం. శిథిలాలయ పూజారికి అవసరం అయినది నా ఇంట్లో వున్న తాళపత్ర గ్రంథం. నే లేనిసమయంలో వాడు నా ఇంటి మీదికి దాడి రావచ్చు, జాగ్రత్త!" అని హెచ్చరించాడు.

"వాడు అద్భుతశక్తులున్నవాడు. మూడో కన్ను తెరిచి సర్వం భస్మంచేయగలడు," అన్నాడొకడు జనంలోనుంచి.

ఆ మాట్లాడినవాడు జనంలో ఎక్కడున్నాడో తెలుసుకునేందుకు శివాలుడు



తలతిప్పి పరీక్షగాచూసి, వాడు కనబడక పోయేసరికి, పెద్దగా గొంతెత్తి, "మన పల్లెవాసుల్లో కనీసం ఒకళ్ళిద్దరికైనా ఆ పూజారి అద్భుత శక్తుల్లో నమ్మకం కలగటం నా కాశ్చర్యంగా వుంది. పూజారీ, వాడి డబ్బు తిన్న అధములూ లేపే పుకార్లు నమ్మకండి," అన్నాడు.

తరవాత అతడు కొందరు పల్లెవాసుల్ని వెంటబెట్టుకుని తిమ్మగూడెం కేసి బయలుదేరాడు. అరణ్యంలో కొంత నడిచి కొండ ప్రాంతాన్ని చేరగానే, అక్కడ వారికి విరిగి నేలపడివున్న రాకసిబొమ్మ కనిపించింది. శివాలుడి వెంట వున్నవాళ్ళందరూ దాన్ని





చూసి చాలా ఆశ్చర్యపడ్డారు, కొందరికి భయంకూడా కలిగింది.


శబరుల్లో ఒకడు కిందపడివున్న త్రిశూలాన్ని చేతికి తీసుకుని, దాని కంటివున్న రక్తాన్ని పరీక్షగా చూసి, శివాలుడి దగ్గిరకు వచ్చి, "ఈ త్రిశూలం నూటికి నూరుపాళ్లు కంచుది. మన ప్రాంతాల ఎవరూ యీ లోహాన్ని యిందుకు వాడరు. దీన్ని అంటివున్న నెత్తురు మనిషిదికాదు, ఏదో అడవి జంతువుది," అన్నాడు.

శివాలుడు త్రిశూలాన్ని అందుకుని అటూ యిటూ తిప్పి చూసి, "నువ్వన్నది నిజం. వయసులో వుండగా విక్రమకేసరిదొర వెంట హిమాలయ పర్వతప్రాంతాలకు వెళ్ళినప్పుడు, యీ కంచులోహాన్ని అక్కడివాళ్ళు రకరకాల వస్తువులు చేయటానికి ఉపయోగించటం నేను చూశాను," అని, ఓ క్షణకాలం ఏదో ఆలోచిస్తూ వూరుకుని, తరవాత, "సరే, పదండి, కాలయాపన ఎందుకు," అంటూ ముందుకు నడిచాడు.


"ఈ త్రిశూలం శిథిలాలయ పూజారిదేనంటావా, శివాలుదొరా! వాడు హిమాలయ ప్రాంతాల నించి వచ్చినవాడేగదా?" అని ప్రశ్నించాడు, త్రిశూలాన్ని శివాలుడి కిచ్చిన శబరుడు.

"వాడి మాట లెలా నమ్మటం? వెయ్యేళ్ళుగా శిథిలాలయ పూజారిత్వం, మూడో కన్ను, కావాలన్నప్పుడు అదృశ్యమైపోవటం...ఇందులో ఏదో మోసం వుంది. వాణ్ణి చేజిక్కించుకుంటేనేగాని నిజం బయటపడదు. ముందు మనం త్వరగా తిమ్మగూడెం చేరాలి. మనకంటె ముందు పోయినవాళ్ళు, యీ సరికి గూడెం చేరి వుంటారనుకుంటాను," అన్నాడు శివాలుడు.

శివాలుడి ఊహ సరైనదే. తమ పల్లె పెద్దకొడుకు ప్రమాదంలో చిక్కుకుని వుండొచ్చని భావించిన శబరయువకులు, తిమ్మగూడెంవాడి వెంట ఆగమేగాల మీద








ఆ గూడేనికి పరిగెత్తారు. గూడెం పరిసరాలను చేరుతూనే, సహాయం కోసం వచ్చిన ఆ గూడెంవాడు శబరయువకులను సరాసరి గండుపోతు వున్న చోటుకు తీసుకుపోకుండా, పక్కదారుల వెంట వాళ్ళను నడిపి, గండుపోతు ధాన్యం దోచుకుంటున్న ప్రదేశానికి చేర్చాడు.

వాళ్ళు అక్కడికి చేరేంతలో గండుపోతు రంకెలువేస్తూ, శిఖిముఖి మీదికి దూకాడు. శిఖిముఖి యీటె పైకెత్తి ముందు కడుగు వేయబోయేంతలో, గండుపోతు దృష్టి, అప్పుడే అక్కడి కొచ్చిన శబరయువకుల మీద పడింది. వాళ్ళంతా శిఖిముఖి వెనక వైపు నుంచి ఆయుధాలెత్తి ముందుకు ఉరకబోతున్నారు.

గండుపోతు వాళ్ళను చూస్తూనే తక్కున ఆగిపోయి పెద్ద గొంతుతో, "మోసం! కపటం! పోటాపోటీకి రమ్మని పిలిచి, నీ వాళ్ళను నా మీదికి దొంగదాడికి ఉసి కొల్పుతున్నావా?" అంటూ చూపుడు వేలును శబరయువకుల కేసి ఎత్తాడు.

శిఖిముఖీ, అతడికి అంతదూరంలో నిలబడివున్న విక్రమకేసరీ ఆశ్చర్యంగా వెనక్కుతిరిగి చూశారు. వాళ్ళకు కొండల దగ్గిర తమకు కనిపించిన తిమ్మగూడెం వాడి వెంట వచ్చిన శబరయువకులు ఈటెలు పట్టుకుని ముందుకు వస్తూండటం కనిపించింది. శిఖిముఖి వెంటనే చేయెత్తి వాళ్ళకు ముందుకు రావద్దని సౌంజ్ఞచేసి, "మీరంతా వున్నచోటునే ఆగండి. ఈ సవర గండుపోతూ, నేనూ మా బలాబలాలు తేల్చుకోపోతున్నాం," అన్నాడు.

శబరయువకులు ఆ మాట వింటూనే ఎక్కడివాళ్ళక్కడ నిలబడిపోయారు. శిఖిముఖి, గండుపోతు కేసి తిరిగి, "ఊఁ, దెబ్బ కాచుకో, గండుపోతూ!" అని అరిచి ముందుకు అడుగు వేయబోయాడు. కాని, అంతలో గండుపోతు ఒకడుగు వెనక్కు



వేసి, "నువ్వు నీవాళ్ళ నందర్నీ వీపు వెనక వత్తాసు పెట్టుకుని నా మీదికి దెబ్బలాడ వస్తున్నావు.. ఒకవేళ... ఒకవేళ ఏవిఁటి? నువ్వు నా చేతిలో తప్పక చచ్చితీరుతావు— కాని, ఆ సమయంలో నీ శబరమంద అంతా ఒంటరిగావున్న నా మీదికి వచ్చి పడతారు," అన్నాడు.

"ఎవరిచేతిలో ఎవరు చచ్చేదీ యిప్పుడే తేలిపోతుంది, గప్పాలు కొట్టకు. కావాలంటే నీవాళ్ళను కూడా నువ్వు నీ వెనక రక్షణ కోసం తెచ్చుకో," అన్నాడు శిఖిముఖి.


ఆ వెంటనే గండుపోతు చప్పట్లుచరిచి కేకలుపెట్టాడు. గూడెంలో ఎక్కడెక్కడ



వున్న అతడి అనుచరులంతా తమ నాయకుడి దగ్గిరకు పరిగెత్తుకు వచ్చారు. గండుపోతు వాళ్ళందర్నీ పడ్లపాతరకు అవతలి వైపున ఆయుధాలతో సర్వసన్నద్ధంగా వుండమనీ, శిఖిముఖి ముఠావాళ్ళు వున్నచోటు నుంచి కాలు కదిపితేచాలు, వాళ్ళ మీదికి ఉరకమనీ ఆజ్ఞలు యిచ్చాడు.

ఆ తరవాత శిఖిముఖీ, గండుపోతూ యీటెలను ఝుళిపిస్తూ కలియబడ్డారు. గండుపోతు ఈటె విసుర్లను శిఖిముఖి తన ఈటెను అడ్డంగాపెట్టి ఆపుతూ, ఒక్కొక్క అడుగే వెనక్కు వేస్తూ, ధాన్యం పాతర చుట్టూ గిరికీలు తిరగసాగాడు. అతడి ఎత్తుగడ ఏమిటంటే; గండుపోతు మీద తను ఆఖరి దెబ్బ తీసేముందు అతణ్ణి బాగా అలిసిపోయేట్టు చేయాలని.

గండుపోతుకు, శిఖిముఖి తనను పాతర చుట్టూ తిప్పటం చిర్రెత్తిస్తున్నది. ఈ కుర్రకుంకను క్షణాలమీద యీటెతో నాలుగు పోట్లు పొడిచి పాతర్లో పడవేసి యింత మట్టి కప్పించగలనని, అతడనుకున్నాడు. కాని, ఆ కుంక చిడతగండులా తన యీటె దెబ్బకు అందకుండా తప్పుకుంటూ, తనతో దాగుడుమూతలాట లాటి దేదో ఆడుతున్నాడు....



"ఒరే, పిరికికుట్టే! అంత భయపడి పారిపోదలిచిన వాడివి నాతో ఎందుకు పంతానికి దిగావు?" అంటూ పళ్ళుకొరికి, ఆయాసపడసాగాడు గండుపోతు.

"పోతూ! నేను పారిపోవటంలేదు, నీ ప్రాణం తీయబోతున్నాను!" అంటూ శిఖిముఖి ఒక్క కేకపెట్టి, తన యీటెను రెండు గుప్పెళ్ళలోనూ గట్టిగా బిగించి పట్టుకుని, గండుపోతు చేతిలోని ఈటెను బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు గండుపోతు పట్టుకున్న ఈటె పట్టుదప్పి ఎగిరి అంత దూరాన పడిపోయింది. అతడు దాని కోసం పక్కకు తిరిగి పరిగెత్తబోయేంతలో శిఖిముఖి అతడి భుజంమీద తన ఈటె అలుగును బలంగా ఆనించి, "పోతూ! శరణను, ఓడిపోయాననను, నిన్ను ప్రాణాలతో వదులుతాను," అన్నాడు.

"గండుపోతు శబరకుక్కను శరణడగటమా?" అంటూ గండుపోతు భీకరంగా అరిచి ఎడంచేత్తో, భుజంమీద ఆనించివున్న శిఖిముఖి యీటెను పక్కకు కొట్టి, కుడి చేత్తో మొలనున్న పొట్టి కత్తిని చ్రరున లాగి మీదికి దూకాడు. శిఖిముఖి చప్పున ఒక అడుగు వెనక్కువేసి, అతడి కత్తి దెబ్బను తప్పుకుని, తిరిగి గండుపోతు మీదికి రాబోయేంతలో ఈటెతో అతడి కుడి చేతిని



బలంగా ఒక పోటు పొడిచి, అదేసమయంలో కాలితో అతడి ఎడమ మోకాలి మీద గట్టిగా ఒక తన్ను తన్నాడు.

గండుపోతు బాధతో ఒక అరుపు అరిచాడు. అతడి చేతిలోని కత్తి జారి కింద పడింది. మోకాలి మీద తగిలిన తాపుకు కాలిపట్టు తప్పి అతడు పక్కనున్న పడ్ల పాతర్లో దభీమంటూ పడిపోయాడు.

ఇది చూస్తూనే అతడి అనుచరుల్లో హాహాకారాలు బయలుదేరినై. వాళ్ళల్లో కొందరు పారిపోయేందుకు వెనుదిరగబోయేంతలో, ఒక సవరుడు ఎడమచేత్తో ఈటె పైకెత్తి, కుడిచేత్తో జబ్బచరుస్తూ, "గండుపోతుదొర తరవాత నేనూ, యిక్కడ నాయకుణ్ణి! ఈ శిఖిముఖినీ, వాడి కులంవాళ్ళనూ కన్నుమూసి తెరిచేంతలో నరికి పోగులుపెడతాను. మీరు నా వెన్ను కాచి వుండండి, చాలు, రండి," అంటూ శిఖిముఖి కేసి బయలుదేరాడు.

శిఖిముఖికి ప్రమాదం రానున్నదని గ్రహించిన విక్రమకేసరి, శబరయువకులందర్నీ హెచ్చరించి శత్రువులను ఎదుర్కొనేందుకు బయలుదేరాడు. అటు సవరలు కొత్త నాయకుడి వెంట ముందుకు రాసాగారు. భయంకరమైన పోరూ, రక్తపాతం తప్పని పరిస్థితి ఏర్పడిన ఆ దశలో సవరల వెనక నుంచి శివాలుడు ఎలుగెత్తి కేక పెట్టాడు: "అనవసర రక్తపాతం ఎందుకు? గండుపోతు ముఠావాళ్ళంతా లొంగిపొండి! ఆయుధాలు కింద పడవేయండి."

ఆ కేక వింటూనే గండుపోతు అనుచరులు వెనక్కు తిరిగి చూశారు. శివాలుడూ మరి కొందరు శబరులూ ఈటెలు ఎత్తి తమ కేసి రావటం వాళ్ళ కంటబడింది. ముందువైపు నుంచి విక్రమకేసరి శబరయువకుల్తో మీదికి వస్తున్నాడు. ఇప్పుడేం చేయటం? లొంగిపోవటమా? లేక నిలబడి ఎదిరించటమా? —(ఇంకా వుంది)





శిథిలాలయం

7

[శిఖిముఖీ, విక్రమకేసరీ తిమ్మగూడెం వెళ్ళారని కబురందగానే, శివాలుడు కొందరు అనుచరులతో ఆ గూడేనికి వెళ్ళాడు. అతడు చేరేనరికి శిఖిముఖి, నవరగండుపోతును ఈటెతో పొడిచి వడ్లపాతర్లో పడవేశాడు. గండుపోతు అనుచరులు, శిఖిముఖి మీదికి వచ్చేంతలో శివాలుడు వాళ్ళను ఆయుధాలు కిందపడవేయమని హెచ్చరించాడు. తరవాత—]

సవరగండుపోతు గాయపడి వడ్లపాతర్లో పడిపోగానే, అతడి అనుచరులకు నాయకత్వం వహించిన సవరుడు, శివాలుడి హెచ్చరిక విని తాను పెద్ద చిక్కులో తల దూర్చానని గ్రహించాడు. ఇప్పటి పరిస్థితుల్లో పోరుకు దిగటం అంటే సర్వనాశం కావటమే; అలా అని శివాలుడికి లొంగిపోతే—యిక సవరపల్లెల్లో తనకూ, తమ నాయకుడికీ మానమర్యాదలు దక్కవు....

సవరుడు యిలా ఆలోచించి, శివాలుడి కేసి తిరిగి పెద్ద గొంతుతో, "మీరు మమ్మల్ని అన్ని వైపుల నుంచీ చుట్టుముట్టారు. మా కన్న మీరు రెండు మూడింతలు అధిక సంఖ్యలో వున్నారు. ఇది న్యాయం కాదు. మీరు చేసేది ధర్మయుద్ధం అనిపించుకోదు," అన్నాడు.

ఆ మాటలు వింటూనే శిఖిముఖి సవరుడి కేసి తీవ్రంగా చూసి, "ప్రతిదానికి



న్యాయం, ధర్మం అంటూ వెకిలిగా మాట్టా డటం, మీరు ఆ శిథిలాలయ పూజారి దగ్గి ర్నుంచి నేర్చుకున్నట్టుంది. డబ్బు కాశపడి, పరాయి చోటు నుంచి వచ్చిన మంత్రాల పోతు పూజారికి సహాయపడటం న్యాయం, ధర్మం అవుతుందా? ఈ తిమ్మగూడెం మీద వచ్చిపడి ధాన్యం దోచుకుంటున్నారే, యిదేరకం ధర్మం? ఇక అట్టే మాట్టాడక ఆయుధాలు కింద పడెయ్యండి," అన్నాడు.

"ఒకసారి మేం నిరాయుధులం అయిం తరవాత, మమ్మల్నందర్నీ మీరు ఈటెల్తో పొడిచి చంపరని హామీ ఏమిటి?" అన్నాడు సవరుడు.



"అదంతా మా దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి వుంటుంది. ఇంతకూ మీరు చప్పున ఆయుధాలు అవతల పారేస్తారా? లేక...." అంటూ శిఖిముఖి, విక్రమకేసరి వెంట వున్న శబరయువకుల కేసి చూశాడు.

శిఖిముఖి మాటల ధోరణిని అలాగే సాగ నిస్తే, అనవసర రక్తపాతం జరుగుతుందని భయపడి, శివాలుడు తన చేతిలో వున్న యీటెను దూరంగా విసిరివేస్తూ, "మీ సవ రల్లో ఏ ఒక్కరికీ హాని జరగదని నేను మాట యిస్తున్నాను. కావాలంటే ఆయు ధాలు దగ్గిరే వుంచుకోండి, నా అభ్యం తరం లేదు. నాకు కావలసిన వాడు శిథిలా లయ పూజారి. వాడే నాకు ప్రబల విరోధి. ఇంతకూ మీ నాయకుడు గండుపోతెక్కడ?" అని అడిగాడు, సవరల నాయకుడుగా మాట్టాడిన వాణ్ణి.

"ఇక్కడ! ఇక్కడ! వడ్లపాతర అడు గున పడున్నాను. గాయం నుంచి నెత్తురు వరదలై పారుతున్నది. కళ్ళు బైర్లు తిరుగు తున్నై," అంటూ అరిచాడు సవరగండు పోతు పాతర్లో నుంచి.

శివాలుడు ఆశ్చర్యంగా ఆ మాటలు వినిపించిన వైపుకు చూసి, గబగబా వడ్ల పాతర దగ్గిరకు పోయి, లోపలికి తొంగి


CHITRA



నా కూతురు నాగుమల్లిని ఎందుకు చేసుకో గూడదు? ఏమంటావ్, శివాలూ?" అన్నాడు గండుపోతు పకపకనవ్వుతూ.

ఈ అసందర్భపు మాటలు వినగానే, ఎత్తు నుంచి పడటంవల్లా, గాయం నుంచి రక్తస్రావం జరగటంవల్లా గండుపోతుకు మతిచలించి వుంటుందనుకున్నాడు, శివాలుడు. ఆ వెంటనే అతడు తన అనుచరుల్ని హెచ్చరించి ఒక కొయ్యపలక తెప్పించి, దాని చివర్లకు తాళ్ళు కట్టించి, ఇద్దర్ని పాతర్లోకి దింపాడు. వాళ్ళిద్దరూ గండుపోతును కూర్చున్న చోటు నుంచి ఎత్తి కొయ్యపలక మీద పడుకోబెట్టారు. పాతర పైనున్న వాళ్ళు, గండుపోతును మాటులోపడ్డ అడవి జంతువును పైకి లాగినట్టు తాళ్ళ సాయంతో పైకి లాగారు.

గండుపోతు తన అనుచరుల కేసి చూసి ఆశ్చర్యపడుతూ, "మన వాళ్ళందరి దగ్గిరా ఆయుధాలున్నయ్యే! ఇంతకీ యిక్కడ గెలిచిందెవరు? మన వాళ్ళెందరు చచ్చారు?" అని ప్రశ్నించాడు.

సవరలకు నాయకత్వం వహించిన వాడు గండుపోతు ముందుకు వచ్చి, "దొరా! శబర శివాలుదొర యిక్కడ రక్తపాతం జరక్కుండా ఆపారు," అన్నాడు.

చూశాడు. గండుపోతు పాతర మధ్య కూర్చుని తలఎత్తి శివాలుడి కేసి చూశాడు.

"గండుపోతూ! ఏమిటిది? గాయపడ్డావా? త్వరగా పైకెక్కిరా. ఆ శిథిలాలయ పూజారిని పట్టుకునేందుకు నీ సహాయం కావాలి," అన్నాడు శివాలుడు.

"పైకెక్కి రాగలిగితే, ఎప్పుడో వచ్చి వుండేవాణ్ణి. ఈటె పోటు తిని కుడిచేయి చచ్చుపడి పోయింది. ఎడమకాలి కీళ్ళిరిగినట్టు అనుమానం. ఇంత చేసిన వాడెవడో తెలుసా? నీ కొడుకు శిఖిముఖి! వాడు ధైర్యసాహసాల్లో, కత్తి, యీటె సాముల్లో నా అంతటివాడు. వాడికి యీడొచ్చిన






అనుచరు డలా చెప్పగానే గండుపోతు, శివాలుడి కేసి తిరిగి, "నేను మీ జాతివాళ్ళకు చాలా అన్యాయం చేశాను. పూజారికుక్క నాకు బంగారం ఆశ చూపి, నా చేత పాడు పనులు చేయించాడు. నన్ను క్షమించు," అన్నాడు వణుకుతున్న గొంతుతో.

"జరిగిందేదో జరిగింది; యిద్దరం మరిచిపోదాం. ముందు నీ కాలికీ, చేతికీ కట్లుకట్టనీ. తరవాత ఆ పూజారి వేట అందరం కలిసి ప్రారంభిద్దాం," అని చెప్పి, శివాలుడు అంత దూరాన నిలబడి చూస్తున్న వృద్ధుడొకణ్ణి దగ్గిరకు పిలిచి, "ఈ సవరజాతి పెద్దకు వెంటనే చికిత్సచెయ్యి," అన్నాడు.

ఆ వృద్ధుడు గ్రామవైద్యుడు. అతను తన వైద్యపరికరా లెప్పుడూ సంచీలో పెట్టుకుని భుజానికి వేలాడవేసుకుని తిరుగుతూంటాడు. అతడు గండుపోతు చేతిగాయం మీద ఏదో ఆకుపసరు పిండి, అవే ఆకుల్ని కట్టుగా కట్టాడు. తరవాత గండుపోతు ఎడమకాలిని వేళ్ళతో పట్టి చూసి, యిద్దరు సవరుల్ని గండుపోతు చేతులు పక్కలకు లాగి పట్టుకోమని చెప్పి, రెండు వెదురు బద్దల్ని అతడి మోకాలుకు పైనా కిందా పెట్టి, తాడుతో గట్టిగా బిగించి ముడివేశాడు. వైద్యుడిది చేసేప్పుడు గండుపోతు బాధతో గిలగిల్లాడిపోతూ, "ఇంత బాధకూ కారకుడు ఆ పూజారికుక్క! వాడిచ్చిన బంగారు ఇటుకల్ని మహానదిలో పారెయ్యండి. వాణ్ణి ఈ బెగ్గుచ్చి, టేకుమాను చిరారుకొమ్మన ఎండగట్టండి!" అంటూ అరిచాడు.

కట్లు కట్టడం అయిపోగానే గ్రామ వైద్యుడు లేచి నిలబడి, గండుపోతు ముఖంలోకి తీక్షణంగా చూస్తూ, "గండుపోతూ, వైద్యుడుగా నా ధర్మమేదో నేను చేశాను. ఇప్పుడు చెప్పు; మా గ్రామం నుంచి దోచుకుపోయిన ధాన్యం మాకు తిరిగి యివ్వదలిచావా, లేదా?" అని ప్రశ్నించాడు.





"మా వాళ్ళు ఎత్తుకుపోయింది బహు కొద్ది ధాన్యమే. అంతా ఎత్తుకుపోకుండా శిఖిముఖి పులిగండులా వచ్చి పడ్డాడు. మా వాళ్ళు ఎత్తుకుపోయిన ప్రతి బస్తా ధాన్యానికీ రెండు బస్తాల మా సొంత ధాన్యం చేర్చి, మీ గ్రామ పాతర్లో పోయిస్తాను," అని చెప్పి, గండుపోతు తన అనుచరులతో, "బస్తాలుగా కట్టివున్న ధాన్యమంతా పాతర్లో పోయండి. మనవాళ్ళు గూడెం దాటించిన ప్రతి బస్తాతోనూ, మరి రెండుబస్తాల ధాన్యం మన పల్లె నుంచి యిక్కడికి తీసుకురండి," అని చెప్పాడు. తమ నాయకుడు ఇలా ఆజ్ఞాపించగానే,




సవరులు కొందరు తమ పల్లె కేసి బయలుదేరబోయారు. గండుపోతు వాళ్ళను ఆపి, "పూజారికుక్క, తన గుహ వదిలి అరణ్యంలో తిరుగుతూండొచ్చు. ఒక వేళ మీ కెదురుపడి అడిగితే, ఇక్కడ మన సవరు లందరూ, శబరశివాలుడికి ఖైదీలుగా చిక్కిపోయారని చెప్పండి," అన్నాడు.

తరవాత గండుపోతును, శివాలుడు యిద్దరి చేత గ్రామచావడిలోకి మోయించుకు పోయాడు.

గ్రామచావడిలో శివాలుడూ, శిఖిముఖీ, విక్రమకేసరీ ఒక పక్కగా కూర్చున్నారు. గండుపోతు తన అనుచరులు పరిచిన జంతుచర్మాల మీద గోడకు చేరగిలబడి కూర్చున్నాడు. శివాలుడు ప్రశ్నించిన మీదట అతడు, శిథిలాలయ పూజారి వారం రోజుల క్రితం తమ పల్లెకు రావటం, లంచంగా చాలా బంగారం యిచ్చి, విక్రమకేసరి నుంచి తాళపత్ర గ్రంథం సంపాయించి తన కివ్వమని అడగటం గురించి చెప్పాడు.

"శివాలూ, కేవలం వాడిచ్చిన వెధవ బంగారం కోసమే, నేనిన్ని పాడుపనులు చేశాననుకోకు. వాడు నాకు మహత్తరమైన మంత్రాలు నేర్పి, నన్ను ఈ అరణ్య రాజ్యానికి మహారాజును చేస్తానన్నాడు.






వాడింతకీ కావాలనే ఆ తాళపత్ర గ్రంథం రహస్యం ఏమిటి?" అని ప్రశ్నించాడు, గండుపోతు.

"అది నువ్వడగవలసిన ప్రశ్న కాదు, గండుపోతూ. ఒక విధంగా నాకూ ఆ తాళ పత్రాల్లో వున్న రహస్య విషయా లేమిటో పూర్తిగా తెలియవు. అదలా వుంచుదాం. ఈ శిథిలాలయ పూజారి, ఈ ప్రాంతాల నుంచి స్వేచ్ఛగా తిరిగి బ్రహ్మపుత్రానదీ లోయలకు పోవటం, ముందు ముందు కొన్ని చిక్కులకు దారితీస్తుంది. వాణ్ణిక్కడే పట్టుకుని హతమార్చాలి. ప్రస్తుతం వాడు దాగివున్న కొండగుహ ఎక్కడ?" అని అడిగాడు శివాలుడు.

గండుపోతు, శిఖిముఖి కేసి తలతిప్పి, "మీ శిఖికి యీ చుట్టుపక్కల వున్న అరణ్యం, కొండలూ క్షుణ్ణంగా తెలిసినవే కదా. శిఖీ! నందికొండ దిగువున వున్న తాటితోపు నీ వెరిగే వుంటావు. ఆ తోపుకు దక్షిణపు అంచున ఒక అయిదుతలల తాటిచెట్టున్నది. ఆ తాటిచెట్టెక్కి అన్నిటి కన్న ఎత్తుగావున్న తల మీంచి చూస్తే, ఆ పూజారిగాడు వుంటున్న గుహ సూటిగా కనబడుతుంది. ఆ గుహ పక్కన మరి కొన్ని గుహలున్నవి గనక, ఆ దుర్మార్గు




డున్న గుహను గుర్తించటానికి యిదొక్కటే మార్గం," అన్నాడు.

"ఆ గుహ ముందు కావలి వాళ్ళెవరైనా వున్నారా?" అన్నాడు శిఖిముఖి.

"గుహ ముందు లేరు, తాటితోపులో మా వాళ్ళు యిద్దరు ముగ్గురున్నారు. నీకు సహాయం చేయమని వాళ్ళకు యిప్పుడే కబురు పంపుతాను," అన్నాడు గండుపోతు.

శివాలుడి అనుమతి పొంది, శిఖిముఖీ, విక్రమకేసరీ నలుగురు అనుచరులను వెంట బెట్టుకుని నందికొండ కేసి బయలు దేరారు. అవసరం రావచ్చున్న నమ్మకంతో శిఖిముఖి విల్లంబులు వెంట పెట్టుకు



పోయాడు. వాళ్ళు నందికొండను చేరేసరికి సూర్యుడు బాగా పడమటికి వాలాడు. తాటి తోపులో వున్న గండుపోతు అనుచరులు తమ నాయకుడి నుంచి ముందే వార్త అంది వుండటంతో, శిఖిముఖినీ, విక్రమ కేసరినీ అయిదుతలల తాటి చెట్టున్న చోటుకు తీసుకుపోయి, "మీరు తాటి చెట్టెక్కి చూడండి. పూజారి గుహలోనే వున్నాడు. రెండు మూడు గంటల సేపు నుంచీ ఎందుకనో గుహంతా కలయ తిరుగు తున్నాడు. గుహలో అంతగా వెలుగు లేక పోవటంతో, వాడేం చేస్తున్నదీ స్పష్టంగా తెలియటం లేదు," అని చెప్పారు.

శిఖిముఖి, విక్రమకేసరి సంప్రతించు కున్నారు. విక్రమకేసరి కొందరు అనుచరు లతో గుహ దగ్గిరకు పోయేట్టూ, ఒకవేళ పూజారి వాళ్ళు రావటం చూసి పారి పోయేందుకు ప్రయత్నిస్తే, శిఖిముఖి చెట్టు మీది నుంచి బాణం వదిలి వాణ్ణి చంప టమో, గాయపరచటమో చేసేట్టూ నిర్ణ యించుకున్నారు.

పావుగంట తరవాత విక్రమకేసరి కొండ ఎక్కి గుహను సమీపించేంతలో, అప్పటి వరకూ గుహలో నీడలా అటూ యిటూ తిరుగుతున్న పూజారి ఆకారం, ఒక్కసారిగా ఎగిరి గంతేసినట్టు, చెట్టు మీదున్న శిఖి ముఖికి తోచింది. పూజారి పారిపోయే ప్రయత్నం చేస్తున్నాడని భావించి, శిఖి ముఖి గురి చూసి బాణం వదిలాడు. బాణం దెబ్బ తగలగానే, గుహలో వున్న ఆకారం బాధతో ఎలుగుబంటిలా ఒక్కసారి గాండ్రించింది.

ఆ గాండ్రింపు వింటూనే విక్రమకేసరీ, అతడి వెంట వున్నవాళ్ళూ, గుహ కేసి వేగంగా పరిగెత్తారు. "పూజారి ఎలు గ్గొడ్డుగా మారాడు!" అనుకుంటూ శిఖి ముఖి చెట్టు మీంచి దిగి, గుహ కేసి పరుగుతీయ సాగాడు. —(ఇంకా వుంది)





శిథిలాలయం

8

[సవరగండుపోతు, శివాలుడికి శిథిలాలయ పూజారి దాగి వున్న కొండగుహ సంగతి తెలియజేశాడు. శిఖిముఖీ, విక్రమకేసరీ కొండ ప్రాంతాలకు వెళ్ళారు. శిఖిముఖి గుహలో కదులుతున్న ఆకారాని కేసి గురి చూసి బాణం వదిలాడు. బాణందెబ్బ తింటూనే గుహలోని ఆకారం ఎలుగుబంటులా పెద్దగా గేంద్రించి బయిటికిదూకింది. తరవాత—]

శిఖిముఖి చెట్టు మీది నుంచి దిగి గుహను చేరేసరికి, విక్రమకేసరీ అతడి వెంట వున్న వాళ్ళూ, పెద్దగా కేకలు పెడుతూ ఎలుగు బంటును వెంటపడి తరుముతున్నారు. బాణం దెబ్బ తింటూనే ఎలుగుబంటు గుహ నుంచి బయటికి వచ్చి, కొండ దిగి పారిపోయేందుకు ప్రయత్నించింది.

"కేసరీ! ఆ ఎలుగ్గొడ్డును పట్టుకునేం దుకు ఎందు కంత శ్రమపడుతున్నావ్? ముందు గుహలో ఆ పూజారిగా డున్నాడేమో చూడటం అవసరం," అన్నాడు శిఖిముఖి, విక్రమకేసరిని సమీపిస్తూ.

ఆ మాటలు వింటూనే గండుపోతు అను చరులైన సవరలు, "ఇంకెక్కడి పూజారి! మనను మోసగించేందుకు వాడే యిలా ఎలుగుబంటుగా మారిపోయాడు. వాణ్ణి యీ ఆకారంలోనే పట్టుకుని నిలువునా కాల్చి భస్మం చేసేద్దాం," అన్నారు.






శిథిలాలయ పూజారి కున్నవని చెప్పబడే అపూర్వశక్తుల్లో శిఖిముఖికీ రవంత నమ్మకం వున్నది. తాటిచెట్టు పై నుంచి దిగి వచ్చే ప్పుడు అతడూ, గుహలో వున్నది ఎలు గ్గొడ్డుగా మారిపోయిన పూజారి అయి వుండొచ్చనుకున్నాడు. అలాంటప్పుడు, యీ అమాయకులైన సవరలు ఎలుగు బంటును పూజారి అని భ్రమ పడటంలో ఆశ్చర్యపడవలసిం దేమీ లేదు.

శిఖిముఖి యిలా ఆలోచించి, ఎగ్ర గండును ఎలుగుబంటు మీదికి ఉసికొలు పుతూ, “కేసరీ, మీరు ఎలుగును పట్టు కొండి గండుపోతు ముఠావాళ్ళు అన్నట్టు అది పూజారి అయినా కావచ్చు. అయినా కాకపోయినా వాళ్ళకు మనం కోపం తెప్పిం చటం ఎందుకు? నేను యీ లోపల గుహ లోకి పోయి, ఆ దుర్మార్గుడు చీకట్లో ఎక్క డైనా నక్కి వున్నాడేమో చూస్తాను,” అని చెప్పి గుహలోకి వెళ్ళాడు.

గుహలో జాగ్రత్తగా పరీక్షించిన మీదట శిఖిముఖికి, శిథిలాలయ పూజారి అందులో కొన్నాళ్ళపాటు వున్న గుర్తులు కనిపించినై. గుహలో ఒక మూలగా పులిచర్మం ఒకటి పరిచి వున్నది. మరో మూల వంట చేసు కునేందుకు పొయ్యీ, కొన్ని పాత్రలూ కని పించినై. పొయ్యి పక్కనే చమురుతో బాగా తడిపి వున్న రెండు దివిటీలు రాళ్ళకు ఆనించబడి వున్నవి.

పూజారి గుహ నుంచి పారిపోయేందుకు మరే రహస్య ద్వారం వున్న సూచనలూ శిఖిముఖికి కనిపించలేదు. అతడు యిప్ప టికి చాలా గంటల క్రితమే గుహ వదిలి పోయాడు. ఎలుగ్గొడ్డును మహా తెలివిగా యిందుకు ఉపయోగించుకున్నాడు.

శిథిలాలయ పూజారి జిత్తులమారి తనా నికి శిఖిముఖి అబ్బురపడుతూండగా గుహ బయిటి నుంచి విక్రమకేసరి పిలుపు విని పించింది. శిఖిముఖి వెంటనే బయిటికి





వచ్చాడు. ఎలుగ్గొడ్డును ఎత్తయిన రాళ్ళ మధ్యకు తరిమి సవరలు దాని మెడకు తాడు తగిలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎరగండు రాళ్ళ మధ్య వున్న ఒకే ఒక యిరుకు దారి నుంచి అది బయటికి పారి పోతుందా, అక్కడ నిలబడి పెద్దగా మొరుగుతున్నది.





విక్రమకేసరి, శిఖిముఖి దగ్గిర కొచ్చి చిన్న గొంతుతో, "శిఖీ! యీ నల్లమొద్దు శిథిలాలయ పూజారి కాదని నాకూ తెలుసు. కాని, సవరల మూఢ విశ్వాసాన్ని తృణీకరిస్తే కొన్ని అనవసర చిక్కులు ఎదురయ్యే ప్రమాదం వున్నది. వీళ్ళు తమ నాయకుడైన గండుపోతుతో, ఎలుగుబంటుగా మారిన పూజారిని చేజేతులా జారవిడిచామని చెప్పి తీరుతారు. అతడికి పూజారి మంత్రశక్తుల్లో పూర్తి విశ్వాసం వున్నట్టు కనబడుతుంది," అన్నాడు.

"ఆ దుర్మార్గుడి వల్ల చిక్కుల్లో పడింతరవాత గండుపోతుకు అతడి మీద నమ్మకం పోయి, ద్వేషభావం కలిగిందని నే ననుకుంటున్నాను. ఏమైనా, కొండ కింద వుండి పూజారి గుహను కాపలా కాస్తున్న వాళ్ళకు, వాడు బయటికి పోయిన సంగతి గాని, యీ ఎలుగుబంటు లోపల వున్న విషయం గాని తెలియదు. అందువల్ల మనం దీన్ని పట్టుకుపోయి, మా అయ్యాకూ, గండుపోతుకూ చూపటం మంచిది. ఆ తరవాత అరణ్యంలో పూజారిగాడి వేట ప్రారంభిద్దాం," అన్నాడు శిఖిముఖి.

శిఖిముఖి ఎలుగుబంటు వున్న చోటుకు పోయి, రాళ్ళ మీది నుంచి దాని కేసి చూశాడు. అది పెద్దగా గోండ్రిస్తూ పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నది.

శిఖిముఖి చుట్టూ కలియచూసి, అల్లంత దూరంలో వున్న పొదల మీది అడవితీగల్ని కోసుకువచ్చి, వాటిని తాడుగా పేని, ఉచ్చువేసి దానిని ఎలుగుబంటి మెడ





మీదికి గురిగా విసిరాడు. అది ఎలుగుబంటి మెడకు తగులుకోగానే ఉచ్చు గొంతుకు బిగిసేలా బలంగా లాగాడు.

ఎలుగుబంటు గోండ్రిస్తూ చేతులతో తాడును తెంచేందుకు ప్రయత్నించింది. శిఖిముఖి హెచ్చరించగానే, విక్రమకేసరితో పాటు, ఇద్దరు ముగ్గురు సవరులు అతడి చేతిలో వున్న తాడును బలంగా పైకి గుంజారు. ఎలుగుబంటు ఒకటి రెండ డుగులు నేల మీది నుంచి పైకి లేచింది. శిఖిముఖి అదే అదనుగా దాని మూతికి ఒక అడవితీగను గట్టిగా రెండు చుట్లు చుట్టి ముడివేసేశాడు.



శిఖిముఖీ, విక్రమకేసరీ కలిసి ఎలుగు బంటును రాళ్ళ మధ్య నుంచి బయటికి లాగి, దాని మెడకు బిగిసివున్న తాడును సవరలకు యిచ్చి, "ఇక తిమ్మగూడేనికి పదండి. ఇది అడవిగొడ్డో, లేక శిథిలాలయ పూజారో మీ నాయకుడు సవరగండే తేలుస్తాడు," అనిచెప్పారు.

వాళ్ళు ఎలుగుబంటుతో గూడేన్ని చేరే సరికి, అక్కడ స్త్రీలూ, పిల్లలూ గుంపులుగా పోగై, "పూజారి ఎలుగు! పూజారి ఎలుగు!" అని కేకలు పెడుతూ, వాళ్ళతో పాటు శివాలుడూ, సవర గండుపోతూ వున్న గ్రామచావడికి వచ్చారు.


శివాలుడు యీ గందరగోళం ఏమిటా అని చావడిలోంచి బయటికి వచ్చి, తన కొడుకునూ, ఎలుగుబంటునూ చూస్తూనే, "ఏమిటిది? ఆ దుర్మార్గుడు పూజారి గుహలో లేడా?" అని ప్రశ్నించాడు.

"పూజారి గుహలో నుంచి ఎప్పుడో పారిపోయాడు. ఆ సంగతి కాపలావాళ్ళకు తెలియకుండా వుండేందుకు ఈ ఎలుగు బంటును గుహలో కట్టివేశాడు," అని శిఖిముఖి అక్కడ జరిగినదంతా తండ్రికి చెప్పి, "గండుపోతు కులంవాళ్ళకు యీ ఎలుగే శిథిలాలయ పూజారి అన్న నమ్మకం

వున్నది. అందుకనే దీన్ని యిక్కడికి పట్టు కొచ్చాం. గండుపోతు కూడా దీన్నోసారి చూడటం బావుంటుంది. అతడు చెప్పితే తప్ప, అతడి మనుషులకు నమ్మకం కల గదు," అన్నాడు.

ఈ లోపల గండుపోతును అతడి అను చరు లిద్దరు భుజాలు పట్టుకుని చావిడి బయటకు తీసుకు వచ్చారు. అతడు తన అనుచరులు చెప్పినదంతా విని, ఎలుగు బంటు కేసి గుచ్చి గుచ్చి చూస్తూ, "ఆ పూజారి కుక్క ఎంతకైనా సమర్థుడే! ఎందుకైనా మంచిది, యీ మెకాన్ని యింటికి తీసుకుపోయి, నా కూతురు నాగు మల్లికి ఒప్పచెపుతాను. మల్లి ఈటె, కత్తి తీసుకున్నదంటే, యిది నిజం చెప్పితీరు తుంది!" అని తన అనుచరుల కేసి తిరిగి, "మన జాగ్రత్తలో మనం వుండాలి. ఒక వేళ ఆ పూజారికుక్క అరణ్యంలోనే తిరుగుతూండొచ్చు. మన గూడేలన్నిటికి కబురందించి, ఆ దుష్టుణ్ణి పట్టుకునే ప్రయత్నం చెయ్యండి," అన్నాడు.

గండుపోతు అనుచరులు ఎలుగు బంటును వెంట తీసుకుని అక్కణ్ణించి వెళ్ళిపోగానే శివాలుడు స్నేహపూర్వకంగా సవరగండుపోతు భుజం తట్టి, "గండు పోతూ! ఇక మేం మా పల్లెకు వెళతాం.





శిఖిముఖి ఎంతో మేదకుడుగా కనిపిస్తాడు. మీరంతా మా గూడేనికి వచ్చి రాత్రికి నే నిచ్చే విందుభోజనం తినాలి. ఈ లోపల ఆ పూజారికుక్క ఎక్కడ వున్నదీ తెలిసినా తెలియొచ్చు," అన్నాడు.

ఈ ఆహ్వానం అంగీకరించటమా, మానటమా అన్నట్లు శివాలుడు, తన కొడుకు కేసీ, విక్రమకేసరి కేసీ చూశాడు. వాళ్లిద్దరూ ఏ భావం కనబరచలేదు. కాని, ఆ ఇద్దరి కళ్ళూ గండపోతు మీదే వున్నవి. అతడు మరేదైనా కుతంత్రం పన్నుతున్నాడేమో అన్న అనుమానం వాళ్ళను పీడిస్తున్నది.

పూజారి మనకూ మనకూ అనవసర విరోధం తెచ్చిపెట్టాడు. అదంతా మరిచి పోదాం. నీ గాయాలు మాని త్వరలో ఆరోగ్యం కలుగుతుందని నమ్ముతున్నాను. నా కొడుకు తొందరపాటుకు విచారిస్తున్నాను," అన్నాడు.

ఆ మాటలకు గండుపోతు బిగ్గరగా నవ్వి, "తొందరపాటా! ఆ వయసుకు ఆ మాత్రం తొందరపాటు లేకపోతే, పెరిగి పెద్దయింతరవాత ఎందుకు పనికొచ్చేట్టు? నేనూ వయసులో వుండగా కాబొయ్యే మామ మీద యిలాంటి కాస్త మోటు సరసమే ఆడాను. నా కూతురు నాగుమల్లితో పోలిస్తే, నీ కొడుకు

శివాలుడి ఆలోచన గ్రహించిన వాడిలా నవరగండుపోతు తలాడిస్తూ, "ఒక కుల పెద్ద విందుకు ఆహ్వానిస్తే, మరొక కుల పెద్ద రాననటం నే నింతవరకూ చూడలేదు, వినలేదు," అన్నాడు.


"సరే, గండుపోతూ అలాగే వస్తాం. కాని, యిక్కడ వున్న మా పల్లెవాళ్ళందరూ మాత్రం మీ గూడేనికి వచ్చే అవకాశం లేదు. నేనూ, శిఖిముఖీ, విక్రమకేసరీ, మరి నలుగురైదుగురు మా వాళ్ళూ మీ గూడేనికి వస్తాం. మిగిలిన వాళ్ళంతా చీకటి పడేలోపల మా పల్లెకు పోవటం అవసరం. ఆ శిథిలాలయ పూజారి పల్లె మీద మరెలాంటి

ఘోరానికి పూనుకుంటాడో ఊహించలేం గదా," అన్నాడు.

"అదీ నిజమే. ఆ కాట్లకుక్కను పట్టుకుని చిత్రవధ చేసేవరకూ నాకు మనశ్శాంతి వుండదు. ఊఁ, బయలుదేరదామా?" అన్నాడు గండుపోతు.

శివాలుడు తన అనుచరుల్లో నలుగురైదుగురిని మాత్రం తన వెంట వుంచుకుని తతిమ్మా వాళ్ళను కుంభారమిట్ట పల్లెకు పోయి, రాత్రల్లా తగు జాగ్రత్తలో వుండమని హెచ్చరించాడు. ఆ తరవాత గండుపోతు అనుచరులు తమ నాయకుడికి డోలీ ఒకటి తయారు చేసి, అందులో అతణ్ణి కూర్చోపెట్టి, దాన్ని అటిద్దరూ యిటిద్దరూ భుజాలకు ఎత్తుకుని తమ గూడెం కేసి బయలుదేరారు. శివాలుడూ, శిఖిముఖీ, విక్రమకేసరీ దాన్ని అనుసరించి ప్రయాణమయ్యారు.

దాదాపు ఓ గంట ప్రయాణం తరవాత అందరూ నవరపల్లెకు చేరేసరికి, పల్లె మధ్యలో వున్న గండుపోతు ఇంటి ముందు పల్లెవాసులంతా గుమిగూడి నవ్వుతూ, కేరింతలు కొడుతూ గంతులు వేయటం వాళ్ళకు కనిపించింది. శివాలుడు పల్లెవాసుల ఉత్సాహం చూసి, శిథిలాలయ పూజారిని



వాళ్ళు పట్టుకొచ్చారేమో అనుకున్నాడు. కాని, తీరా దగ్గిరకు పోయి చూస్తే, గండుపోతు కూతురు నాగుమల్లి గుహ దగ్గిర దొరికిన ఎలుగుబంటు చేత రకరకాల ఆటలు ఆడిస్తున్నది.

"ఇప్పటికిప్పుడు పట్టుకున్న ఆ క్రూర మృగాన్ని యింతలోనే నీ కూతురు ఎలా మచ్చిక చేయగలిగింది, గండుపోతూ?" అంటూ శివాలుడు ఆశ్చర్యపోయాడు.

"సాహసమే నవరమహాలక్ష్మి, అన్నారు పెద్దలు. నా కూతురు సాహసంలో, ధైర్యంలో నాకు సమానురాలు, మీ శిఖిముఖి దానికి ఉజ్జీ అవునా కాదా అన్న సంశయం నన్ను

బాధిస్తూనే వున్నది. యిలా అన్నానని ఏమీ అనుకోకు, శివాలూ!" అన్నాడు గండు పోతు, కూతురు కేసి ఆప్యాయంగా చూస్తూ.

నాగుమల్లి, తండ్రిని చూస్తూనే ఎలుగు బంటు మెడకు కట్టి వున్న తాడును వదిలి, "అయ్యా, నడవలేనంతగా గాయపడ్డావా? ఏదో చిన్న దెబ్బ తగిలిందని చెప్పారే, మన వాళ్ళు," అంటూ తండ్రిని కావిలించు కుని కన్నీళ్ళు పెట్టుకున్నది.

"తగిలిన గాయం చిన్నదేనమ్మా, కాని ఎడం కాలి కీలేదో కాస్త..." అని గండు పోతు నవ్వుతూ శిఖిముఖి కేసి చేయి చూపి, "ఇంత సవరగండుపోతును డోలీ ఎక్కిం చిందెవరో తెలుసా? ఆ కోడెకారు శిఖిముఖి. అలా కనబడుతున్నాడు గాని—ఎంత తెగువ! ఎంత గుండె బలం!" అన్నాడు.

నాగుమల్లి చప్పున తల తిప్పి, శిఖిముఖి కేసి చూసింది. క్షణంలో ఆమె కన్నీళ్ళు మాయమయినై. కోపంతో ఆమె కళ్లు ఎర్ర బడినై, ముక్కుపుటాలు అదిరినై. ఏదో అనబోయిన దల్లా ఆగి చప్పున తల పక్కకు తిప్పుకున్నది.

ఇదంతా గమనిస్తున్న విక్రమకేసరి, శిఖి ముఖితో రహస్యంగా, "శిఖీ! మనకు విందు చేయటంలో గండుపోతు ఎత్తుగడ ఏమిటా అనే యింతవరకూ మనం ఆలో చిస్తున్నాం. అతడు మహా చేయగలిగితే ఆహారంలో విషం కలిపించగలడు. కాని— కూతురు నాగుమల్లి నీ మీద పగ పట్టినట్టు న్నది, జాగ్రత్త!" అన్నాడు.

శిఖిముఖి ఏదో అనబోయేంతలో ఎలుగు బంటు గోండ్రిస్తూ, అక్కడ చేరిన గుంపు మీద పడి, పంజాలతో అందిన వాణ్ణి అంది నట్టు కొట్టి రక్కసాగింది. గుంపులో హాహా కారాలు బయలుదేరినై. నాగుమల్లీ, శిఖి ముఖీ "తప్పుకోండి, తప్పుకోండి," అని పెద్దగా కేకలు పెడుతూ ఎలుగొడ్డు కేసి పరిగెత్తారు. —(ఇంకా వుంది)





శిథిలాలయం

9

[కొండగుహలో శిఖిముఖీ, విక్రమకేసరులకు శిథిలాలయ పూజారి కనిపించలేదు. అక్కడ దొరికిన ఎలుగుబంటును వాళ్ళు సవరగండుపోతు ముఠావాళ్ళకు ఒప్ప చెప్పారు. నాగుమల్లి దాన్ని కొంతసేపు ఆడించి, యివతలికి రాగానే, అది చుట్టూ చేరిన గుంపు మీద విరుచుకు పడింది. దాన్ని పట్టుకునేందుకు శిఖిముఖీ, నాగుమల్లీ పరిగెత్తారు. తరవాత—]

ఎలుగుబంటు చేత గాయపడిన వాళ్ళల్లో ఎక్కువమంది సవర స్త్రీలూ, పిల్లలూ. మగవాళ్ళు దాన్ని చంపేందుకు యీటెలూ, కర్రలూ అందుకునేలోపలే ఎలుగుబంటు చేయవలసిన ఘోరం అంతా చేసి, పారి పోయే ప్రయత్నంలో వున్నది. ఆ దశలో దాన్ని పట్టుకునేందుకు నాగుమల్లీ, శిఖి ముఖీ ముందుకురికారు. వాళ్ళు ఎలుగు కేసి పరిగెత్తటం చూసిన సవరలు ఈటెల్ని దానికేసి విసరకుండా ఆగారు. అవి గురి తప్పి తమ నాయకుడి కూతురుగ్గాని, శిఖి ముఖిగ్గాని తగలవచ్చని వాళ్ళు భయపడ్డారు.

ఎలుగుబంటు ఒకసారి రెండు కాళ్ళ మీదా నిలబడి తనను సమీపిస్తున్న నాగు మల్లి మీదికి దూకబోయింది. నాగుమల్లి ఏమీ చలించక పిడికెళ్ళు బిగించి వున్న చోటునే నిలబడింది. అసరికి ఎలుగును సమీపించిన శిఖిముఖి కాలితో బలంగా



దాని నడుం మీద ఓ తన్ను తన్నాడు. ఎలుగుబంటు గోండ్రిస్తూ కిందపడి చప్పున లేచి అరణ్యం కేసి పరిగెత్తసాగింది.

పీడ విరగడయిందన్నట్టు చూసి, శిఖిముఖి వెనుదిరగబోయాడు. కాని అంతలో అతడి దృష్టి మెరుపులా ఎలుగుబంటు కేసి పరిగెత్తుతున్న నాగుమల్లి మీద పడింది. యిప్పుడామె చేతిలో ఒక యీటె వున్నది. వెనక నుంచి తండ్రి గండుపోతూ మరి కొందరూ ఆగమని కేకలు పెడుతున్నా ఆమె లక్ష్యపెట్టకుండా ముందుకు పరిగెత్తసాగింది.


నాగుమల్లి సాహసం చూసి శిఖిముఖి మనసులోనే మెచ్చుకున్నాడు. కాని, ఆమె



చేస్తున్నది దుస్సాహసమనీ, ప్రమాదం తెచ్చిపెట్టేదనీ అతడికి తోచింది. ఆ వెంటనే అతడు, "మల్లీ!" అంటూ కేకపెట్టి ఆమె కేసి పరిగెత్తాడు. ముందు ఎలుగుబంటూ, దానికి కొంచెం వెనకగా నాగుమల్లీ, ఆమెకు కాస్త దూరంలో శిఖిముఖీ పరిగెత్తుతూ, చూస్తూండగానే అరణ్యవృక్షాల వెనక మాయమయారు.

"ఆ ఎలుగుబంటు రూపంలో వున్నవాడు పూజారే! సందేహంలేదు. ఆ పూజారి కుక్క మంత్ర తంత్ర విద్యల్లో సాటిలేనివాడు. శివాలూ! వాడు నాకూతుర్నీ, నీ కొడుకునూ చంపటానికో లేక ఎత్తుకుపోవటానికో, యీ మాయారూపంలో వచ్చాడు. ఇద్దర్నీ సమ్మోహపరిచి వెంట తీసుకుపోయాడు. ఇప్పుడేంచేయటం?" అంటూ గండుపోతు అరవసాగాడు.

శివాలుడికి, పూజారి శక్తిసామర్థ్యాల్లో గండుపోతుకున్నంత గుడ్డినమ్మకం లేదు. ఎలుగుబంటును తరుముకుంటూ తన కొడుకూ, గండుపోతు కూతురూ పరిగెత్తటంలో అతడికి పూజారి సమ్మోహన విద్య ఏమీ వున్నట్టు అనుమానం కలగలేదు. కాని, వాళ్ళిద్దరూ ఒకసారి కీకారణ్యంలో జొరపడిం తరవాత, ఆ దుర్మార్గుణ్ణించి





ఎలాంటి ప్రమాదమైనా సంభవించవచ్చని అతడికి కొంచెంగా భయం కలిగింది.

శివాలుడు ఏమి చేయటమా అని ఆలో చించేంతలో విక్రమకేసరి ముగ్గురు శబరుల్తో అతణ్ణి సమీపించి, "శివాలా! నేను శిఖి ముఖికి సాయం వెళతాను. అతడికి ఎలుగు బంటు నుంచి ప్రమాదం వస్తుందని కాదు, నా భయం. ఆ శిథిలాలయ పూజారి యీ చుట్టుపక్కల అరణ్యంలో ఎక్కడో మాటేసి వుంటాడని నానమ్మకం," అన్నాడు.

"నేనూ అదే అనుకుంటున్నాను, కేసరి! వాణ్ణీ, నాగుమల్లినీ కనపడిన వాళ్ళను కనపడినట్టు యిక్కడికి లాక్కురండి," అన్నాడు శివాలుడు.

"నేను వద్దని కేకలు పెడుతున్నా పరి గెత్తింది, నాగు. నేను వెంటనే తిరిగి రమ్మన్నానని చెప్పండి," అని గండుపోతు విక్రమకేసరితో చెప్పి, అతడు బయలుదేరి పోబోతూండగా భుజంపట్టుకు ఆపి, "ఆ ఎలుగ్గొడ్డుందే—అది పూజారి అనే నా అను మానం. దాన్ని దొరికితే ప్రాణాలతో యిక్క డికి పట్టుకురాకండి, చంపి చర్మం వలు చుకువస్తే సరిపోతుంది. ఆ చర్మాన్ని ఎండ గట్టి నా ఇంటి గడప దగ్గిర కాళ్ళుతుడుచు కునేందుకు ఉపయోగిస్తాను," అన్నాడు.



విక్రమకేసరి అతడి మాటలకు సరే అని తలూపి, అనుచరులతో అరణ్యం కేసి పరుగు తీశాడు. వాళ్ళు అరణ్యం చేరగానే, "శిఖిముఖీ! శిఖిముఖీ!" అంటూ కేకలు ప్రారంభించారు. కాని, జవాబు రాలేదు. వాళ్ళల్లో కొందరు అడుగు జాడల కోసం నేలమీద వెతకటం ప్రారంభించారు. ఆ ప్రాంతాల అడవిజంతువులూ, మనుషులూ నడిచిన కాలి గుర్తులు అనేకం కంటబడినై. నాగుమల్లీ, శిఖిముఖుల కాలిగుర్తులు వాటిల్లో ఏవో తెలుసుకోవటం ఎలా?

"ఎలుగుబంటు వాళ్ళిద్దర్నీ అరణ్యంలో చాలా లోపలికి తీసుకుపోయినట్టుంది.





బంటును కొండగుహ దగ్గిర పట్టుకుని సవర పల్లెకు చేర్చింది తను....


శిఖిముఖి యిలా ఆలోచిస్తూ ఎలుగు బంటూ, నాగుమల్లుల వెనక కొండలోయలో వున్న అరణ్యంలోకి చాలా దూరం పరిగెత్తారు. చివరకు ఎలుగుబంటు బాగా అలిసిపోయినట్టుంది. అది ఒక టేకుమాను పక్కన నిలబడి కోరలు చాస్తూ, చిన్నగా గాండ్రించసాగింది. నాగుమల్లి దాన్ని సమీపించి చేతిలోని యీటెతో దాని గుండెల మీద పొడవబోయింది. కాని, ఎలుగు ఆ దెబ్బ తప్పుకుని మాను వెనకకుపోయి గాండ్రిస్తూ నిలబడింది.

మనం రెండు ముఠాలుగా చీలి వెతకటం వల్ల ప్రయోజనం వుండొచ్చు," అన్నాడు కేసరి. ఆ వెంటనే ఇద్దరిద్దరు ఒక జట్టుగా బయలుదేరి అరణ్యంలో కేకలు పెడుతూ శిఖిముఖీ, నాగుమల్లీ కోసం వెతకసాగారు. కాని, నాగుమల్లీ, శిఖిముఖులు ఆ ప్రాంతాల ఎక్కడా లేరు. తన కులంవాళ్ళను గాయపరిచింది గనక, ఎలుగును చీల్చి చెండాడాలన్న కోపంతో నాగుమల్లి దాన్ని వెంటబడి తరమసాగింది. తమ కాతిథ్యం యిస్తున్న గండుపోతు కూతురు ప్రమాదంలో చిక్కుకుంటుందేమో అని శిఖిముఖి ఆమెను వెన్నంటి పరిగెత్తసాగాడు. పైగా, ఆ ఎలుగు

ఆ సమయంలో శిఖిముఖి, నాగుమల్లిని సమీపించాడు. నాగుమల్లి అతడి రాకను చూసీ, చూడనట్టు తల పక్కకు తిప్పుకుని ఎలుగుబంటి మీద యీసారి యీటెతో కలియబడేందుకు, దాని కేసి ఒక్కొక అడుగే వేయసాగింది.

"మల్లీ, దానికి మరీ దాపులకు వెళ్ళకు. పారిపోయే ఆశలేనప్పుడు క్రూరమృగం ఎంత సాహసం చేయగలదో, నీకు తెలీదా?" అన్నాడు, శిఖిముఖి.

"అహఁ, తెలీదు! శబరకుర్రాడొచ్చి చెపితే తప్ప, ఏది ఎలుగుబంటో, ఏది ఎలక





పిల్లో కూడా నాకు తెలీదు," అని వెటకారంగా అంటూ నాగుమల్లి తల తిప్పి శిఖిముఖి కేసి చూడబోయేంతలో, అదే అవకాశంగా తీసుకుని ఎలుగుబంటు ఆమె మీదికి దూకింది. కాని, అది మీదికి దూకబోయేముందు పెట్టిన గుర్రుధ్వని వింటూనే నాగుమల్లి ఈటెను రెండు చేతులతో దాని గుండెల కేసి బలంగా పూపింది. ఈటె ఎలుగు గుండెల్లో గట్టిగా పొడుచుకున్నది. కాని, అది ఎగిరి మీదబడ్డ వేగానికి నాగుమల్లి కాలు నిలదొక్కుకోలేక వెనక్కు పడిపోయింది. ఎలుగుబంటు ఆమె తలను గావుపట్టు పట్టేందుకు పెద్దగా నోరు తెరిచింది.

శిఖిముఖి నడుం నుంచి వేలాడుతున్న చురకత్తిని చర్రునలాగి, మెరుపులా ఎలుగుబంటి మీదికి దూకి, ఎడంచేత్తో దాని కంఠాన్ని వెనక్కు లాగుతూ, కుడి చేతిలో వున్న చురకత్తిని బలంగా దాని మెడమీద గుచ్చి నరాలు తెగేట్టుగా మెలి తిప్పాడు. ఎలుగుబంటు నాగుమల్లిని వదిలి పెద్దగా గాండ్రిస్తూ, శిఖిముఖి మీద విరుచుకుపడింది. శిఖిముఖి ఒక చేత్తో ఎలుగుబంటి మెడను గట్టిగా పట్టుకుని, దాని వాడి కోరలకు తన తల దొరక్కుండా చూసుకుంటూ, చురకత్తితో దాని శరీరం మీద అందిన చోటనల్లా బలంగా పొడవసాగాడు.





ఈలోపల నాగుమల్లి లేచి నిలబడింది. ఆమెకు శిఖిముఖి మీద తన తండ్రిని కొట్టి గాయపరిచాడన్న పగా, కోపం వున్నా, యీ సమయంలో అతడు తనను రక్షించేందుకు ప్రయత్నించి ఎలుగు వల్ల ప్రమాదం తెచ్చుకున్నాడన్న గ్రహింపు కలిగింది. వెంటనే ఆమె ఎలుగుబంటు శరీరంలో దిగి వున్న తన యీటెను ఒక్క గుంజు గుంజి బయటికిలాగి, దానితో ఎలుగు డొక్కలో యిటు నుంచి అటు దూసుకుపోయేట్టుగా ఒక్క పోటు పొడిచింది. ఎలుగుబంటు ఒకసారి పెద్దగా గోండ్రించి, వెల్లికిలా పడి గిలగిల తన్నుకోసాగింది.



శిఖిముఖి లేచి నిలబడ్డాడు. అతడి శరీరం మీద అక్కడక్కడా ఎలుగుబంటి వాడి గోళ్ళవల్ల చిన్నచిన్న గాయాలై కొద్దిగా నెత్తురు కారుతున్నది. అతడి కుడి చేతిలోని చురకత్తి రక్తం ఓడుతున్నది.

నాగుమల్లి అతణ్ణి నఖశిఖ పర్యంతం ఓసారి పరీక్షగా చూసి చిరునవ్వు నవ్వబోయి అంతలోనే ముఖం మీద చిరుకోపం కనబరుస్తూ, "అంత చిన్న కత్తితో ఎవరైనా ఎలుగుబంటు మీద కలియబడతారా? మీ శబరకులం వాళ్ళల్లో ధైర్యసాహసాలున్నయ్యేమోగాని, యుక్తి నేర్పుల్లాంటివి కనబడవు. నీకేమైనా ప్రమాదం జరిగివున్నట్టయితే, అందుక్కారణం నేనని, మీ తండ్రి మామీద దొమ్మీ చేసివుండేవాడు," అన్నది.

"యుక్తులూ, కుయుక్తులూ మనుషుల మీద పారినంత తేలిగ్గా, క్రూరమృగాల మీద పారవు. నిన్ను చంపబోతున్న ఎలుగును ఏ యుక్తి నేర్పూ వుపయోగించి నేను విడిపించగలిగేవాణ్ణి? ఆ క్షణంలో నా దగ్గిర యీ చిన్న కత్తి కూడా లేకపోతే, వట్టి చేతులతోనే దానిమీద కలియబడి వుండేవాణ్ణి," అన్నాడు శిఖిముఖి.

నాగుమల్లి ఆ మాటలకు కొంచెంగా ఆశ్చర్యపోయి, "నీ శత్రువు కూతురు



ప్రాణాలు కాపాడేందుకు అంత సాహసం చేసేవాడివా?" అని అడిగింది.

"గండుపోతు నాకు శత్రువు కాదు. ఏ పరిస్థితుల్లో మేం యిద్దరం యీటెలు తీసుకుని పోట్లాడుకోవలసి వచ్చిందో, ఆ సంగతి మీవాళ్ళకూ మావాళ్ళకూ కూడా బాగా తెలుసు. జరిగిపోయిందాన్ని గురించి యిప్పుడు వాదోపవాదాలెందుకు? ఈ గాయాలకు ముందు ఆకుపసరు పూయాలి. నీవూ బాగా గాయపడ్డావు. వాటి నుంచి తీపూ సలపరం మొదలవక ముందే ఆకు రసం తెచ్చి పూసుకో. నెత్తురు కట్టించి గాయాన్ని మాన్పే ఓషధీ పత్రాలేవో గుర్తించి తెచ్చుకో గలవా? లేక నేను కోసుకొచ్చిపెట్టనా?" అంటూ శిఖిముఖి చుట్టూ ఓమారు కలయ చూసి, మహావృక్షాలకు దిగువున అల్లిబిల్లిగా పెరిగిన పొదల కేసి బయలుదేరాడు.


నాగుమల్లి అతణ్ణి ఆగమని హెచ్చరించి, "నేనూ అరణ్యంలో పుట్టి పెరిగినదాన్నే. మందుకు పనికొచ్చే ఆకులేవో నాకు తెలియనివికావు. వాటిని నీక్కూడా నేనే తెచ్చి యిస్తాను. మావాళ్ళు అన్నట్టు ఈ చచ్చిన ఎలుగుబంటు ఆ దొంగ పూజారేనేమో! లేచి పారిపోకుండా చూస్తూండు," అంటూ చిరునవ్వునవ్వి చెట్లల్లోకి పోయి, నాలుగైదు



నిమిషాల్లో యిన్ని ఆకులు గుప్పెళ్ళతో పట్టుకు వచ్చింది.

నాగుమల్లి తిరిగి వచ్చేసరికి, శిఖిముఖి ఒక ఎండుమోడు మీద కూర్చుని ఆమెను గురించే దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. నాగుమల్లి కనబరిచిన ధైర్యసాహసాలేకాక, ఆమె అందచందాలు కూడా అతడి హృదయాన్ని బాగా ఆకర్షించినై.

"ఏమిటాలోచన? ఇదుగో ఆకురసం!" అంటూ నాగుమల్లి, శిఖిముఖిని సమీపించింది. అతడు ఉలిక్కిపడి నిద్ర లేచినట్టు ఆమె కేసి చూసి, చేయి చాపాడు. కాని నాగుమల్లి ఆకుల్ని అతడి కివ్వక, "నీవు



మీదా, భుజాలమీదా కూడా ఎలుగు గోళ్ళతో బాగా రక్కింది. అక్కడ పసరు రాసు కోవటం నీవల్ల నేమవుతుంది? నేరాస్తాను," అంటూ శిఖిముఖి గాయాల మీద ఆకు నలిపి దాని పసరు పూయసాగింది.

శిఖిముఖి పసరు తగిలినప్పుడల్లా భగ్గుమని మండే గాయాల బాధ మరిచి పోయి, ఆమె ముఖం కేసి చూస్తూ వుండి పోయాడు. పసరు రాయటం పూర్తవగానే నాగుమల్లి అతణ్ణించి కొంచెం ఎడంగా పోయి తన శరీరం మీది గాయాలకు పసరు రాసుకోబోయింది. కాని, శిఖిముఖి చప్పున లేచి ఆమె దగ్గరకుపోయి, చేతిలో వున్న ఆకుల్ని లాక్కునేందుకు ఆమె గుప్పెళ్ళను బలంగా పట్టుకుని, "నాకు నువ్వు చెప్పిందే, నీకూ చెల్లుతుంది. ఇప్పుడు వంతు నాది," అంటూ ఆమె యిచ్చిన ఆకుల్ని మరి కాస్త రసం వచ్చేలా అరచేతుల్తో నలిపి, ఆమె శరీరం మీద దెబ్బలు తగిలినచోటనల్లా రాయసాగాడు. నాగుమల్లి లేని బాధను కన బరుస్తూ చిన్నగా మూలుగులు ప్రారం భించింది.

ఈ స్థితిలో లోయపైనున్న కొండభాగం మీది గుబురు చెట్లల్లోంచి, "నా బిడ్డల్లారా! అహ్హహ్హ!" అన్న వికృత కంఠ ధ్వని విని పించింది. శిఖిముఖీ, నాగుమల్లి తలలు ఎత్తి పైకి చూశారు.

"మిమ్మల్నిద్దర్నీ హిమాలయాలకు అటూయిటూ నూరు యోజనాల వరకూ మహారాజూ, మహారాణీలను చేయబో తున్నాను. ఇదుగో, నా దూత మీ దగ్గిరికే వస్తున్నాడు. వాడిద్వారా నా సందేశం సర్వం తెలుసుకోండి," అంటూ ఆ వికృత కంఠం మరోసారి పలికింది. తలలు ఎత్తి నిశ్చేష్టులై చూస్తున్న శిఖిముఖీ, నాగుమల్లుల కేసి చెట్ల కొమ్మల మీదుగా ఒక మానవా కారం, ఎగురుతున్న పక్షిలా చేతులు చాచి కిందికి దిగసాగింది. —(ఇంకా వుంది)





శిథిలాలయం

10

[నవరజాతి వాళ్ళను గాయపరిచి ఎలుగుబంటు అరణ్యంలోకి పారిపోసాగింది. కాని శిఖిముఖీ, నాగుమల్లీ దాన్ని కొంత పోరుజరిగాక, చంపారు. ఆ సమయంలో కొండ మీది నుంచి పూజారి కంఠం వినిపించింది. మరుక్షణంలో ఒక మానవాకారం ఎగురుతున్న పక్షిలా చేతులు చాచి చెట్లకొమ్మల మీదుగా కిందికి రాసాగింది. తరవాత—]

చెట్ల కొమ్మల్లోంచి తమ కేసి వస్తున్న వింత ఆకారాన్ని చూసి, శిఖిముఖీ, నాగుమల్లులు చాలా ఆశ్చర్యం పొందారు. ఆ ఆకారం చూడటానికి మామూలు మనిషిలాగే వుంది. కాని, పక్షిలా గాల్లో తేలియాడుతూ కిందకు దిగి రావటం వాళ్లిద్దరికీ కొంత భయాన్ని కూడా కలిగించింది. ఇది. శిథిలాలయ పూజారి తన మంత్ర ప్రభావంతో కల్పించిన పక్షి మనిషేమో అనుకున్నాడు, శిఖిముఖి. కాని, అంతలోనే అతడి అనుమానం పటాపంచలైంది. ఆ వింత మనిషి కాళ్లూ చేతులూ ఊపుతూ భూమికి పదీ పన్నెం డడుగుల ఎత్తులోకి వచ్చేసరికి, అతడి నడుముకు ఒక బలమైన మోకు కట్టివున్నట్టు శిఖిముఖి చూశాడు. అంటే, పూజారి కొండ మీద వ్నుండి, యీ మనిషి నడుముకు తాడు కట్టి చెట్లల్లోంచి తమ ముందుకు జారుస్తున్నాడన్నమాట!





మనిషి దభీమంటూ కింద పడ్డాడు. వాడి నడుముకు కట్టివున్న తాడు తెగిపోయింది.

నిలువునా నేల మీద పడిపోయిన పక్షి మనిషిని శిఖిముఖి, నాగుమల్లి పట్టుకుని కదిలించి చూశారు. కాని, వాడు శవంలా కొంచెం సేపు బిర్రబిగుసుకు పోయి, హఠాత్తుగా ప్రాణం వచ్చినవాడల్లే ఎగిరి గంతేసి నిలబడుతూ, "జై, పూజారి దేవా!" అంటూ పెద్దగా కేక పెట్టాడు.

"ఆ పూజారి, దేవుడు కాదురా, దయ్యం! ఇంతకీ నీ వెవడివి? ఆ దుర్మార్గుడి బంటువా? చెప్పు," అంటూ శిఖిముఖి వాడి మెడ పట్టుకుని వూపాడు.

"నేను గండభేరుండ పక్షి జాతివాణ్ణి. చుక్కలకంటా ఎగరగలను; ఈ భూప్రపంచాన్ని క్షణకాలంలో చుట్టి రాగలను," అంటూ వాడు గణాచారిలా వూగిపోసాగాడు.

"ఏదేదో మూంచి తాగిన మైకంలో వున్నాడు. వీడి నుంచి మనం పూజారి సందేశం వినటం ఎలా సాధ్యం?" అంటూ శిఖిముఖి వాణ్ణి భుజాలు పట్టుకుని ఒక్క తోపు తోశాడు. ఆ తోపుకు వాడు పోయి ఒక చెట్టు బోదెకు కరుచుకుని, మెల్లిగా కూనిరాగాలు తీయసాగాడు.

ఈ సంశయం కలగ్గానే శిఖిముఖి పెద్దగా నవ్వి, నాగుమల్లితో, "చూశావా, ఆ శిథిలాలయ పూజారి మంత్రశక్తులు ఎంత మహత్తరమయినవో? మీ అయ్య అమాయకంగా అతడి దొంగమాటలు నమ్మి, మాతో విరోధం తెచ్చుకున్నాడు," అన్నాడు.

ఆ మాటలకు నాగుమల్లి కోపం తెచ్చుకుని, "మీ శబరవాళ్ళు తెలివిమంతులూ, మా నవరలు అమాయకులూ అనా నీవు అనేది? అందరూ మందబుద్ధులే! అసలు కావాలని మాతో విరోధం పెట్టుకున్నది, మీ జాతివాళ్ళు. మా అయ్య సంగతి..." అంటూ ఏమో చెప్పబోయేంతలో పక్షి



అప్పటివరకూ జరుగుతున్నదంతా పరీక్షగా చూస్తున్న నాగుమల్లి చప్పున పక్షి మనిషి దగ్గిరకు పోయి, ఈటె తిప్పి వాడి భుజాన పొడుస్తూ, "నీవు సవరజాతి వాడివి కాదా? నీది తిమ్మగూడెమే కదా? గండుపోతు తెలుసా?" అని ప్రశ్నించింది.

గండుపోతు అన్న పేరు వింటూనే వాడు అదిరిపడి, "సవరగండుపోతా? అతడికి చావు తప్పదు. పూజారి దేవుడికి కోపం తెప్పించాడు. చూస్తూండు, రెండుమూడు రోజుల్లో పూజారి దేవుడు పంపే గండ భేరుండం అతణ్ణి కోడిపిల్ల కింద తన్నుకు పోయి, ఏ కొండశిఖరానో పెట్టుకుని పొడుచుకు తినేస్తుంది," అన్నాడు.


"ఈ తిక్క తిక్క మాటలు కట్టిపెట్టు. నీవు తిమ్మగూడెం వాడివి, నాకు తెలును. నేను సవరపెద్ద గండుపోతు కూతుర్ని; నాగుమల్లిని. నీ పేరేమిటి?" అంటూ నాగుమల్లి ఈటె కర్రతో వాడి వెన్నుమీద బలంగా కొట్టింది.

ఆ దెబ్బతో వాడికి తిక్క సగం దిగి పోయింది. వాడు చప్పున తలతిప్పి నాగుమల్లి కేసి చూస్తూ, "నాగుమల్లివా? చెప్పవేం? నిన్ను పూజారి దేవుడు మహారాణిని చేస్తానంటున్నాడు—నా పేరా? పాతపేరు



ఏదో గుర్తు లేదు. పూజారి దేవుడు పిలిచే పేరు, సవర భేరుండం," అన్నాడు.

"నువ్వు సవర భేరుండానివి కాదు, చవట భేరుండానివి. ఆ దుర్మార్గు డేదో మందుమాకులు ప్రయోగించి నీ మతి చెడ కొట్టి నట్టుంది. లేకపోతే విప్పసారా అతిగా తాగి వుంటావు. అందుకే యింత సేపటి నుంచీ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నావు. నీ కైపు దించి నిన్నిప్పుడే మామూలు మనిషిగా చేస్తాను," అంటూ శిఖిముఖి, భేరుండాన్ని నడుం పట్టుకు ఎత్తి భుజాన వేసుకుని, దాపులనున్న సెలయేటి దగ్గిరకు పరుగు పరుగున పోయి, విసిరి పడవేశాడు.





నీళ్ళల్లో పడుతూనే భేరుండం పెద్దగా ఓ చావుకేక పెట్టాడు. అతడికి తాను నీటి ప్రవాహన పడి కొట్టుకు పోయి ఏ రాతికో తల తగిలి చస్తానన్న భయం కలిగింది. శిఖిముఖి అతణ్ణి నీటివాలు వెంట కొట్టుకు పోకుండా పట్టుకుని, తలను నీటిలో ముంచుతూ, "ఈ దెబ్బతో నీ మత్తు వదులుతుంది, తిరిగి మనిషివవుతావు," అన్నాడు పళ్ళు కొరుకుతూ.

శిఖిముఖి వాణ్ణి ఆ విధంగా నాలుగైదు సార్లు నీటిలో ముంచి ఎత్తేసరికి భేరుండం ప్రాణభయంతో తల్లగిల్లి పోతూ, "చంపకు నన్ను, మహారాజా! పూజారి దేవుడు పంపిన సందేశం వినండి, ఆ పటం చూడండి. మహారాణి ఎక్కడ? కాపాడు, రక్షించు, మహారాణీ!" అంటూ అరిచాడు.

సెలయేటి ఒడ్డున నిలబడి యీ గొడవంతా చూస్తున్న నాగుమల్లి, భేరుండం మాటలకు విరగబడి నవ్వుతూ, "శిఖీ! వాణ్ణి చంపకు. నీ వైద్యంతో వాడికి ఉన్న కాస్త మతి కూడా పోయినట్టుంది. ఒడ్డున పడెయ్యి," అన్నది.

శిఖిముఖి ఆ మాటలతో కాస్త శాంతించి, గండభేరుండాన్ని నీటిలో నుంచి పైకెత్తి ఒడ్డుకు గిరవాటు వేశాడు. వాడు పడ్డ చోటునే ఆయాసపడుతూ లేచి కూర్చుని, "నన్ను దయ తలచండి. ఆకాశంలో ఎంతో దూరం నుంచి ఎగిరి వచ్చిన ఆయాసం, శ్రమా వల్ల ఏదేదో మాట్టాడాను," అన్నాడు వగర్చుతూ.

"ఏదో పటం అన్నావే, ఏమిటది?" అని ప్రశ్నించాడు శిఖిముఖి.

"ఆ మరిచాను, మహారాజా!" అంటూ గండభేరుండం దుస్తుల్లో నుంచి గుండ్రగా చుట్టివున్న చర్మాన్నొకదాన్ని బయిటికి తీసి, "ఇది మంచు జింక చర్మం. విప్పి చూడండి. మీరు పాలించబోయే రాజ్యపు సరిహద్దులూ, ఆ రాజ్యంలోని కొండలూ,






నదులూ, అరణ్యాలూ అన్నీ వుంటవి. మీరు వెంటనే బయలుదేరాలి. పూజారి దేవుడున్న చోటుకు తీసుకు పోతాను. తర వాత ఆయన మనందర్నీ ఆకాశమార్గాన బ్రహ్మపుత్రా నదీలోయలకు ఎత్తుకు పోతారు," అన్నాడు సవర భేరుండం.

శిఖిముఖీ, నాగుమల్లీ అతని మాటలేమీ పట్టించుకోలేదు. వాళ్ళు గుండ్రంగా చుట్టి వున్న జింకచర్మాన్ని విప్పి, దాని మీద రంగుల్లో చిత్రించివున్న అపూర్వ దృశ్యా లను చూస్తున్నారు. అందులో ఒక చోట శిథిలాలయం చిత్రించబడి వున్నది. దాని పక్కగా ఒక మహానదీ, కొండలూ, అర ణ్యాలూ చిత్రితమయాయి. దూరంగా మంచుతో కప్పబడిన హిమాలయ పర్వ తాలు కనిపిస్తున్నవి. శిఖిముఖీ, నాగుమల్లీ ఆ దృశ్యాలు చూస్తూ మైమరిచారు. వారి నేదో అదృశ్య శక్తి ఒకటి ఆ సుందర ప్రాంతాలకు ఆహ్వానిస్తున్నట్టుగా తోచింది.

"శిఖీ! మనం యీ బొమ్మలో వున్న హిమాలయ ప్రాంతాలకు వెళదామా? పూజారి చెప్పే రాజూ, రాణీ మాటలు నేను నమ్మను. కాని, ఊరికే ఒకసారి అతడి వెంట వెళ్ళి, అద్భుతంగా వున్న ఆ కొండలూ అవీ చూసివద్దాం," అన్నది నాగుమల్లి.

శిఖిముఖి, ఆమె కేసి తలతిప్పి చూశాడు. నాగుమల్లి కళ్ళింత చేసుకుని, జింకచర్మం మీద చిత్రించబడ్డ దృశ్యాల కేసి చూస్తూ ఆనందపారవశ్యంలో మునకలు వేస్తున్నది. శిఖిముఖి ఏదో ప్రమాదాన్ని శంకించిన వాడిలా కనుబొమలు పైకెత్తి, తలాడిస్తూ, నాగుమల్లి భుజం మీద చేయివేసి, "మల్లీ! నువ్వీ లోకంలోనే వున్నావా? లేక శిథిలా లయ పూజారి మంత్ర ప్రభావానికి కట్టుబడి పోయావా?" అని ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నతో నాగుమల్లి ఉలిక్కిపడి, "భేరుండానికి లాగే నాకూ మతిపోయి నట్టుంది. ఆ దుర్మార్గుడైన పూజారి వెంట





ఆ బ్రహ్మపుత్రానది లోయల కేసి వెళ్ళటం ఏమిటి ?" అన్నది, నొచ్చుకుంటున్నట్టు.

"నేనూ అదే అడగబోతున్నాను. వాడు మన శత్రువు .." అంటూ శిఖిముఖి ఆగి, సవర భేరుండం కేసి తల తిప్పి, "నువ్విక్కడే వుండు. నీ వెంట ఆ పూజారి దేవుడి దగ్గిరకొస్తాం," అని చెప్పి, నాగు మల్లిని కొంచెం దూరంగా తీసుకుపోయి, "ఆ శిథిలాలయ పూజారిని పట్టుకునేందుకు యిదొక అవకాశం. వాడు యీ ప్రాంతాల్లో చేసిన ఘోరాలు అన్నీ యిన్నీ కావు. గండ భేరుండం మాటలు నమ్మినట్టు నటించి, వాడి వెంట పూజారి దగ్గిరకు వెళదామా ?




ఒకసారి ఆ దుష్టుడు మన కంటబడితే, వాణ్ణి పట్టుకు బంధించటం ఏమంత కష్టం కాదు," అని చెప్పాడు.

నాగుమల్లి అందుకు సంతోషంగా అంగీక రించింది. ఆ వెంటనే శిఖిముఖి, గండభేరుం డాన్ని సమీపించి, "ఇక పద, మీ పూజారి దేవుడి దగ్గిరకు దారితియ్యి," అన్నాడు.

గండభేరుండం ఆ మాటలు వింటూనే పరవశుడై పోయినట్టు గంతులు వేస్తూ, "రండి, రండి. కాబోయే మహారాజూ, మహారాణీలను పూజారిదేవుడికి పరిచయం చేయటం కన్న నాక్కావలసిం దేమున్నది? రాజ్యం వచ్చిం తరవాత, యీ సవర భేరుండాన్ని మాత్రం మరవకండి," అని చెట్లల్లోంచి కొండ మీదికి దారితీశాడు.

ఆ కొండప్రదేశ మంతా పెద్దపెద్ద వృక్షా లతో కప్పుకుపోయి వున్నది. భేరుండం ఆ ప్రాంత మంతా క్షుణ్ణంగా తెలిసినవాడి లాగా గబగబా నడవసాగాడు. శిఖిముఖీ, నాగుమల్లీ చుట్టూ పరికించి చూస్తూ, ఆయుధాలు జాగ్రత్తగా పట్టుకుని వాణ్ణి అనుసరించారు.

ఒక పావుగంట గడిచింది. ఆ సరికి వాళ్ళు కొండ మీదికి చాలాదూరం ఎక్కారు. ఇప్పుడు భేరుండం ఏవో గుర్తుల కోసం




CHITRA

చూస్తున్నవాడిలా తల అటూ యిటూ తిప్పుతూ మెల్లిగా నడుస్తున్నాడు. శిఖిముఖీ, నాగుమల్లులు ఒక మహావృక్షం బోదెను చుట్టి ముందుకు పోయేంతలో, "నా బిడ్డల్లారా! వస్తున్నారా? అహ్హహ్హ!" అన్న శిథిలాలయ పూజారి వికృత కంఠధ్వని వినిపించింది.

ఇద్దరూ గతుక్కుమని తలలెత్తి పైకి చూశారు. వాళ్ళ కళ్ళకు భయంకొల్పే అద్భుత దృశ్యం ఒకటి కనిపించింది. వాళ్ళు కింద అరణ్యంలో చంపిన ఎలుగుబంటు చెట్లకొమ్మల మీదుగా—గాలిలో తేలుతూ పైకి పోతున్నది.

"శిఖీ! అది మనం చంపిన ఎలుగే! మెడ ఒక పక్కకు వేలాడవేసి వున్నది కనబడటం లేదా?" అన్నది నాగుమల్లి ఆశ్చర్యపడుతూ.

"తెలుస్తూనే వున్నది. దేని సాయంతో శిథిలాలయ పూజారి దాన్ని పైకి లాగుతున్నాడో అర్థం కావటంలేదు. ఓహెూ, భేరుండాన్ని మన ముందు దించినట్టు .." అని శిఖిముఖి ఏదో చెప్పబోయేంతలో, పై నుంచి పూజారి కంచుకంఠం గణగణమంటూ మోగింది:

"అవి తాళ్ళనుకుంటున్నావా? కాదు, కర్మపాశాలు! వాటికి బద్ధుడయ్యే, భల్లూకేశ్వరుడు నా దగ్గిర కొస్తున్నాడు; మీరూ నా దగ్గిర కొస్తున్నారు."

ఆ మరుక్షణంలోనే జుఁయ్ మంటూ రెండుమూడు బాణాలు చెట్లకొమ్మల మీదుగా పైకి దూసుకుపోయినై. దానితోపాటే విక్రమకేసరి గొంతు కూడా వినిపించింది: "శిఖీ! మల్లీ! ఆ పూజారి వున్న గుహ తెలిసింది. చుట్టుముట్టుదాం. ఇదుగో వస్తున్నాను."

శిఖిముఖీ, నాగుమల్లీ ఆ కంఠధ్వని వినవచ్చిన వైపుకు తలలు తిప్పి చూశారు. విక్రమకేసరి వేగంగా వాళ్ళ కేసి పరిగెత్తుకు వస్తున్నాడు. —(ఇంకావుంది)





శిథిలాలయం

11

[అరణ్యంలో ఎలుగుబంటును చంపింతరవాత, శిఖిముఖీ, నాగుమల్లులకు కనిపించిన వింతమనిషి, తన పేరు నవరభేరుండం అని చెప్పి, వాళ్ళిద్దర్నీ వెంట బెట్టుకుని పూజారి పద్దకు బయలుదేరాడు. వాళ్ళు కొండ ఎక్కుతూండగా, విక్రమకేసరి వాళ్ళ కేసి పరిగెత్తుకు వస్తూ; తనకు పూజారి దాగివున్న కొండగుహ తెలిసిందని కేకవేశాడు. తరవాత—]

విక్రమకేసరి వేగంగా తమ కేసి పరిగెత్తుకు రావటం చూస్తూనే, శిఖిముఖికి తాను శిథిలాలయ పూజారిని పట్టుకునేందుకు వేసిన పథకం దెబ్బతిని పోయిందని అర్థమైంది. ఇప్పుడు విక్రమకేసరి పెట్టిన కేకలు ఆ దుర్మార్గుడు వినే వుంటాడు; సందేహం లేదు. తననూ, నాగుమల్లినీ కల్లబొల్లి మాటలతో మోసపుచ్చి వెంట తీసుకు పోవచ్చుని భావించిన పూజారికి, విక్రమకేసరి రాకతో ఆ ఎత్తు పారదని తెలిసిపోయి వుంటుంది. ఇప్పుడు చేయవలసిందేమిటి? పూజారి బంటయిన సవరభేరుండాన్ని బంధిస్తే, పూజారి అతడికి సాయపడేందుకు రావచ్చు. అప్పుడు....

శిఖిముఖి యిలా ఆలోచించి విక్రమకేసరి కేసి చేయి వూపుతూ, నాగుమల్లితో, "మల్లీ! అనుగో, ఆ భేరుండాన్ని మంచి మాటలతో పారిపోకుండా చూడు. నేను,



కేసరితో ఒక మాట చెప్పి యిప్పుడే వస్తాను," అన్నాడు.

నాగుమల్లి సరే నన్నట్టు తల వూపి, ముందుపోతున్న భేరుండం కేసి గబగబా పరిగెత్తింది. ఇంతలో కొండ మీది నుంచి శిథిలాలయ పూజారి పెద్ద గొంతుతో, "భేరుండం! నువ్వు పరాకు చిత్తగిస్తున్న ట్టున్నది. జాగ్రత్త. ఇదుగో కర్మపాశం! దాన్ని పట్టుకుని వెంటనే ఆకాశంలోకి ఎగురు," అన్నాడు.

శిఖిముఖి ఆ మాటలు వింటూనే, భేరుండం కేసి తిరిగి అతణ్ణి పట్టుకునేం దుకు పరిగెత్తేంతలో, కొండ పై నుంచి



నల్లని తాడొకటి విసురుగా వచ్చి భేరుండం ముందు పడింది. భేరుండం దాన్ని గబగబా నడుముకు చుట్టుకుని, "పూజారిదేవా! ఈ నవరభేరుండం ఆకాశంలోకి ఎగిరి పోటానికి సిద్ధంగా వున్నాడు. ఏమిటీ, మీ ఆజ్ఞ?" అని కేక పెట్టాడు.

మరుక్షణంలో భేరుండం తాడు సాయంతో గాలిలోకి లే అతణ్ణి పట్టుకునేందుకు శిఖిముఖీ, నాగుమల్లులతోపాటు విక్రమ కేసరి కూడా పరిగెత్తాడు. కాని, భేరుండం అప్పటికే గాలిలో అయిదారు నిలువుల ఎత్తుకు లేచిపోయాడు. విక్రమకేసరి పళ్లు కొరుకుతూ, "ఓరి, పూజారిబంటూ! నీకు చావు తప్పదు!" అని విల్లంబు పై కెత్తి, బాణం వదలబోయాడు.

శిఖిముఖి చప్పున ఏదో ఆలోచన వచ్చిన వాడిలా తల ఎగర వేసి, విక్రమకేసరి చేయి పట్టుకుని అతడు బాణం వదలకుండా ఆపి, "కేసరీ, తొందరపడకు. ఆ బంటును చంపి నందువల్ల మనకు కలగబోయే మేలు కన్న కీడే అధికంగా వుంటుంది," అన్నాడు.

"వాడు దుష్టుడి సేవకుడు; దుష్టుడు!" అన్నాడు విక్రమకేసరి కోపంగా.


"వాడు దుష్టుడి సేవకుడే గాని, దుష్టుడు మాత్రం కాదు. కేవలం అల్పజీవి, ఒట్టి



బోళామనిషి. తాగిన మైకంలో వాడు నిజంగా తాను ఆకాశంలోకి ఎగరగల ననుకుంటు న్నాడు. అలాంటి మందమతిని ఎవరైనా తమ స్వప్రయోజనానికి ఉపయోగించుకో వచ్చు. వాడు బతికి వుండి, పూజారి సేవ లోనే వుంటే ముందు ముందు మనకు పనికి వస్తాడు," అన్నాడు శిఖిముఖి.


"ముందు ఏ నాటి సంగతో ఎందుకు? ఆ పూజారి వున్న గుహను ఒక కంట కని పెట్టి వుండేందుకు ఇద్దరు శబరుల్ని కావలి వుంచాను. మరొకడు చెట్ల మీదుగా ఎగిరి పోతున్న ఎలుగుబంటి రహస్యం ఏమిటో కనుక్కునేందుకు వెళ్ళాడు. మనం పూజారి వున్న గుహను చుట్టు ముట్టుదాం," అన్నాడు విక్రమకేసరి.

"నీ కేకల్తో, గండభేరుండం తప్పిం చుకు పోవటంతో ఆ పూజారిగాడు మన ప్రయత్నం ఏమిటో గ్రహించే వుంటాడు," అని శిఖిముఖి తానూ, నాగుమల్లీ అరణ్యంలో ప్రవేశించి-ఎలుగ్గొడ్డును చంపి నప్పటి నుంచీ జరిగిన సంఘటనలన్నీ చెప్పి, గండభేరుండం తన కిచ్చిన జింక చర్మాన్ని అతడికి చూపించాడు. దాని మీద చిత్రించబడిన దృశ్యాలు చూసి విక్రమ కేసరి సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయాడు.



"ఈ చర్మం మీది చిత్రాలు మనకు బ్రహ్మపుత్రా లోయల్లో ప్రవేశించినప్పుడు మార్గాన్వేషణలో సహాయపడతవి. దాన్ని నీ దగ్గిరే వుంచు," అన్నాడు శిఖిముఖి.

విక్రమకేసరి ఆ జింకచర్మాన్ని ఎప్పటిలా గుండ్రంగా చుట్టి, తాడుతో నడుముకు బిగించుకున్నాడు. అంతలో శబరు డొకడు అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చి, "కేసరి దొరా! ఆ మంత్రాల మారిగాడూ, మరొ కడూ గుహలో చేరి ఏదో మాట్లాడుకుంటు న్నారు. లోపల వాళ్ళు వెలుగు కోసం మంట చేసినట్టున్నది. గుహ ద్వారం పొగతో మూసుకు పోయింది," అని చెప్పాడు.





"గుహలో వాళ్ళు మంట చేసింది వెలుగు కోసం కాదు, మన కళ్ళల్లో ఇంత పొగా, దుమ్మూ కొట్టి అక్కణ్ణించి పారి పోయేందుకు. నాకు వాడు దొరుకుతాడన్న నమ్మకం లేదు. అయినా ప్రయత్నం చేసి చూద్దామంటావా, కేసరీ?" అన్నాడు శిఖిముఖి.

"దొరక్క మాయమైపోతాడా? వాడే మన్నా ఆకాశభూతమా?" అన్నది నాగు మల్లి విసురుగా.

"నాగుమల్లి బాగా చెప్పింది, శిఖీ! ఇక బయల్దేరుదాం," అంటూ విక్రమకేసరి ముందుండి దారి తీశాడు. అతడు లోగడే




పూజారి వున్న గుహ చూసిన వాడు కావటం చేత, దారికోసం వెతుక్కోవలసిన అవ సరం లేకుండా పోయింది.

కొద్దిసేపటి తరవాత వాళ్ళు గుహను సమీపించేసరికి, గుహ ముఖాన్ని దట్టంగా పొగ కమ్మి వుండటం వాళ్ళ కంటబడింది. ఆ పొగ చూస్తూనే శిఖిముఖి, "ఆ దుష్టుడు లోపల లేడు. అంత పొగలో ఏ ప్రాణీ అట్టే కాలం బతకదు," అన్నాడు.

"అయితే వాడు తప్పించుకు పోయి నట్టేనా?" అన్నాడు విక్రమకేసరి నిరు త్సాహపడిపోతూ.

శిఖిముఖి జవాబిచ్చేంతలో, వాళ్ళ వెంట వున్న శబరుడు ఒక ఎత్తయిన కొండరాతి మీద నిలబడి, "దొరా! పొగ యిక్కణ్ణించే కాదు, గుహ వెనక మరి రెండు మూడు చోట్ల నించి కూడా వస్తున్నది," అని పెద్ద కేకపెట్టాడు.


"అంటే, ఆ దుర్మార్గుడు పారిపోయేం దుకు గుహలో మరికొన్ని రహస్య మార్గా లున్నవన్నమాట. కేసరిదొర కావిలి పెట్టిన ఇద్దరు శబరవాళ్ళూ ఏం చేస్తున్నారు? నిద్రపోతున్నారా లేకపోతే వాళ్ళను కూడా పూజారి భుజానేసుకు పోయాడా?" అన్నది నాగుమల్లి అవహేళన చేస్తున్నట్టు.





అది గుర్తించిన శిఖిముఖి వచ్చే కోపాన్ని ఆపుకుంటూ, "ఆ దెయ్యాలపోతు శబరుల్నే కాదు, సవరవాళ్ళను కూడా గాడిదల్ని చేశాడు. ఇప్పుడు మనం కాస్త తెలివిగా ప్రవర్తించాలి. కేసరీ, నువ్వు కాపలి పెట్టిన వాళ్ళిద్దరూ ఆ పూజారిని అనుసరించి పోయారని నా అనుమానం," అని అక్కడున్న చెట్టు కొమ్మ ఒకటి విరిచి గుహ ముందుకు వెళ్ళి, దానితో గుహ ద్వారం ముందు గట్టిగా విసిరాడు. గాలికి పొగ కాస్తా చెల్లా చెదరైంది. అంతలో విక్రమకేసరి గుహ లోపలికి రెండు మూడు బాణాలు కొట్టాడు. లోపలి నుంచి ఎలాంటి శబ్దమూ రాలేదు.

ఇప్పుడేమి చేయుటమా అని శిఖిముఖి ఆలోచించేంతలో, గుహ మీది నుంచి నాగుమల్లి పెద్దగా చప్పట్లు చరిచి ఒక పెద్ద కేక పెట్టింది. ఆమెకు గుహ వెనక దిగువగా వున్న లోయ కేసి పోతున్న పూజారీ, సవర భేరుండం కనిపించారు. వాళ్ళకు కొంచెం వెనక రాళ్ళచాటున నక్కుతూ యిద్దరు వ్యక్తులు పోతున్నారు. వాళ్ళు విక్రమకేసరి చెప్పే శబర కాపలి వాళ్ళని ఆమె అనుకున్నది. ఆమె కేక పెట్టి పిలవగానే వాళ్ళల్లో ఒకడు వెనక్కు తిరిగి చూసి, రెండో



వాడితో ఏమో చెప్పి గబగబా కొండ ఎక్కి గుహ కేసి రాసాగాడు.

నాగుమల్లి తాను పూజారిని చూసిన సంగతి శిఖిముఖి వాళ్ళకు చెప్పబోయేంతలో, అతడూ, విక్రమకేసరీ, వెంట వున్న శబరుడూ గుహ మీదికి వచ్చి, దిగువనున్న లోయ కేసి చూశారు. వారికి తమ దగ్గిర కొస్తున్న శబరుడితో పాటు, లోయలోకి దిగిపోతున్న శిథిలాలయ పూజారి కూడా కనిపించాడు.

"శిఖీ! మనం ఆ పూజారిగాణ్ణి వెంట తగిలి పట్టుకోవటం ఏమంత కష్టం కాదు," అన్నాడు విక్రమకేసరి ఎంతో ఉత్సాహంగా.





"నాకూ అలాగే అనిపిస్తున్నది. మల్లి ఏమంటుందో?" అంటూ శిఖిముఖి నాగుమల్లి కేసి చూశాడు.

"వాడు అందకపోతే బాణం కొట్టి చంపుతాం. ఒకవేళ అంది కూడా తిరగబడితే యీటెతో పొడిచి ప్రాణాలు తీస్తాం. ఊఁ పదండి," అంటూ నాగుమల్లి గుహ మీది నుంచి కిందికి దూకింది.

నాగుమల్లి ధైర్యసాహసాలు లోగడే రుజువు అయివుండకపోతే, శిఖిముఖీ, విక్రమకేసరీ కూడా ఈ మాటల్ని కేవలం వాచాలతగానో, బడాయి చూపటంగానో జమకట్టి వుండేవాళ్ళు. కాని, వాళ్ళిద్దరికీ ఆమె శక్తిసామర్థ్యాలు తెలుసు. అయినా, ఆమె రక్షణబాధ్యత తమ మీద వున్నదని నమ్మివున్న ఆ ఇద్దరూ కూడబలుక్కుని, నాగుమల్లికి అటూ యిటూ తాముండి, ఆమెకు ఎలాటి ప్రమాదం జరక్కుండా చూడాలనుకున్నారు. శిథిలాలయ పూజారి ఏ క్షణంలో ఏ రకమైన దుష్టపన్నాగం పన్నబోతాడో అన్నది ఎవరికీ అంతు చిక్కని సంగతి....

శిఖిముఖి ముందుండి దారితీస్తుండగా తతిమ్మా ముగ్గురూ అతణ్ణి అనుసరించి వేగంగా లోయలోకి దిగసాగారు. వాళ్ళ దృష్టి శిథిలాలయ పూజారి మీదనే వున్నది. వాడు తమ కనుగప్పి, ఏ రాళ్ళచాటు నుంచో పారిపోకుండా చూడాలని వాళ్ళనుకున్నారు. కాని పూజారి నిర్భయంగా, తాపీగా లోయలోకి దిగిపోతున్నాడు. అతడు ఒకటి రెండు సార్లు తలతిప్పి శిఖిముఖీ వాళ్ళ కేసి చూసి, భేరుండంతో చేతులూపుతూ ఏదో చెప్పాడు.

"ఆ దుష్టుడి ప్రవర్తన చూస్తూంటే నా కేదో అనుమానంగా వున్నది, కేసరీ. వాడు మన నుంచి పారిపోయేందుకు ఎలాంటి ప్రయత్నమూ చేయకపోగా, మనను ముక్కుకు తాడుపోసి లోయలోకి



లాగుతున్నట్టు ప్రవర్తిస్తున్నాడు," అన్నాడు శిఖిముఖి.

"లోయలో వాడి బ్రహ్మరాక్షసి సేన కాపలా వుందేమో!" అన్నది నాగుమల్లి వెటకారంగా.

"ఉంటే... నవరగండుపోతు కూతురు వాళ్ళను ఏకాకిగా ఎదుర్కొని జయించే స్తుంది! మన కెలాంటి భయమూ లేదు కేసరీ," అన్నాడు శిఖిముఖి.


ఆ మాటలకు విక్రమకేసరి పెద్దగా నవ్వాడు. అంతలో శబర కావలి వాళ్ళల్లో రెండవవాడు వాళ్ళ దగ్గరకు పరిగెత్తుకు వచ్చి, పూజారి గుహలో వున్న మరొక దారి గుండా ఎలా బయటపడిందీ, తాను వాణ్ణి దృష్టి నుంచి తప్పుకు పోనీయకుండా లోయలోకి ఎలా వెన్నంటి పోయిందీ— శిఖిముఖి వాళ్ళకు చెప్పాడు.

"నీ దగ్గిర వడిశెల వుంది కదా? ఇప్పట్లో నీ యీటె కన్న దాని ఉపయోగం ఎక్కువలా కనబడుతున్నది. చేతికి అందక పోతే ఆ పూజారిగాణ్ణి ఒక్క వడిశెల దెబ్బతో కింద పడగొట్టాలి," అన్నాడు విక్రమకేసరి, ఆ శబరుడితో.

శబరుడు ఈటెను భుజాన పెట్టుకుని, వడిశెలలో రాయిపెట్టి దాన్ని అటూ యిటూ ఊపుతూ నడవసాగాడు. అంతలో పూజారి కొండ దిగి ఎదురుగా వున్న మైదాన ప్రదేశంలో ప్రవేశించాడు. శిఖిముఖి వెంట వున్న వాళ్ళను వేగంగా కదలండని హెచ్చరించి, పరిగెత్తుకుంటూ పోయి కొండ దిగి మైదానం చేరుతూనే, "ఓహోయ్, దొంగ పూజారీ, ఆగు! పారిపోవాలని ప్రయత్నిస్తే చావు తప్పదు," అని కేక పెట్టాడు.

శిథిలాలయ పూజారి వెనక్కు తిరిగి, "అదుగో, ఆ అర్ధచంద్రాకారంగా కనబడే గండశిలలున్న వే, అక్కడికి పోయి ఆగు తాను. తాపీగా రండి, అంతా మాట్లాడు కుందాం," అన్నాడు. —(ఇంకా వుంది)






శిథిలాలయం

12

[శిఖిముఖీ, విక్రమకేసరీ పూజారి దాగి వున్న గుహ దగ్గిరకు వెళ్ళారు. కాని, అతడు అందులో లేడు. సవర భేరుండాన్ని వెంటబెట్టుకుని పూజారి కొండ దిగి లోయ కేసి పోతూండటం వాళ్ళకు కనిపించింది. శిఖిముఖీ వాళ్ళు అతణ్ణి వెంబడించారు. పూజారి లోయలో వున్న గండశిలలను శిఖిముఖికి చూపి, అక్కడికి రమ్మన్నాడు. తరువాత—]

శిథిలాలయ పూజారి మాటలు, శిఖిముఖీ వాళ్ళకు చాలా కోపాన్ని తెప్పించినై. వాళ్ళు వేగంగా లోయలోకి దిగి, రాళ్ళ ముందు నిలబడి వున్న పూజారీ, సవరభేరుండాల్ని సమీపించేంతలో, రాళ్ళ వెనక నుంచి దాదాపు పదిమంది చెంచులు పెద్దగా కేకలు పెడుతూ ముందుకు దూకారు. వాళ్ళ నాయకుడు ఒక గుర్రం మీద రాతి చాటు నుంచి ముందుకు వచ్చి, "ఎవరు? శిఖిముఖీ, నాగుమల్లులా? శబర, సవర నాయకుల పిల్లలన్నమాట! మీరు నా బందీలు. మీ తండ్రులు ఏ పాటి ధనం యిచ్చి మిమ్మల్ని విడిపించుకు పోతారో చూస్తాను," అన్నాడు.

"భేష్, బావుంది! అదీ అసలు కథ! ఇందులో నె నెలాంటి జోక్యం కల్గించుకోను, అర్థమైందా, శిఖీ!" అంటూ పెద్దగా నవ్వాడు శిథిలాలయ పూజారి.



"వాడు చెంచు బందిపోట్ల నాయకుడు, బడేచెంచు, కేసరీ!" అన్నాడు శిఖిముఖి ఈటె ఎత్తుతూ.

"ఇది పూజారి దుర్మార్గుడు మన కోసం పెట్టిన మాటు!" అన్నది నాగుమల్లి ఈటె ఝళిపిస్తూ.

విక్రమకేసరి ఏమీ జవాబివ్వకుండా మెరుపులా ముందుకు దూకి, బడేచెంచు తల మీద ఈటెతో బలంగా ఒక దెబ్బకొట్టి, ఆ దెబ్బకు చెంచు గుర్రం మీది నుంచి కింద పడుతూండగానే, గుర్రం కళ్ళాన్ని గట్టిగా పట్టుకుని, "శిఖీ, మల్లీ! మాటల్తో కాలయాపన ప్రమాదం. మీ రిద్దరూ దీన్నెక్కి పారిపోండి. పూజారి మీ కోసమే యింత దుష్టతంత్రం పన్నాడు," అంటూ శిఖిముఖిని భుజం పట్టుకుని ముందుకు లాగి, బలవంతంగా గుర్రం ఎక్కించాడు. నాగుమల్లి ఏదో అభ్యంతరం చెప్పబోయింది. కాని విక్రమకేసరి ఆమెకు అవకాశం యివ్వకుండా, ఒడిసి పట్టుకుని శిఖిముఖి వెనక గుర్రం మీద ఎక్కించి, గుర్రాన్ని డొక్కలో గట్టిగా ఒక్క తన్ను తన్నాడు.

ఇదంతా కన్నుమూసి తెరిచేంతలో జరిగిపోయింది. బడేచెంచు అనుచరులు తెప్పరిల్లి కేకలు పెడుతూ ముందుకు వచ్చేలోపలే శిఖిముఖి, నాగుమల్లి ఎక్కిన గుర్రం లోయలో పరిగెత్తసాగింది. నేల మీద పడ్డ బడేచెంచు అబ్బా అంటూ లేచి నిలబడి, "మీరు ఆ గుర్రం మీద వెళ్ళే వాళ్ళను పట్టుకోండి. యీ చవటల సంగతి నేనూ, పూజారి ప్రభువూ చూస్తాం," అన్నాడు.

చెంచులు ఐదారుగురు అరుస్తూ గుర్రం వెనక పరిగెత్తారు. శిథిలాలయ పూజారి అక్కడ నిలబడి వున్న మిగతా చెంచులతో, "ఈ విక్రమకేసరిని ప్రాణాలతో పట్టుకోండి. శిథిలేశ్వరీదేవికి బలి పెట్టటానికి యింతకంటె అర్హుడు యీ భూప్రపంచంలో దొరకడు," అన్నాడు పళ్ళు కొరుకుతూ.



విక్రమకేసరి తన ముగ్గురు అనుచరులనూ హెచ్చరించి, ఒక్కొక్క అడుగే వెనక్కు వేస్తూ, కొండ కేసి కదలసాగాడు. చెంచులు భయంకరంగా కేకలు పెడుతూ వాళ్ళను చుట్టు ముట్టేందుకు ముందుకురికారు.

"బడేచెంచూ, నువ్వు పెద్ద పొరపాటు చేశావు. నీ వాళ్ళను మరో ఇరవై మందిని వెంట తెస్తే పని సానుకూల మయేది. ఈ విక్రమకేసరి మహా పొగరుబోతు. గాయ పరచకుండా అతణ్ణి పట్టుకోపటం సాధ్యం కాదు. శిథిలేశ్వరీదేవికి క్షతగాత్రుణ్ణి బలి పెట్టటం గొప్ప అపచారం. అందువల్ల మనం ప్రస్తుతానికి యీ విక్రమకేసరిని వదిలి మన నివాసాలకు పోవటం ఉత్తమం," అన్నాడు పూజారి.

"పూజారి ప్రభూ! చూడండి, వాడు నా వాళ్ళను రాళ్ళ చుట్టూ ఎలా గిరికీలు తిప్పిస్తున్నాడో. తమరొక పని చేయకూడదా? మంత్రం ప్రయోగించి వాడి కాళ్ళూ చేతులూ ఆడకుండా బంధించండి," అన్నాడు బడేచెంచు.

ఆ మాటలకు పూజారి పెద్దగా నవ్వుతూ, "నా మహా మంత్రశక్తిని యీ హీనుణ్ణి పట్టుకునేందుకు ప్రయోగించటమా? ఎంత మాటన్నావు, చెంచూ! పొరబాటు, పొర



బాటు. నే చెప్పినట్టు చెయ్యి. నీ వాళ్ళను తిరిగి రమ్మను. కావాలంటే వాళ్ళను కూడా ఆ శిఖిముఖీ, నాగుమల్లులను పట్టుకునేందుకు పంపు," అన్నాడు.

"చిత్తం, పూజారి ప్రభూ, చిత్తం!" అంటూ బడేచెంచు తలవంచి పూజారికి సమస్కరించి, విక్రమకేసరితో పోరుతున్న తన అనుచరులను తిరిగి రావలసిందిగా పెద్ద కేక పెట్టాడు. ఆ కేక వింటూనే చెంచులు బతుకుజీవుడా అనుకుని, విక్రమకేసరి వల్ల గాయపడిన తమవాణ్ణొకణ్ణి భుజాన వేసుకుని, తమ నాయకుడి వద్దకు తిరిగి వచ్చారు.





"కావొచ్చు, పూజారి దొరా! మనకీ కోతి వెధవల్తో పనేం? చక్కా బ్రహ్మపుత్రా నదీ లోయలకు వెళ్ళిపోదాం. బయలుదేరండి. ఊఁ ఎగరమన్నారా, ఆకాశంలోకి?" అంటూ నవరభేరుండం చేతులు పైకీ కిందికీ ఆడించసాగాడు.

పూజారి, భేరుండం మెడ మీద ఒక్క చరుపు చరిచి, "ఎగరటానికి వేళాపాళా లేదా? ఇది వాయసవేళ; భేరుండాలు యీ వేళప్పుడు పై కెగరలేవు, నేల నంటి పెట్టుకుని వుండాల్సిందే, తెలిసిందా? ఇక నోరు మూసుకుని బుద్ధిగా వెంటరా," అంటూ బయలుదేరాడు.

"పూజారి ప్రభూ! ఇక మనం మన ఆకాశ గుహకు వెళదామా? నా వాళ్ళు ఆ శిఖిముఖినీ, నాగుమల్లినీ అక్కడికే పట్టుకు వస్తారు. నా తలదిమ్ము యింకా వదల్లేదు," అన్నాడు బడేచెంచు.

"అలాగే వెళదాం. కాని...నీ వాళ్ళు వాళ్ళిద్దర్నీ పట్టుకోగలరా అన్న సంశయం నాక్కలుగుతున్నది. నేనీ ప్రాంతాలకు వచ్చినప్పటి నుంచీ, ఎందుకనో అన్నీ విఘ్నాలే ఎదురవుతున్నవి. వింధ్యకు దక్షిణాన శిఖిలేశ్వరీదేవి ప్రభావం అంతగా చెల్లుబడి అవుతున్నట్టు కనబడదు," అన్నాడు పూజారి నిస్పృహగా.

చెంచు నాయకుడి వెంట పూజారీ తతిమ్మా చెంచులూ అతడి నివాసమైన ఆకాశ గుహకు బయలుదేరారు. అదే సమయంలో విక్రమకేసరి తన వెంటవున్న శబరులతో కలిసి, శిఖిముఖి, నాగుమల్లులు గుర్రం మీద పారిపోతున్న లోయప్రాంతం కేసి పరిగెత్తసాగాడు. అతడికి గుర్రం మీద వున్న వాళ్ళిద్దరూ, వాళ్ళను పట్టుకునేందుకు వెనకగా పరిగెత్తుతున్న చెంచులూ కనబడుతూనే వున్నారు. గుర్రం ఎగుడు దిగుడుగా వున్న ఆ ప్రాంతాల వేగంగా పరిగెత్తలేక పోతున్నది. అది అవకాశంగా తీసుకుని




చెంచులు దాన్ని చుట్టు ముట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

విక్రమకేసరి పెద్దగా, "శిఖి, మల్లీ! మేం వస్తున్నాం. పూజారీ, బడేచెంచూ పారి పోయారు," అని కేకలు వేస్తూ వారి కేసి పరిగెత్తసాగాడు. కాని, అతడు వాళ్ళను సమీపించే లోపలే యిద్దరు ముగ్గురు చెంచులు ముఠానుంచి విడివడి, అడ్డ దారిన రాళ్ళ మీదుగా దూకుతూపోయి, ముందు వైపునుంచి గుర్రం దారిని అట కాయించారు.


శిఖిముఖి కత్తితోనూ, నాగుమల్లి ఈటె తోనూ ఆ చెంచులు గుర్రాన్ని సమీపించ కుండా ఆప సాగారు. ఒకటి రెండు నిమిషాల తరవాత శిఖిముఖి గుర్రం కళ్ళాన్ని గట్టిగా పట్టుకుని పక్కకు లాగి, దాన్ని లోయలో నుంచి కొండ మీదికి ఎక్కించసాగాడు. అతడికి విక్రమకేసరి కేకలు వినిపించినై. కేసరి కొండ మీది నుంచి తన కేసి దిగి వస్తున్నాడని అతడు భావించాడు.

శిఖిముఖి గుర్రాన్ని కొండ మీదికి ఎక్కించే ప్రయత్నం గమనిస్తూనే, ఒక చెంచు అటుగా పరిగెత్తి గట్టిగా చప్పట్లు చరుస్తూ, దాన్ని బెదరకొట్ట సాగాడు. గుర్రం



కొంచెంగా బెదిరి వెనక కాళ్ళమీద లేచింది. ప్రమాదాన్ని గుర్తించిన నాగుమల్లి తన చేతిలోని ఈటెను చెంచువాడి కేసి విసిరింది. కాని, చెంచు ఆ దెబ్బ తప్పుకుని మరింత గట్టిగా చప్పట్లు చరుస్తూ, గావు కేకలు పెట్టసాగాడు.

శిఖిముఖీ, నాగుమల్లులకు రానున్న ప్రమాదాన్ని గుర్తించిన విక్రమకేసరి చప్పున వడిశెల వున్న శబరుణ్ణి దగ్గిరకు పిలిచి, "బాగా గురిచూసి ఒక్క దెబ్బతో గుర్రం ముందున్న చెంచువాణ్ణి కింద పడ కొట్టాలి. ఆ వెనక పరిగెత్తు కొస్తున్నవాళ్ళ సంగతి తరవాత చూద్దాం," అన్నాడు.





శబరుడు వడిశెలలో రాయి పెట్టి, దాన్ని గిర్రున రెండుసార్లు తిప్పి, చెంచు మీదికి విసిరాడు. అది జుయ్ మంటూ పోయి గుర్రాన్ని అడ్డగిస్తున్న చెంచు గుండెలను బలంగా తాకింది.


ఆ దెబ్బకు వాడు అరుస్తూ నేల మీది నుంచి అంతెత్తు ఎగిరి దభీమంటూ కిందపడి గుర్రం కేసి దొర్లుకుంటూ పోయాడు. గుర్రం బెదురుకుని గిర్రున వెనుదిరుగబోయి, వెనక కాళ్ళకింద వున్న గులకరాళ్ళు పట్టు తప్పి జారటంతో పక్కకు పడి, ఏటవాలుగా వున్న కొండమీది నుంచి దిగువకు దొర్లుకు పోసాగింది. గుర్రంతో పాటు కిందపడిన



శిఖిముఖి, నాగుమల్లులు కూడా కిందికి దొర్లుకు పోయారు.

చెంచువాళ్ళు యీ దృశ్యం చూస్తూనే, సంతోషం పట్టలేక పెద్దగా చప్పట్లు చరిచి కేకలు పెడుతూ, "పట్టుకోండి, పట్టు కోండి," అంటూ శిఖిముఖీ, నాగుమల్లుల కేసి పరిగెత్తారు. వాళ్ళు శిఖిముఖి వాళ్ళను సమీపించే లోపలే విక్రమకేసరి బాణం ఎక్కుపెట్టి గుంపు మధ్యకు వదిలాడు. బాణం ఒక చెంచును తాకింది. వాడు ఒక్క చావుకేక పెట్టి కిందపడి పోయాడు. అంతలో శిఖిముఖి లేచి నిలబడి తనను పట్టవచ్చే చెంచువాణ్ణి ఒక్క తన్ను తన్ని, అతడి చేతిలోని ఈటెను లాక్కున్నాడు.

కాని, యీ లోపల గుర్రం మీంచి కింద పడటంవల్ల గట్టి దెబ్బ తగిలి స్పృహ కోల్పోయిన నాగుమల్లిని, ఇద్దరు చెంచులు భుజాలమీద వేసుకుని లోయకు అడ్డంపడి పరిగెత్తసాగారు. తతిమ్మా చెంచులు ఓ క్షణకాలం శిఖిముఖిని ప్రతిఘటించి, దూరం నుంచి పరిగెత్తుకు వస్తున్న విక్రమ కేసరినీ, శబరుల్నీ చూసి, యిక లాభం లేదనుకుని తాము కూడా లోయలోకి పారి పోయి, చూస్తూండగానే రాళ్ళ వెనక మాయమయారు.




CHITRA

శిఖిముఖి, విక్రమకేసరి కేసి చేయి చూపి రాళ్ళ వెనుకకు పారిపోయిన చెంచుల వెంట పడ్డాడు.


కాని, అతడు గుర్రం మీది నుంచి పడ్డ పాటుకు మోకాలు కొంచెం బెణకటంతో, వాళ్ళ ననుసరించి వేగంగా పరిగెత్తలేక పోయాడు. అ దశలో విక్రమకేసరి వచ్చి అతణ్ణి కలుసుకున్నాడు.

"కేసరీ! పెద్ద ఘోరం జరిగిపోయింది. ఇంత మందిమి వుండి, నాగుమల్లిని రక్షించలేక పోయామంటే ఆమె తండ్రే కాదు, మా అయ్య కూడా మనల్ని— ముఖ్యంగా నన్ను అసహ్యించుకుంటాడు. మనం చెంచు మూకతో యుద్ధం చేయకుండా నాగుమల్లిని రక్షించలేం. నువ్వు గూడేనికి పోయి మనవాళ్ళను పాతికా ముప్పై మందిని వెంటబెట్టుకు రా. ఈ లోపల నేను కాలిజాడలను బట్టి పోయి, ఈ చెంచులు మల్లిని ఎక్కడికి తీసుకు పోతున్నదీ గమనిస్తాను," అన్నాడు శిఖిముఖి.

విక్రమకేసరి ఏదో అభ్యంతరం చెప్పబోయాడు గాని, శిఖిముఖి వినిపించుకోక, అతణ్ణి వేగిర పెట్టాడు. విక్రమకేసరి చేసేది లేక ఒక శబరుణ్ణి శిఖిముఖి వెంట వదిలి, తతిమ్మా యిద్దరితో గూడేనికి బయలుదేరాడు.

శిఖిముఖి, చెంచులు పోయిన మార్గాన్ని కాలిజాడల వల్ల గుర్తిస్తూ, ఓ అరగంట తరవాత కొండపాదంలో వున్న ఒక అరణ్య ప్రాంతాన్ని చేరాడు. అతడికి చెట్లచాటు నుంచి ఏవో గొంతులు వినిపించినై. అతడు వెంటవున్న శబరుణ్ణి నిశ్శబ్దంగా వుండమని హెచ్చరించి, దాపుల నున్న ఒక చెట్టు ఎక్కి దిగువకు చూశాడు. చెట్లల్లో ఒక చోట పులిబోను ఒకటి వున్నది. చెంచులు నాగుమల్లిని దాని కేసి మోసుకు పోతున్నారు. —(ఇంకా వుంది)





శిథిలాలయం

13

[పూజారి ప్రోత్సాహంతో చెంచునాయకుడూ, అతడి అనుచరులూ, శిఖిముఖీ వాళ్ళమీద హఠాత్తుగా దాడిచేశారు. విక్రమకేసరి, చెంచునాయకుణ్ణి గుర్రం మీది నుంచి పడగొట్టి, గుర్రాన్ని శిఖిముఖీ, నాగుమల్లులకు ఒప్పచెప్పాడు. చెంచులు గుర్రం మీదినుంచి జారి పడిన నాగుమల్లిని అరణ్యంలోని ఒక పులిబోను దగ్గరకు తీసుకుపోసాగారు. తరవాత—]

చెంచులు నాగుమల్లిని పులిబోను దగ్గిరకు తీసుకుపోయి, దాని పక్కగా నేల మీద పడుకోబెట్టారు. నాగుమల్లికి యింకా స్పృహ రాలేదు. చెట్టు మీది నుంచి యిదంతా చూస్తున్న శిఖిముఖికి ఒక్క క్షణంపాటు, మల్లిని పులిబోనులో ఎరగా పెడతారేమో అన్న భయం కలిగింది. కాని, అంతలోనే అతడికి చెంచునాయకుడైన బడే చెంచు అన్న మాటలు గుర్తుకు వచ్చినై. వాడు ఆమెను బందీగా చేసి, ఆమె తండ్రి అయిన సవరగండుపోతు నుంచి ధనం గుంజాలని చూస్తున్నాడు. కాని, వాడి అనుచరులు మల్లిని పులిబోను దగ్గిర ఎందుకు దించారు?

శిఖిముఖి యిలా ఆలోచిస్తున్నంతలో, చెంచువాళ్ళల్లో ఒకడు చుట్టూ కలయచూసి, పెద్దగా గొంతెత్తి, "బూతాలదొరా!" అని కేక పెట్టాడు.



ఉత్తరక్షణంలో పులిబోనుకు వెనకవున్న గుబురు చెట్లల్లోంచి, "ఎవర్రావాడు? చారల మెకాన్ని బెదరకొడుతున్నావా? నిలువునా పాతేస్తాను! పో అక్కణ్ణించి," అన్న జవాబు వచ్చింది.


చెంచులు ఆ జవాబుకు బెదిరిపోయి అటు చూసేంతలో చెట్ల కొమ్మల్లోంచి ఊడల సాయంతో, నల్లగా, పొట్టిగా, బక్క చిక్కి వున్న వాడొకడు నేల మీదికి దిగాడు. వాడి మెడలో ఎముకల దండ ఒకటి వున్నది, చేతిలో వంకర టింకరగా వున్న పొడవాటి కర్ర ఒకటి పట్టుకుని వున్నాడు. వాడు చెంచు దయ్యాలపోతు.




దయ్యాలపోతు పులిబోనును సమీపిస్తూనే, నేల మీద పడి వున్న నాగుమల్లి కేసి ఆశ్చర్యంగా చూస్తూ, "ఎవర్రా యిదీ, దేవతా పిల్లలా వుంది? ఎందు కిక్కడికి తీసుకొచ్చారు? ఎవరు చంపారు?" అని ప్రశ్నించాడు.

చెంచుల్లో ఒకడు జరిగిందంతా అతడికి చెప్పి, "బడేదొర యీ పిల్లని ఆకాశగుహ దగ్గరకు తీసుకురమ్మన్నాడు. కాని, చాలా సేపుగా కదలా మెదలక పడున్నది. చచ్చి పోయిందేమో అని భయంగా వున్నది. దొర మా ప్రాణాలు తీసేస్తాడు," అన్నాడు వణికిపోతూ.

భూతాలరాయుడు, నాగుమల్లి ముక్కుపుటాల దగ్గిర వేలుపెట్టి చూసి, "చావలేదు, ప్రాణం వున్నది. గుర్రం మీంచి పడ్డ పాటుకు ప్రాణం కడబట్టింది. మందూ మంత్రం వేసి యిప్పుడు మెళుకువ తెప్పించామో — మీ కందకుండా పారిపోతుంది. ఇదుగో, యీ భస్మం తీసుకోండి. ఆకాశ గుహ చేరిం తరవాత ముక్కు దగ్గిర పెట్టండి. నాలుగు తుమ్ము లేచి కూచుంటుంది," అని నడుం నుంచి వేలాడుతున్న సంచీలోంచి, ఒక పొట్లం తీసి చెంచు వాడికి యిచ్చాడు.







చెంచువాడు ఆ పొట్లం తీసుకుని రొండిన దోపుకుని, రెండోవాణ్ణి హెచ్చరించాడు. ఇద్దరూ కలిసి నాగుమల్లిని తిరిగి భుజాన వేసుకుని బయలు దేరారు. ఇదంతా చూస్తున్న శిఖిముఖికి నాగుమల్లిని వాళ్ళ బారి నుంచి రక్షించటం చాలా తేలిక అన్న ధైర్యం కలిగింది. అతడు నాగుమల్లిని ఎత్తుకు పోతున్న చెంచులను మధ్య మార్గంలో అటకాయించా లనుకున్నాడు.

శిఖిముఖి తన వెంట వున్న శబరుడితో తాను తిరిగి వచ్చేవరకూ, చెంచు భూతాల రాయుణ్ణి ఓ కంట కనిపెట్టి వుండమని చెప్పి, చెట్ల కొమ్మల మీదుగా ముందుకు కొంత దూరం పోయేసరికి, గండశిలల దగ్గిర తమను ఎదుర్కొన్న చెంచులు కొందరు, నాగుమల్లిని ఎత్తుకుపోతున్న వాళ్ళను సమీపిస్తూండటం అతడి కంటబడింది. ఆ దృశ్యం చూస్తూనే శిఖిముఖి నిరుత్సాహ పడిపోయాడు. ఇందర్ని ఎదిరించి నాగుమల్లిని రక్షించటం సాధ్యమయేది కాదని అతడు నిర్ణయించుకున్నాడు. విక్రమకేసరి వెంట తీసుకువచ్చే శబరుల సహాయంతో, తాను చెంచునాయకుడి ఆకాశగుహను ముట్టడించటం ఒక్కటే, నాగుమల్లిని రక్షించటానికి మిగిలిన మార్గం...

విక్రమకేసరి వచ్చేవరకూ తాను చేతులు ముడుచుకు కూర్చోవలసిందే అనుకున్నాడు, శిఖిముఖి. అంతలో అతడికి భూతాలరాయుడూ, పులిబోనూ గుర్తుకు వచ్చినై. ఆటవికుల్లో ఒకడుగా అతడికి, అలాంటి జాతివాళ్ళ మీద మంత్రతంత్రాలు ఎరిగిన వ్యక్తులు చలాయించే అధికారం గురించి బాగా తెలుసు. చెంచు భూతాల రాయుణ్ణి కాస్త హడలకొట్టి, వీలయితే అతడి ద్వారా కొంత సహాయం సంపాయించా లనుకున్నాడు, శిఖిముఖి. ఆ వెంటనే అతడు నిశ్శబ్దంగా చెట్ల కొమ్మల్లో కదిలి, పులిబోను వున్నచోటుకు వచ్చాడు.





భూతాలరాయుడు ఒక చిన్న మేకను, మెడతాడు పట్టుకుని బోనుదగ్గరకు లాక్కురా ప్రయత్నిస్తున్నాడు. కాని అది అరుస్తూ అటూయిటూ గెంతుతున్నది. శిఖిముఖి కొద్దిసేపు యిదంతా చూసి, పులిలా పెద్దగా ఒక్కసారి గాండ్రుపెట్టి, చెట్ల కొమ్మల్లోంచి వేగంగా భూతాలరాయుడి ముందు దూకాడు.

భూతాలరాయుడు అదురుకుని కేకపెట్టి పారిపోబోయినవాడల్లా, తన ముందు దూకినది పులి కాదనీ, శబరయువకుడనీ చూసి, వంకరకర్ర పైకెత్తుతూ, "ఎవడ్రా నువ్వు? చెంచు దయ్యాలపోతుతోనే పరాచకాలా? నిన్ను మారేడుకాయలో దట్టించి ముక్కుపొడుం కింద పీల్చేస్తాను," అన్నాడు రౌద్రంగా.

శిఖిముఖి ఏమీ మాట్లాడకుండా, ఎడమ చేత్తో అతడి చేతిలోంచి కర్ర లాక్కుని, కుడిచేత్తో అతడి జుట్టు వడిసి పట్టుకున్నాడు. భూతాలరాయుడు పట్టు విడిపించుకునేందుకు పెనుగులాడుతూ, "ఎవడ్రానువ్వు, వెర్రికుంకా! బతుకు మీద రోశావా, ఏం? నే నెవర్ననుకున్నావ్? బడేచెంచుముఠావాణ్ణి, ఆ చెంచు తరవాత అంతవాణ్ణి, వదులు!" అన్నాడు.

శిఖిముఖి పెద్దగా నవ్వి, "నువ్వెవడివైతే నాకేం, దయ్యాలపోతూ? ఒక మాటచెప్పు; ఈ పక్కనే నీటిమడుగు చూశాను. పులి ఏ వేళప్పుడు దప్పిక తీర్చుకునేందు కక్కడికి వస్తుంది?" అని ప్రశ్నించాడు.

భూతాలరాయుడు ఆ ప్రశ్న వింటూనే కళ్ళెర్రచేసి, "ఎవడ్రానువ్వు, నన్ను ప్రశ్నలడగటానికి? జుట్టు వదులు ముందు!" అంటూ హుంకరించాడు.

"అయితే నిన్ను ఏం ప్రశ్నలడగను, అంతా ఆ పెద్దపులే చూసుకుంటుంది!" అంటూ శిఖిముఖి, దయ్యాలపోతును నడుం పట్టుకుని పైకెత్తి పులిబోను దగ్గరకు తీసుకు

పోయి, "మేక బదులు నిన్ను పులికి ఎరగా పెడుతున్నాను, తెలిసిందా?" అంటూ బోనులోకి తోయబోయాడు.


భూతాలరాయుడు గడగడ వణికిపోతూ, "నువ్వెవరో తెలియక దూషించాను, క్షమించు! నన్ను పులికి ఆహారంగా వెయ్యకు. బతికున్నన్నాళ్ళూ నీకు సేవ చేస్తాను," అంటూ బావురుమన్నాడు.

శిఖిముఖి, అతణ్ణి వదిలి, "అలా అయితే నిన్ను పెద్దపులికి మేతగా వెయ్యను. బతికున్నన్నాళ్ళూ నాకు సేవచేయ నవసరం లేదు, ఒక్క ఇరవైనాలుగ్గంటలు నే చెప్పినట్టు చెయ్యి, చాలు," అన్నాడు.

"చిత్తం. ఆజ్ఞాపించు. నీ దాసుణ్ణి," అంటూ భూతాలరాయుడు, శిఖిముఖికి సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆ సాష్టాంగ్రపాణాచారం పడిపోయాడు.

శిఖిముఖి అతణ్ణి లేవమని చెప్పి, "సవరగండుపోతు కూతుర్ని మీవాళ్ళు బలవంతంగా ఎత్తుకుపోయారు; నువ్వు చూశావుగదా? ఆమెను యీ రాత్రే నేను కాపాడదలిచాను. ఎలా అని అడక్కు. కాని, నువ్వొకటి చేయాలి. మీ ఆకాశగుహ ముందుండే గుడిశెల చుట్టూ వున్న కంచె ద్వారాన్ని యీ రాత్రికి తాళ్ళతో లోపలి నుంచి బంధించకుండా అట్టే పెట్టాలి. గండుపోతు కూతుర్ని ఆ ద్వారానికి సాధ్య





మైనంత దగ్గరగావున్న గుడిసెలో వుంచాలి. ఈ పనులు చేయగలవా?" అన్నాడు.

"చిత్తం. నీ ఆజ్ఞ శిరసావహిస్తాను. చెంచు ముఠాలో నా మాటకు తిరుగు లేదు," అన్నాడు భూతాలరాయుడు.

"అది నిజమేకావచ్చు. కాని, నువ్వు అన్నమాట నిలుపుకోపోతే? నన్ను మోసం చేస్తే?" అని ప్రశ్నించాడు, శిఖిముఖి.

"ఆకాశదేవర మీద ఒట్టేస్తున్నాను, సరా?" అంటూ భూతాలరాయుడు మెళ్ళో వున్న ఎముకల దండను కళ్ళకద్దుకున్నాడు.

"అలా అయితే ఆ దండను నా దగ్గిర యిచ్చిపో. నువ్వు చెప్పినట్టు చేస్తే, ఆ తర



వాత దాన్ని నీకు తిరిగి యిచ్చేస్తాను," అన్నాడు శిఖిముఖి, ఎముకల దండను చేత్తో గట్టిగా పట్టుకుని.


భూతాలరాయుడు లబలబ లాడిపోతూ, "ఈ మహత్తు గల దండలోనే వుంది, నా మంత్రశక్తంతా! ఇది మెళ్ళో లేకపోతే నేను చిల్లిగవ్వకు మారను. చెంచులంతా నన్ను కొండగబ్బిలాని కన్న హీనంగా చూస్తారు," అన్నాడు.

"సరే, ఆడిన మాట తప్పవుగదా? జాగ్రత్త. మోసం చేయాలని ప్రయత్నించావో, నిన్నేదో ఒకనాడు పట్టుకుని పెద్ద పులికి ఆహారంగా వేస్తాను," అన్నాడు శిఖిముఖి.

"మూడు కోట్ల కొండదయ్యాలూ, ఆరు కోట్ల అరణ్య భూతాలూ సాక్షిగా చెపుతున్నాను; నేను అన్నమాట నిలబెట్టుకుంటాను," అన్నాడు భూతాలరాయుడు.

"అలా అయితే, నువ్వు మీ ఆకాశ గుహకు వెళ్ళిపో. నాగుమల్లికి ఎలాంటి హానీ జరక్కుండా చూడు. ఈ బోను సంగతి నే చూస్తాలే," అన్నాడు శిఖిముఖి.

"చిత్తం, అలాగే పోతాను. అసలు నేను ఎక్కువగా వుండేది యీ అరణ్యంలోనే. ఆ కనబడే మాను వెనకే నా గుడిసె వున్నది.



సెలవు," అంటూ భూతాలరాయుడు అక్కణ్ణించి బయలుదేరాడు.

శిఖిముఖి చెట్టెక్కి భూతాలరాయుడు ఎటు పోతున్నదీ పరీక్షగా చూసి, వాడు ఆకాశగుహ కేసే పోతున్నట్టు తెలుసుకుని, చెట్టుదిగి వచ్చాడు. తరవాత అతడు మేకను బోనులో కట్టివేసి, అంతవరకూ రహస్యంగా చెట్టు మీదవున్న శబరుణ్ణి కేకవేశాడు. వాడు చెట్టుదిగి రాగానే, శిఖిముఖి వాణ్ణి వెంట బెట్టుకుని, భూతాలరాయుడు చెప్పిన గుడిశెలో ఏమున్నదో చూసేందుకు వెళ్ళాడు.

గుడిశెలో శిఖిముఖికి కొన్ని పులితోళ్ళూ, ఎలుగుచర్మాలూ గోడకు వేళ్ళాడుతూ కనిపించినై. నడిమింటి గుంజకు వున్న కొయ్య మేకులకు కొన్ని కపాలాలు తగిలించబడి వున్నయ్. శిఖిముఖి వాటిని పరీక్షించి చూసి, ఒక పులితోలునూ, ఒక కపాలాన్నీ తీసుకున్నాడు. రాత్రికి చెంచుముఠా వుండే ప్రాంతానికి వెళ్ళినప్పుడు, వాటితో కొంత అవసరం కలగవచ్చున్న ఆలోచన అతడి క్కలిగింది.

సూర్యాస్తమయానికి కొంచెం ముందుగా విక్రమకేసరి యాభై అరవైమంది అనుచరులతో శిఖిముఖి వున్నచోటుకు వచ్చాడు. వాళ్ళల్లో సవరలూ, శబరులూ కూడా



వున్నారు. శిఖిముఖి, విక్రమకేసరికి అతడు లేనిసమయంలో జరిగినదంతా చెప్పి, "ఆ దయ్యాలపోతు అన్నమాట నిలబెట్టుకుంటాడన్న పూర్తి నమ్మకం నాకున్నది. అందువల్ల మనం అయిదారుగురం రాత్రికి వాళ్ళ గుడిశెల్లో జొరబడి నాగుమల్లిని విడిపించుకు రావచ్చు. అలాకాక మనం గుంపుగా వెళ్ళి వాళ్ళ మీద దాడి చేస్తే, అనవసర రక్తపాతమే కాక, కోపంకొద్దీ చెంచులు నాగుమల్లి కేదైనా హాని కలిగించవచ్చు," అన్నాడు.

"ఈ ఆలోచన బావుంది. ఒకటి మాత్రం మరిచిపోకు. మన ప్రధాన శత్రువు శిఖి

లాలయ పూజారి! వాడే యీ దుర్మార్గాల కన్నిటికీ కారకుడు. వాడి సంగతే నీవు మరిచినట్టున్నది," అన్నాడు విక్రమకేసరి.

"వాణ్ణి పట్టుకునే ప్రయత్నంలోనే గదా, మనం యీ చిక్కులో పడింది. వాణ్ణెలా మరుస్తాను? వాడీ రాత్రి కంటబడ్డాడో నూకలు చెల్లినవాడికిందే లెక్క!" అన్నాడు శిఖిముఖి పళ్ళుకొరుకుతూ.

ఆ తరవాత వాళ్ళిద్దరూ కొంతసేపు సంప్రతింపులు జరిపి, మొత్తం అనుచరుల్ని వెంటబెట్టుకుని ఆకాశగుహ ప్రాంతానికి వెళ్ళేట్టూ, అక్కడికి చేరిం తరవాత ఒక పదిమందితో మాత్రం ముందుగా చెంచుల గుడిశెల దగ్గిరకు పోయి, పరిస్థితుల్ని బట్టి అవసరం అయితే తతిమ్మావాళ్ళ సహాయం కూడా తీసుకునేట్టూ నిర్ణయించుకున్నారు.

సూర్యాస్తమయం అవగానే అందరూ అరణ్యమార్గాన చెంచుల నాయకుడుండే కొండప్రాంతానికి బయలుదేరారు. ఒక పావుగంట కాలం గడిచేసరికి వాళ్ళకు వెనక వైపునుంచి పులి పెద్దగా గాండ్రించిన ధ్వని వినబడింది. ఆ ధ్వని వింటూనే అందరికన్న ముందు నడుస్తున్న శిఖిముఖి ఆగి, "దయ్యాలపోతు పెట్టిన బోనులో పెద్దపులి పడినట్టుంది. మీలో అయిదారు గురు పోయి బోనుతో సహా దాన్ని లాక్కురండి. అవకాశం దొరికితే చెంచుల్ని కొండ మీది నుంచి కింది లోయల్లోకి గెంతిద్దాం," అని చెప్పాడు.

శిఖిముఖి యిలా చెప్పగానే, పదీపన్నెండు మంది శబరులు వెనుదిరిగి బోను దగ్గిరకు పరిగెత్తారు. అతడు వూహించినట్టు పెద్దపులి బోనులో చిక్కుకుని, బయటపడే మార్గం లేక పెద్దగా అరుస్తూ నానా హంగామా చేస్తున్నది. చిన్న కొయ్యచక్రాల మీద కట్టిన ఆ బోనును శబరులు తాళ్ళ సాయంతో, శిఖిముఖి వున్న చోటుకు యీడ్చుకు పోసాగారు. —(ఇంకా వుంది)





శిథిలాలయం

14

[పులిబోను దగ్గిర కాపలావేసి శిఖిముఖి, చెంచుదయ్యాలపోతును పట్టుకున్నాడు. యీ లోపల నాగుమల్లిని చెంచువాళ్ళు ఆకాశగుహకు తీసుకుపోయారు. దయ్యాలపోతు ప్రాణభయం కొద్దీ శిఖిముఖికి ఆకాశగుహ దగ్గిర సాయపడతానని మాటయిచ్చాడు. బోనులో పడిన పులిని తాళ్ళసాయంతో శబరులు యీడ్చుకు పోసాగారు. తరవాత—]

శిఖిముఖీ, విక్రమకేసరుల వెనకగా నడుస్తున్న శబరులూ, సవరలూ పులిబోను దగ్గిరకు రాగానే, దాని చుట్టూ మూగారు. వాళ్ళల్లో ఒకరిద్దరు ఈటెలతో దాన్ని బెదరకొట్టబోయేసరికి, పులి రెచ్చిపోయి పంజాలు బయిటికి చాచి పెద్దగా గోండ్రించసాగింది. శిఖిముఖి వాళ్ళను వారించి పులిని ఓ సారి పరీక్షగా చూసి, తన భుజం మీద వున్న పులిచర్మాన్ని దాని కేసి వూపాడు. వెంటనే పులి బోనుమూలకు వెళ్ళి గుర్రుపెట్టుతూ వెనక కాళ్ళ మీద కూర్చున్నది.

"పులినే భయపెట్టే యీ పులిచర్మంతో మనం చాలా చాలా ఘనకార్యాలు చెయ్యొచ్చు. నా అనుమానం చెంచు దయ్యాలపోతు దీన్నేదో మంత్రించాడని," అన్నాడు శిఖిముఖి పెద్దగా నవ్వుతూ.

విక్రమకేసరి, శిఖిముఖి చేతిలో వున్న కపాలాన్నీ, పులిచర్మాన్నీ ఓ మారు తాకి



చూసి, ముఖంలో లేని బాధ కనబరుస్తూ, "వీటిని అంటుకుంటే నిప్పును అంటుకున్నట్టుగా చెయ్యి చుర్రుమన్నది. ఈ దయ్యాలపోతూ, శిథిలాలయ పూజారంత గొప్ప మంత్రవేత్తలా వున్నాడు," అన్నాడు. అతడి మాటలకు అనుచరులందరూ పొట్టలు చెక్కలయ్యేలా నవ్వారు.

తరవాత అందరూ అరణ్యమార్గాన కొంతదూరం పోయి, లోయలో నుంచి వున్న కాలిబాటల వెంట కొండ పైనున్న గుహ ప్రాంతానికి నడవసాగారు. పులిబోనును మిట్ట పైకి ఎక్కించటం శిఖిముఖి అనుచరులకు కొంత శ్రమగానే వున్నది. కాని,



ఆ పులి ద్వారా తమ కులపెద్ద కొడుకు ఏదో సాహసకార్యం చేయబోతున్నాడని వూహించి వాళ్ళు ఉత్సాహంగా బోనును పైకి లాక్కుపోసాగారు. పులి చాలాసేపు గాండ్రించి, ఓపిక పోయి కొంతా, పరిసరాలకు అలవాటు పడి కొంతా — శాంతించి బోనులో ఒక మూల నక్కి కూర్చున్నది.

ఆకాశగుహ ప్రాంతం చేరగానే శిఖిముఖీ, విక్రమకేసరులు తమ అనుచరుల్ని రెండు ముఠాలుగా విభజించారు. ఒక ముఠా వాళ్ళు తాము కొండ ఎక్కి వచ్చిన మార్గం నుంచి చెంచులు లోయలోకి పారిపోకుండా కాపలాకాయాలి. రెండవ ముఠా వాళ్ళు చెంచు గూడెం చుట్టూ వున్న కంచె దగ్గర వుండి, పరిస్థితుల్నిబట్టి లోపలికి దూకటమో లేక అక్కడే వుండి, బయిటికి వచ్చే చెంచుల్ని బెదరకొట్టటమో చేయాలి. నాగుమల్లి తమ వశం అయేవరకూ, చెంచుల్తో ముఖాముఖి పోరు లేకుండా చూడాలని శిఖిముఖి అందర్నీ హెచ్చరించాడు. పులిబోను కంచె దగ్గిరగా వుంచబడింది.

చెంచు గూడెంలో అంతా కలిసి నలభై యాభై గుడిసెల కంటె ఎక్కువ వుండవు. వాటి చుట్టూ అయిదారడుగుల కంచె—బల



మైన కర్రలతో కట్టినది వున్నది. కంచె అవతల అక్కడక్కడా ఎత్తుగా పెరిగిన కొన్ని చెట్లున్నవి. వాటి కొమ్మలు కంచె మీదుగా వాలి, గూడెంలోకి దిగేందుకు అనువుగా వున్నవి. శిఖిముఖీ, విక్రమకేసరీ అలాంటి చెట్టు నొకదాన్ని ఎక్కి, కొమ్మ మీద కూర్చుని గూడెంలో రేగే కోలాహలానికి కారణం ఏమిటా అని చూడసాగారు.

బడేచెంచు నివశించేది, మామూలు గుడిశెలాంటిది కాదు. ఒక పెద్ద కొండ గుహను అతడూ, అతడి కుటుంబం ఇల్లుగా వాడుకుంటారు. ఆ గుహ పక్కలనా, పైనా సున్నం పులిమి వాటి మీద రంగులతో రకరకాల బొమ్మలూ అవీ చిత్రించారు. ఆ గుహ ముందున్న ఖాళీ జాగాలో పెద్ద పెద్ద నెగళ్ళు మండుతున్నవి. వాటి చుట్టూ చెంచు స్త్రీలూ, పురుషులూ చేరి పాడుతూ, నాట్యాలు చేస్తున్నారు. ఒక ఎత్తయిన కొయ్యదుంగ మీద కూర్చుని శిధిలాలయ పూజారి యిదంతా చూస్తున్నాడు. బడేచెంచు కొంచెం దూరంలో నిలబడి దయ్యాలపోతుతో ఏదో మాట్టాడుతున్నాడు.

"శిఖీ, యిదా ఆకాశగుహ? పేరు గొప్పగానే వుంది! ఈ గొడవంతా ఏమిటి?" అని అడిగాడు విక్రమకేసరి, శిఖిముఖిని.



"ఏదో జాతర! మనం యిక్కడికి చేరే సరికి గూడెం అంతా సద్దుమణిగి వుంటుందని నేననుకున్నాను. నా పథకం అంతా పాడయింది. చెంచు దయ్యాలపోతు నేను చెప్పిన చోట నాగుమల్లిని వుంచాడో లేదో చూసి వస్తాను," అంటూ శిఖిముఖి కొమ్మ మీంచి దిగి, కంచె ద్వారం కేసి వెళ్ళాడు.

కంచె ద్వారం మూసివున్నది. కాని, శిఖిముఖి దాన్ని గట్టిగా రెండుచేతులతో పట్టి తోసేసరికి కొంచెంగా తెరుచుకున్నది. అతడు ఆ ఖాళీలోంచి లోపలికి పోయాడు. అక్కడికి దాపులనే ఒక చిన్న గుడిశె లాంటి చుట్టిల్లు అతడి కంటబడింది. లోపల






వెలుగు లేదు. దాని ముందు కాపలా వాడెవడూ అతని కంటబడలేదు. చెంచు దయ్యాలపోతు అన్నమాట ప్రకారం ఇందు లోనే, నాగుమల్లిని వుంచివుంటాడని శిఖిముఖి జాగ్రత్తగా గుడిశె దగ్గిరకు పోయి ద్వారానికి అడ్డంగా వున్న వెదురుతడికను తోసి, ఓ క్షణకాలం లోపల ఏమయినా అలికిడి అవుతుందేమో అని విని, అలాంటి దేమీ లేకపోవటంతో లోపల ప్రవేశించాడు.

గుడిశెలో ఎవరూ వున్నట్టు లేదు. అంతా చీకటిమయంగా వున్నది. శిఖిముఖి తన దగ్గిరున్న చెకుముకిరాయి కొట్టి దూది అంటించి, ఆ వెలుగులో గుడిశె అంతా పరీక్షించి చూశాడు. గుడిశెలో ఒక మూల అతడికి రెండు మూడడుగుల పొడవున్న తాళ్ళు కనిపించినై. వాటిని పరీక్షించి చూసిన మీదట, అవి నాగుమల్లిని బంధించేందుకు చెంచువాళ్ళుపయోగించిన వని అతడికి అర్థమైపోయింది. అంటే—నాగుమల్లిని కొంత కాలం వాళ్ళు యీ గుడిశెలోనే వుంచారన్నమాట. అయితే ఇప్పుడామెను ఎక్కడికి తీసుకుపోయివుంటారు? తనకు వాగ్దానం చేసిన విధంగా మల్లిని కంచెద్వారం దగ్గిర గుడిశెలో దాచిన దయ్యాలపోతు, ఏ కారణం వల్ల ఆమెను మరో చోటుకు మార్చాడు?


శిఖిముఖి యిలా ఆలోచిస్తూ కాలం వృథా చెయ్యటం ప్రమాదకారణం అవుతుందనుకుంటూ; తిరిగి విక్రమకేసరి వున్న చోటుకు వచ్చి, తాను చూసినది అతడికి చెప్పి, "మనల్ని చెంచుదయ్యాలపోతు మోసం చేయుటమో లేక అతణ్ణి మరొకడు మోసం చేయుటమో జరిగింది," అన్నాడు.

"అలా అయితే మనం అందరం ఒక్కసారిగా కంచె దూకి పోయి చెంచుల్ని హతమార్చి, నాగుమల్లిని వాళ్ళే గుడిశెలో దాచారో వెతికి పట్టుకుందాం," అన్నాడు విక్రమకేసరి.





శిఖిముఖి ఓ క్షణం ఆలోచించి, "కేసరీ, నువ్వు చెప్పింది బాగానే వుంది కాని, చెంచుల్ని అంత తేలిగ్గా లొంగదీయటం సాధ్యమని నాకు తోచటంలేదు. వాళ్ళు సంఖ్యలో మనకన్న కాస్త ఎక్కువే వుంటారు. పైగా, మనం వాళ్ళ మీద దాడి ప్రారంభించగానే, వాళ్ళలో కొందరు నాగుమల్లిని మరెక్కడికైనా ఎత్తుకుపోయి దాయొచ్చు. నేను లోగడే ఒక పథకం వేసి వుంచాను గదా," అంటూ కేసరికి పులి చర్మం, కపాలం చూపించాడు.




"ఏం చెయ్యబోతున్నావు? ఏమిటా పథకం?" అన్నాడు విక్రమకేసరి.


"ముందుగా మనం ఈ కంచెలోంచి పులి లోపలికి పోగలిగినంత దారి ఒకటి ఏర్పరిచి, దాన్ని బోనులో నుంచి సరైన సమయంలో బయటికి వదిలేందుకు సిద్ధంగా వుండాలి. ఈలోపల నేను లోపలికి పోయి, నాగుమల్లిని వాళ్ళు ఎక్కడ దాచారో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. ఒక చెంచును రహస్యంగా దొరకపుచ్చుకో గలిగితే, వాణ్ణించి ఆ రహస్యం లాగవచ్చు," అన్నాడు శిఖిముఖి.

"నువు ఒంటరిగా పోవటం ప్రమాదం అవుతుందేమో!" అన్నాడు విక్రమకేసరి.

"అలాంటి భయం ఏమీ లేదు. ఈ పులి తోలూ, కపాలం వున్నవి గదా? ఏం జరుగుతుందో నువ్వే చూద్దువుగాని. ఈ లోపల నువ్వు పులిబోను ముందు కంచె నరికించి, దాన్ని చెంచుల మీదికి వదిలేందుకు సిద్ధం చెయ్యి. నేను కపాలాన్ని చెంచుల మీదికి విసిరివెయ్యటమే అందుకు హెచ్చరిక," అని చెప్పాడు శిఖిముఖి.

విక్రమకేసరి సరేనని తన అనుచరుల దగ్గిరకు పోయి, పులిబోను ముందున్న కంచెకర్రలను కింది నుంచి మూడునాలు గడుగుల ఎత్తువరకూ నిశ్శబ్దంగా నరికి వెయ్యమన్నాడు. ఈ లోపల శిఖిముఖి







కొమ్మల మీది నుంచి లోపలికి దిగి, చీకటి ప్రాంతాల్లో నక్కుతూ గుడిసెల కేసి పోసాగాడు. హఠాత్తుగా అతడికి తా నింతకు ముందు చూసిన గుడిసె ముందుకు ఒక చెంచు చిన్న దివిటీ తీసుకుని రావటం కనిపించింది.

దివిటీతో వచ్చిన చెంచు గుడిసె ద్వారాని కడ్డంగా వున్న తడికను తోసి లోపలికి వెళ్ళాడు. అదే అదనుగా శిఖిముఖి గుడిసె ముందుకు పరిగెత్తి, ద్వారం పక్కనే నిలబడ్డాడు. చెంచువాడు దివిటీతో లోపల అంతా వెతికి ఆశ్చర్యపడుతున్నవాడిలా కళ్ళింత చేసి, ఏదో గొణగసాగాడు. శిఖిముఖికి వాడు అక్కడికి రావటం నాగుమల్లి కోసమన్న అనుమానం కలిగింది. వెంటనే అతడు పిల్లిలా నిశ్శబ్దంగా గుడిసె లోపలికి పోయి, వెనక నుంచి చెంచువాడి మీదికి ఎగిరి, వాడి కంఠాన్ని ఎడమచేత్తో వెనక్కి విరిచిపట్టుకుని, కుడిచేత్తో నోరు మూసి, "బతకదలిస్తే అరవకు!" అన్నాడు బుసకొడుతున్నట్టు.


చెంచువాడి చేతిలోంచి దివిటీ కింద పడిపోయింది. విడిపించుకు నేందుకు వాడే మాత్రం పెనుగులాడకుండా, శవంలా బిగదీసుకుపోయాడు. శిఖిముఖి వాడి మెడపట్టు వదిలి, చిన్న గొంతుతో, "నువ్వెక్కడి కెందుకు వచ్చావు?" అని ప్రశ్నించాడు.

చెంచువాడు కళ్ళింత చేసి, ఏదో భూతాన్ని చూసినట్టుగా శిఖిముఖి కేసి ఓమారు చూసి వణికిపోతూ, "సవర నాగుమల్లిని మా బడేదొర తీసుకురమ్మన్నాడు. అందుకోసం వచ్చాను," అన్నాడు.

"నాగుమల్లిని ఇక్కడ దాచినట్టు మీ దొరకు ఎవరు చెప్పారు?" అని ప్రశ్నించాడు శిఖిముఖి.

"భూతాలదొర!" అన్నాడు చెంచు.

"మరి నాగుమల్లి ఏమయింది? నిజం చెప్పు. అబద్ధమాడావో చంపేస్తాను,"



అంటూ శిఖిముఖి నడుం నుంచి వేలాడుతున్న చురకత్తిని పైకెత్తాడు.

"నన్ను చంపకు, దొరా! నేను బడే చెంచు మనిషిని కాదు; భూతాలదొర సొంత నౌకర్ని. ఆయన నాచేతే ఆ మల్లిని ఇక్కడ రహస్యంగా దాయించి, కంచె ద్వారాన్ని వూరికే దగ్గిరకి చేరవేసి వుంచమన్నాడు. చెప్పినట్టే చేశాను," అన్నాడు చెంచు.

"భూతాల దొర యిలా ఎందుకు చేశాడో, తెలుసా?" అని అడిగాడు శిఖిముఖి.

"బాగా తెలీదు. నవరమల్లిని, ఆకాశ దేవరకి పూజారిణ్ణి చేయబోతున్నానని అన్నాడు. ఆ మాట ఎవళ్ళతో అనొద్దన్నాడు. నే చెప్పేదంతా నిజం, నన్ను చంపకు, దొరా!" అంటూ చెంచు శిఖిముఖి కాళ్ళ మీద పడబోయాడు.

శిఖిముఖి వాణ్ణి వారించి, "అయితే పో. నన్ను చూసిన సంగతి మాత్రం ఎవరితోనూ అనకు, జాగ్రత్త!" అని హెచ్చరించాడు.

చెంచు వెళ్ళిపోయాడు. శిఖిముఖి పులి తోలు మీద కప్పుకుని, కాళ్ళమీదా చేతుల మీదా నడుస్తూ, ఆకాశగుహకు దాపుల నున్న గుడిశెల కేసి బయలుదేరాడు.

అంతలో బడేచెంచు వాళ్ళున్న ప్రాంతాన పెద్ద గలభా లేచింది. శిఖిముఖి చీకటి మాటున దాగుతూ అటు వెళ్ళేసరికి, చెంచు



దయ్యాలపోతూ, శిథిలాలయ పూజారీ తగువులాడుతున్నట్టు మాట్లాడుకుంటున్నారు. వాళ్ళిద్దరి పక్కనా బడేచెంచు, "మోసం! మోసం!" అంటూ కేకలు పెడుతున్నాడు.

అసలీ గొడవకంతకూ కారణం తెలుసుకుందామన్న ఆదుర్దాలో శిఖిముఖి మరికాస్త ముందుకు పోయేసరికి, అతడి మీద నెగళ్ళవెలుగు పడింది. వెంటనే ఒకరిద్దరు చెంచులు "పులి! పులి!" అని అరిచారు.

బడేచెంచూ, దయ్యాలపోతూ, పూజారీ చప్పున కదిలి ఆకాశగుహ కేసి పరిగెత్తారు. వాళ్ళని ఈటెతో కొట్టాలనే ఉద్రేకంలో శిఖిముఖి లేచి నిలబడ్డాడు. పులిచర్మం జారి కిందపడింది. పారిపోయే చెంచులు అది చూసి, "పులి కాదు! మనిషి!" అంటూ వెనుదిరిగి శిఖిముఖి కేసి రాసాగారు.

శిఖిముఖి ఒక్కొక్కడుగే వెనక్కు వేస్తూ, ఈటె పైకెత్తి కంచె కేసి బయలుదేరాడు. చెంచుల కేకలు విన్న బడేచెంచూ వాళ్ళు తిరిగి నెగళ్ళ దగ్గిరకు పరిగెత్తుకు వచ్చారు. శిథిలాలయ పూజారి పట్టరాని కోపంతో పళ్ళు కొరికి, "ఆ పులివేషగాడెవరో నాకు తెలుసు! ప్రాణాలతో పట్టుకోండి!" అంటూ హుంకరించాడు.

చెంచువాళ్ళు ఈటెలు తీసుకుని శిఖిముఖి కేసి రాసాగారు. ప్రమాదం రానున్నదని గుర్తించిన శిఖిముఖి కపాలాన్ని పూజారి మీద పడేలా విసిరి, పెద్దగా ఒక కేక పెట్టాడు. మరుక్షణంలో విక్రమకేసరి బోనులో నుంచి వదిలిన పులి పెద్దగా గాండ్రిస్తూ, శిథిలాలయపూజారి వాళ్ళున్న వైపుకు దూకింది.

"పారిపోకండి. మరొక పులివేషగాడు. చంపండి!" అంటూ శిథిలాలయ పూజారి కేకలు పెట్టాడు. పులి ఎదురైన యిద్దరు చెంచుల్ని పంజాతో కొట్టి బడేచెంచూ, పూజారీ వున్న దిశకు కుప్పించి దూకుతూ పోసాగింది.

—(ఇంకా వుంది)





శిథిలాలయం

15

[శిఖిముఖీ అతడి అనుచరులూ ఆకాశగుహ ప్రాంతం చేరేసరికి, అక్కడ చెంచులు కోలాహలంగా నాట్యాలు చేస్తున్నారు. నాగుమల్లి బంధించబడిన గుడిశెలో శిఖిముఖికి చెంచు వాడొకడు పట్టుబడ్డాడు. శిఖిముఖి పులిచర్మం కప్పుకున్నాడు. శిథిలాలయ పూజారి అది గ్రహించగానే, విక్రమకేసరి పులిని బోను నుంచి వదిలాడు. తరవాత.—]

ఈసారి తమ మీదికి వస్తున్నది, నిజమైన పులి అని శిథిలాలయ పూజారికీ, బడే చెంచుకూ తెలిసిపోయింది. పులి ఆ సరికే నలుగు రైదుగురు చెంచుల్ని పంజా దెబ్బలతో పడగొట్టింది. ఇక అక్కడ వుండటం ప్రమాదం అని తెలుసుకుని శిథిలాలయ పూజారి, ఆకాశగుహ పక్కనున్న కొండ అంచు కేసి పరిగెత్తసాగాడు. బడేచెంచు తన గుహ కేసి పారిపోతూ, అనుచరుల నుద్దేశించి, "చచ్చు వెధవల్లారా! పులిని చూసి భయపడుతున్నారా? నెగళ్ళలో మండే కట్టెలు తీసుకుని ఎదురు తిరగండి!" అని కేకలు పెట్టాడు.

చెంచులు తమ నాయకుడు చెప్పినట్టే భగభగ మండే కట్టెపుల్లలు తీసుకుని పులి మీదికి పరిగెత్తారు. నిప్పంటే భయపడని అడవి మృగం వుండదు. పులి మంటలు చూస్తూనే బెదురుకుని వెనుదిరిగింది.



ఇంతలో శిధిలాలయ పూజారి పెద్ద గొంతుతో, "ఎక్కడ్రా, భేరుండం! తొరగా వచ్చి చావు," అంటూ అరిచాడు.

పులి ప్రవేశంతో ఆకాశగుహ ముందు రేగిన గందరగోళంలో శిఖిముఖి, పూజారి ఎటు పరిగెత్తి పోతున్నదీ గమనించ లేదు. బడేచెంచు అందుబాటులో వున్నట్టు కన బడేసరికి, అతడు అటు కేసి పరిగెత్తాడు. శిఖిముఖి మీద ఒక కన్ను వేసి వుంచిన పూజారి, యిది చూస్తూనే తన నౌకర్ను గట్టిగా కేకపెట్టి పిలిచాడు.

"పూజారిదేవా, యిక్కడున్నాను, వచ్చే వచ్చే!" అంటూ సవరభేరుండం శిధిలాలయ పూజారి దగ్గరకు పరుగు పరుగున వచ్చిచేరాడు.

"ఇక్కడ మనం వచ్చిన పని తీరి పోయింది. ఇక మన ప్రయాణం బ్రహ్మపుత్రా నదీ లోయలకే," అంటూ పూజారి కొండ అంచు కేసి కదిలాడు.

"అయితే, యీ భేరుండాన్ని ఆకాశం లోకి ఎగరమని తమ సెలవా?" అన్నాడు సవరభేరుండం.

"ఈ కటిక చీకటిలో పైకెగరటం ప్రమాదం, ముందు లోయలోకే దిగిపోవాలి. చాప చుట్టి గట్టిగా కట్టావా? తాటి మోకును నే చెప్పిన కొండ రాతికి బలంగా బిగించావా?" అని అడిగాడు శిధిలాలయ పూజారి.

"తమ ఆజ్ఞ ప్రకారం అంతా సిద్ధపరిచి వుంచాను. కొండ కింది లోయలోకి ఎగిరి పోదామంటావా, దేవా?" అన్నాడు సవరభేరుండం.

"అలాంటి పిచ్చి పని చెయ్యకు, కాళ్లూ చేతులూ విరిగి చస్తావు. మోకు సాయంతో నేను ముందుగా లోయలోకి దిగుతాను. నువ్వు చాప చుట్టను ఎత్తుకుని కాస్త వెనకగా దిగు," అన్నాడు పూజారి.

ఇద్దరూ కొండ అంచుకు పోయారు. అక్కడ ఒక పెద్ద రాతికి బలమైన మోకు



ఒకటి కట్టబడి వున్నది. రాతి పక్కన తాళ్ళతో కట్టబడిన చాప చుట్ట ఒకటి వున్నది. అందులో బంధించబడి వున్నది నాగుమల్లే! ఆమె తల మాత్రం బయిటికి కనబడుతున్నది. అరవకుండా వుండేందుకు ఆమె నోటికి అడ్డంగా ఒక వస్త్రం ముక్క బిగించారు.

శిథిలాలయ పూజారి, నాగుమల్లి కేసి ఓ మారు చూసి, తృప్తిగా తలాడించి రాతి దగ్గిరకు పోయి మోకును లాగి చూశాడు. తరవాత భేరుండం కేసి తిరిగి, "మోకు లోయలోకి దిగేందుకు సరిపడా వున్నదా?" అని ప్రశ్నించాడు.

"లోయలోకేంటి, దేవా! నువ్వు కాస్త మంత్రం ప్రయోగిస్తే అది బ్రహ్మపుత్రానది ఉత్తరం గట్టునే తాకేస్తుంది," అన్నాడు భేరుండం.

"ఈ రాత్రి తాగొద్దని చెప్పానే, తాగావా? ఏవిఁటా పిచ్చి మాటలు! నోరు మూసుకుని, ఆ చాప చుట్ట ఎత్తుకుని, నా వెనగ్గా లోయలోకి దిగు," అంటూ శిథిలాలయ పూజారి తాడు పట్టుకుని, కొండ మీంచి లోయలోకి దిగసాగాడు.


సవర భేరుండం చేతుల్ని పైకీ కిందికీ ఓ సారి వూపి, "అంతా పూజారిదేవుడి



ఆజ్ఞ," అంటూ నాగుమల్లి కట్టబడి వున్న చాప చుట్టను భుజానికి ఎత్తుకోబోయేంతలో, ఆకాశగుహ వైపు నుంచి పెద్ద రణగొణ ధ్వని వినిపించింది.

భేరుండం బితుకు బితుకు మంటూ ఆకాశ గుహ కేసి ఓ క్షణకాలం చూసి, "పూజారి దేవా! ఆ శిఖిముఖీ వాళ్ళు, మన బడేచెంచు మీద దాడి చేస్తున్నట్టున్నది. మనం చెంచుకు సాయంపోవద్దా?" అన్నాడు.

"ఆ చెంచు చవటకు సాయం పోవటమా? ఛీ, నోరు మూసుకుని త్వరగా రా. ఆ చెంచు వెధవ, నే చెప్పిన పని ఒక్కటీ సక్రమంగా చేయలేకపోయాడు. వాణ్ణి





ఆ దయ్యాలపోతు మోసం చేస్తే, నేను వాళ్ళిద్దర్నీ మంత్రశక్తితో బుద్ధిహీనుల్ని చేసి, నాగుమల్లిని వశం చేసుకున్నాను. ఇక వాళ్ళనీ వాళ్ళనీ కొండ మీంచి దూకి చావనీయ్," అన్నాడు శిధిలాలయ పూజారి.

"పాపం, బడేచెంచు మంచివాడు! అతడికి శిఖిముఖి చేతుల్లో చావు రాసిపెట్టి వున్నదిగామాలు!" అని ఓసారి గట్టిగా గొంతు సవరించుకుని సవరభేరుండం, నాగుమల్లిని వీపుకు వేలాడవేసుకుని మోకు సాయంతో లోయలోకి దిగసాగాడు.

సవరభేరుండం ఊహించినట్టే ఆకాశ గుహ ముందు శిఖిముఖీ అతడి అనుచరులూ, బడేచెంచుతోపాటు అతడి ముఠా వాళ్ళను చుట్టుముట్టారు. ఆ ప్రయత్నంలో చెంచుల్లో ఇద్దరుముగ్గురు బాగా గాయపడ్డారు కూడా. సాధ్యమైతే ఎలాంటి రక్తపాతం లేకుండా చెంచుల్ని లొంగదీసుకుని, నాగుమల్లిని బంధవిముక్తురాల్ని చేసి తీసుకుపోవా లనుకున్న శిఖిముఖి, బడేచెంచుతో, "మీవాళ్ళ నందర్నీ ఆయుధాలు కింద పడవేయమని చెప్పు. అలా చేస్తే మీలో ఎవరికీ హాని కలిగించను. నాక్కావలసింది సవరనాయకుడి కూతురు నాగుమల్లి," అన్నాడు.

"నాగుమల్లినే కాదు, శిధిలాలయ పూజారిని కూడా మా వశం చెయ్యాలి," అన్నాడు విక్రమకేసరి ఈటెను బడేచెంచు కేసి గురి చేస్తూ.

బడేచెంచు గడగడ వణికిపోతూ, "ఇందులో నా తప్పేమీ లేదు. ఏదో దురాశ కొద్దీ డబ్బాశ పడి నాగుమల్లిని పట్టి తెచ్చాను. ఆవిడ తండ్రి చాలా డబ్బున్న వాడని విన్నాను. కాని చివరికిట్లా జరిగింది!" అన్నాడు.

"జరగబోయే దానితో పోలిస్తే, యీ జర్గింది నీకు సన్మానం కింద లెక్క. ముందు చెప్పు, ఆ పూజార్నీ, నీ దయ్యాల



పోతునూ ఎక్కడ దాచావ్?" అంటూ విక్రమకేసరి, బడేచెంచు కేసి రెండడుగులు వేశాడు.

బడేచెంచు మరింతగా వణికిపోతూ ఏదో అనబోయేంతలో, కంచె ప్రాంతాల్నించి, దయ్యాలపోతు ఏడ్పుగొంతుతో, "ఈ పులి మాటే అందరూ మర్చినట్టుంది. బాబులూ, వచ్చి సాయపడండి! ఇది నా గొంతు కొరికేందుకు చూస్తున్నది," అని కేక పెట్టాడు.

దయ్యాలపోతు కేక వింటూనే విక్రమకేసరి ఇద్దరుముగ్గురు అనుచరులతో కంచె దగ్గిరికి పరిగెత్తాడు. పులి కంచె కానుకుని నిలబడి వున్నది. చెంచు దయ్యాలపోతు మోకాళ్ళ మీద కూర్చుని, ఆరిపోవటానికి సిద్ధంగా వున్న ఒక నిప్పుకట్టెను దాని కేసి పూపుతున్నాడు. పులి మీదికి దూకేందుకు కోరలు చాచి గుర్రు పెడుతున్నది.

"ఈ దయ్యాలపోతును తెల్లారింతర్వాత పులికి ఆహారంగా వేద్దాం. ప్రస్తుతానికి యితడితో మనకు పని వున్నది. మీరు రెండుమూడు మండేకట్టెలు తెండి. పులిని మెల్లిగా తిరిగి బోనులోకి పంపుదాం," అన్నాడు విక్రమకేసరి.

విక్రమకేసరి యిలా అనగానే శబరులు నెగళ్ళ దగ్గిరకు పరిగెత్తిపోయి బాగా



మండుతున్న కట్టెలతో తిరిగి వచ్చారు. విక్రమకేసరి, దయ్యాలపోతు పారిపోకుండా ఒకణ్ణతనికి కాపలా పెట్టి, రెండు చేతుల్లో రెండు మండుతున్న కట్టెల్ని పట్టుకుని పులిని సమీపించాడు. పులి పెద్దగా ఓసారి గాండ్రించి, వెనుదిరిగి కంచెవారగా నడవ సాగింది. అది కంచె అవతల బోను వున్న ప్రదేశం చేరగానే, ఒకడు దాన్ని రెండవ వైపు నుంచి అటకాయించాడు. పులి పంజా సాచి అతని మీద దూకబోయినదల్లా, భయ పడి బోనులో జొరబడింది. వెంటనే విక్రమ కేసరి కంచె పైకెక్కి బోను తలుపును దభీ మంటూ మూసేశాడు.

విక్రమకేసరి, చెంచు దయ్యాలపోతు దగ్గిరకు తిరిగి వచ్చేసరికి, వాడు జుట్టు పీక్కుంటూ మతిపోయిన వాడిలా గొణు క్కుంటున్నాడు. విక్రమకేసరి కాపలా వున్న శబరవాణ్ణి పక్కకు పిలిచి, "ఏమిటి వాడు వాగేది? పారిపోవాలని ఏమైనా ప్రయత్నం చేశాడా?" అని అడిగాడు.

"దయ్యాలపోతుకు పిచ్చెక్కిందని నా కనుమానం కలుగుతున్నది, దొరా! పూజారి గాడెక్కడ అని అడిగితే, నా మాట విని పించుకోకుండా, 'వాడెత్తుకు పోయాడు, చావు తప్పదు, పులివాత పడక తప్పదు,' అంటూ ఒకే వరసన గొణుగుతున్నాడు," అన్నాడు శబరుడు.

విక్రమకేసరి, దయ్యాలపోతును భుజం పట్టుకుని కుదిలించి, "ఆ గొణుగుడు మాని, నిజం చెప్పు. ఎత్తుకుపోయిం దెవర్ని? చావు తప్పం దెవరికి? నాగుమల్లిని ఎక్కడ దాచావు?" అని ప్రశ్నించాడు.

దయ్యాలపోతు ఆ ప్రశ్నతో ఈ లోకం లోకి వచ్చినవాడిలా విక్రమకేసరిని నిలువు గుడ్లేసుకుని ఓ క్షణకాలం చూసి, "నాగు మల్లిని నేను దాచిన గుడిసెలోంచి ఆ పూజరి ఎత్తుకుపోయాడు. నేను అన్న మాట తప్పానని శిఖిముఖి నన్ను పులికి



మేతగా వేస్తాడు...నాకు చావు తప్పదు,"
అన్నాడు బొంగురుగొంతుతో.

దయ్యాలపోతు మాటల్తో విక్రమకేసరికి, నాగుమల్లిని శిథిలాలయ పూజారి ఆకాశ గుహ ప్రాంతం నుంచి చల్లగా మరెక్కడి కైనా దాటవేశాడేమో అన్న సంశయం కలిగింది. అతడు మారు మాటాడకుండా దయ్యాలపోతును మెడ పట్టుకుని బరబరా శిఖిముఖి వున్న చోటుకు లాక్కువచ్చి, అతడన్న మాటలు శిఖిముఖికి చెప్పాడు.


శిఖిముఖి పట్టరాని కోపంతో ఈటె పైకెత్తి, "దయ్యాలపోతూ, నీకు చావు తప్పదు. నువ్వూ, ఆ పూజారి దుర్మార్గుడూ తోడుదొంగలు. వాడి కోసం యీ చుట్టు పక్కల అంతా గాలించాం, కనిపించలేదు. నాగుమల్లి కూడా కనబడటం లేదు. వాడు దాగే రహస్యస్థలం ఎక్కడ?" అన్నాడు.

"ఆ దుర్మార్గుడూ నేనూ బద్ధ శత్రువులం, దొరబాబూ! ఆ సంగతి మా బడే చెంచుకూ్కడా తెలుసు. నాగుమల్లిని నువ్వు దాయమన్న గుడిసెలోనే దాచాను. వాడూ, వాడి నౌకరూ చీకటి పడింతర్వాత ఒకటికి రెండుసార్లు కొండ అంచు కేసి పోవటం చూశాను. అక్క డేమన్నా..." అంటూ దయ్యాలపోతు ఆగిపోయాడు.



శిఖిముఖి, దయ్యాలపోతు మెడ పట్టుకుని, "త్వరగా రా. ఆ ప్రదేశం ఏదో చూపు," అన్నాడు తొందరపెడుతూ.

దయ్యాలపోతు కొండ అంచు కేసి గబగబా నడిచాడు. అతని వెన్నంటి పోయిన శిఖిముఖీ, విక్రమకేసరులకు శబరవాళ్ళు తెచ్చిన కాగడాల వెలుగులో, ఒక పెద్ద గండశిలా, దానికి కట్టివున్న బలమైన తాటి మోకూ కనిపించినై. శిఖిముఖి చప్పున వంగి మోకును బలంగా లాగి చూశాడు, అది బిగుసుకుపోయి వుంది. అప్పు డతను తల వంచి దాన్ని చెవికానించుకుని కొద్దిసేపు విని "మోకు ఆధారంతో ఆ పూజారీ



వాళ్ళు కొండ మీంచి లోయలోకి దిగిపోతున్నారు, అనుమానం లేదు," అన్నాడు.

"అలా అయితే ఒక్క వేటుకు మోకు నరకండి. ఆ నీచుడు కింది లోయలో రాళ్ల మీద పడి తల పగిలి చస్తాడు," అన్నాడు బడేచెంచు ఆ సమయాని కక్కడికి వచ్చి.

"చెంచూ! తొందరపడి అలాంటి బుద్ధి తక్కువ పని చేసేవు. అలా మోకు నరికితే చచ్చేది ఒక్క పూజారే కాదు, అతడి వెంట నాగుమల్లి కూడా వున్నది," అన్నాడు శిఖిముఖి. అతడు యిలా అనేంతలో చెంచుల్లో కొందరు తమ చేతుల్లో వున్న కాగడాలను లోయలోకి విసిరారు. వాటి వెలుగులో మోకు సాయంతో కిందికి దిగిపోతున్న శిథిలాలయ పూజారీ, నవరభేరుండం, అతడి భుజాన వేలాడుతున్న చాప చుట్టా— అందరికీ కనిపించినై.

"శిఖీ! ఇప్పుడేమిటి ఉపాయం? ఆ దుర్మార్గుడు నాగుమల్లితో కూడా మనకు కనిపించకుండా పారిపోయే ప్రమాదం వున్నది," అన్నాడు విక్రమకేసరి.

"నేనూ మరో మోకు సాయంతో వాడి వెంట బడతాను. ఈ వున్న మోకు నలుగురిని మోయలేక పోవచ్చు," అని శిఖిముఖి బడేచెంచుతో, "త్వరగా ఒక మోకు తెప్పించు," అని చెప్పాడు.

క్షణాల మీద చెంచులు ఒక మోకు తెచ్చారు. శిఖిముఖి దాని కొస నొకదాన్ని గండశిలకు కట్టించి, మిగతా దాన్ని లోయలోకి జార్చి, దాని వెంట కిందికి దిగుతూ, "కాగడాలను పూజారీ వాళ్లకు తగలకుండా కొంచెం దూరంగా విసరండి," అన్నాడు.

చెంచులు విసిరిన కాగడాల వెలుగులో శిథిలాలయ పూజారీ వాళ్ళు దాదాపు లోయ అడుగు భాగాన్ని చేరబోవటం శిఖిముఖికి కనిపించింది. వెంటనే అతడు మోకు వెంట సర్రుమంటూ వేగంగా లోయలోకి దిగసాగాడు. —(ఇంకా వుంది)





శిథిలాలయం

16

[పెద్దపులి మీద పడటంతో, చెంచులు సెగళ్ళ దగ్గిర నుంచి పారిపోయారు. ఎంత వెతికినా శిఖిముఖికి, నాగుమల్లి కనిపించ లేదు. శిథిలాలయ పూజారి ఆమెను తీసుకుని పారిపోయినట్టు చెంచు దయ్యాలపోతు అతడికి చెప్పాడు. మోకు సాయంతో కొండ మీది నుంచి లోయలోకి దిగి పోతున్న పూజారిని, శిఖిముఖి వెంబడించాడు. తరవాత–]

శిఖిముఖి లోయలోకి దిగేసరికి అతడికి పూజారిగాని, నాగుమల్లిని వీపుకు వేలాడ కట్టుకున్న గండభేరుండంగాని కనిపించ లేదు. వాళ్ళు అతడికన్న కొంచెం ముందుగా లోయలోకి దిగగలిగారు. శిఖిముఖి చుట్టూ కలయ చూసేంతలో అతడికి దూరంగా గుర్రం సకిలించిన ధ్వని వినబడింది. వెంటనే అతడు ఆ దిక్కు కేసి వేగంగా పరిగెత్తాడు. చీకట్లో క్రమంగా దూరమై పోతున్న గిట్టల ధ్వని తప్ప అతడికి గుర్రం కనిపించలేదు.

శిఖిముఖి నిరుత్సాహ పడిపోతూ, యిప్పుడేమి చేయటమా అని ఆలోచించేంతలో, మోకు సాయంతో లోయలోకి దిగిన విక్రమకేసరి, అతణ్ణి "శిఖీ!" అని పిలిచాడు.

శిఖిముఖి ఆ పిలుపు వింటూనే అదిరి పడి, వెనక్కు తిరిగాడు. విక్రమకేసరి అతడి భుజంమీద చేయి వేసి చిన్న



గొంతుతో, "ఏం, ఆ దుర్మార్గుడు నీకు అందకుండా పారిపోయాడా?" అని ప్రశ్నించాడు.

"అందకపోవటమే కాదు, వాడు నా కంటికే కనిపించలేదు. దూరాన గుఱ్ఱం పరిగెత్తిపోయిన శబ్దం మాత్రం విన్నాను,' అన్నాడు శిఖిముఖి.

"వాడుగానీ, ఆ భేరుండంగానీ నాగుమల్లిని గుఱ్ఱం మీద వేసుకుని త్వరత్వరగా యీ ప్రదేశం వదిలి పారిపోయివుంటారు. అలా జరిగివుంటే మాత్రం ఆ పూజారిగాడికి యిక్కడ సహాయపడేందుకు మరికొందరు మనుషులు వుండి వుండాలి. లేకపోతే




గుఱ్ఱం ఎక్కణ్ణుంచి వస్తుంది!" అన్నాడు విక్రమకేసరి.

"అంతే అయియుండాలి. మనం మాటలతో కాలయాపన చేయటం ఎందుకు. యీ చుట్టుపక్కల వాళ్ళకోసం వెతుకుదాం. మనవాళ్ళందరూ కొండ దిగి వస్తున్నారు గదా?" అన్నాడు శిఖిముఖి.

"వస్తున్నారు. వాళ్ళు యిక్కడికి చేరేందుకు కొంత ఆలస్యం అవుతుంది. నువ్వు గుఱ్ఱం పరిగెత్తిపోయిన ధ్వని ఏ దిక్కుగా విన్నావు?" అని అడిగాడు విక్రమకేసరి.

శిఖిముఖి వున్న చోటు నుంచి కదిలి, అక్కడికి దాపుల నున్న చెట్ల కేసి చేయి చూపాడు. ఇద్దరూ అటు కేసి నిశ్శబ్దంగా బయులుదేరారు. ఆ ప్రదేశం లోయకు కొంచెం ఎగువగా వున్నది. అంత చీకటిలోనూ చెట్ల మధ్య నుంచి సన్నని కాలిబాట ఒకటి వాళ్ళ కంట బడింది. ఆ బాట వెంట వాళ్ళు కొంతదూరం వెళ్ళేసరికి, బాటకు పక్కగా వున్న పొదల చాటు నుంచి చిన్న వెలుగు వాళ్ళకు కనిపించింది.

శిఖిముఖి, విక్రమకేసరికి ఆ వెలుగు చూపి, "ఎవరో ఆ పొదల వెనక నెగడు వేసుకుని కూర్చున్నట్టున్నది. అరణ్య





మృగాల భయంకొద్దీ, యీ ప్రాంతాల దొంగలైనా దొరలైనా రాత్రివేళల్లో నిప్పు ముందు కాలక్షేపం చేయవలసిందే. వీళ్ళెవరో తెలుసుకుందాం," అంటూ పొదల చాటునే నక్కుతూ ముందుకు కదిలాడు.

శిఖిముఖి, విక్రమకేసరీ ఆ నెగడు వున్న చోటుకు దాపుల నున్న పొదల వెనక్కు పోయేసరికి, వాళ్ళకు నెగడు ముందు ఇద్దరు మనుషులు కనిపించారు. వాళ్ళ దుస్తుల తీరూ అదీ చూస్తూంటే, వాళ్ళు అడవి దొంగలలా వున్నారు. వాళ్ళు లోకం మాటే మరిచి కాళ్ళ ముందు పరుచుకున్న వస్త్రం మీద కుప్పగా పోసివున్న వెండి కానుల్ని లెక్కిస్తున్నారు.

శిఖిముఖి, విక్రమకేసరిని, ఆ దొంగల వెనక వున్న పొదల చాటుకు వెళ్ళమని చెప్పి, తాను పొదల చాటు నుంచి కత్తి దూసి వాళ్ళ ముందుకుపోతూ, "ఉన్న చోటు నుంచి కదలకండి, జాగ్రత్త!" అని గట్టిగా హెచ్చరించాడు.

దొంగ లిద్దరూ అదిరిపడి, కత్తులు దూయబోయిన వాళ్ళల్లా శిఖిముఖిని చూస్తూనే ఓ క్షణకాలం తటపటాయించారు. ఆ అదనులో విక్రమకేసరి పొదల చాటు నుంచి వాళ్ళ వెనగ్గా వచ్చి నిలబడి, కత్తిని



వాళ్ళ కంఠాల మీద ఆడిస్తూ, "జాగ్రత్త, కదలకండి!" అంటూ హుంకరించాడు.

దొంగలు ఆ హెచ్చరికతో కుక్కిన పేనుల్లా అయిపోయారు. శిఖిముఖి వాళ్ళను సమీపించి, ఒరల నుంచి కత్తులు లాగి దూరంగా విసిరివేస్తూ, "శిథిలాలయ పూజారి ఎక్కడ?" అని ప్రశ్నించాడు.

ఆ ప్రశ్న వింటూనే దొంగల్లో ఒకడు అమాయకుడిలా ముఖం పెట్టి, "శిథిలాలయ పూజారా? ఆ పేరే వినలేదే!" అన్నాడు.

"ఆ పేరు వినటమేగాదు, ఆ దుర్మార్గుడి నుంచే యీ వెండి కానులన్నీ సంపాయించారు. మోసం చెయ్యాలని చూడ



కండి," అని, విక్రమకేసరితో, "కేసరీ! వీళ్ళ చేత నిజం చెప్పించటం ఏమంత కష్టం కాదు. పారిపోవాలని ప్రయత్నించిన వాణ్ణి నిర్దాక్షిణ్యంగా కత్తితో నరుకు," అని చెప్పి, దొంగల్లో ఒకడి తలకు వున్న వస్త్రాన్ని లాగి, దానితో వాడి చేతులను వెనక్కు విరిచికట్టాడు శిఖిముఖి.

"ఇప్పుడు నిజం చెప్పబోతున్నారు, తెలిసిందా?" అని శిఖిముఖి నెగడు నుంచి కాలే కట్టె ఒకటి తీసుకుని, ఒక దొంగ వాడి కేసి ముందుకొక అడుగు వేశాడు.

రానున్న ప్రమాదాన్ని గుర్తించగానే దొంగ లబోమంటూ, "అయ్యా, నన్ను



కాల్చి చంపకండి. ఆ పూజారి ఎక్కడున్నాడో తెలీదు. అతడికి ఒక గుర్రాన్ని అమ్మాం. ఆ డబ్బు పంచుకుంటున్నాం," అన్నాడు.


"నీకు తెలిసింది యింతే నన్నమాట. సరే, నీ స్నేహితుడికి మరికొంత తెలిసి వుంటుంది," అంటూ శిఖిముఖి కాలే కట్టెను రెండవ దొంగ మీదికి గురి చేశాడు.

ఈసారి ఆ రెండవ దొంగ ఒక చావు కేక పెట్టి, "అయ్యా, నన్ను కాల్చకు. అంతా నిజం చెబుతాను. ఆ పూజారి వెంట దుక్కలాంటి సవరవా డొకడున్నాడు. వాడు చాపలో చుట్టి తెచ్చిన ఒక మనిషిని పూజారి గుర్రం మీద వేసుకుని అరణ్యంలోకి దౌడు తీశాడు. ఇంతే మాకు తెలిసింది," అన్నాడు.

"కాదు, మీకింకా చాలా తెలుసు. కేసరీ, నువ్వూ ఒక నిప్పు కట్టె అందుకో," అన్నాడు శిఖిముఖి.

విక్రమకేసరి నెగడులో నుంచి బాగా మండుతున్న కట్టె నొకదాన్ని తీసుకుని మొదటి దొంగను సమీపిస్తూ, "వీపు కాల్చటం కంటె తల కాలిస్తే వీళ్ళకు మరి కాస్త సుఖంగా వుంటుంది," అని కట్టెను మొదటి దొంగ తలమీద పెట్టబోయాడు.

దొంగ గడగడ వణికిపోతూ, "అయ్యలారా, మమ్మల్ని హింసించకండి. ఇప్పుడు




CHITRA



మాకు తెలిసినదంతా చెప్పేస్తాం. ఆ పూజారీ, అతడి నౌకరూ మాట్లాడుకునేదాన్నిబట్టి, వాళ్ళు రాత్రికిరాత్రే బయలుదేరి బ్రహ్మ పుత్రానదీ ప్రాంతాలకు వెళ్ళిపోతున్నట్టు తెలిసింది. సత్యం చెబుతున్నాను. ఆ పైన కొండదేవతే సాక్షి!" అన్నాడు.

"శిఖీ, యీ వెధవలు బ్రహ్మపుత్రానది యీ పక్కన ఎక్కడో వున్నదను కుంటున్నారులావుంది ఒళ్ళు కాలితే తప్ప నిజం చెప్పరు," అంటూ విక్రమకేసరి శిఖిముఖి చేతులో వున్న నిప్పు కర్రను కూడా లాక్కొని, యిద్దరు దొంగల తలల మీదా ఆనించబోయాడు.



"మా కింతకన్నా ఏం తెలియదు. రక్షించండి," అంటూ దొంగలు గగ్గోలు ప్రారంభించారు. శిఖిముఖి, విక్రమకేసరిని వారించి, "వీళ్లు నిజంచెపుతున్నట్టే వున్నది. పాపం, నాలుగు రాళ్ళ కోసం గుర్రాన్ని ఆ పూజారికి అమ్మటం నేరం కింద జమ కట్టలేంకదా," అని, దొంగలతో, "సరే, ఇక మీ చావేదో మీరు చావండి. ఒకవేళ మీ కెప్పుడైనా ఆ పూజారిగాని, నవర వాడు...వాడి పేరు భేరుండంగాని కని పించితే, ఆ సంగతి కుంభారమిట్ట పల్లెలో చెప్పాలి. అలాచేయ్యక పోయారో మీ చర్మం వలిచి తీరుతాను," అన్నాడు.

"అయ్యో, మీరు ప్రాణదాతలు. మాటి స్తున్నాం. ఆ పూజారి కనిపిస్తే అగమేగాల మీద వచ్చి, మీ పల్లెలో ఆ సంగతి చెపుతాం," అన్నాడు దొంగల్లో ఒకడు.

శిఖిముఖి అంగీకార సూచకంగా తలా డించి, విక్రమకేసరిని వెంట బెట్టుకుని చెట్లల్లోకి కొంతదూరం పోయి ఆగి, "కేసరీ, ఈ దొంగలు మనతో చెప్పకుండా దాచిన ముఖ్య రహస్యం ఒకటున్నదని నా కను మానం కలుగుతున్నది. పూజారికి గుర్రాన్ని అమ్మిన మాట నిజం. కాని, వాడెక్కడ వున్నదీ తమకు తెలియదనటం పూర్తి






అబద్ధం. ప్రాణభయం పెట్టినా మనను వాళ్ళు అబద్ధాలతో పక్కదార్లు తొక్కించ వచ్చు. అందుకని, నేను వాళ్ళను వెంబడించి ఎటుపోయేదీ తెలుసుకోదలిచాను. నువ్వు, యీ ప్రాంతాల్లోనే వుండి, మన వాళ్ళు రాగానే, వాళ్ళను నాలుగు దిక్కులకూ పూజారిని వెతికేందుకు పంపి, యీ సమీపంలోనే నా కోసం కాచుకుని వుండు," అన్నాడు.



విక్రమకేసరి సరే నన్నాడు. ఆ వెంటనే శిఖిముఖి దొంగలున్న చోటుకు పోయాడు. అతడు పొదలచాటు నుంచి వాళ్ళేమి చేస్తున్నదీ చూసేంతలో దొంగలు డబ్బును రెండు చిన్న మూటలుగా కట్టి, నడుముకు వేలాడ వేసుకుని, పొదల్లో వెతికి, పోయిన కత్తుల్ని సంపాయించి, నవ్వుకుంటూ అరణ్యంలోకి వున్న కాలిబాట వెంట బయలుదేరారు. శిఖిముఖి నిశ్శబ్దంగా వాళ్ళను అనుసరించాడు.

విక్రమకేసరి చీకట్లో అటూ యిటూ పచార్లు చేస్తూ తన అనుచరుల రాకకోసం ఎదురు చూడసాగాడు. ఓ పావు గంట గడిచింది. హఠాత్తుగా అతడికి లోయ దిగువ ప్రాంతం నుంచి కుక్క అరవటం వినబడింది. ఆ అరుపు శిఖిముఖి వేటకుక్క ఎర్రగండుదని అతడు గ్రహించాడు. దాని అర్థం కుంభారమిట్ట నుంచి శివాలుడుగాని, లేక శిఖిముఖి బంధువుల్లో మరెవరైనాగాని అటువస్తున్నారన్నమాట.

అతడు చప్పున కదిలి కుక్క అరుపు వినబడిన వైపుకు నడవసాగాడు. కొద్దిసేపట్లోనే అతడికి లోయ పైకి ఎక్కి వస్తున్న శివాలుడూ, గండుపోతూ వాళ్ళ వెంట నలుగు రైదుగురు శబర సవరవాళ్ళూ కనిపించారు. ఒక శబరుడు ఎర్రగండు మెడ నున్న తాడు పట్టుకుని వున్నాడు. కుక్క తాడును గుంజుతూ ముందుకు పరిగెత్తాలని పెనుగులాడుతున్నది.



శివాలుడు, విక్రమకేసరిని చూస్తూనే, "కేసరీ, క్షేమంగా వున్నావా? శిఖి ఎక్కడ? నాగుమల్లిని ఆ దుర్మార్గుడైన పూజారి ఎత్తుకు పోయిన మాట నిజమా?" అని ప్రశ్నించాడు.

విక్రమకేసరి జవాబు చెప్పబోయేంతలో, సవరగండుపోతు పెద్దగా గొంతెత్తి, "ఆ పూజారి నీచుణ్ణి ప్రాణాలతో చర్మం ఒలిపిస్తాను. వాడెక్కడ?" అన్నాడు ఆవేశ పడిపోతూ.

శివాలుడు అతడి భుజం పట్టుకుని, "తొందరపడకు, గండుపోతూ! ముందు సంగతి సందర్భాలు తెలుసుకోనీయ్," అన్నాడు శాంతపరుస్తూ.

విక్రమకేసరి తాము అరణ్యంలో ప్రవేశించి, బడేచెంచు నివసించే ఆకాశగుహ చేరటం, అక్కడ జరిగిన గొడవలూ—అన్నీ టూకీగా చెప్పి, చివరకు శిఖిముఖి దొంగలను అనుసరించి పోవటం సంగతి తెలియ పరిచాడు.

"ఒంటరిగా ఆ అడవి దొంగలను వెంబడించటంలో కొంత ప్రమాదం వున్నా, శిఖిముఖి తెలివైన పనే చేశాడు. ఏమైనా యీ చీకట్లో ఆ పూజారిని పట్టుకోవటం సాధ్యమయే పని కాదు. తెల్లవారిం తరవాత ఈ అరణ్యాలూ, కొండలూ వాడికోసం గాలించవలసి వున్నది," అని, శివాలుడు గండుపోతుతో, "నువ్వేమీ దిగులు పడకు. నాగుమల్లి ఆ దుర్మార్గుణ్ణించి స్వశక్తితోనే బంధవిముక్తురాలు కాగలదని నా నమ్మకం. అలా జరగకపోయినా, పూజారి మన వలలో చిక్కకుండా పోడు," అన్నాడు.

శివాలుడు మాట ముగించీ ముగించక ముందే, లోయ పక్కనే వున్న ఒక ఎత్తయిన ప్రదేశం నుంచి భగభగ మండుతున్న దివిటీ కనిపించింది. ఎవరో దాన్ని గాలిలో వూపుతున్నారు. శివాలుడూ అతడి వెంట వున్న వాళ్లూ అటు కేసి చూసేంతలో, సన్నని ఈల వినిపించింది. —(ఇంకా వుంది)





17

[శిథిలాలయ పూజారి తన బంటు నరభేరుండం సాయంతో, నాగుమల్లిని అపహరించి, పారిపోయాడు. అరణ్యంలో శిఖిముఖి, పూజారికి గుర్రాన్ని అమ్మి సాయపడిన దొంగలు కనిపించగా, వాళ్ళను వెన్నంటి పోయాడు. శివాలుడూ, గండుపోతూ లోయలోకి వచ్చారు. వారికి దూరం నుంచి ఎవరో ఈలవేస్తున్న ధ్వనివినిపించింది. తరవాత—]

శివాలుడు దివిటీ వెలుగు కేసి ఓ క్షణకాలం చూసి, తన అనుచరులతో, "దివిటీని గాలిలో అల్లల్లాడిస్తున్న వాడెవడు? ఆ ఈల లోగడ ఎక్కడో విన్నట్టున్నదే," అన్నాడు ఆశ్చర్యపడుతూ.

అప్పుడు శబరుల్లో ఒకడు శివాలుడితో, "దొరా, ఆ దివిటీ కనబడుతున్న చోటున బడేచెంచు వేటకు వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకునే పాక ఒకటి వున్నది. చీకటి పడే వేళ నేను అటు నుంచే వచ్చాను. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేరు," అన్నాడు.

దివిటీని శివాలుడూ వాళ్ళున్న వైపుకు రమ్మన్న సూచనగా పైకీ కిందికీ ఊపుతూ, వాడెవడో మరింత బిగ్గరగా ఈల వేయసాగాడు. శివాలుడు, గండుపోతుతో మాట్లాడి, అనుచరులతో, "వాడెవడో గాని మననే పిలుస్తున్నట్టున్నది. పోదాం పదండి," అంటూ బయలుదేరాడు.



శివాలుడూ వాళ్ళు పాకను సమీపించేంతలో, దివిటీ పట్టుకున్నవాడు ఈలలు వేయటం మాని పాక లోపలికి వెళ్ళిపోయాడు. శివాలుడు పాకను సమీపించి చూసేసరికి దాని వెదురుకర్రల తలుపు మూయబడి వున్నది. లోపల వెలుగుతున్న దివిటీ కాంతి కిటికీ లోంచి బయటికి పడుతున్నది.

శివాలుడు తలుపు దగ్గిరకు పోయి దాన్ని గట్టిగా తడుతూ, "ఎవరూ లోపల? తలుపు తెరవండి!" అన్నాడు.

లోపలి నుంచి జవాబు లేదు. శివాలుడు తలుపును గట్టిగా తోశాడు. అది కిర్రుమంటూ తెరుచుకున్నది. లోపల ఒక కొయ్యబల్ల మీద శిథిలాలయ పూజారి కూర్చుని వున్నాడు. అతడు శివాలుణ్ణి చూస్తూనే వికృతంగా నవ్వి, "ఓహో, కులపెద్ద లంతా కలిసికట్టుగా వచ్చినట్టుందే! స్వాగతం అనక తప్పదు గదా? లోపలికి రండి," అన్నాడు.

పూజారి ధైర్యం, తెగువతనం చూసి శివాలుడు నిర్విణ్ణుడయిపోయాడు. సవర గండుపోతు పెద్దగా హుంకరించి కత్తి ఝళిపిస్తూ పూజారి కేసి దూకబోయాడు.

శివాలుడు, గండుపోతును భుజం పట్టుకుని ఆపి, "తొందరపడకు, పోతూ! మన చేతిలో చిక్కిన యీ దుష్టుడు మరెక్కడికీ పారిపోలేడు," అన్నాడు.

గండుపోతు ఆ మాటలతో కాస్త శాంతించాడు. కాని, అతడి కళ్ళు నిప్పులు చెరుగుతున్నవి. ఏమాత్రం వీలు దొరికినా పూజారిని కత్తితో రెండుగా నరకాలన్న ఉద్రేకంలో వున్నా డతను.

శివాలుడు, శిథిలాలయ పూజారిని సమీపించి, "మా అందరికీ ఎంతో కష్టనష్టాలు కలిగించటమే గాక; సవరపెద్ద కుమార్తెను కూడా నువ్వు అపహరించుకు పోయావు. అలాంటి నువ్వు యింత ధైర్యంగా మా





మధ్యకు రావటం నాకు ఆశ్చర్యాన్ని కలిగి స్తున్నది," అన్నాడు.

శిథిలాలయు పూజారి ఆ మాటలకు వికవిక మంటూ నవ్వి, "నువ్వు గండుపోతు కన్న ఎన్నో రెట్లు వివేకవంతుడివి, నా శక్తిసామ ర్థ్యాలు ఎలాంటివో యిప్పటికి నీ కర్థమైన వనుకుంటాను," అన్నాడు.

పూజారి నవ్వూ, అతడి మాటల వెనక వున్న అవహేళనా చూసి శివాలుడు మండి పడి, ఒక్క అంగలో అతణ్ణి సమీపించి మెడ గట్టిగా పట్టుకుని, "నీచుడా, అంత ధీమాగా మాట్లాడకు. నాగుమల్లిని ఎక్కడ దాచావు? వెంటనే చెప్పు," అంటూ హుంకరించాడు.

పూజారి మాట్టాడబోయి, మెడమీద శివా లుడి గుప్పెట బిగిసివుండటంతో గిలగిల్లా డుతూ కళ్ళు తేలవేసే స్థితికి వచ్చాడు. వాణ్ణి చంపే ముందు, నాగుమల్లి ఎక్కడ వున్నదీ తెలుసుకోవటం ముఖ్యంఅనుకుని శివాలుడు అతడి మెడపట్టు వదిలాడు.

పూజరి మెడను రెండుచేతులతో కాసేపు నవరించుకుని, ఒకసారి గట్టిగా కాండ్రించి, పట్టరాని కోపంతో ముక్కుపుటాలు అదురు తూండగా శివాలుడి కేసి తీవ్రంగా చూస్తూ, "శివాలూ, చివరికి నువ్వు ఆటవికుడి వన్న సత్యాన్ని బయట పెట్టుకున్నావు. నేను నీ మిత్రుడి కుమార్తెను అపహరించి కూడా, మిమ్మల్ని కావాలని యిక్కడికి ఎందుకు పిలిచానో, నీ కర్థమైనట్టు లేదు. మరొక మాట; శిథిలాలయు పూజారి పాదాలను తప్ప మరే శరీరభాగాన్నీ మానవమాత్రు డెవరూ తాకరాదు. అటువంటి పవిత్రమైన శరీరంలో మెడభాగాన్ని పట్టుకుని, నువ్వు నీ నాశనాన్నీ, నీ వంశనాశనాన్నీ కోరి తెచ్చుకున్నావు," అన్నాడు.

"ఆ వెధవ కోతలన్నీ కట్టిపెట్టి, ముందు నాగుమల్లిని ఎక్కడ దాచావో చెప్పు! అలా చెప్పకపోయావో, యీ సారి నీ తుచ్ఛ



దేహాన్ని నేను తాకను. దాన్ని మా పెంపుడు కుక్క ఎర్రగండు ఆకలయినప్పుడల్లా కొంచెంకొంచెంగా తినేస్తుంది," అన్నాడు శివాలుడు.


ఎర్రగండు అన్నమాట వింటూనే కుక్క శివాలుణ్ణి సమీపించి, అతడి పక్కగా నిలబడి చిన్నగా మొరుగుతూ, శిథిలాలయ పూజారి కేసి దూకేందుకు కాళ్ళు చాచబోయింది. శివాలుడు దాని తల నిమురుతూ, "ఈ నీచుడి దేహం విషంతో సమానమన్న భయం నా కుంది. తొందరపడి తిని ప్రాణాపాయం తెచ్చుకోవటం ఎందుకు, కొంచెం ఆగు," అన్నాడు.



"శివాలూ, ఈ అవమానాన్ని నేను సహించను. నీ మేలు కోరి ఒక మాట చెపుదామని వచ్చాను. కాని, నీ ధోరణి నాకు కోపం తెప్పిస్తున్నది. నేను వెళుతున్నాను," అంటూ శిథిలాలయపూజారి బల్ల మీది నుంచి లేచాడు.

అప్పటి వరకూ తనలో పొంగే కోపాన్ని అణుచుకుని, ఓ పక్కగా నిలబడి అంతా వింటున్న సపరగండుపోతు, పూజారి లేచి నిలబడగానే, యిక కోపాన్ని పట్టలేక ఎగిరి అతడి మీద పడి, రెండుచేతుల్తో పైకెత్తి నేలకు విసిరి కొట్టబోయాడు. శివాలుడు చప్పున, గండుపోతు ముందుకుపోయి, అతడి చేతుల్లో విలవిల తన్నుకుంటున్న పూజారిని నడుం పట్టుకుని కిందకు దించి, "పోతూ, కొంచెం ఆగు. ముందు నాగుమల్లి ఎక్కడ వున్నదో తెలుసుకోనివ్వు. తరవాత వీణ్ణి నీ యిష్టం వచ్చినట్టు చిత్రవధ చేద్దువుగాని," అన్నాడు.

శిథిలాలయ పూజారి భయంతో వణికిపోతూ, "మీ రింత బుద్ధిహీనులని తెలిస్తే, నే నిక్కడికి వచ్చేవాణ్ణే కాదు. నా దారిన నేను హిమాలయాలకు వెళ్ళిపోయేవాణ్ణి. సరే, నాగుమల్లి ఎలాంటి ప్రమాదంలో చిక్కుకుని వున్నదో మీకు అంతుబట్టినట్టు




లేదు. మీ ఇద్దరు మూర్ఖ ఆటవికుల్ని చంపేందుకు నేను నా మహా మంత్రశక్తిని వృథాపరచ దలచలేదు. ఇక్కడ నేను మరణించటమే జరిగితే, ఆ మరుక్షణంలో నాగుమల్లి అక్కడ చిత్రవధ చేయబడు తుంది. అందుకు అవసరం అయిన ఏర్పాట్లన్నీ చేసే నేను మీ మధ్యకు వచ్చాను. జాగ్రత్త!" అన్నాడు.

పూజారి యిలా అనేసరికి శివాలుడికీ, గండుపోతుకూ వాడి ఎత్తుగడ అర్థమై పోయింది. ఇక్కడ పూజారికి ఎలాంటి హాని జరిగినా, అతడి భృత్యులు నాగుమల్లిని హత్య చేస్తారు...

"పూజారీ, యిప్పటికి నీ కుతంత్రం ఏమిటో నాకు పూర్తిగా అర్థమైంది. సరే, నీకు ఎలాంటి ప్రాణాపాయం రాదు. నాగుమల్లిని ఎక్కడ మా స్వాధీనం చేస్తావు?" అని అడిగాడు శివాలుడు.

"నాగుమల్లిని వట్టినే మీకు తిరిగి ఒప్ప చెప్పదలిస్తే, అసలు యిక్కడికి నేను రావటం ఎందుకు? నేను పిచ్చివాణ్ణను కున్నారా? విక్రమకేసరి నీకు తెచ్చి యిచ్చిన, తాళపత్రాలు నా స్వాధీనం చేస్తే, నాగుమల్లి సజీవంగా మిమ్మల్ని చేరుతుంది. లేకపోతే, రేపు సూర్యోదయంవేళ, తలలేని ఆమె మొండెం, కొండ మలుపున వున్న





రావిచెట్టుకు వేలాడుతూ వుంటుంది," అన్నాడు శిథిలాలయ పూజారి.

"సరే, అలాగే ఆ తాళపత్రాలు పల్లె నుంచి తెప్పించి నీకిస్తాను. కాని, నాగుమల్లిని నువ్వు వదులుతావన్న నమ్మకం ఏమిటి?" అని అడిగాడు శివాలుడు.

"నేను ఆటవికుణ్ణి కాను, దేవీభక్తుణ్ణి! దేవీభక్తుడు మాట తప్పడు. ఆ తాళపత్రాలున్న సంచీని, తెల్లవారే లోపల ఆ రావిచెట్టుకు వేలాడ కట్టండి. వాటిని నా శిష్యుడు తీసుకోగానే, నాగుమల్లి అక్కడే మిమ్మల్ని కలుసుకుంటుంది," అన్నాడు శిథిలాలయ పూజారి.


"మాట తప్పవుగదా?" అన్నాడు శివాలుడు.

"ఆ మూర్ఖ ప్రశ్నకు యింతకు ముందే జవాబు చెప్పాను. మరో అరగంటలో నేను నా స్థానానికి చేరకపోతే, నాగుమల్లి మొండెం రావిచెట్టును చేరుతుంది. వెళతాను ... సూర్యోదయం లోపల— గుర్తుందిగదా?" అంటూ శిథిలాలయ పూజారి పాకలోంచి బయటికి నడిచి, చీకట్లో కలిసిపోయాడు.

పూజారి పోగానే శివాలుడు, గండుపోతుతో, "పోతూ! మొత్తం మీద యీ పూజారి దుర్మార్గుడు మన మీద విజయం సాధించాడు. నాగుమల్లి ప్రాణం కన్న ఆ తాళపత్రాలేమీ ఎక్కువ కాదు. కాని, నా పూర్వ యజమాని పుత్రుడు ప్రాణప్రదంగా నా దగ్గిరకు పంపిన వాటిని కాపాడలేకపోయానే అన్న విచారం నాకు కలుగుతున్నది," అంటూ వాకిలి పక్కగా నిలబడి వున్న విక్రమకేసరి కేసి తిరిగి, "కేసరీ! నీ అభిప్రాయం ఏమిటి? ఇంతవరకూ నువ్వు ఒక్కగానొక్క మాట కూడా మాట్లాడలేదు," అన్నాడు.

"పెద్దలు మీరంతా సంప్రతించుకుంటున్నప్పుడు, నేను మధ్యలో కల్పించు





కోపటం బావుండదని పూరుకున్నాను. నాగుమల్లిని రక్షించేందుకు, ఆ తాళపత్రాలను పూజారి పరం చెయ్యటం ఒక్కటే మార్గంగా నాకూ తోస్తున్నది. ఒకసారి నాగుమల్లి సురక్షితంగా మనను చేరింతరవాత, తాళపత్రాలను తిరిగి సంపాయించేందుకు పూజారిని వేటాడవచ్చు," అన్నాడు విక్రమకేసరి.

"కుర్రవాడివైనా, చాలా వివేకమైన మాట చెప్పావు," అని శివాలుడు విక్రమకేసరిని మెచ్చుకుని, తన అనుచరులైన శబరులతో, వెంటనే కుంభారమిట్టపల్లెలోని తన యింటికి వెళ్ళి, తాళపత్రాలను తీసుకు రమ్మని చెప్పాడు.

ఈలోపల శిథిలాలయ పూజారికి గుర్రాన్ని అమ్మమని చెప్పిన దొంగ లిద్దరినీ అనుసరించిపోయిన శిఖిముఖి, అరణ్యంలో వాళ్ళుండే ఇంటిని చేరుకున్నాడు. దొంగ లిద్దరూ తలుపు తట్టగానే అది తెరుచుకున్నది. శిఖిముఖి ఇంటి నానుకుని వున్న చెట్ల చాటునుంచి కిటికీలో కుండా లోపలికి చూశాడు. లోపల కాగడాల వెలుగులో మరిద్దరు దొంగలు అతడి కంటబడ్డారు. నాగుమల్లి గోడ పక్కగా వున్న ఒక కొయ్య బల్ల మీద కూర్చుని వున్నది. ఆమె చేతులు రెండూ తాళ్ళతో బంధించబడి వున్నవి.

ఆ దృశ్యం చూస్తూనే శిఖిముఖి కోపంతో నిలువెల్లా కంపించి పోయాడు. ఓ క్షణం అతడు తలుపు తోసుకుని లోపలికి పోయి దొంగల్ని హతమార్చా లనుకున్నాడు. కాని, మరుక్షణంలో అతడు ఆ ప్రయత్నం తనకే కాక, నాగుమల్లికి కూడా ప్రమాదకారణం అవుతుందని గ్రహించాడు. ఇప్పుడు తను చేయవలసింది కొండ లోయలోకి సాధ్యమైనంత త్వరగా పోయి, విక్రమకేసరినీ మరి కొందరినీ వెంటబెట్టుకుని వచ్చి, ఇంటిని చుట్టుముట్టి పూజారి అనుచరుల్ని హతమార్చి, నాగుమల్లిని విడిపించుకు పోవటం....



శిఖిముఖి యిలా ఆలోచించేంతలో అతడికి పూజారి ఎక్కడ అన్న ప్రశ్న ఎదురైంది. వాడూ, వాడి బంటు సవరభేరుండం ఎక్కడికి పోయారు? ఒకవేళ పూజారి, నాగుమల్లిని దొంగల పరం చేసి, తాను తన బంటుతో బ్రహ్మపుత్రానదీ ప్రాంతాలకు తిరిగి ప్రయాణమయ్యాడా?

ఆలోచిస్తూ కాలం వృథాపుచ్చటం మంచిది కాదనుకుంటూ శిఖిముఖి కిటికీ నుంచి యివతలికి వచ్చి, పొదల చాటున నక్కుతూ, అరణ్యం కేసి పోయే కాలిబాట మీదికి వచ్చాడు. హఠాత్తుగా అతడికి గుర్రపు గిట్టల సవ్వడి వినిపించింది. శిఖిముఖి చప్పున దారికి పక్క నున్న పొదల చాటుకు పోయాడు. అంతలో ఒక చెట్టు చాటు నుంచి సవరభేరుండం పరిగెత్తుకుంటూ వచ్చి, "ఎవరక్కడ? పొదల చాటున దాగిందెవరు? బయిటికి వచ్చెయ్యండి!" అంటూ కేక పెట్టాడు.

శిఖిముఖి ప్రమాదాన్ని గుర్తించి, అక్కణ్ణించి మరి కొంచెం దూరంగా కదిలేంతలో శిథిలాలయ పూజారి గుర్రం మీద వేగంగా అక్కడికి వస్తూ, "ఎవడూ, భేరుండమా? ఏమిటా కేకలు? శత్రువులకు మన నివాసం తెలియపరచా లనుకుంటున్నావా?" అన్నాడు కోపంగా.

"కాదు, పూజారిదేవా! పొదల్లో ఏదో అలికిడయింది!" అన్నాడు భేరుండం తడబడుతూ.

"ఆ అలికిడేదో నీ బుర్రలో అయింది. వద్దంటే మళ్ళీ అతిగా తాగుతున్నావ్. సరే, ఆ అలికిడికి కారణం ఏమిటో చూసి, త్వరగా రా," అంటూ పూజారి గుర్రాన్ని ఇంటి కేసి దౌడు తీయించాడు.

సవరభేరుండం చేతిలో వున్న ఈటెను ఝళిపిస్తూ, శిఖిముఖి దాగివున్న పొదల కేసి అడుగులో అడుగు వేసుకుంటూ బయలుదేరాడు. —(ఇంకా వుంది)





18

[నాగుమల్లిని ఎత్తుకుపోయిన శిథిలాలయ పూజారి, ఆమెను విడిచి పుచ్చేందుకు, శివాలుణ్ణి తాళపత్రగ్రంథం మూల్యంగా చెల్లించమన్నాడు. శివాలుడు అందుకు అంగీకరించాడు. దొంగలువున్న చోటుచూసి శిఖిముఖి తిరిగి వస్తూండగా, అలికిడి విన్న సవరభేరుండం, ఈటెను ఝళిపిస్తూ అతడి పైకి రాసాగాడు. తరవాత—]

శిఖిముఖి క్షణాల మీద తను ఏమి చెయ్యటం క్షేమమో ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. సవర భేరుండాన్ని వెనక నుంచి వెళ్ళి తలమీద బలంగా ఒక దెబ్బ కొట్టి చడీ చప్పుడూ లేకుండా చంపెయ్యవచ్చు. కాని, అందువల్ల పూజారి ముఠా తమ రహస్య నివాసం శత్రువులకు తెలిసిపోయిందని, నాగుమల్లిని మరొక చోటుకు ఎత్తుకుపోయి దాయవచ్చు...

ఇలా ఆలోచించిన శిఖిముఖి, సవర భేరుండం కంట బడకుండా పారిపోయేందుకు ఒక ఎత్తు వేశాడు. అతను దాగివున్న పొదల్లో నుంచి దాపుల నున్న మరికొన్ని పొదల కేసి నాలుక్కాళ్ళ మీద నడుస్తున్న జంతువులా కుప్పించి దూకుతూ, చిరుత గండు కోపంతో అరిచినట్టు పెద్దగా గర్జన చేశాడు. ఆ ధ్వని వింటూనే సవరభేరుండం బెదురుకుని తక్కున ఆగిపోయి, వెనక్కి



ఒక్కొక్క అడుగే వేస్తూ, "చిరుతగండా! ఏదో మనిషనుకున్నాను," అన్నాడు భయం వల్ల వణుకుతున్న గొంతుతో.

భేరుండాన్ని యింత తేలిగ్గా మోసగించ గలిగినందుకు సంతోషపడిపోతూ, శిఖిముఖి మరింత బిగ్గరగా అరుస్తూ, పొదల చాటు నుంచి మహా వృక్షాలున్న అరణ్యంలోకి పరిగెత్తాడు. బయట అడవి జంతువు అరవటం వింటూనే, ఇంట్లోకి పోయిన శిఖి తాలయ పూజారి, ధొంగల్లో యిద్దర్ని సవర భేరుండానికి సాయం వెళ్ళమని చెప్పాడు.

ఆ దొంగ. లిద్దరూ కత్తులూపుకుంటూ, "ఎక్కడ చిరతపులి? ఎక్కడ?" అంటూ



సవర భేరుండం వున్న పొదల దగ్గిరకు పరిగెత్తుకు వచ్చారు.


సవర భేరుండం అప్పటికి తేరుకుని, పెద్దగా నవ్వుతూ, "ఇంకెక్కడి చిరత? అది నా మీదికి దూకబోయే సమయంలో ఈ బెతో గట్టిగా ఒకే పోటు పొడిచాను. ఆ దెబ్బకు వెల్లకిలా పొదల్లో పడి లేచి అరణ్యం కేసి దౌడు తీసింది," అన్నాడు.

"భేష్, సాహసంలో, తెగువతనంలో మాతో సరితూగ్గలవాడివి. ఇక రా. పూజారి దొర నీ కేదో ప్రమాదమైన పని ఒప్ప చెప్ప బోతున్నాడు," అన్నాడు దొంగల్లో ఒకడు.

"ప్రమాదమైన పనా? ఉహూఁ, నాకేం భయం లేదు. ధొర ఆజ్ఞాపిస్తే, అలా ఆకాశంలోకి ఎగిరిపోగలను. నేను మానవ గండభేరుండాన్ని, తెలుసుగా!" అన్నాడు సవరభేరుండం.

"ఆ సంగతి మాకు తెలుసు. తెలియని వాళ్లు నువ్వేదో హెచ్చులు మాట్లాడు తున్నావనుకుంటారు. పూజారి దొర మంత్ర శక్తికి తిరుగేమిటి?" అన్నాడు దొంగల్లో రెండోవాడు.

"ఏవిఁటా చచ్చు కబుర్లు? భేరుండాన్ని చిరుతపులి పీక కొరికి ఎత్తుకు పోలేదు, నయం! వాడు బాగా మైకంలో వున్నట్టు



న్నాడు. వాగుడు కట్టి పెట్టి రమ్మనండి," అంటూ శిథిలాలయ పూజారి కేకపెట్టాడు.

సవర భేరుండాన్ని యింత తేలిగ్గా మోసం చేసి అరణ్యంలోకి పారిపోయిన శిఖిముఖి అతి వేగంగా లోయలోకి పరిగెత్తాడు. అక్కడ అతడు దివిటీల వల్ల లోయ అంచున వున్న ఇంటిని గుర్తించి, అక్కడికి చేరేసరికి, శివాలుడూ, సవర గండుపోతూ—అందరూ కనిపించారు. శిఖిముఖి వాళ్ళకు, నాగుమల్లి బంధించబడి వున్న ఇంటిని గురించి చెప్పి, దాన్ని చుట్టుముట్టితే, ఆమెను రక్షించటమే గాక, శిథిలాలయ పూజారిని కూడా పట్టుకుని బంధించవచ్చని తెలియపరిచాడు.

శివాలుడు తన కొడుకు చెప్పినట్టు చేయటమే సరిఅయిన మార్గం అని సవర గండుపోతుతో సంప్రతించి నిర్ణయించాడు. తండ్రి ద్వారా శిఖిముఖి, పూజారి తాళపత్రాలున్న సంచీని వేలాడకట్టమన్న రావిచెట్టు సంగతి విన్నాడు. అతడు ముందు జాగ్రత్తగా, ఆ రావిచెట్టు ప్రాంతాల కాపలాకోసం ఇద్దరు శబరయువకుల్ని పంపాడు.

ఆ తర్వాత ధైర్యసాహసాలు గల పది మంది శబర యువకుల్నీ, విక్రమకేసరినీ వెంటబెట్టుకుని శిఖిముఖి, శిథిలాలయ



పూజారివున్న ఇంటి కేసి వేగంగా ప్రయాణమయాడు. అరగంట తరవాత ఆ ఇంటి ప్రాంతాన్ని చేరేసరికి శిఖిముఖికి, యీ సారి ఇంటి ముందున్న పొదల ప్రాంతాల దొంగల్లో ఒకడు అటూ యిటూ గస్తీ తిరుగుతూండటం కనిపించింది, కిటికీలోంచి దీపకాంతి బయటికి పడుతున్నది.

ఆ గస్తీవాణ్ణి చూస్తూనే శిఖిముఖికి, పూజారి ఏదైనా ప్రమాదాన్ని శంకించాడా అన్న అనుమానం కలిగింది. వాడు బహు టక్కరి. నాగుమల్లిని మరోచోటుకు ఎత్తుకుపోలేదు గదా అన్న భయం కలిగిందతడికి. ఏది ఏమైనా ముందు ఇంటిని చుట్టు



ముట్టాలి. శిఖిముఖి, విక్రమకేసరితో తాను చేయబోయే పని గురించి చెప్పాడు. గస్తీ వాడు ముందుగా హెచ్చరిస్తే, ఇంట్లో వున్న శత్రుమూక అంతా పారిపోయే ప్రమాదం వున్నది. కనక గస్తీవాణ్ణి కిక్కురుమనకుండా తుదముట్టించాలి.

శిఖిముఖి అనుచరుల్ని అంత దూరాన వదిలి పొదల వెనగ్గా పాకుతూ పోయి, గస్తీవాడు తానున్న పొద పక్కగా నడిచే సమయంలో వెనకనుంచి కత్తిపిడితో బలంగా నెత్తిమీద కొట్టి, వాడు కింద పడబోయే సమయంలో అరవకుండా వుండేందుగ్గాను గొంతు పట్టుకోబోయాడు. కాని, దొంగ దెబ్బ తిని ముందుకు తూలి పడబోతూనే పెద్దగా చావుకేక పెట్టాడు.

ఆ కేక వింటూనే ఇంట్లో వున్న శిథిలాలయ పూజారి ప్రమాద మేదో ముంచుకు వస్తున్నదని గ్రహించి, సవర భేరుండంతో, "ఒరే, భేరుండం! మనం తక్షణం యీ ఇల్లు వదిలి పోవాలి. నా వెంట పరిగెత్తుకు రా!" అంటూ ఇంటికి వెనకవైపు నున్న వాకిలి తెరుచుకుని, దాపుల నున్న అరణ్యం కేసి పరిగెత్తాడు.

శిఖిముఖి గస్తీ దొంగ కేక పెట్టగానే తాను వేసిన పథకం చెడిందని గ్రహించి, తన అనుచరుల్ని ఇంటిని చుట్టు ముట్టమని హెచ్చరించాడు. విక్రమకేసరీ, శబర సవర యువకులూ ఇల్లు చుట్టుముట్టారు. శిఖిముఖి ఇంటి ముందు ద్వారం నుంచి, విక్రమకేసరి వెనక వైపు నున్న ద్వారం నుంచీ కత్తులు ఝళిపిస్తూ లోపలి కడుగు పెడుతూనే, "అందరూ లొంగి పొండి. ఎదురు తిరిగారో ప్రాణాలు దక్కవు, జాగ్రత్త!" అన్నారు.

కొయ్యబల్ల మీద కూర్చుని వున్న నాగుమల్లి వాళ్ళిద్దరి కేసీ వింతగా చూస్తూ, "భలే తెలివైన వాళ్ళు. మీరు పట్టుకోదలిచిన పూజారి వెధవ భేరుండంతో యింతకు



ముందే పారిపోయాడు. అదుగో, ఆ మూల వున్న ముగ్గురు సోమరి వెధవలూ మాంచి కైపుతో కళ్ళు మూశారు. భూకంపం వచ్చి ఇల్లు కూలినా లేవరు," అన్నది.

శిఖిముఖి, నాగుమల్లిని సమీపించి మౌనంగా ఆమె కాలి చేతి కట్లను విప్ప సాగాడు. విక్రమకేసరి అతడి దగ్గిర కొచ్చి, "ఏం, శిఖీ! ఆ పూజారి దుర్మార్గుణ్ణి వెంబడించే ప్రయత్నం చేయొద్దా? వాడు మరోసారి మనందరినీ మోసగించి పారిపోయాడు," అన్నాడు.




"వాడు రోజులు మూడిననాడు గాని మన చేతబడడు. ఈ గుడ్డి వెన్నెల్లో వాణ్ణి యీ మహారణ్యంలో ఎక్కడని వెతుకుతాం? మనకు అనవసర శ్రమ తప్ప ఫలితం వుండదు. ఇదిగో, యీ గండుపోతు కూతుర్ని తండ్రికి ఒప్ప చెపితే, మన బాధ్యత తీరిపోతుంది. ఆ తరవాత మనం నిశ్చింతగా మీ తాతగారిని గురించి తెలుసుకునేందుకూ, ఆ శిథిలాలయ రహస్యం ఏమిటో కనుక్కునేందుకూ బ్రహ్మపుత్రా నదీ ప్రాంతాలకు పోదాం," అన్నాడు శిఖిముఖి.

నాగుమల్లి కట్లు వూడతీయగానే లేచి నిలబడబోయి, రక్తప్రసారం సరిగా జరగక కాళ్ళు చచ్చు పడటంతో తిరిగి బల్లమీద కూర్చుంటూ, విక్రమకేసరితో, "ఈ శబర కుర్రాడికి ఆ శిథిలాలయ పూజారి ఎంత జిత్తులమారో యింకా తెలిసినట్టు లేదు. వాడు మీకంటె ముందుగా ఆ బ్రహ్మపుత్రా లోయల్లోని శిథిలాలయాన్ని చేరతాడు," అన్నది.

"అక్కడికి వెళ్ళేందుకు అవసరం అయిన దారి గుర్తులూ అవీ వున్న పటం గల తాళపత్రాలు మా దగ్గిర వున్నవి. ఆ దారేదో తెలుసుకునేందుకే పూజారి ఆ తాళపత్రాల కోసం యింతగా తెగించి ప్రయత్నించాడు. అవి జన్మలో వాడిచేత బడవు," అన్నాడు శిఖిముఖి.







తలలు నరక బోతున్నట్టు చెప్పాడు. దొంగలు ముగ్గురూ అతడి కాళ్ళా వేళ్ళా పడుతూ, "ఆ పూజారి దుర్మార్గు డిచ్చిన డబ్బంతా నీ కిస్తాం. మమ్మల్ని ప్రాణాలతో వదులు," అన్నారు.


"ఏదీ, ఆ డబ్బు చూపండి?" అన్నాడు శిఖిముఖి.

దొంగలు ఒకరి ముఖాలొకరు చూసుకుని, చుట్టూ కలయచూడసాగారు. వాళ్ళెవరి కోసం చూస్తున్నారో గ్రహించిన శిఖిముఖి, "నాలుగోవాడి కోసం చూస్తున్నారా? వాడు కూడా వస్తేగాని, ఆ దాచిన డబ్బు బయటికి తీయటానికి లేదన్న మాట! సరే, బహుశా వాడీపాటికి నరకంలో వుండి వుంటాడు. వాడివంతు డబ్బు కూడా మీరే పంచుకుని, ఎక్కడనైనా యింత పొలం కొనుక్కుని సన్మార్గంలో బతకండి. దొంగల్లా మళ్ళీ ఏనాడైనా నా కంట బడ్డారో, ఆ క్షణానే మీ ప్రాణాలు తీస్తాను," అన్నాడు.

అంతలో గది మూల నిద్రపోతున్న దొంగల్లో ఒకడు పెద్దగా ఆవులిస్తూ కళ్ళు తెరిచి, శిఖిముఖి వాళ్ళను చూసి, భయంతో కంపించి పోతూ తోటి వాళ్ళను నిద్ర లేపా లని చూశాడు. కాని వాళ్ళు కదల లేదు. శిఖిముఖి వాళ్ళను సమీపించి కత్తిపిడితో ఒక్కొక్కళ్ణీ పొడుస్తూ, "ఇక లేవండి. మీ యజమాని పారిపోయాడు. మీ ముగ్గురి తలలూ రావిచెట్టుకు వేళ్ళాడ గట్ట బోతున్నాను," అన్నాడు.

తతిమ్మా యిద్దరు దొంగలూ కళ్ళు తెరుస్తూనే, శిఖిముఖిని చూసి అదురుకు పోయారు. శిఖిముఖి మరోసారి వాళ్ళకు

శిఖిముఖి వెంట నాగుమల్లీ తతిమ్మా అనుచరులూ ఇంటి బయటికి వచ్చారు. విక్రమకేసరి, శిఖిముఖితో, "శిఖీ! పూజారికీ, దొంగలకూ ఆశ్రయం అయిన యీ ఇంటిని యిలా వుండ నివ్వటం నా కిష్టం లేదు. వాళ్ళు మరోసారి యిక్కడ చేరి దుర్మార్గ



కార్యాలు చేయవచ్చు. దీనికి నిప్పుపెట్టటం మంచిది," అన్నాడు.

శిఖిముఖి, "నీ యిష్టం," అంటూ తల వూపాడు. విక్రమకేసరి ఇంట్లోకి పోయి వెలుగుతున్న దివిటీ తీసుకుని బయిటికి వచ్చి, ఇంటి నాలుగు పక్కలా దానితో అంటించాడు. చూస్తూండగానే పెద్ద మంటలు లేచినై. శిఖిముఖీ అతడి అనుచరులూ సంతోషంగా చప్పట్లు చరుస్తూ లోయ కేసి బయలుదేరారు. చచ్చినవాడు చావగా మిగిలిన ముగ్గురు దొంగలూ, కాలే ఇంట్లో నుంచి తమకు పనికి వస్తవనుకున్న కొయ్యబల్లలూ, వంటపాత్రలూ హడావిడిగా బయటికి తెచ్చుకోసాగారు.

లోయ సమీపంలో వున్న పూరిపాక దగ్గిర తిరిగి అంతా కలుసుకున్నారు. సవరగండుపోతు తన కుమార్తెను చూసి పొందిన ఆనందం అంతా యింతా కాదు. అతడు నాగుమల్లిని బుజ్జగిస్తూ, "నిన్నా పూజారి కుక్క ఉత్తరాదికి ఎత్తుకు పోయాడే అనుకున్నాను. అదృష్టం కొద్దీ దొరికావు. ఆ పిచ్చికుక్కగాణ్ణి ఏదో విధంగా పట్టుకుని కండకు కండ కోసి కాకులకూ గద్దలకూ వెయ్యకపోతే నేను గండుపోతునే కాదు," అన్నాడతను.



శివాలుడు చిరునవ్వు నవ్వుతూ, "గండుపోతూ, మనం యిలాంటి ప్రతిజ్ఞలు చేసి నెరవేర్చుకోగలిగిన స్థితిలో లేం, పెద్దవాళ్ళ మయి పోయాం. శిఖిముఖీ, విక్రమకేసరీ ముందుగా శూరసేనదేశం వెళ్ళి, విక్రమకేసరి తండ్రిగారితో మాట్లాడి బహుశా అక్కణ్ణించి బ్రహ్మపుత్రా నదీలోయ ప్రాంతాలకు వెళతారు. ఒకవేళ వాళ్ళకు తిరిగీ ఆ శిథిలాలయ పూజారి నని చెప్పుకునే దుష్టుడు ఎదురైతే, తప్పక వాణ్ణి నీ కోసం కాళ్ళూ చేతులూ కట్టి తీసుకు వస్తారు. అప్పుడు నువ్వు వాణ్ణి చిత్రహింసలకు గురిచెయ్యవచ్చు," అన్నాడు.

శివాలుడి మాటలకు అందరూ వినోదంగా నవ్వారు. తరవాత సూర్యోదయం అవుతూనే శివాలుడూ, గండుపోతూ తమవాళ్లను వెంటబెట్టుకుని తిమ్మగూడెం చేరారు. అక్కడ ఆ పగలూ, రాత్రీ వినోదాలతో, విందులతో కాలంగడిపి శివాలుడు మర్నాటి ఉదయం తన కుంభారమిట్ట పల్లెకు బయలుదేరాడు. అతడు ప్రయాణమయే సమయంలో నాగుమల్లి, శిఖిముఖిని ఒక పెద్ద చెట్టు చాటుకు పిలిచి, తనను కాళ్లూ చేతులూ కట్టి హింస పెట్టిన శిథిలాలయ పూజారి శిక్ష కావాలన్నది.

"వాడు మాకు ఆ లోయల్లో తటస్థపడాలే కాని, వాడి తలే నరికి తెచ్చి నీ కిస్తానని వాగ్దానం చేస్తున్నాను. కాని, తిరిగి రావటానికి ఎంతకాలం పడుతుందో చెప్పలేను. ఈ లోపల నువ్వు మరొక సవరవాడి పెళ్ళాం అయిపోతే, వాడు నా మీద ఈటె ఎత్తుతాడు," అన్నాడు శిఖిముఖి.


ఆ మాటలు నాగుమల్లికి కోపం, సిగ్గూ కూడా తెప్పించినై. ఆమె తలవంచుకుని నేల చూపులు చూస్తూ, "నన్ను సవరవాడు కాదు గదా, మరే శబరవాడు కూడా చేసుకోలేడు," అన్నది వణుకుతున్న కంఠస్వరంతో.

"అంటే....నాకేం తెలియటం లేదు," అంటూ శిఖిముఖి అమాయకంగా, నాగుమల్లి ముఖం కేసి చూశాడు.

నాగుమల్లి ఏదో చెప్పబోయింది, కాని అంతలో శివాలుడు పెద్దగా, "ఊఁ, యిక అందరూ బయల్దేరండి. శిఖిముఖి ఎక్కడ?" అన్నాడు.

నాగుమల్లి చప్పున కదిలి ఇంటి కేసి పరిగెత్తింది. ఎర్రగండు అరుస్తూ శిఖిముఖి దగ్గిరకు వచ్చింది. శిఖిముఖి దాని తల నిమిరి నాగుమల్లి అన్న మాటల్లోని భావమేమిటా అని ఆలోచిస్తూ తండ్రి దగ్గిరకు బయలుదేరాడు. —(ఇంకా వుంది)






19

[శిఖిముఖీ, విక్రమకేసరీ తమ అనుచరులతో శిథిలాలయ పూజారి వున్న ఇంటిని చుట్టుముట్టి నాగుమల్లిని బంధవిముక్తురాల్ని చేశారు. పూజారి, నవరభేరుండంతో అరణ్యంలోకి పారిపోయాడు. నాగుమల్లి, శిఖిముఖితో అతడు బ్రహ్మపుత్రా నదీ లోయల నుంచి తిరిగివచ్చేవరకూ తాను పెళ్ళాడబోవటం లేదని చెప్పింది. తరవాత—]

శివాలుడు తన అనుచరులందరినీ వెంట బెట్టుకుని మధ్యాహ్నం వేళకు కుంభార మిట్టపల్లె చేరాడు. తాను పల్లెలో లేని సమయాన శిథిలాలయ పూజారి పల్లెపై ఏదైనా అఘాయిత్యం చేసివుండవచ్చునన్న భయం అతణ్ణి దారి పొడుగునా బాధించింది. కాని పల్లె చేరుతూనే అలాంటి ఉపద్రవం ఏమీ జరగలేదని తెలిసి, అతడు చాలా సంతోషించాడు.

ఇన్నాళ్ళకు శివాలుడికి, విక్రమకేసరి తండ్రి జయపాలుడు తనకు పంపిన తాళపత్రాలు తీరిగ్గా చదివిచూసే అవకాశం దొరికింది. జయపాలుడి తండ్రి విక్రమకేసరి రెండవసారి బ్రహ్మపుత్రా లోయలకు ఎందుకు వెళ్ళటం జరిగిందో, వాటిల్లో అతడికి సూచనప్రాయంగా వున్న కొన్ని స్థలాల పేర్ల ద్వారా అర్థమైంది. అతడు యీ రెండవ యాత్ర పెట్టుకున్నది, బ్రహ్మ



పుత్రానది లోని అసంఖ్యాకమైన లంకల్లో ఒకటైన వృశ్చికలంక చేరేందుకు. ఆ లంక మీదే శిథిలాలయం వున్నదని వాడుక. అందులో అంతులేని ధనకనకాలే కాక, వెలలేని శిల్పసంపద కూడా వున్నదని చెపుతారు. విక్రమకేసరి ఆ ధనాన్నీ, వీలయితే అపూర్వకళాఖండాలుగా చెప్పబడే శిల్పాలనూ తీసుకువచ్చి తన రాజభవనాన్ని అలంకరింప చేయాలనుకున్నాడు.

తాళపత్రాల్లో విక్రమకేసరి ఆ శిథిలాలయాన్ని చేరేందుకు తనకు తెలిసిన వర్తమానమంతా రాశాడు. ఆ దేవాలయం ఇభ్యు లనబడే ఆటవికులు కొన్ని వందల



సంవత్సరాల క్రితం నిర్మించినది. ప్రకృతి వైపరీత్యాలవల్లా, బ్రహ్మపుత్ర వరదల వల్లా, ఆ లంక చుట్టుపక్కల చాలా ప్రాంతం జలమయం అయిపోయి, కొన్నేళ్ళుగా ఆ దేవాలయం వున్న లంక ఎక్కడున్నదో కూడా ఎవరికీ తెలియకుండా పోయింది. కాని, ఇభ్యుజాతి వాళ్ళలో కొందరు వృద్ధులకు మాత్రం ఆ శిథిలాలయం వున్న లంకను గురించిన సమాచారం కొంతలో కొంత తెలుసునన్న వాడుక వున్నది.


శివాలుడు, వందల సంఖ్యలో వున్న తాళపత్రాల్లో అక్కడా యిక్కడా వున్న శిథిలాలయానికి సంబంధించిన విషయాన్ని విక్రమకేసరికి చెప్పి, "కేసరీ, మీ తాతగారైన విక్రమకేసరి దొర యింకా సజీవుడే అన్న నమ్మకం నాకు లేదు. ఆయన వయసులో నా కన్న చాలా పెద్ద. అంతే కాక ఆ లోయల్లో ఒంటరిగా తిరుగుతూ విషజ్వరాలకూ వాటికీ గురై యింతకాలం సజీవుడై వుంటాడని నేననుకోను. ఏమైనా, సంగతి మీ నాయనగారితో చెప్పు. ఆయన ఆ ప్రాంతాలకు వెళ్ళితీరాలంటే మనం చేయగలిగిందేమీ లేదు. నీకు తోడుగా శూరసేనదేశం వరకే గాక, ఆ బ్రహ్మపుత్రా

నదీ లోయలకు కూడా నా కొడుకు శిఖి ముఖిని పంపుతున్నాను," అన్నాడు.

విక్రమకేసరి, శివాలుడికి కృతజ్ఞత తెలియపరిచాడు. మర్నాటి ఉదయం అతడు శిఖిముఖిని వెంటబెట్టుకుని తన దేశానికి బయలుదేరాడు. దారిలో దొంగల బెడదగాని, శిథిలాలయ పూజారి నుంచి ఏమైనా ఆపదగాని రావచ్చునన్న అను మానంతో శివాలుడు వారి వెంట దృఢ కాయులైన యిద్దరు శబరయువకుల్ని అంగరక్షకులుగా పంపాడు.


మార్గమధ్యంలో ఎలాంటి చిక్కులకూ గురి కాకుండానే పక్షం రోజుల తరవాత శిఖిముఖీ, విక్రమకేసరీ శూరసేనదేశం చేరారు. జయపాలుడు విక్రమకేసరి ద్వారా సంగతి సందర్భాలన్నీ తెలుసుకుని, ఎంత ప్రమాదంతో కూడిన కార్యం అయినా సరే, తాను తప్పక బ్రహ్మపుత్రానదీ లోయ లకు పోయి, తన తండ్రి సజీవుడో కాదో అన్న సంగతి తెలుసుకు తీరాలన్నాడు.

జయపాలుడి ఆలోచనకు మంత్రీ, యితర రాజోద్యోగులూ అభ్యంతరం చెప్పారు. ఇటువంటి కష్టసాధ్యమైన పనికి యువకుడే తగినవాడనీ, ఈ వయసులో జయపాలుడు అంత దూరప్రయాణానికి



పూనుకోవటం క్షేమంకాదనీ సలహా యిచ్చారు. వారి సలహాను పాటించి జయ పాలుడు తన కొడుకైన విక్రమకేసరి పైన యీ కార్యభారం పెట్టాడు.

ప్రయాణానికి అవసరం అయిన ఏర్పా ట్లన్నీ ఒక వారం రోజుల్లో పూర్తయినై. విక్రమకేసరీ, శిఖిముఖుల వెంట రక్షణగా జయపాలుడు సుశిక్షితులైన ఇద్దరు క్షత్రియ యువకుల్ని పంపేందుకు ఏర్పాటు చేశాడు. అందరూ ఒకనాటి ప్రాతఃకాలాన బ్రహ్మ పుత్రానదీ లోయలకు ప్రయాణం అయారు. బయలుదేరే ముందు జయపాలుడు శిఖి ముఖిని ఆప్యాయంగా కౌగలించుకుని,



అతడి మెడలో ఒక రక్షరేకు కట్టాడు. అది జయపాలుడికి తన తండ్రి నుంచి లభ్యమయిన తాళపత్రాలు గల పెట్టెలో దొరికింది. దాని మీద కాళీమాత రూపం చెక్కబడి వున్నది.

శిఖిముఖీ, విక్రమకేసరులు తమ యిద్దరు సహచరులతో నాలుగైదు నెలల కాలం అరణ్యాల్లో, కొండల్లో ప్రయాణించి, చిన్నాపెద్ద నదులను అనేకం దాటి చివరకు కామాఖ్యపురం చేరారు. అక్కడ కొద్ది రోజులపాటు విశ్రాంతి తీసుకుని తరవాత దారిచూపే వాణ్ణెవణ్ణయినా కుదుర్చుకుని ఇఖ్యుజాతి వాళ్ళుండే ప్రాంతం చేరాలని వాళ్ళు నిర్ణయించుకున్నారు. తాత విక్రమకేసరి యీ జాతివాళ్ళు నివసించే ప్రాంతాల కొంతకాలం వున్నట్టు శూరసేన దేశపు పండితుడు జయపాలుడికి లోగడ చెప్పి వున్నాడు.

విక్రమకేసరీ అతడి అనుచరులూ కామాఖ్యపురం చేరి, ఒక సత్రంలో బస చేశారు. ఆ సమయాన పట్టణంలో దేవీ ఉత్సవాలు జరుగుతున్నవి. అవి చూసేందుకు చుట్టుపక్కల పదీ పన్నెండు కోసుల దూరం నుంచి కూడా జనం వస్తున్నారు. వీళ్ళల్లో అనేక తెగలవాళ్ళూ, జాతుల వాళ్ళూ వున్నారు. బ్రహ్మపుత్రా నదీ లోయల్లో దారి చూపేందుకు నమ్మకస్థుడైనవాడి కోసం వెతకటానికి యిది మంచి అదనుగా శిఖిముఖికి తోచింది. అతడు విక్రమకేసరినీ, తతిమ్మా యువకుల్నీ వెంటబెట్టుకుని ఉత్సవం జరుగుతున్న ప్రాంతానికి బయలుదేరాడు. వీధులకు యిరువైపులా చిన్నచిన్న దుకాణాలు అనేకం వాళ్ళ కంటబడినై. ఆ దుకాణాల్లో ఏనుగు దంతంతో చేసిన రకరకాల వస్తువులూ, పాలరాతితో చెక్కిన విగ్రహాలూ, జంతు చర్మాలతో తయారైన సామగ్రులూ అమ్ముతున్నారు.




నలుగురు యువకులూ ఆ దుకాణాల్లోని విచిత్ర వస్తువులను చూస్తూ ముందుకు కదిలారు. వాళ్ళకు ఒక వీధి మలుపున ఏనుగుచర్మాలు పరుచుకుని వాటి మీద మానవాస్థికలు పెట్టుకు కూర్చున్న ఒక జ్యోతిష్యుడు కనిపించాడు. పెద్ద గడ్డం, జడలు కట్టిన తల వెంట్రుకలతో, ముఖాన ఎర్రని పెద్ద కుంకంబొట్టుతో, అతడు చూపరుల్ని బాగా ఆకర్షిస్తున్నాడు.

శిఖిముఖీ వాళ్ళూ అతడి కేసి ఓ క్షణ కాలం చూసి ముందుకు కదలబోయేంతలో, జ్యోతిష్యుడు "శూరసేనదేశపు కేసరీ, ఆగు! ఒక్క మాట," అన్నాడు పెద్దగొంతుతో.

తనను ఆ విధంగా పేరుపెట్టి పిలిచిన జ్యోతిష్యుడి కేసి ఆశ్చర్యంగా చూస్తూ విక్రమకేసరి నిలబడ్డాడు. జ్యోతిష్యుడి చేత సాముద్రికం చెప్పించుకుంటున్న కొందరు విక్రమకేసరినీ, అతడి వెంటవున్న వాళ్ళనూ పరీక్షగా చూడసాగారు.

శిఖిముఖి జ్యోతిష్యుడి కేసి రెండడుగులు వేసి, "అయ్యా, చేయి చూసి మనుషుల పేర్లు చెప్పే జ్యోతిష్యుల్ని కొందరిని నే నెరుగుదును. కాని, మీరు మనిషి ముఖం చూసి పేరూ వూరూ తెలుసుకోగలిగారు. లోగడ మా ప్రాంతాల ఏమన్నా వున్నారా?" అని అడిగాడు.





జ్యోతిష్యుడు వికవిక మంటూ నవ్వి, "నేను అఘోరీ జ్యోతిశ్శాస్త్ర పండితుణ్ణి, శిఖీ! భూతభవిష్యత్ వర్తమానాలు అన్నీ వున్నపాళంగా చెప్పగలను. మీరిక వచ్చిన దారినే ఇంటికి తిరిగిపొండి. వృద్ధ విక్రమ కేసరి బతికిలేడు. పైగా మీరు వెయ్యేళ్ళ వయసు గల మహాశక్తిమంతుడితో విరోధం తెచ్చుకున్నారు. సాహసించి బ్రహ్మపుత్రా నదీ లోయల్లోకి పోయారో మీరు బల వన్మరణం పొందుతారు," అన్నాడు.

ఆ మాటలు వింటూనే విక్రమకేసరి కత్తి దూయబోయాడు. శిఖిముఖి అతణ్ణి వారించి చిన్నగొంతుతో, "కేసరీ! తొందర పడకు. మనం వున్నది దేశంకాని దేశం. ఈ కపట జ్యోతిష్యుడు శిథిలాలయ పూజారి మిత్రుడో సేవకుడో అయివుంటాడు. ఆ దుర్మార్గుడి ద్వారానే వీడు మనను గురించి విన్నాడు. అంటే దాని అర్థం, ఆ పూజారి యీ పట్టణంలోనే ఎక్కడో వున్నాడన్న మాట; మనను యిన్నాళ్ళుగా ఒక కంట కనిపెట్టే వున్నాడని తెలుస్తున్నది గదా!" అన్నాడు.

"అలాగే తోస్తున్నది. ఆ దుర్మార్గుడి పీడ విరగడైపోయిందనుకున్నాను. సరే, మనం యిక యీ జనంలో తిరగటం మంచిది కాదు. వాడి బంట్లు మనను చాటు నుంచి దెబ్బ తీయవచ్చు. మన విడిది సత్రంకు పోదాం పదండి," అన్నాడు విక్రమకేసరి.

నలుగురూ ఓ అర గంట తరవాత సత్రం దగ్గిరకు వచ్చేసరికి, సత్రం యజమాని వాళ్ళతో, "మీ గురువుగారు, మీరు విడిది చేసిన గదిలో వున్నారు. ఓ గంట కాలంగా మీ కోసం ఎదురు చూస్తున్నారు," అని చెప్పాడు.

సత్రం యజమాని యిలా అనగానే నలుగురూ ఎక్కడలేని ఆశ్చర్యం పొందారు. శిఖిముఖి సత్రం యజమాని కేసి అను

మానంగా చూస్తూ, "మాకు గురువంటూ ఎవరూ లేరు. వాడెవడో దొంగ అయి వుంటాడు. మేం దిగిన గది వాడికి చూపావా?" అని అడిగాడు.

సత్రం యజమాని కళవెళపడిపోతూ, "గది చూపాను. అతడు గొప్ప కాళీ భక్తుడిలా వున్నాడు. ఏదో గుడికి పూజారి ననీ, మీకు చాలా కాలంగా గురువుననీ చెప్పాడు," అన్నాడు.

"సరే, వాడి సంగతి మేం చూసు కుంటాం. మా గది వైపు నుంచి కేకలూ అరుపులూ వినిపించినా, ఓ అర గంట వరకూ అటు కేసి ఎవర్నీ రానీయకు," అంటూ శిఖిముఖి గబగబా మిద్దెపై నున్న తమ గది కేసి బయలుదేరాడు. విక్రమ కేసరీ, క్షత్రియయువకు లిద్దరూ అతడి వెనకనే నడిచారు.

విక్రమకేసరీ వాళ్ళు విడిదికని తీసు కున్న గది తలుపులు బార్లా తెరిచి వున్నవి. అందరికన్న ముందు నడుస్తున్న శిఖిముఖి గదిలో అడుగు పెడుతూనే శిథిలాలయ పూజారిని చూశాడు. పూజారి ఒక చిన్న కొయ్యపెట్టెను బద్దలు కొట్టేందుకు ఒక చురకత్తి పిడితో దాని మీద బలంగా కొడుతున్నాడు.



శిఖిముఖి వాకిట్లోకి రాగానే పూజారి తల ఎత్తి అతడి కేసి చూసి, వికృతంగా నవ్వుతూ, "శిఖీ, మంచి సమయానికే వచ్చావే! సరే, నువ్వూ నీ స్నేహితులూ గడప దగ్గిరే ఆగండి. ఈ తుక్కు పెట్టెను తెరిచేందుకు నా మంత్రశక్తిని వృథా చెయ్యటం ఎందుకని, యీ చురకత్తిని వాడుతున్నాను," అన్నాడు.

శిఖిముఖి గడప దగ్గిరే ఆగి, వెనక నిల బడివున్న క్షత్రియ యువకులైన అజితు డికీ, వీరభద్రుడికీ కనుసైగతో ద్వారాన్ని కాపలాకాయమని హెచ్చరించి, ముందుకు రెండడుగులు వేసి, "పూజారీ! ఆ పెట్టెలో



శిథిలాలయానికి పోయేందుకు అవసరం అయిన దారి గుర్తులు గల తాళపత్రం వున్నదనుకుంటున్నావా? ఉహుఁ, అది అక్కడ లేదు. ఇదుగో, కేసరి దాన్ని సర్వదా తన దుస్తుల్లో దాచుకు తిరుగుతున్నాడు. కొంచెం దగ్గిరకొచ్చి అడుగు, యిచ్చేస్తాడు," అన్నాడు.


విక్రమకేసరి తన దుస్తుల్లో నుంచి ఒక పెద్ద తాళపత్రం తీసి పూజారి కేసి రెపరెప లాడించాడు. పూజారి దాన్ని చూస్తూనే పళ్ళుకొరికి, "దాని కోసం అడగాలా? అడుగుతున్నాను; నోటితో కాదు కత్తితో!" అంటూ తన చేతులోవున్న చురకత్తిని విక్రమకేసరి కేసి విసిరాడు.

రానున్న ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన శిఖిముఖి, విక్రమకేసరిని భుజాలు పట్టుకుని కిందికి లాగాడు. చురకత్తి రివ్వుమంటూపోయి ద్వారబంధానికి బలంగా గుచ్చుకుపోయింది. శిఖిముఖి, పూజారిని పట్టుకునందుకు ముందుకు దూకేంతలో అతడు గది వెనకవున్న తలుపు తెరుచుకుని పక్కనేవున్న పిట్టగోడ మీంచి కిందికి దూకేశాడు.

శిఖిముఖీ, విక్రమకేసరీ పిట్టగోడను ఒక్క తృటికాలం ఆలస్యంగా చేరారు. పూజారి అంత ఎత్తు నుంచి కిందపడి మరణిస్తాడని వాళ్ళనుకున్నారు. కాని, మిద్దె కింది ఆవరణలో నిలబడివున్న సవరభేరుండం, పూజారి నేల తాకకుండా మధ్యలోనే పట్టుకుని, అతణ్ణి దాపులనున్న రెండు గుర్రాల్లో ఒకదాని మీద ఎక్కించి, తాను రెండో గుర్రం మీదికి లంఘించాడు.

శిఖిముఖి చప్పున వెనక్కు తిరిగి, "అజితా! వీరభద్రా! మీరు సత్రం ఆవరణలోకి పరిగెత్తి, గుర్రాల మీద పారిపో చూస్తున్న ఆ దుర్మార్గుల్ని పట్టుకోండి!" అని కేకపెట్టాడు. అజితుడూ, వీరభద్రుడూ కిందికి పరిగెత్తారు. —(ఇంకా వుంది)






20

[శిఖిముఖీ, విక్రమకేసరీ యిద్దరు అనుచరులతో బ్రహ్మపుత్రానదీ లోయలకు బయలుదేరారు. వాళ్ళు కామాఖ్యనగరం చేరి ఒక సత్రంలో విడిది చేశారు. వాళ్ళు లేని సమయంలో పూజారి వాళ్ళుండే మిద్దె మీది గదిలో ప్రవేశించాడు. శిఖిముఖి అతన్ని పట్టుకోవాలని ప్రయత్నిస్తే, పిట్టగోడ దూకి గుర్రం మీద పారిపోసాగాడు. తరవాత—]

సత్రం ముందు పెద్ద కలకలం రేగింది. ఇద్దరు హడావిడిగా గుర్రాల మీద పారిపోతూండటం, కత్తులు దూసిన యువకులిద్దరు 'ఆగండి!' అంటూ వాళ్ళకేసి పరిగెత్తుతూండటం చూసి, సత్రంలో విడిది చేసినవాళ్ళు చాలామంది ఆవరణలోకి పరిగెత్తుకొచ్చారు. అజితుడూ, వీరభద్రుడూ వేగంగా పూజారీవాళ్ళ వెనక కొంతదూరం పరిగెత్తారు. కాని, గుర్రాల మీద పారిపోతున్న అతణ్ణీ, సవరభేరుండాన్నీ పట్టుకోవటం వాళ్ళకు సాధ్యమయేపని కాదు.

శిఖిముఖీ, విక్రమకేసరీ తమ గది తలుపు బంధించి మిద్దె మీది నుంచి కిందికి దిగి వచ్చారు. ఆ సరికి అజిత వీరభద్రులు రొప్పుతూ వాళ్ళ దగ్గిరకు వచ్చి, పూజారి దొరకలేదని చెప్పారు. ఆ దుర్మార్గుణ్ణి చేజిక్కించుకునే అవకాశం కొద్దిలో విఫలమైనందుకు శిఖిముఖి విచారపడ్డాడు.





అంత ఎత్తు మిద్దె మీది నుంచి పూజారి కిందికి దూకుతాడని అతడు అనుమానించ లేకపోయాడు. నవరభేరుండం కింద కాచుకుని వున్న సంగతి అతడికి తెలియదు.

"శిఖీ! ఈ దుర్మార్గుడి బెడద మనకు వదిలేలాలేదు. మనం వాడితో తెలివి తక్కువగా మాటలు పెట్టుకున్నాం. గదిలో ప్రవేశిస్తూనే వాణ్ణి కత్తితో నరకవలసింది," అన్నాడు విక్రమకేసరి.


"అవును. ఈసారి వాడు తటస్థపడితే మనం చేయబోయేది అదే. ఆ నీచుడితో మనకు మాట లేమిటి?" అన్నాడు శిఖిముఖి.

అక్కడ చేరినవాళ్ళు శిఖిముఖినీ, విక్రమకేసరినీ రకరకాల ప్రశ్నలు అడగ సాగారు. ఎవరో యిద్దరు, పెద్ద దొంగతనం చేసి గుర్రాల మీద పారిపోయారని వాళ్ళను కున్నారు. సత్రపు యజమాని చేతులు నలుపుకుంటూ నంగిగా, "అయ్యా, ఇందులో నా పొరపాటు చాలా వున్నది. మీరు లేనప్పుడు ఆ పూజారినని చెప్పి నతణ్ణి మీ గదిలోకి పోనివ్వవలసింది కాదు. విలువగల వస్తువు లేమైనా ఎత్తుకు పోయాడా?" అని అడిగాడు.

"వాడికొక్కవలసిన విలువైన వస్తువు లేవీ మా దగ్గిర లేవు. మేము యాత్రి కులం; పుణ్యతీర్థాలు సేవించేందుకు బయలుదేరినవాళ్ళం. మా దగ్గిర విలువైన వస్తువు లేంవుంటవి?" అన్నాడు శిఖిముఖి.

"తమ గదిలో దొంగతనం జరగలేదని వినటం నాకు చాలా సంతోషం కలిగిస్తున్నది. ఆ పూజారినన్నవాడి ముఖలక్షణాలు చూస్తే, వాడు ఇభ్యజాతి వాడిలా వున్నాడు. వాళ్ళెంత నమ్మకస్థులో అంత నమ్మక ద్రోహులు," అన్నాడు సత్రం యజమాని.

ఆ రాత్రి శిఖిముఖీ, విక్రమకేసరీ సంప్రతించుకుని బ్రహ్మపుత్రానదీ లోయల్లో






ఇభ్యుజాతి వాళ్ళుండే ప్రాంతాలకు దారి చూప గల వాణ్ణొకణ్ణి కుదుర్చుకోవటం మంచిదని నిశ్చయించారు. పెద్దమనిషిలా కనబడుతున్న సత్రం యజమానితో యీ మాట చెపితే, అతడు ఆశ్చర్యపడి, "ఆ ప్రాంతాలకు పోవటం అంత క్షేమం కాదు," అన్నాడు.


శిఖిముఖి ఆ మాటకు చిన్నగా నవ్వి, "మాకు ప్రాణాపాయం కలగవచ్చునే కదా మీరు భయపడుతున్నది. అలాంటి భయం మాకేం లేదు. మమ్మల్ని చంపినందువల్ల ఎవరికీ ఒరిగేదేంవుండదు. ఆ లోయల్లోని చిన్నా పెద్ద పవిత్ర స్థలాలన్నీ చూడ దలిచాం. ముఖ్యంగా ఇభ్యుజాతివాళ్ళుండే ప్రాంతాల అతి పురాతనమైన దేవాలయా లున్నవని విన్నాం. ఎంత కష్టనష్టాలకైనా సరే ఓర్చి వాటన్నిటినీ తప్పక దర్శించి తీరాలి," అన్నాడు.

"అయితే మీ యిష్టం. మీ ప్రయాణం ఎప్పుడో చెప్పండి. ఆ ప్రాంతాలు బాగా తెలిసిన వాణ్ణొకణ్ణి మీ వెంట పంపుతాను. వాడికి తిండీ తిప్పలూ మీరే చూడాలి. తిరిగివచ్చిం తరవాత పారితోషికంగా కొంత డబ్బు యివ్వవలసివుంటుంది," అన్నాడు సత్రంయజమాని.



శిఖిముఖీ, విక్రమకేసరీ అందుకు అంగీ కరించారు. మర్నాడు సూర్యోదయంవేళ పొట్టిగా బలంగా గున్నఏనుగుపిల్లలా వున్న ఒక నడి వయసువాణ్ణి, సత్రంయజమాని వాళ్ళ దగ్గిరకు తీసుకువచ్చి, "అయ్యా, ఇతడి పేరు జాంగ్లా. ఇభ్యుజాతి వాళ్ళుండే ప్రాంతాలన్నీ తనకు బాగా తెలుసంటున్నాడు. ఇతడూ ఆ జాతివాడే," అని చెప్పాడు.

శిఖిముఖి అతణ్ణి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాడు. మనిషిముఖం చూసి స్వభావాన్ని కనిపెట్టేందుకు అతడికి సాధ్య మయేలా కనిపించలేదు. జాంగ్లా పెదాల



మీద చిరునవ్వు కదులుతున్నది. ముఖం మీద ఎలాంటి భావం ప్రస్ఫుటం కావటం లేదు. ఎండ వానలకు గురై, బాగా బీటలు బారిన నల్ల రాతిపలకలా వున్నది అతడి ముఖం.

జాంగ్‌లాను పరిచయం చేసి సత్రం యజమాని వెళ్ళిపోగానే, శిఖిముఖి అతడితో, "నీవు నమ్మకస్థుడివా కావా అన్న భయం మాకు లేదు. మేం నలుగురం, నువ్వొక్కడివి. కాని, నీకు ఇభ్యజాతి వాళ్ళుండే ప్రాంతాలు క్షుణ్ణంగా తెలుసునా లేదా అన్నదే నా కనుమానంగా వున్నది," అన్నాడు.




"నేనెంత నమ్మకస్థుణ్ణో మీరే తెలుసుకుంటారు. పోతే, నేను పుట్టి పెరిగింది ఇభ్యజాతి వాళ్ళుండే ప్రాంతానే. నేను ఆ జాతివాణ్ణేనని సత్రంయజమాని తమకు చెప్పాడు గదా? ఆయన నన్ను బాగా ఎరుగు," అన్నాడు జాంగ్‌లా.

"సరే, నీకు దారిభత్యం మేమే జరుపుతాం. ప్రయాణం ముగిసి తిరిగి ఈ కామాఖ్యనగరం చేరింతరవాత, నీకు పారితోషికంగా అయిదు బంగారుకాసు లిస్తాం. ఇష్టమేనా? ఆలోచించుకుని చెప్పు," అన్నాడు శిఖిముఖి.


"ఆలోచనెందుకు, తమ దయ!" అన్నాడు జాంగ్‌లా.

"మమ్మల్ని ఆ లోయల్లోని గోల్‌భరా అన్న ఇభ్యజాతి గ్రామం చేర్చాలి. ఆ దాపుల్లో ఎక్కడో అతిపురాతనమైన ప్రసిద్ధ దేవాలయం వున్నదని విన్నాం." అన్నాడు శిఖిముఖి.

గోల్‌భరా అన్న పేరు వింటూనే జాంగ్‌లా కొంచెం ఉలిక్కిపడి, "చిత్తం. అలాగే అక్కడికి దారి చూపుతాను, ఆ గ్రామం నే నెరిగినదే. కాని, మీ రన్నట్టు అక్కడ ప్రసిద్ధ దేవాలయం ఏమీ లేదు. తరవాత నన్ను తప్పుపట్టకుండా ముందే







వున్న సంగతి తమకు మనవి చేసుకుంటున్నాను," అన్నాడు.


"ఉన్నట్టు మేం విన్నాం, అవునా, కేసరీ?" అంటూ శిఖిముఖి విక్రమకేసరి కేసి చూసి, అతడు అవునన్నట్టు తల వూప గానే, జాంగ్‌లాతో, "నువ్వు మాకు ఆ గ్రామానికి దారి చూపు. అక్కడికి చేరింతరవాత, సంగతి మేం చూసుకుంటాం. ప్రయాణం యీ సాయంకాలమే, సిద్ధంకా," అన్నాడు.

జాంగ్‌లా వాళ్ళకు నమస్కరించి వెళ్ళి పోయాడు. ఆ సాయంత్రం తమకు దారిలో అవసరం అయిన ఆహార పదార్థాలనూ, ఇతర సామగ్రినీ రెండు కంచరగాడిదల మీద వేసుకుని, శిఖిముఖీ, విక్రమకేసరీ నదీ లోయల కేసి బయలుదేరారు. జాంగ్‌లా వాళ్ళకు ముందు నడుస్తూ దారి చూప సాగాడు.

చీకటిపడుతూనే అందరూ అరణ్యం లోని ఒక చిన్న కొలను ప్రాంతం చేరారు. ఆ రాత్రికి అక్కడ ఆగి, వంట చేసుకుని, మర్నాటి వేకువజామున తిరిగి ప్రయాణం కావటానికి వాళ్ళు నిశ్చయించుకున్నారు. వంటపనిలో అజితుడూ, వీరభద్రుడూ నిమగ్నులయారు. జాంగ్‌లా ఎండుపుల్లలు తీసుకువస్తానని శిఖిముఖితో చెప్పి, అరణ్యం లోకి పోయాడు

శిఖిముఖీ, విక్రమకేసరీ ఒక చెట్టు నానుకుని కూర్చుని తమ ముందు కార్య క్రమాన్ని గురించి మాట్లాడుకో సాగారు. విక్రకేసరికి, జాంగ్‌లా మీద పూర్తి నమ్మకం కలగలేదు. వాడు తమను తప్పు దారి పట్టిస్తాడేమో అన్న అనుమానం అతడు బయటపెట్టాడు. శిఖిముఖినీ యిలాంటి అనుమానమే అప్పుడప్పుడూ పీడిస్తున్నది.

"మన జాగ్రత్తలో మనం వుందాం. ఈ జాంగ్‌లా, శిథిలాలయ పూజారి అను



చరుడేమో అనేగదా నీ భయం. ఆ దుర్మార్గుడే మనను ఏమీ చేయలేనప్పుడు, యీ వెధవ చేయగలిగిం దేమిటి?" అన్నాడు శిఖిముఖి.


విక్రమకేసరి ఏదో జవాబు చెప్పబోయేంతలో, ఎర్రగండు చిన్నగా మొరిగి, దాపుల నున్న గుబురుచెట్ల కేసి బయలుదేరింది. శిఖిముఖి కుక్క వాలకం చూసి, విక్రమకేసరిని హెచ్చరించి, దాని వెనకనే నిశ్శబ్దంగా నడిచాడు.

విక్రమకేసరి కత్తి దూసి నిలబడి, చూట్టూ అలముకుంటున్న చీకటిలోకి గుచ్చి గుచ్చి చూడసాగాడు.



ఎర్రగండు చెట్లల్లో కొంత దూరం ముందుకు పోయి ఒక చోట ఆగి, తల పై కెత్తి మొరగ సాగింది. నేలకు దాదాపు అయిదా రడుగుల ఎత్తులో దట్టంగా పరుచుకుపోయిన చెట్లకొమ్మల కేసి, శిఖిముఖి పరీక్షగా చూశాడు. అక్కడ శత్రు వెవడైనా దాగివున్నాడేమో అన్న సంశయం అతడిక్కలిగింది. కాని అక్కడ ఎవరూ వున్నట్టు లేదు. అంతలో అతడికి దూరంగా ఎవరో చిన్నగొంతుతో మాట్లాడుతున్నట్టు అనుమానం కలిగింది. అతడు ముందుకు నడవబోయాడు. ఎర్రగండు అతడి దారిని అడ్డగిస్తూ తల పైకెత్తి పెద్దగా మొరగటం ప్రారంభించింది.

ఈసారి శిఖముఖికి అడుగుల చప్పుడు స్పష్టంగా వినబడింది. చూస్తూండగానే జాంగ్‌లా భుజం మీద యిన్ని ఎండుపుల్లలు పెట్టుకుని వేగంగా అతడి కేసి రాసాగాడు. శిఖిముఖి అతడి కేసి రెండడుగులు వేసేంతలో చెట్లకొమ్మల్లోంచి ఒక పెద్ద కొండచిలువ తపీ మంటూ జాంగ్‌లా మీద పడి, అతడి శరీరాన్ని బలంగా చుట్టివేయసాగింది. ఎర్రగండు పెద్దగా అరుస్తూ ముందుకు దూకింది, జాంగ్‌లా ఒక చావుకేక పెట్టాడు.




CHITRA

శిఖిముఖి ఓ క్షణకాలం కొయ్యబారి పోయాడు. మరుక్షణంలో అతడికి జాంగ్లా ఎలాంటి ఘోర ప్రమాదంలో చిక్కుకున్నాడో అర్థమైంది. అతడు పరిగెత్తుకుంటూ పోయి కొండచిలువ తల నరికేందుకు కత్తి దూశాడు. కాని, కొండచిలువ జాంగ్లాను నడుము నుంచి పైన తన దేహంతో బలంగా చుట్టి అతడి తలను ఒడిసి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఆ చీకట్లో కత్తి గురి ఏమాత్రం తప్పినా కొండచిలువ తలకు మారుగా జాంగ్లా తల తెగి కింద పడే ప్రమాదం వున్నది.

జాంగ్లా ఉక్కిబిక్కిరై పోతూ చిన్నగా మూలుగుతున్నాడు. శిఖిముఖి, "భయపడకు జాంగ్లా! ఇదుగో కొండచిలువను నరికేస్తున్నాను," అంటూ ఎడమచేత్తో పాము మెడ పట్టుకుని యివతలికి లాగుతూ, అదే సమయంలో కత్తితో దాని మెడ మీద బలంగా కొట్టాడు.

తల తెగిపోగానే, జాంగ్లా శరీరం మీది నుంచి కొండచిలువ దేహం మెలికలు తిరుగుతూ కింద పడిపోయింది. జాంగ్లా పెద్దగా మూలిగి ఒక పక్కకు దభీమంటూ పడిపోయాడు. ఈ గందరగోళం అంతా విన్న విక్రమకేసరి, అజిత వీరభద్రులూ అక్కడికి పరిగెత్తుకు వచ్చారు.

శిఖిముఖి, జాంగ్లాను లేవనెత్తేందుకు వంగుతూ, "కొండచిలువ తల నరికాను. దాని పట్టులో చిక్కి నీ కాళ్ళూ చేతులూ ఏమైనా విరిగిపోలేదు గదా?" అన్నాడు.

జాంగ్లా జవాబిచ్చేందుకు గొంతు సవరించుకునేంతలో చీకట్లో నుంచి, "అఘోరీలు భక్తితో పూజించే కొండచిలువ తల నరికిన వాడెవడు? ఇదుగో, నీ తల నరకబోతున్నాం, కాచుకో!" అంటూ నలుగురైదుగురు భయంకరాకారులు, పెద్ద పెద్ద శూలాలు పైకెత్తి, శిఖిముఖి కేసి పరిగెత్తుకు రాసాగారు. —(ఇంకా వుంది)





శిథిలాలయం

21

[శిఖిముఖి కామాఖ్యానగరం నుంచి, జాంగ్‌లా అనే ఒక జట్పజాతివాణ్ణి దారి చూపేందుకు వెంటబెట్టుకుని బ్రహ్మపుత్రా నదీలోయలకు బయలుదేరాడు. వాళ్ళు ఒక మహారణ్యంలో వుండగా జాంగ్‌లాను కొండచిలువ పట్టుకున్నది. శిఖిముఖి దాన్ని చంపాడు. అదిచూసిన అఘోరీలనే సన్యాసులు కొందరు అతడి మీదికి రాసాగారు. తరవాత—]

తన మీదికి వచ్చే అఘోరీలను చూసి శిఖిముఖి, తనకు చావు తప్పదనుకున్నాడు. వాళ్ళెంత క్రూరులో తన తండ్రి చెప్పగా లోగడ అతడు వినివున్నాడు. కాని, ఈ సమయంలో పారిపోవటం గాని, వాళ్ళను ప్రాణభిక్ష కోరటం గాని అవమానకరంగా శిఖిముఖికి తోచింది. చావు తప్పనిసరి అయితే, వాళ్ళను ప్రతిఘటించి పోరాడుతూ చావటమే మేలనుకున్నాడతను.

శిఖిముఖి యిలా ఆలోచించి కత్తి పైకెత్తి పెద్ద గొంతుతో, "విక్రమకేసరి! నువ్వు మన అంగరక్షకులతో తక్షణం అక్కణ్ణించి పారిపో. నన్ను అఘోరీల దండు చుట్టుముట్టుతున్నది. నా రక్షణకు వచ్చి నువ్వు అనవసరంగా చావటం ఎందుకు?" అని కేక పెట్టాడు.

శిఖిముఖి మాట ముగించే లోపలే, అఘోరీల్లో ఒకడు అతణ్ణి శూలంతో పొడవ



బోయాడు. శిఖిముఖి దాని దెబ్బ తప్పుకుని, ఆ అఘోరీని కత్తితో మెడ మీద బలంగా కొట్టాడు. వాడు, "మహాకాళా!" అని అరుస్తూ పక్కకు పడిపోయాడు. ఇంతలో అఘోరీల్లో ఒకడు, "ఆగండి! వాణ్ణి చంపకండి. వాడు విక్రమకేసరి గురువు పేరు ఉచ్చరిస్తున్నాడు," అని కేక పెట్టాడు.

ఆ సమయానికి అక్కడికి మరి నలుగురు అఘోరీలు వచ్చారు. శిఖిముఖి కేక వింటూనే, పారిపోవటానికి మారుగా, విక్రమకేసరీ, అజితుడూ, వీరభద్రుడూ కత్తులు దూసి అతడి రక్షణకు పరిగెత్తుకు వచ్చారు. అఘోరీల్లో మొదట మాట్లాడిన



వాడు చేతులు చాచి తన వాళ్ళను కొంచెం వెనక్కు పొమ్మని చెప్పి, శిఖిముఖితో, "మీ కత్తులూ, ఈ బెలూ మా అఘోరీల ముందు ఎందుకూ కొరగావు. నేను నా అనుచరుల్ని వెనక్కు పొమ్మన్నది, మీకు భయపడి కాదు. అంతకు ముందు నువ్వు విక్రమకేసరి గురువు పేరు తలిచావు. అంతే కాకుండా ఆయన్ని పారిపొమ్మన్నావు. ఇది చాలా వింతగా వున్నది! ఎవరివి నువ్వు? ఆ విక్రమకేసరి గురువు ఎక్కడ?" అని ప్రశ్నించాడు.

శిఖిముఖికి ఆ ప్రశ్నతో పరిస్థితి చాలా వరకు అర్థమైపోయింది. తాత విక్రమకేసరి చాలాకాలం పాటు అఘోరీలు వుండే ప్రాంతాన నివసించినట్టు, అతడు వదిలి పోయిన తాళపత్రాల ద్వారా తెలుస్తున్నది. తనను కేకపెట్టి పారిపొమ్మన్నది, ఆ విక్రమకేసరినేనని వీళ్ళనుకుంటున్నారు.

విక్రమకేసరి తన సమీపానికి రాగానే శిఖిముఖి అతణ్ణి తనను ప్రశ్నించిన అఘోరీకి చూపుతూ, "ఇతడే విక్రమకేసరి! ఈయన తాతగారైన విక్రమకేసరి మహారాజు కొన్నేళ్ళ క్రితం ఈ ప్రాంతాలకే వచ్చారు. ఆయన ఏమైనదీ తెలియలేదు. ఆయన్ని వెతికేందుకే మేము శూరసేన



దేశం నుంచి బయలుదేరి ఈ ప్రదేశానికి వచ్చాం," అన్నాడు.

శిఖిముఖిని ప్రశ్నించిన అఘోరీ తతిమ్మా వాళ్ళకు నాయకుడు. అతడు శిఖిముఖి ఇచ్చిన జవాబు వింటూనే, విక్రమకేసరి ముందుకు వచ్చి వంగి నమస్కరించి, "విక్రమకేసరి గురువు పోలికలన్నీ నీలో వున్నవి. ఆయన మా ముఠా అఘోరీలకు ఆపదసమయాల్లో సలహా లిచ్చి, దీర్ఘ రోగాలను మూలికా చికిత్సతో నయంచేసి ఎంతగానో పాటుపడ్డాడు. ఆయన ఋణం తీర్చుకో లేనిది. కాని..." అంటూ శిఖిముఖి ముఖంలోకి గుచ్చిగుచ్చి చూస్తూ, "అతడు చెప్పేది నా కేం అర్థం కావడం లేదు. విక్రమకేసరి గురువు యింకా బతికుంటాడని మీ రెందుకు భావించారు? ఒకవేళ ఆయన బతికే వుంటే మీ దేశానికి ఎప్పుడో తిరిగి వచ్చేవాడు గదా?" అన్నాడు.

"ఆయన యింకా సజీవుడే అన్న కొన్ని వదంతులు మేం విన్నాం. బ్రహ్మపుత్రా నదీ లోయల్లోని ఒకానొక శిథిలాలయ ప్రాంతానికి ఆయన వెళ్ళినట్టూ, తరవాత ఆయన జాడ తెలియకుండా పోయినట్టూ, మాకు లభించిన తాళపత్రాల ద్వారా మేము ఊహించాం," అన్నాడు శిఖిముఖి.



"మీ ఊహ సరైనదే. విక్రమకేసరి గురువు జభ్య జాతి వాళ్ళు నివసించే లోయ ప్రాంతాలకు వెళ్ళాడు. తరవాత ఆయన జాడ మాకు తెలియలేదు. జభ్యులు ఆయన్ని చంపి వుంటారని మేం అనుకోం, ఆ ప్రాంతాల ఆయన ఏదో భయంకర వ్యాధికి గురై మరణించి వుంటాడని మా నమ్మకం," అన్నాడు అఘోరీల నాయకుడు.

"ఆదేదో యదార్థంగా తెల్సుకో దలిచాం. కాని, మాకు ఒకానొక పూజారి నుంచే కాక, మీ అఘోరీల నుంచి కూడా ప్రమాదాలు తప్పవట్టున్నవి," అన్నాడు శిఖిముఖి.



ఆ మాటకు అఘోరీల నాయకుడు నవ్వి, "మా వాళ్ళ నుంచి మీకు ఎలాంటి హాని కలగకుండా, ఇదిగో ఈ రుద్రాక్షల దండ నీ ముంజేతికి కడుతున్నాము. ఆ పూజారి సంగతి నాకు తెలియదు. మీ జాగ్రత్తలో మీ రుండండి. మీ దేశానికి తిరిగి పోయేలోపల మిమ్మల్ని ఈ మహారణ్యాల్లో ఎక్కడో మరోసారి మేం తప్పక కలుసు కుంటాం. నా పేరు ఘోరచిత్తుడు," అని చెప్పి, శిఖిముఖి చేతికి రుద్రాక్షల దండ కట్టి, చావు బతుకుల్లో వున్న తమ అనుచరుణ్ణి తనవాళ్ళచేత పట్టించుకుని అఘోరీల నాయకుడు వెళ్ళిపోయాడు.

శిఖిముఖి తామంతా దిగిన చెట్టు కిందికి వచ్చాడు. అజిత, వీరభద్రులు వంటపనిలో నిమగ్నులయారు. శిఖిముఖి, విక్రమకేసరిని దూరంగా తీసుకుపోయి, జాంగ్‌లాను కొంత చిలువ పట్టుకునే ముందు, తాను చెట్ల చాటున ఎవరో మాట్లాడుతున్న శబ్దం విన్న సంగతి చెప్పాడు.

"జాంగ్‌లాను ప్రశ్నించి నిజం తెలుసుకోవచ్చు గదా?" అన్నాడు విక్రమకేసరి.

"వాడు మనకు తెలియకుండా మరెవరితోనో చెట్ల చాటున మాట్లాడివుంటే—మన ప్రశ్నలకు వాణ్ణించి నిజం బయటపడదు. ఒకవేళ నేనే పొరబడి వుండివచ్చు. గాలికి చెట్ల ఆకులూ, చిరుకొమ్మలూ చేసే శబ్దం కూడా ఒకోసారి ఎవరో గుసగుసలాడుతున్నట్టు ధ్వనించటం జరుగుతుంది. ఏమైనా మనం మరి కాస్త అప్రమత్తులంగా వుండాలి," అన్నాడు శిఖిముఖి.

వంట పూర్తవగానే అందరూ భోజనాలు చేశారు. ఆ సరికి జాంగ్‌లా ఒళ్ళునొప్పులు పోయి, మామూలుగా నడవసాగాడు. చెట్టు కింద శిఖిముఖి, విక్రమకేసరి తమ వెంట తెచ్చిన నారపట్టాలతో చిన్న గుడారం వేసుకుని, దానిలో పడుకున్నారు. అజితుడూ, వీరభద్రుడూ, జాంగ్‌లా కంచరగాడిదలకు

మేత వేసి, తాము దిగిన చోటుకు చుట్టూ అక్కడక్కడా నెగళ్ళు వెలిగించారు. అప్పటికే జాము పొద్దుపోవటంతో తతిమ్మా మూడు జాముల రాత్రిలోనూ, జాముకొకరు చొప్పున మేల్కొని వుండి, కావలా కాయటానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

మొట్టమొదటి కావలా వంతు అజితుడిది. అతడు నెగళ్ళు ఆరిపోకుండా మధ్యమధ్య వాటి మీద ఎండుపుల్లలు వేస్తూ, చుట్టూ వున్న చీకట్లో నుంచి ఏవైనా మృగాలు గాని, శత్రువులు గాని వస్తున్నారేమో కనిపెట్టేందుకు గుచ్చి గుచ్చి చూడ సాగాడు. ఆ జాము కాలమూ ఎలాంటి దుర్ఘటనా లేకుండా గడిచిపోయింది. దూరంగా అరణ్యంలో పులి అరుపూ, నక్క కూతలూ మాత్రం అజితుడు విన్నాడు. మధ్యమధ్య ఏదో ఈల లాంటి ధ్వని కూడా అతడి చెవుల బడింది. బహుశా అది వెదురు పొదల్లో గాలి వీచే శబ్దం అయివుంటుందనుకున్నా డతను.

అజితుడి వంతు అయిపోగానే జాంగ్‌లా కావలాకు పూనుకున్నాడు. అజితుడు పోయి వీరభద్రుడికి అంత ఎడంలో పడుకున్నాడు. కాని అతడికి నిద్ర సరిగా పట్టలేదు. అఘోరీల దాడి చూసినంతరవాత



అతడికి యీ అరణ్యంలో ఏ నిముషాన ఎలాంటి ప్రమాదం వస్తుందో అన్న భయం పట్టుకున్నది.

కొద్ది కాలం గడిచింది. అజితుడు కొంచెం సేపు నిద్రతో జోగి, దూరాన్నుంచి ఏదో క్రూర జంతువు అరుపు వినబడగానే మత్తుగా కళ్ళు తెరిచి చూశాడు. జాంగ్‌లా నెగళ్ళ పక్కగా నిలబడి అరణ్యంలోకి చూస్తున్నాడు. వాడు సరిగా కట్టెలు వేయనందున నెగళ్ళు క్రమక్రమంగా ఆరిపోతున్నవి.

అజితుడు లేచి వాణ్ణి గట్టిగా కొప్పడదామనుకున్నంతలో, చెట్ల చాటు నుంచి



సన్నని ఈల వినబడింది. ఆ వెంటనే జాంగ్లా ఈటె భుజాన పెట్టుకుని కూర్చున్నాడు. ఏదో మోసం జరగబోతున్నదని అజితుడు అనుకుని విశ్వస్తంగా తల తిప్పి శిఖిముఖి, విక్రమకేసరులు నిద్రపోతున్న గుడారం కేసి చూశాడు. ఆ సమయంలో అక్కడ కనిపించిన దృశ్యం అతణ్ణి నిలువెల్లా కంపించేలా చేసింది.

చిరుతపులి ఒకటి గుడారాన్ని సమీపించి, నేలను మూచూసి, గుడారం పట్టాల ఖాళీ లోంచి లోపలికి తలపెట్టబోతున్నది. ఇంత జరుగుతుంటే ఎర్రగండు ఏం చేస్తున్నట్టు? అనుకున్నాడు అజితుడు. అతడికి దానున్న ప్రమాదం అర్థం కాగానే, అంతవరకూ వున్న భయం కాస్తా ఎగిరిపోయింది.

"వీరభద్రా, లే! ప్రమాదం ముంచుకు వస్తున్నది!" అంటూ అతడు ఎగిరి లేచి, చేతిలో వున్న ఈటెను గురిచూసి చిరుత పులి కేసి విసిరాడు. అదృష్టం కొద్దీ ఆ ఈటె సూటిగా పోయి చిరుతపులి రొమ్ముల్లో గుచ్చుకున్నది. బాధతో అది పెద్దగా బొబ్బరిస్తూ, పడుతూ లేస్తూ దూరంగా వున్న పొదల కేసి పోసాగింది.

అజితుడి కేకలూ, చిరుతపులి బొబ్బరింతల్లో శిఖిముఖి, విక్రమకేసరి నిద్ర లేచి కత్తులు దూస్తూ గుడారం నుంచి బయటికి





వచ్చారు. ఈలోపల అజితుడు, నిద్రలేచిన వీరభద్రుడితో, జాంగ్లా పారిపోకుండా చూస్తూండమని చెప్పి, శిఖిముఖి వాళ్ళ దగ్గిరకు పరిగెత్తి పోయి, జరిగిం దేమిటో రెండు మాటల్లో చెప్పి, "ఆ పొదల చాటు నుంచి ఈల వినిపించింది. అక్కడెవడో దాగివున్నాడని నా అనుమానం," అన్నాడు.

విక్రమకేసరి ఆ మాట వింటూనే, విల్లు తీసుకుని బాణం ఎక్కుపెట్టి, అజితుడు చూపిన పొదల కేసి ఒకదాని వెంట ఒక టిగా మూడు బాణాలు కొట్టాడు. మూడో బాణం జుయ్యిమంటూ పోయి ఒక పొదను తాకేసరికి, అక్కణ్ణించి పెద్దగా ఒక బావుకేక వినిపించింది. మరుక్షణంలో పొద బాగా కదిలి నట్టయి, అందులో నుంచి నల్లని ఆకారం ఒకటి బయటికి పారిపోవటం కనిపించింది.

శిఖిముఖి, అజితుణ్ణి హెచ్చరిస్తూ, "ఈ గుడ్డివెన్నెల్లో వాణ్ణి ఒంటరిగా వెంబడిం చటం ప్రమాదం. శత్రువులు మరి కొందరు ఆ చుట్టుపక్కలఎక్కడైనా దాగివుండొచ్చు. మీ యిద్దర్లో ఒకరు జాంగ్లాను కనిపెట్టి వుండండి. మరొకళ్ళు మన సామాను రక్షణ చూడండి. నేనూ, కేసరీ పోయి ముందుగా, ఆ గాయపడిన చిరుతపులి ఎలా వుందో చూసి వస్తాం. గాయపడిన క్రూరమృగాన్ని వదిలి వూరుకోవటం చాలా ప్రమాదం," అన్నాడు.

శిఖిముఖీ, విక్రమకేసరీ బయలుదేర గానే, అజితుడు, "శిఖిదొరా! ఇంత జరుగు తున్నా ఎర్రగండు అరవకుండా మొరగ కుండా వున్నదేం?" అన్నాడు.

"దానికి ఎవరో ఎవరో ఏమిటి—ఈ జాంగ్లా మత్తుమందు పెట్టాడు. నీ కేక వినపడగానే దాన్ని తట్టి లేపాలని చూశాను. అది మత్తుగా పడి వున్నది....అదంతా తర వాత చూద్దాం," అన్నాడు శిఖిముఖి.

వెలుగుతున్న కర్ర ఒకటి తీసుకుని శిఖిముఖీ, విక్రమకేసరీ పొదలను సమీపిం



చేంతలో చిరుతపులి ఒకసారి గట్టిగా అరిచి వాళ్ళ మీదికి దూకబోయింది. కాని, బాగా గాయపడి వుండటం వల్లా, గుండెల్లో గుచ్చుకున్న ఈటె ముందుకాళ్ళకు అడ్డపడటం వల్లా, అది పొదలో నుంచి దూకుతూనే పక్కకు పడి గిలగిల్లాడ సాగింది.

శిఖిముఖి ఈటెతో దాని తల మీద రెండుసార్లు బలంగా పొడిచి, గుండెల్లో దిగి వున్న ఈటెను పట్టుకుని ఒక్క గుంజాతో బయటికి లాగాడు. చిరుతపులి ఓ క్షణ కాలం గిల గిల తన్నుకుని ప్రాణాలు విడిచింది.

"శిఖీ! ఇది చూశావా?" అంటూ విక్రమకేసరి తన ఈటెను చిరుతపులి మెడ మీద ఆనించాడు. అక్కడ ఒక తోలు పట్టెడ—చిరుతపులి మెడకు బిగించి వున్నది కనిపించింది.

"ఇది పెంపుడు చిరుత. దీన్ని పెంచిన వాడు స్వయంగా వచ్చి మనం వున్న గుడారం మీదికి దీన్ని వదిలి పొదల్లో దాక్కున్నాడు. వాడు నీ బాణందెబ్బ తిన్నాడు. ఇక వాడి సంగతి చూద్దాం పద," అంటూ శిఖిముఖి బయలుదేరాడు.

ప్రాణభయంతో గజగజ వణికిపోతున్న జాంగ్లా దగ్గిరకు అతడు రాగానే, జాంగ్లా దణ్ణం పెడుతూ అతడి పాదాల మీద పడబోయాడు. శిఖిముఖి, వాణ్ణి మెడ పట్టుకు గుంజి నిలబెట్టి, వాడి చేతిలో ఒక వెలిగే కట్టెపుల్ల పెడుతూ, "అన్ని సంగతులూ తరవాత మాట్లాడదాం. బాణందెబ్బ తిన్న నీ మిత్రుడు ఎలా వున్నాడో చూడాలి. ముందుండి దారితియ్యి. పారిపోవాలని చూశావో, నీ వెన్నులో ఈటె గుచ్చుతాను," అన్నాడు కఠినంగా.

జాంగ్లా మరింతగా వణికిపోతూ పొదల కేసి నడవసాగాడు. వెనగ్గా శిఖిముఖి, విక్రమకేసరి బయలుదేరారు.

—(ఇంకావుంది)





22


[అఘోరీలు శిఖిముఖితో రాజీమాటలు మాట్లాడి తమ దారిన వెళ్ళిపోయారు. రాత్రివేళ శత్రువులు తమ మీదికి దొంగదాటుగా వదిలిన చిరుతపులిని శిఖిముఖివాళ్ళు చంపారు. వాళ్ళకు సాయపడిన జాంగలానూ, గాయపడిన వాని మిత్రుడు ఎక్కడున్నదీ తెలుసుకునేందుకు, ముందుగా దారి తీయమని శిఖిముఖి ఆజ్ఞాపించాడు. తరవాత—]

కాగడాకాంతిలో శిఖిముఖివాళ్ళు పొదల పక్కగా నడుస్తూ, గాయపడిన శత్రువు కోసం వెతకసాగారు. వారి కొక పొద దగ్గిర నెత్తురు మరకలు కనిపించినై. అక్కడ విరిగిన కొన్ని చెట్టురెమ్మలూ, ఆకులూ చెల్లాచెదురుగా పడివున్నవి.

"కేసరీ, వాడు నీ బాణందెబ్బ తిన్నదీ, యీ పొద దగ్గిరే. కాని, ఎలాగో యిక్కణ్ణించి పారిపోగలిగాడు. తెల్లవారవస్తున్నది. ఇంకా యిక్కడ కాలయాపన చెయ్యటం ఎందుకు? ప్రయాణసన్నాహాలు చేద్దాం," అన్నాడు శిఖిముఖి.

"మన ప్రయాణానికి దారి చూపి సాయపడేవా రెవరు? ఈ జాంగలా శత్రుపక్షంవాడని తేలిపోయింది గదా?" అన్నాడు విక్రమకేసరి.

"ఏ పక్షంవాడయినా, వీడు ప్రస్తుతానికి మన అధీనంలో వున్నాడు. కావాల్సి



నగరం నుంచి బయలుదేరేటప్పుడు, వీడు మనను అభ్యుజాతివాళ్ళు నివసించే గోల్‌ఖరా గ్రామం చేరుస్తానని మాట యిచ్చాడు. ఆ పని వీడిచేత చేయించుదాం," అన్నాడు శిఖిముఖి.

"ఇంకా యీ దుర్మార్గుణ్ణి నమ్మటమా? మనను తప్పుదారి పట్టించి, ఆ శిథిలాలయపు పూజారికి ఒప్పచెప్పగలడు!" అన్నాడు విక్రమకేసరి.

"అలాంటి భయం ఏమీ లేదు. ఏదైనా మోసం చేయబోతున్నట్టు అనుమానం కలిగిన మరుక్షణం, ఈ జాంగ్‌లాను కత్తితో ముక్కలు ముక్కలుగా నరుకుతాను. మనకొచ్చిన చిక్కేమిటంటే, ఈ మహారణ్యాల్లో, నదీ లోయల్లో వీడు తప్ప, దారి చూపగల వాడు మరొకడు లేడు. వీణ్ణి అందుకు ఉపయోగించుకోక తప్పదు," అన్నాడు శిఖిముఖి.

"ఆ ఉపయోగించుకోవటం అదీ నీవే చూసుకోవాలి. నేను మాత్రం ఈ జాంగ్‌లాను ఒక్క క్షణం కూడా నమ్మను," అన్నాడు విక్రమకేసరి.

"నేనూ అంతే," అని శిఖిముఖి, జాంగ్‌లా కేసి తిరిగి, "జాంగ్‌లా, నిజం చెప్పు. నీకు డబ్బు మీద ఎక్కువ ఆశా, ప్రాణం మీద ఎక్కువ ఆశా?" అని ప్రశ్నించాడు.

జాంగ్‌లా ఓ క్షణకాలం తటపటాయించి, తరవాత చిన్నగొంతుతో, "శిఖి దొరా! నాకు రెంటి మీదా సమానమైన ఆశే వున్నది. ఒకటి లేకపోతే రెండోది వృథా!" అన్నాడు.

"ఎంత విశ్వాసఘాతుకుడివైనా, ఇప్పుడు అజాగ్రత్తవల్లనో, పరధ్యానం చేతనో నిజం చెప్పినట్టు కనబడుతున్నావు. ఈ క్షణం నుంచీ నీ ప్రాణం నా గుప్పిట్లో వున్నది. ఎలాంటి మోసం చేయకుండా గోల్‌ఖరాకు మమ్మల్ని చేర్చిన మరునిముషంలో నీకు



స్వేచ్ఛ యిస్తాను; కొంత ధనం కూడా యిస్తాను. విన్నావా?" అన్నాడు శిఖిముఖి.

"విన్నాను, దొరా! కామాఖ్యనగరంలో శిథిలాలయ పూజారి అంతులేని ధనం ఆశ చూపి, నన్ను వక్రమార్గం పట్టించాడు. ఇకనుంచీ మీకు విశ్వాసపాత్రుడుగా ఉంటాను," అన్నాడు జాంగ్లా.

శిఖిముఖి తలవూపి, జాంగ్లాను ముందు నడవమని, విక్రమకేసరితో రాత్రి తాము బసచేసిన చెట్టు దగ్గిరకు బయలుదేరాడు. వాళ్ళు ఆ చెట్టు దగ్గిరకు వచ్చేసరికి అజితుడూ, వీరభద్రుడూ ఎర్రగండుతో వినోదంగా ఆడుకుంటున్నారు. శిఖిముఖిని చూస్తూనే కుక్క అతడి దగ్గిరకు పరిగెత్తుకు వచ్చింది.

శిఖిముఖి, ఎర్రగండు తల నిమురుతూ, "మత్తుమందు దెబ్బ నుంచి యిప్పటికి కోలుకున్నావన్న మాట! ఇదుగో, ఆ మందు ప్రయోగించినవాణ్ణి ఓ కంట కనిపెట్టి వుండు. పారిపోవాలని చూస్తే, మమ్మల్ని హెచ్చరించ నవసరం లేదు, కంఠం కొరికి నెత్తురు తాగు," అన్నాడు జాంగ్లాను చూపుతూ.

ఎర్రగండు చిన్నగా మొరిగింది. జాంగ్లా వెలవెలపోతూ, "నేనిక నుంచి



తమకు విశ్వాసపాత్రుడైన సేవకుణ్ణి, దొరా!" అన్నాడు.

"ఆ సంగతి ముందుముందు నువ్వు రుజువు చేసుకోవలసి వున్నది. ప్రస్తుతానికి తాడుతో నీ చేతులు వెనక్కు విరిచికట్టి, పారిపోకుండా వుండేందుకు కంచరగాడిద మెడకు, ఆ తాడు బిగించబోతున్నాను," అన్నాడు శిఖిముఖి.

ఆ తరవాత అందరూ కలిసి తమ సామానులను రెండు కంచరగాడిదల మీదా వేసి తాళ్ళతో గట్టిగా కట్టారు. అజితుడు, జాంగ్లా చేతుల్ని వెనక్కు లాగి తాడుతో బలంగా ముడివేసి, రెండవ కొనను కంచర



గాడిద మెడకు కట్టారు. శశిముఖి ఆజ్ఞాపించగానే జాంగ్‌లా ముందుండి దారి తీయసాగాడు.

మిట్టమధ్యాహ్నం వరకూ వాళ్ళు అరణ్యంలో నడిచి, ఒక లోయలో ప్రవహిస్తున్న ఒక నది పాయను చేరారు. అది హిమాలయాల్లో పుట్టిన ఏదో ఒక పెద్ద నదికి ఉపనది అయివుంటుంది. నదిలో అక్కడక్కడా ఎత్తయిన రాళ్ళగుట్టలు వున్నవి. వాటి మీదా, నది అంచులనా అనేక వందల సంఖ్యలో మొసళ్ళు వున్నవి.

శశిముఖి ఆ మొసళ్ళ కేసి వింతగా చూస్తూ, "కేసరీ! మనం బహుశా యీ



నది దాటవలసి వుంటుందనుకుంటాను. నీటి వేగం హెచ్చుగా వున్నా, నది వెడల్పు నూరు గజాలకన్న ఎక్కువ వుండదు. కాని, యీ మొసళ్ళకు చిక్కకుండా దీన్ని దాటటం పెద్ద చిక్కు సమస్య," అన్నాడు.

"జాంగ్‌లా కావాలని మన నిక్కడికి నడిపించాడేమో అని నా అనుమానం. గోల్‌ఖరా గ్రామం చేరేందుకు యీ నదిని దాటవలసిన అవసరం వున్నదో లేదో వాణ్ణి అడిగి చూస్తాను," అన్నాడు కేసరి.

అందరికన్న ముందు నడుస్తున్న జాంగ్‌లాను సమీపించి విక్రమకేసరి, "జాంగ్‌లా! ఈ మొసళ్ళ నదికి దారి తీశావేం! గోల్‌ఖరా యింకెంత దూరం?" అని అడిగాడు.

జాంగ్‌లా రొప్పుతూ, "ఈ నదీతీరం వెంట నాలుగైదు కోసుల దూరం పోయి, ఒక కొండచరియ దాటి వెనక్కు తిరిగి ఒక కోసు దూరం వస్తే, గోల్‌ఖరా గ్రామం చేరవచ్చు. అలా కాక యిక్కడే నది దాటి వెళితే, ఆ గ్రామం సుమారు రెండు కోసుల దూరంలో వుంటుంది," అన్నాడు.

"ఈ కోసుల లెక్క ఏదో కొంత తికమకగా వున్నది. నదిలో యిన్ని మొసళ్లు వుండగా ప్రాణాపాయం లేకుండా దీన్ని దాటటం ఎలా?" అన్నాడు విక్రమకేసరి.








"చెట్లకొమ్మలు గాని, బోదెలు గాని నరికి తెప్పలు కట్టి వాటి మీద నది దాట వచ్చు, దొరా," అన్నాడు జాంగ్‌లా.

అంతలో అక్కడికి శిఖిముఖి వచ్చాడు. విక్రమకేసరి జాంగ్‌లా చెప్పినదంతా అతడికి చెప్పి, నీ అభిప్రాయం ఏమిటని అడిగాడు.

"అది కొంచెం తాపీగా ఆలోచించవలసిన సంగతి. మనను యీ జాంగ్‌లా గోల్‌ఖరా గ్రామం చేరుస్తున్నాడో, లేక శిథిలాలయ పూజారి మాటు పెట్టుకు కూచున్న చోటుకు చేర్చబోతున్నాడో ముందుగా తెలుసుకోవాలి. ముందు యిక్కడ వంటపనులు కానిచ్చి, భోజనాలు ముగించుకుని తరవాత ఏం చేయవలసిందీ ఆలోచిద్దాం," అన్నాడు శిఖిముఖి.

ఆ వెంటనే కంచరగాడిదల మీంచి సామానులు దించి అజితుడూ, వీరభద్రుడూ వంటపని ప్రారంభించారు. శిఖిముఖి, జాంగ్‌లా చేతికట్లు విప్పి, పారిపోవాలని ప్రయత్నిస్తే చావు తప్పదని హెచ్చరించాడు. ఈ లోపల విక్రమకేసరి ఒక ఎత్తయిన చెట్టు ఎక్కి, అక్కణ్ణించి పరిసరాలు పరిశీలించాడు. అతడికి నది అవతల సుమారు రెండుమూడు కోసుల దూరంలో, ఒక కొండ పాదం దగ్గిర్నుంచి పొగ వస్తూండటం కనిపించింది.

విక్రమకేసరి చెట్టు దిగి వచ్చి, శిఖిముఖికి యీ సంగతి చెప్పి, "అది గోల్‌ఖరాయే కావచ్చు," అన్నాడు.

"అయే వుంటుంది. భోజనాలైన తరవాత జాంగ్‌లాను చెట్టెక్కించి ఆ పొగ ఎక్కణ్ణించి వస్తున్నదో చూసి చెప్పమందాం. శిథిలాలయ పూజారి కూడా మన దారి తెన్నులు చూస్తూ, యీ ప్రాంతాల్లో ఎక్కడో వున్నట్టు తెలుస్తున్నది గదా. మనం తగు జాగ్రత్తలో వుండాలి," అన్నాడు శిఖిముఖి.







తరవాత అందరూ చెట్లనీడన కూర్చుని భోజనాలు చేశారు. నదిలో నుంచి నీరు తేవటానికి పోయిన అజితుడూ, వీరభద్రుడూ ఎంతో శ్రమపడి మొసళ్ళను బెదరకొట్టి పాత్రల్లో నీళ్ళు నింపుకోవలసి వచ్చింది.

"కేసరి దొరా! ఈ నదిని మనం దాటాలని చూడటం ప్రమాదకరం. నది వెంట ఎగువకు పోయి, యీ జాంగ్‌లా చెప్పిన కొండచరియ ఏదో దాటి, గోల్‌ఖరా చేరటం బావుంటుంది," అన్నాడు అజితుడు.

"అదే ఆలోచిస్తున్నాం. అసలు యీ మోసకారి మాటల్లో వున్న నిజమెంతో ముందు తెలుసుకోవాలి గదా," అన్నాడు విక్రమకేసరి.

శిఖిముఖి, జాంగ్‌లాను దగ్గిరకు పిలిచి, దాపులనున్న మహావృక్షం ఒకటి ఎక్కి, చుట్టుపక్కల పూజారిముఠాగాని, ఏదైనా గ్రామంగాని వున్నదేమో చూడమన్నాడు.

జాంగ్‌లా ఎలుగుబంటిలా చకచకా చెట్టు మీదికి పాకిపోయి, చుట్టూ ఓ మారు కలయచూసి, చిన్నగా నవ్వుకుని చెట్టు దిగి వచ్చాడు. వాడు నవ్వుకోవటం శిఖిముఖి వాళ్ళు గమనించలేదు.

జాంగ్‌లా, శిఖిముఖి దగ్గిరకు వచ్చి, "దొరా! దూరాన కొండల్లో గోల్‌ఖరా గ్రామం కొంచెంగా కనబడుతున్నది. గ్రామం చుట్టూ అరణ్యం కావటంతో కొత్త వాళ్ళు దాన్ని గుర్తించటం కష్టం. ప్రయాణమవుదామా?" అని అడిగాడు.

"ప్రయాణం యిప్పుడు కాదు, ఎండ తగ్గి చల్లబడిం తరవాత. నీ మిత్రులు— ఆ పూజారి ముఠా నది అవతల ఎక్కడైనా కనిపించిందా?" అని అడిగాడు శిఖిముఖి.

ఆ ప్రశ్న వింటూనే జాంగ్‌లా కొంచెంగా వణికి, "నన్నింకా నమ్మటం లేదా, దొరా! ఆ దుర్మార్గులు నా కంటబడితే ప్రాణాలతో వదలను," అన్నాడు.

"ఇదీ రుజావు కావలసిన సంగతి. కాని, ఒకవేళ నువ్వు ఏదైనా మోసానికి సాహసిస్తే మాత్రం నిన్నూ నేను ప్రాణాలతో వదలను," అన్నాడు శిఖిముఖి.

జాంగ్లా చేతులు రెండూ ఎత్తి శిఖిముఖికి నమస్కరిస్తూ, ఏమో చెప్పబోయేంతలో మేతకు వదిలిన కంచరగాడిదల్లో ఒకటి, నది ఒడ్డునే వున్న ఒక చెట్లపొద దగ్గిర్నుంచి పెద్దగా అరుస్తూ, దూరంగా పారిపోసాగింది. శిఖిముఖి, అజితవీరభద్రుల్ని దాన్ని మళ్ళ వేసుకురమ్మని చెప్పబోయేంతలో, జాంగ్లా కర్ర ఒకటి తీసుకుని, గాడిద కేసి పరిగెత్తాడు.

విక్రమకేసరి చప్పున విల్లంబులు చేత బట్టి, జాంగ్లా కేసి గురి చేశాడు. ఒకవేళ వాడు అరణ్యవృక్షాల్లోకి పారిపోవాలని చూస్తే, బాణంతో కొట్టటానికి అతడు సిద్ధంగా వున్నాడు.

ఈలోపల అజిత వీరభద్రులు కూడా అటుకేసి బయలుదేరారు.

జాంగ్లా పరిగెత్తుతున్నవాడల్లా నది ఒడ్డునున్న చెట్లపొద దగ్గిరకు వెళ్తూనే తటక్కున ఆగిపోయాడు. పొదలో నుంచి ఒక చిరుతగండు కోపంతో అరిచింది. అది ఆ సమయంలో అక్కడ తాను చంపిన లేడి నొకదాన్ని తింటున్నది. ముందు



కంచెరగాడిదా. తరవాత జాంగ్లా అక్కడికి పోయి దాన్ని రెచ్చగొట్టారు.

చిరుతపులి పొదలో నుంచి తల బయటికి పెట్టింది. పొదకు ఒక గజం దూరంలో జాంగ్లా భయకంపితులై, వెనక్కు అడుగు వేసేందుకూ కూడా శక్తిచాలక నిలబడి పోయారు. ఒక త్రుటికాలం యిలా చిరుతపులి, వారూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ స్థాణువుల్లా కదలామెదలక వుండి పోయారు. అంతలో చిరుత కసిగా అరిచి, జాంగ్లా కేసి లంఘించింది. జాంగ్లా చావు ఎలాగూ తప్పదనుకుని కర్రతో బలంగా చిరుతపులి తల మీద కొట్టారు. కాని, చిరుత బలం ముందూ, వేగం ముందూ అతడి శక్తి కొరగానిదై పోయింది.

చిరుతపులి, తన గొంతుపట్టుకోకుండా జాంగ్లా దాని మెడ మీద బలంగా ముష్టిఘాతా లివ్వసాగారు. అది కాళ్ళతో వాడి నడుం పట్టుకుని విదిలించింది. చిరుతా, జాంగ్లా కూడా ఒకళ్ళనొకళ్ళు బలంగా పట్టుకుని వుండటంతో, ఆ ఊపుకు వల్లంగా వున్న నదిలోకి దొర్లుకుంటూ పోయి, ప్రవాహంలో పడ్డారు.

ప్రవాహంలో పడినా ఒకళ్ళనొకళ్ళు వదలకుండా సంఘర్షిస్తున్న చిరుతా, మనిషీ మీదికి పది పన్నెండు మొసళ్ళు అన్ని వైపుల నుంచీ వేగంగా వచ్చిపడినై. కళ్ళాల మీద జరిగిపోయిన యీ ఘోరం చూసి, శశిముఖి నిశ్చేష్టుడైపోయాడు. కాని, విక్రమకేసరి, మొసళ్ళ కేసి బాణం తరవాత బాణం కొట్టసాగాడు.

పోరాడుతూ ప్రవాహం వెంట కొట్టుకు పోతున్న చిరుతపులి, జాంగ్లాల కేసి, నది అవతలి ఒడ్డునున్న చెట్లలో నుంచి బాణాలు రివ్వురివ్వు మంటూ రాసాగినై. అక్కడెవరో దాగివుండి జాంగ్లాకు తగలకుండా, గురిగా చిరుతపులి మీదికి బాణాలు వదులుతున్నారు. —(ఇంకా వుంది)





23

[జాంగ్‌లాను కంచరగాడిదకు కట్టించి, వాళ్ళే ముందుండి దారితీయమని శిఖిముఖి ఆజ్ఞాపించాడు. మధ్యాహ్నంవేళకు అందరూ ఒక నదీతీరం చేరారు. అక్కడ జాంగ్‌లా పైకి ఒక చిరుతపులి దూకింది. పులీ, వాడూ మొసళ్ళున్న నదిలో పడ్డారు. ఆ సమయంలో నది అవతలి నుంచి రివ్వుమంటూ బాణాలు రాసాగినై. తరవాత—]

నది అవతలి గట్టు నుంచి జాంగ్‌లా, చిరుతపులుల కేసి బాణాలు రావటం చూస్తూనే శిఖిముఖి ఓ క్షణకాలం ఆశ్చర్యపడి, విక్రమకేసరిని హెచ్చరించాడు. ఆ బాణాలు వదులుతున్నవాళ్ళు జాంగ్‌లా మిత్రులని అతడికి అనుమానం కలిగింది. ఆ మిత్రులు 'మరెవరో కాదు, పూజారిముఠా!

"కేసరీ! మనం నదీతీరం నుంచి కొంచెం వెనక్కు రావటం మంచిది. నది అవతలి నుంచి బాణాలు కొడుతున్నవాళ్ళు పూజారి ముఠా, సందేహం లేదు. మనం వాళ్ళ బాణాందెబ్బకు అందుబాటులో వున్నాం. జాగ్రత్త!" అన్నాడు శిఖిముఖి.

శిఖిముఖి హెచ్చరిక వింటూనే కేసరి, అజితవీరభద్రులు నదీతీరం నుంచి బాగా వెనక్కు వచ్చేశారు. ప్రవాహంలో జాంగ్‌లా, చిరుతపులి ఒకరి నుంచి ఒకరు వేరుపడిపోయారు. జాంగ్‌లా మునుగుతూ తేలుతూ,





నది అవతలి ఒడ్డుకు చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. చిరుతపులి గిలగిల తన్నుకుంటూ ప్రవాహం వెంట కొట్టుకుపోతున్నది. మొసళ్ళు కొన్ని, బాణాలు తగలటంతో బెదిరిపోయి దూరంగా పోసాగినై.

ఈ స్థితిలో చెట్లచాటు నుంచి ఒక దృఢకాయుడు తెప్ప నొకదాన్ని ఈడ్చుకుంటూ వచ్చి నదిలోకి వదిలాడు. అతడి వెనకగా పరిగెత్తుకొచ్చిన యిద్దరు వ్యక్తులు ఎగిరి దానిమీద ఎక్కి, చిన్నచిన్న తెడ్లతో దాన్ని బాణంలా కేసి తోసుకుపోసాగారు. తెప్పలో కొచ్చిన దృఢకాయుణ్ణి చూస్తూనే శిఖిముఖి వాడెవడైందీ గుర్తించాడు.

శిఖిముఖి, విక్రమకేసరికి వాణ్ణి చూపిస్తూ, "వాణ్ణి గుర్తించావా? వాడు సవరభేరుండం, పూజారి నౌకరు. గురిచూసి బాణం గుండెల్లో దూసుకుపోయేలా కొట్టు," అన్నాడు.

విక్రమకేసరి బాణం వదిలేందుకు గురిచూసేంతలో, సవరభేరుండం అయిదారడుగుల ఎత్తున్న ఒక డాలును పట్టుకుని, దాని మీంచి తల పైకెత్తి శిఖిముఖి కేసి చూస్తూ, "వాడెవడు, శిఖిముఖా? శబర పెద్ద శివాలుడి కొడుకా? ఎక్కడి కుంభార మిట్టపల్లె, ఎక్కడి బ్రహ్మపుత్రానది లోయలు! చావదలిస్తే యింత దూరం రావాలా? వృథా ప్రయాస!" అన్నాడు.

సవరభేరుండం మాట ముగించే లోపలే విక్రమకేసరి వదిలిన బాణం రివ్వుమంటూ పోయి డాలు పైభాగాన్ని తాకి, కింద పడిపోయింది. భేరుండం ఆ దెబ్బకు ఎగిరిపడి, "నా మాటలు వినబడుతున్నయ్యా? ఈ డాలు పూజారి దేవర మంత్రించి నాకిచ్చింది. దీని వెనక వున్నవాడికి ప్రాణభయం లేదు!" అన్నాడు.

విక్రమకేసరి విల్లుకు మరో అంబు పెట్టి వదలబోయేంతలో సవరభేరుండం దగ్గిరకు శిథిలాలయ పూజారి వచ్చాడు.



పూజారిని చూస్తూనే శిఖిముఖి చప్పున విక్రమకేసరి కేసి తలతిప్పి, "కేసరీ! ఇప్పుడు నువ్వు కొట్టవలసింది శిథిలాలయ పూజారిని. బాగా గురి చూడు. మేము తక్కినవాళ్ళ సంగతి చూస్తాం," అన్నాడు.

ఆ వెంటనే శిఖిముఖి, అజితవీర క్షత్రులు కూడా విల్లంబులు చేతికి తీసుకున్నారు. అందరూ మోకాళ్ళ మీద వంగి బాణాలు వదిలేందుకు గురి చూస్తున్నంతలో పూజారి పెద్దగా నవ్వుతూ కొంచెం వెనక్కుపోయి, "ఒరే, మూర్ఖుల్లారా! మీ బాణాలు యింత దూరం వచ్చి నన్ను తాకలేవు. అయినా ప్రయత్నించండి," అంటూ కేకపెట్టి, తన పక్కనున్న అడవి దొంగలకు సౌంజ్ఞచేశాడు.

దొంగలు గబగబా విల్లుకు బాణాలు సంధించి, శిఖిముఖివాళ్ళ కేసి విడవసాగారు. కాని, అవి వాళ్ళవరకూ రాకుండా మధ్య వున్న నదిలో పడిపోసాగినై. శిఖిముఖీ అతడి అనుచరులూ వదిలిన బాణాలు కూడా, పూజారి ముఖాను తాకలేదు. ఈ విధంగా నాలుగైదు నిమిషాలపాటు బాణాలు వదిలింతరవాత, యిందువల్ల ప్రయోజనంలేదని పూజారికీ, శిఖిముఖికీ కూడా తెలిసిపోయింది.



శిఖిముఖి తన అనుచరులకు యిక బాణాలు వ్యర్థపరచవద్దని చెప్పి, "మనం ఊహించినట్టు శిథిలాలయ పూజారి మనను వెన్నంటే వస్తున్నాడు. మన కన్న ముందుగా వాడు నది దాటాడంటే, బహుశా వాడు యీ నదికే గోలీభరా గ్రామం పోయి అక్కడివాళ్ళ నుంచి శిథిలాలయాన్ని గురించి చాలా భోగట్టా సంపాయించి వుంటాడు," అన్నాడు.

"అలా జరిగినట్టే తోస్తున్నది. జాంగ్లాను మన మీద తెలివిగా ప్రయోగించి ఆ దుర్మార్గుడు మన రహస్యాలు చాలా గ్రహించాడు," అన్నాడు విక్రమకేసరి.





"ఇప్పటి సమస్య ఎవరు ముందుగా శిథిలాలయాన్ని చేరతారనేది. గోల్‌ఖరా గ్రామంలో దాన్ని గురించిన వివరాలు మనం తెలుసుకుందాం అనుకున్నాం. ఒక వేళ పూజారి అక్కడికి ముందుగా పోయినా ముంచుకుపోయిందేమీ లేదు. వాణ్ణి ఆ శిథిలాలయ ప్రాంతంలోనైనా చేజిక్కించుకుని సర్వనాశనం చేయగలం," అన్నాడు శిఖిముఖి.

నదికి అవతలి నుంచి పూజారి ముఠా, ఇవతలి నుంచి శిఖిముఖి అతడి అనుచరులూ ఒకళ్ళనొకళ్ళు కొంతసేపు క్రోధంగా చూసుకుంటూ నిలబడ్డారు.

అప్పటి పరిస్థితుల్లో ఎవరికెవరూ హాని కలిగించలేరని రుజువైంది. శిఖిముఖి కొంచెం సేపు ఆలోచించి, విక్రమకేసరితో, "ఇక మనం, ఆ జాంగ్‌లా చెప్పిన కొండచరియ కేసి బయలుదేరదాం. గోల్‌ఖరా గ్రామం చేరేందుకు అది చుట్టుదారి అయినా తప్పదు. ఈ మొసళ్ళ నదిని శత్రువులు అవతలి గట్టున కాపు వేసుకుని వుండగా దాటాలని ప్రయత్నించటం ప్రమాదానికి దారి తీస్తుంది," అన్నాడు.

శిఖిముఖి యిలా అనగానే అందరూ ప్రయాణ సన్నాహాలు ప్రారంభించారు. తమతమ సామానులన్నీ కంచరగాడిదల మీద వేసి, నదీతీరం వెంట నడుస్తూ సూర్యాస్తమయం వేళకు కొండ ప్రాంతాన్ని చేరి అక్కడున్న చిన్న కొండచరియ నొకదాన్ని చూశారు.

నలుమూలలా చీకటి ముసురుకుంటున్న సమయంలో యిరుకుగా వున్న కొండచరియను దాటాలని చూడటం ప్రమాద కారణం అవుతుందని శిఖిముఖి, విక్రమకేసరి సంప్రతించుకుని నిర్ణయానికి వచ్చారు. ఆ ఇరుకు దారిలో పూజారి ముఠా ఏ రాళ్ళచాటునో వుండి తమ మీద హఠాత్తుగా దాడి చేయవచ్చు....



రాత్రి రెండు జాములు ముగిసేలోపలే అందరూ భోజనాలు చేశారు. జాము దిగిన చోట నెగడు వేయటంవల్ల, పూజారి మనుషులు తమ ఉనికి తెలిసిపోతుందన్న భయంతో శిఖిముఖివాళ్ళు నెగడు వెలిగించలేదు. కాని, కావలాకు ఒకరు కాకుండా యిద్దరు చొప్పున వుండటం మంచిదని నిశ్చయించుకున్నారు.

అర్ధరాత్రివరకూ, ఎక్కడో దూరాన అరణ్యమృగాల అరుపులు తప్ప, వాళ్ళున్న ప్రాంతాన మాత్రం ఎలాంటి సంచలనం కలగలేదు. ఆ తరవాత నదివైపు నుంచి ఏవో ధ్వనులు వినిపించసాగినై. వాటికి కారణం నదిలోని మొసళ్ళు ఏదో ఆహారం కోసం పోట్లాడుకోవటంగా అజితవీరభద్రులు భావించారు. కాని, ఆ ధ్వనులు వున్నకొద్దీ మరింత అధికం కావటంతో వాళ్ళిద్దరూ కత్తులు చేతబట్టుకుని జాగ్రత్తగా నడుస్తూ నదిని సమీపించారు.


నల్లని చీకటి పరుచుకుపోయిన నదిలో కొన్ని మానవాకారాలు కదులుతూండటం వాళ్ళిద్దరికి కంటబడింది. శత్రువులు తెప్పల మీద నదిని దాటుతున్నారన్న సూచనగా వాళ్ళ ఛాయలు అటూయిటూ వూగిసలాడుతున్నవి. అలా జరిగినప్పుడల్లా నీళ్ళు కలి



పెనపట్టు శబ్దం చేస్తున్నవి. వాళ్ళు అతి జాగ్రత్తగా తెడ్లు వేస్తున్నారన్న మాట!

అజితవీరభద్రులు, శిఖిముఖిని, విక్రమకేసరిని హెచ్చరించేందుకు దవ్వున వున్న చోటు నుంచి కదిలి వెనక్కు పరిగెత్తబోయారు. అంతలో వాళ్ళమీద చిక్కగా అల్లిన వెడల్పాటి వల ఒకటి విసురుగా వచ్చి పడింది. వాళ్ళు దాన్నుంచి తప్పుకునేందుకు ప్రయత్నించేలోపలే యిద్దరూ అందులో కదిలేందుకైనా వీలులేకుండా బిగించబడ్డారు. ఈ రకం వలల్ని ఆటవికులు జింకలనూ, లేళ్ళనూ పట్టేందుకు ఉపయోగిస్తూంటారు.





అజితవీరభద్రుడు వలలో గిలగిలా తన్నుకుంటూ, తమ యజమానుల్ని హెచ్చరించేందుకు అరవబోయేంతలో రెండు బలమైన చేతులు వాళ్ళ కంఠాల మీద పడినై. వాళ్ళు ఉక్కిరిబిక్కిరైపోయారు.

"అరిచేందుకు ప్రయత్నించకండి. మీ నాయకులిద్దర్నీ యింతకు ముందే బంధించాం." అన్నాడో కంఠం కోపంగా. ఆ మాట్లాడినవాడి దగ్గిరకు మరిద్దరు ఆటవికులు వచ్చారు.

తమను బంధించినవాళ్ళు ఏనుగు చర్మాలు ధరించి వుండటం అజితవీరభద్రులు గుర్తించారు. అంటే వీళ్ళు శక్తి లాలయ పూజారి ముఠావాళ్ళు కాదన్న మాట! అంతకు ముందు తమను హెచ్చరించినవాడన్నట్టు నిజంగా వీళ్ళు యీపాటికే శిఖిముఖిని, విక్రమకేసరిని కూడా బంధించి వుంటారా?

వాళ్ళిద్దరి సంశయం తొలగిపోయేట్టు మరుక్షణంలోనే శిఖిముఖివాళ్ళు పడుకున్న గుడారం వైపు నుంచి ఎర్రగండు అరుపూ, మనుషుల కేకలూ వాళ్ళకు వినిపించినై. అక్కడ కొద్ది క్షణాలసేపు గందరగోళం లేచి సద్దు మణిగిపోయింది. అంతవరకూ ఆ దిక్కు కేసి చూస్తున్న ఆటవికుడు తృప్తిగా తలాడించి, తన పక్కన వున్న వాళ్ళతో, "ఈ యిద్దర్నీ అక్కడికి మోసుకురండి!" అంటూ గుడారం వున్న చోటుకు కదిలాడు.

అజితవీరభద్రులున్న వలను యిద్దరిద్దరాటవికులు కర్రకు వేలాడ కట్టుకుని గుడారం దగ్గిరకు వచ్చి దింపారు. శిఖిముఖి చేతులనూ, విక్రమకేసరి చేతులనూ తాళ్ళతో బంధించి యిద్దరాటవికులు పట్టుకుని నిలబడి వున్నారు. ఎర్రగండు వలలో బంధించబడి వున్నది.

"వాళ్ళిద్దర్నీ వలలో నుంచి బయిటికి లాగి చేతులకు తాళ్ళు బిగించండి.



కుక్కను మాత్రం వలలోనే వుంచి కర్రకు వేలాడకట్టి భుజానవేసుకు రండి. జాగ్రత్త, అది యిప్పటికే మనవాళ్ళెందరి గొంతులు కొరికింది," అన్నాడొక ఆటవికుడు. వాడు వాళ్ళ నాయకుడు.

"ఆ కంచరగాడిదల సంగతేమిటి, దొరా?" అని అడిగా డొక ఆటవికుడు.

"కులపెద్దకు బహూకరిద్దాం. యింత మంచి జాతి కంచరగాడిదలు దొరకవు," అన్నాడు ఆటవిక నాయకుడు.

అంతవరకూ యిదంతా నిశ్శబ్దంగా చూస్తూ వూరుకున్న శిఖిముఖి పెద్దగా గొంతెత్తి అధికారం వుట్టిపడే స్వరంతో, "మీరెవరో మాకు తెలియదు. మేము మా మహారాజును వెతుక్కుంటూ యీ ప్రాంతాలకు వచ్చాం. హఠాత్తుగా దొంగల్లా మా మీదపడి మమ్మల్ని బంధించారు. ఇందుకు మీరు తప్పక ప్రతిఫలం అనుభవిస్తారు," అన్నాడు.

"ఈ బెదిరింపులూ, బడాయింపులూ మా కులపెద్ద వద్ద చెప్దువు గాని. కాళీ మాతకు ప్రసాదం అయ్యే ముందుగా మీ అందరికీ మాట్లాడేందుకు చాలా సమయం, అవకాశం వుంటుంది," అంటూ ఆటవికుల నాయకుడు వికవికా నవ్వాడు.



"మీది గోలేభరా గ్రామమా? మీరు ఋభ్యుజాతివాళ్ళా? మేం అక్కడికి వచ్చేందుకే బయలుదేరాం. కట్లు విప్పండి. మీ వెంట వస్తాం," అన్నాడు శిఖిముఖి.

"అదృష్టంకొండకి మీ రక్కడికి బయలుదేరింది మాకు ముందే తెలిసింది. అంతేకాక మీ రెంత ప్రమాదకారులో కూడా విన్నాం. నువ్వన్నట్టు మేం ఋభ్యుజాతి వాళ్ళమే. ఇక మాట్లాడకుండా వెంట రండి," అంటూ ఋభ్యుల నాయకుడు తన అనుచరులను హెచ్చరించాడు.

అందరూ నదిని చేరి అక్కడ సిద్ధంగా వున్న తెప్పల మీద ఎక్కి నది దాటి

సూర్యోదయంవేళకు గోళ్ళథరా గ్రామం చేరారు. గ్రామంలోని అభ్యుజాతి వాళ్ళంతా—ఆడా మగా పిల్లలూ వీధుల్లో చేరి శిఖిముఖివాళ్ళను వింతగా చూడ సాగారు. గ్రామం మధ్యనున్న ఒక విశాలమైన చుట్టు గుడిసెను చేరగానే అభ్యుల నాయకుడు తన అనుచరులను గుడిసె ద్వారం దగ్గిర ఆగమని చెప్పి, శిఖిముఖి వాళ్ళతో లోపలికి వెళ్ళాడు.


గుడిసె మధ్య గల ఒక ఎత్తయిన ఆసనం మీద అభ్యుల కులపెద్ద కూర్చుని వున్నాడు. అతడు బాగా వృద్ధుడు. వెడల్పాటి ముఖం, పెద్ద కళ్ళు, పొడవాటి మీసాలూ—అతడు చూడటానికి భయం కొల్పేట్టున్నాడు. అతడి వెనకగా అభ్యు జాతి మాంత్రికుడు నిలబడి వున్నాడు. దిగువన ఒక ముక్కాలిపీట మీద తృప్తిగా చిరునవ్వునవ్వుతూ శిథిలాలయ పూజారి కూర్చుని వున్నాడు.

"పూజారి ఇక్క యిక్కడున్నాడా? ఆశ్చర్యం!" అన్నాడు శిఖిముఖి హేళన చేస్తున్నట్టు.

"మిమ్మల్ని శిథిలేశ్వరికి బలి పెట్టవలసిన పని వుంది గదా? అందుకోసం వచ్చాను." అన్నాడు పూజారి.

"ముందు కాళీమాతకు బలి యిచ్చిం తరవాత, ఆ ఎంగిలి ప్రసాదాన్ని నువ్వేమైనా చేసుకో, తెలిసిందా?" అంటూ అభ్యుజాతి మాంత్రికుడు కోపంగా పూజారి కేసి కళ్ళురిమాడు.

"శాంతించండి!" అంటూ అభ్యుల కులపెద్ద చేయి ఊపి, శిఖిముఖి, విక్రమకేసరుల కేసి నిశితంగా చూస్తూ, "మీ నలుగుర్నీ బలి చేయాలని నాకు లేదు. మీలో నాయకుడెవరు? వాణ్ణొక్కణ్ణే కాళీమాతకు బలి పెడతాను. తక్కినవాళ్ళు స్వేచ్ఛగా తిరిగిపోవచ్చు. నాయకుడెవరో ముందు చెప్పండి?" అన్నాడు. —(ఇంకా వుంది)





శిథిలాలయం


24

[చిరుతపులి, మొసళ్ళ బారినుంచి జాంగిలాను శిథిలాలయ పూజారి మరో రక్షించాడు. ఆ రాత్రి కొండచరియ ప్రాంతాన నిద్రిస్తున్న శిఖిముఖిని, అతని అనుచరులనూ ఇఖ్య జాతివాళ్ళు పట్టుకుని తమ పల్లెకు తీసుకుపోయారు. వాళ్ళ కులపెద్ద కాళీమాతకు బలి యిచ్చేందుకు శిఖిముఖి అనుచరులను తమ నాయకుడెవరో చెప్పమన్నాడు. తరవాత—] .

ఇఖ్యుల కులపెద్ద, శిఖిముఖి వాళ్ళను అడిగిన ప్రశ్న వింటూనే శిథిలాలయ పూజారి మహదానంద పడిపోయాడు. అతడికి, యీ దెబ్బతో శిఖిముఖి కాళీ మాతకు బలి అయిపోతాడని, ఆ అటవికుడి సహాయం కోల్పోయిన విక్రమకేసరిని తేలిగ్గా హత మార్చవచ్చని అనిపించింది.

"ఇఖ్య నాయకా! మీరు వాళ్ళను ఆ ప్రశ్న అడగ నవసరం లేదు. వాళ్ళ నాయకు డెవరో తెలుస్తూనే వున్నదిగదా— ఆ అటవికుడు శిఖిముఖి శిథిలాలయం పేరుతో ధనాశ చూపి తతిమ్మా ముగ్గురినీ యింత దూరం తీసుకువచ్చాడు," అన్నాడు శిథిలాలయ పూజారి.

పూజారి మాటలు వింటూనే ఇఖ్య కులపెద్ద కోపంగా తల తిప్పి అతడి కేసి చూశాడు. ఇఖ్య మాంత్రికుడు తన చేతి లోని దండంతో పూజారి వీపుమీద పొడిచి,



"కులపెద్ద అనుమతి ముందుగా తీసుకుని తరవాత మాట్లాడాలి! ఆపాటి మర్యాద కూడా నీకు తెలియదా?" అన్నాడు.

పూజారి చిన్నగా మూలిగి చేత్తో వీపు తడుముకున్నాడు. అభ్యు కులపెద్ద మరోసారి మొదట వేసిన ప్రశ్నను శిఖిముఖి, విక్రమకేసరుల కేసి చూస్తూ గట్టిగా అడిగాడు. విక్రమకేసరి ఏదో జవాబు చెప్పబోయేంతలో శిఖిముఖి అతణ్ణి వారించి, "పూజారి చెప్పినట్టు నేనే యీ అందరికీ నాయకుణ్ణి. కాని, అతనన్నట్టు నేను వీళ్ళను ధనాశ చూపి యింత దూరం తీసుకురాలేదు. మేము యీ ప్రాంతాలకు వచ్చింది విక్రమకేసరి అనే మా మహారాజు కోసం. ఆయన యీ ప్రాంతాల ఎక్కడో వున్నాడని సమాచారం అందింది," అన్నాడు.

'విక్రమకేసరి' అన్న మాట వింటూనే అభ్యు కులపెద్ద ఉలిక్కి పడ్డాడు. అది గమనించిన పూజారి, "అభ్యునాయకా, మీ అనుమతితో మాట్లాడుతున్నాను. విక్రమకేసరి మహారాజు రాకాపోకా అంతా ఏళ్ళూ పూళ్ళనాటి మాట గదా? వీళ్ళు ఆయన పేరు ఎక్కడో విని, ఆ పేరు చాటున కపట నాటకం ఆడుతున్నారు. వీళ్ళు నిజంగా వచ్చింది, శిథిలాలయంలోని వెండి బంగారాలు దోచుకు పోయేందుకు," అన్నాడు.

అభ్యు కులపెద్ద తలాడించి ఒకటి రెండు క్షణాలు మౌనంగా వూరుకుని, తరవాత శిఖిముఖిని, "మిమ్మల్ని గురించి నాకు సర్వం తెలుసు. అనవసర ప్రసంగం వద్దు. మీలో నాయకుడెవరు?" అని అడిగాడు కఠినంగా.

"చెప్పాను గదా, నేనే నాయకుణ్ణి! నా పేరు శిఖిముఖి!" అంటూ శిఖిముఖి ఒకడుగు ముందుకు వేశాడు.

విక్రమకేసరి అతడి భుజం పట్టుకుని లాగుతూ, "నేను రాజవంశంవాణ్ణి, క్షత్రియుణ్ణి! నాకు ఆటవికుడు నాయకు డెలా



కాగలరు? వీళ్ళ ముగ్గురికీ నాయకుణ్ణి నేను. నా పేరు విక్రమకేసరి. ఆ కాళీమాతకు నన్నే బలి పెట్టండి. కాని, బలి అయిపోయే ముందు మీలో కొందరినైనా బలి పుచ్చుకు తీరతాను," అన్నాడు రౌద్రంగా.

శిథిలాలయ పూజారి పెద్దగా నవ్వుతూ, "ఎంత మోసం! తన పేరు విక్రమకేసరి అని పచ్చిఅబద్ధం ఆడేస్తున్నాడు. పైగా అభ్యజాతివాళ్ళను బలి పుచ్చుకుంటాడట! అహ్హహ్హ!" అన్నాడు.

విక్రమకేసరి మాటలు అభ్య కుల పెద్దకు బాగా కోపం తెప్పించినై. అతడు తన అనుచరుల్ని హెచ్చరిస్తూ, "ఈ శిఖిముఖి, విక్రమకేసరులమని చెప్పుకునే వాళ్ళిద్దరూ చాలా ప్రమాదకారుల్లా వున్నారు. తక్షణం యిద్దర్నీ కాళీమాతకు బలి చెయ్యండి. మిగతా యిద్దరి సంగతి తరవాత ఆలోచిద్దాం. నడవండి, కాళీమాత ఆలయానికి," అంటూ ఆసనం మీదినుంచి లేచి బయలుదేరాడు.

శిఖిముఖి, విక్రమకేసరి ముఖముఖాలు చూసుకున్నారు. వాళ్ళకు ఇక అభ్యకుల పెద్దతో మాట్లాడి ప్రయోజనం లేదన్నభావం కలిగింది. తమకు మరణం ఎలాగూ తప్పదు, కాని వెంట వచ్చిన అజిత వీరభద్రులు అనవసర కష్టాలపాలు అవుతా రన్న భయం యిద్దర్నీ బాధించసాగింది.

అభ్య కులపెద్ద వెనకగా అందరూ చుట్టు గుడిసె నుంచి బయటికి వచ్చి, పెద్ద వీధి వెంట కొంతదూరం నడిచి, గ్రామానికి అల్లంత దూరంలో ఒక ఎత్తయిన ప్రదేశంలో వున్న కాళికాలయాన్ని చేరారు.

అభ్య మాంత్రికుడు చేత కత్తి పట్టుకుని, భయంకర రూపంలో వున్న కాళికాదేవి విగ్రహం ముందుకు పోయి, పెద్ద స్వరంతో ఏవో మంత్రాలు చదివి, "కట్లువిప్పి ఇక ఆ శిఖిముఖి, విక్రమకేసరి అనేవాళ్ళను దేవి ముందుకు తీసుకురండి," అన్నాడు.



మాంత్రికుడి ఆజ్ఞ శిథిలాలయం పూజారికి చాలా సంతోషం కలిగించింది. అతడు అభ్యు కులపెద్ద పక్కన చేరి పనిలో పనిగా అజిత వీరభద్రుల్ని కూడా దేవికి బలి పెట్టటం బావుంటుందని సలహా యిచ్చాడు. దానికి కులపెద్ద అవును కాదన్నట్టుగా తల వూపసాగాడు. అతడి దృష్టి విక్రమకేసరి మీదే కేంద్రీకరించబడి వున్నది. విక్రమ కేసరి ముఖకవళికల్లో అతడికి తాను బాగా ఎరిగిన ఒక వ్యక్తి ముఖలక్షణాలు ఛాయా మాత్రంగా కనిపించసాగినై.

శిఖిముఖి వాళ్ళను కొండచరియ దగ్గిర పట్టుకున్న అభ్యు దళనాయకుడు, శిఖిముఖినీ, విక్రమకేసరినీ వదిలించి వాళ్ళ భుజాలు పట్టుకుని, కత్తియెత్తి సిద్ధంగా వున్న అభ్యు మాంత్రికుడి ముందుకు తేయబో యాడు. అదే అదనుగా విక్రమకేసరి గుప్పెట బిగించి అభ్యు దళనాయకుడి తలమీద బలంగా కొట్టాడు.

ఆ దెబ్బకు వాడు దిమ్మెరపోయి కింద పడేంతలో, శిఖిముఖి మాంత్రికుణ్ణి కాలుతో బలంగా ఒక్క తన్ను తన్నాడు. మాంత్రి కుడు ఒక్క కేక పెట్టి పక్కకు పడి పోయాడు. అతడి చేతిలోని కత్తి ఎగిరి దూరంగా పడింది. శిఖిముఖి ఆ కత్తిని దొరక పుచ్చుకునేందుకు ముందు కురి కేంతలో, ఇద్దరు అభ్యులూ, శిథిలాలయ పూజారి బంటొకడూ అతడి మీద పడి చేతులు విరిచి పట్టుకున్నారు. విక్రమకేసరి అతడికి సహాయం వెళ్ళేలోపల అతడి మీద మరి నలుగురు అభ్యులు వచ్చి పడి, కదల కుండా పట్టుకున్నారు.

క్షణంలో జరిగిపోయిన, యీ గందర గోళం చూసి అభ్యు కులపెద్దకు ఆశ్చర్యం, కోపం కూడా కలిగింది. అతడు కళ్ళెర్ర చేసి, మీసం మెలివేస్తూ శిఖిముఖి ముందుకు పోయి, అతడి మెడ పట్టుకుని, "కాళీమాత ముందు నువ్వు చేసిన అపచారానికి నిన్ను

చిత్రవధ చేయిస్తాను! ఈ విక్రమకేసరి అని చెప్పాకు నేవాళ్ళి....''

అభ్యుకుల పెద్ద మాట ముగించే లోపల శిఖిముఖి తన మెడపట్టు వదిలించుకునేందుకు విసురుగా పక్కకు తిరిగాడు. ఆ ఊపుకు అభ్యుకుల పెద్ద చేయి పట్టుతప్పి, శిఖిముఖి మెడలో వున్న రక్షరేకు మీదపడి, దారంతెగి, అతడి చేతిలోకి వచ్చింది.

రక్షరేకు మీద గల కాళీమాత రూపం చూస్తూనే అభ్యుకులపెద్ద ఓ క్షణకాలం నిర్విణ్ణుడై పోయి, అంతలోనే తెప్పరిల్లి చేయెత్తి, "వీళ్ళిద్దరికీ ఎలాంటి హాని కలిగించకండి. ఇదేదో వింతగా వుంది!" అంటూ రక్షరేకును అటూ యిటూ తిప్పి పరీక్షించసాగాడు.

శిఖిముఖి, విక్రమకేసరులు క్షణాలమీద కాళికాదేవికి బలైపోతారని ఎదురుచూస్తున్న శిథిలాలయం పూజారికి, అభ్యుకులపెద్ద మాటలు చాలా ఆశాభంగం కలిగించినై. అతడు జంకుతూ జంకుతూ అతణ్ణి సమీపించి భుజం మీదుగా వంగి రక్షరేకు కేసి చూసి, పళ్ళు కొరికాడు.

"అభ్యునాయకా! ఇది పచ్చిమోసం! దైవద్రోహం! ఈ దేవాలయంలోని పవిత్రమైన కాళీమాత రూపానికి, యీ నాస్తిక వెధవలు నకళ్ళు తయారుచేయించి, మెడల్లో





"దైవదూషకా! అది రాగిముక్కా? జగజ్జనని కాళీమాతనా నువ్వవమానిస్తున్నది! చూస్తారేం, వాడి తల నరకండి!" అంటూ శిథిలాలయ పూజారి అరిచాడు.

ఇభ్య కులపెద్ద కళ్ళెర్ర చేసి, పూజారి కేసి తిరిగి, "నువ్వు కావటానికి అర్చకుడివైనా, ఏవో దుష్టశక్తులు సంపాయించేందుకు నీచోపాసన చేస్తూండటం తెలిసే నిన్ను కులంలో నుంచి బహిష్కరించాం. అటువంటి బహిష్కృతుడివి నువ్వు యిక్కడ పెద్దరికం చేయాలని చూశావే, ముందు నిన్ను బలిపెడతాను," అన్నాడు.

ఆ హెచ్చరికతో పూజారి అదురుకుని వెనక్కు తిరిగి, తన అనుచరులకు సొంజ్ఞ చేశాడు. అందరూ అతడి చుట్టూ మూగారు.

వేళ్లాడకట్టుకు తిరుగుతున్నారు. ఎంత అపచారం! ఎంత అపచారం!" అంటూ శిఖిముఖి కేసి దూకబోయాడు పూజారి.

ఇభ్య కులపెద్ద అతణ్ణి చేతితో వెనక్కు నెట్టి, "కొంచెంసేపు నీ వాగుడు కట్టిపెట్టు!" అని గట్టిగా హెచ్చరించి, శిఖిముఖిని, "ఈ రక్తరేకు నీ కెక్కడ దొరికింది?" అని అడిగాడు.

శిఖిముఖి పళ్ళుకొరుకుతూ, ఇభ్యకుల పెద్ద కేసి చూసి, "ఆ రక్తరేకు నా కెక్కడ దొరికిందో నీకు చెప్పవలసిన అవసరం ఏమిటి? ఆ రాగిముక్క గురించి నీవు తెలుసుకోవలసిందేమీ లేదు," అన్నాడు.

శిఖిముఖికి, ఇభ్య కులపెద్ద అన్న మాటలూ, అతడు రక్తరేకును పరీక్షిస్తున్న తీరూ చూసి చాలా ఆశ్చర్యం కలిగింది. ఆ వెంటనే అతడికి ఆ రక్తరేకు విక్రమకేసరి తాతగారి వయిన తాళపత్రాలు గల పెట్టెలో దొరికింది అన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. అంతే కాక దాని సాయంతో తామందరం బయట పడవచ్చునేమో నన్న ఆశకూడా కలిగింది.

శిఖిముఖి, విక్రమకేసరి కేసి చూసి అతడూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు





గమనించి, దవ్వున ఝభ్యు కులపెద్ద కేసి తల తిప్పి, "ఝభ్యునాయకా! నీలో ఏ మూలనో కొంచెం మానవత్వం వున్నదన్న సంగతి, యింతకుముందు నీవు అన్న మాటలవల్ల గ్రహించాను. ఆ పూజారి పరమదుర్మార్గుడు. అది అలా వుంచుదాం. ఈ రక్షరేకు మా మహారాజైన విక్రమకేసరికి ఎవరో బహూకరించారు. అది ఆయన వదిలిపోయిన తాళపత్రాలు గల పెట్టెలో దొరకగా, దాన్ని ఆయన కుమారుడైన శూరసేనదేశపు రాజు జయపాలుడు నాకు స్వయంగా మెడలో కట్టాడు," అన్నాడు.

ఆ మాటలు వింటూనే ఝభ్యుకుల పెద్ద అదిరిపడి, శిఖిముఖి కేసీ, విక్రమకేసరి కేసీ, ఓమారు చూసి, ఒక్క అంగలో విక్రమకేసరిని సమీపించి, అతణ్ణి గట్టిగా కావిలించుకుని, "నువ్వు ఆ మహారాజు విక్రమకేసరి మనవడివా? మా జాతివాళ్ళను మహామ్మారి రోగానికి బలికాకుండా కాపాడిన ఆ మహారాజు వంశాంకురానికి ఎంతద్రోహం చేశాను!" అంటూ కళ్ళనీళ్ళు పెట్టాడు.

తమ కులపెద్ద యిలా అనగానే, అక్కడ చేరిన ఝభ్యులూ, ఝభ్యు మాంత్రికుడూ, ముందుకు వచ్చి వాళ్ళిద్దరి ముందూ చేతులు కట్టుకుని నిలబడ్డారు.

ఝభ్యు కులపెద్ద, శిఖిముఖిని దగ్గిరకు పిలిచి, సాదరంగా అతడి భుజం మీద చేయివేసి, రక్షరేకును తిరిగి అతడి మెడలో వేలాడ కడుతూ, "అప్పుడు మీరేం చెప్పకుండానే, నాకు మీరు వచ్చిన పని చాలా వరకు తెలిసిపోయింది. మీరు ఆ మహారాజు సజీవుడేమో అన్న అనుమానంతో వెతుకుతూ బయలుదేరి యిక్కడికి వచ్చారు. కాని, ఆయన ఎక్కడో కొండల్లో విషజ్వరంతో చాలాకాలం బాధపడి మరణించారు. ఆయన మీది భక్తికొద్దీ ఆయన మృతదేహాన్ని తెప్పించి, మా పూర్వుల సమాధి పక్కనే సమాధి చేయించాను.



ఈ రక్తలేపనం ఆ మహానుభావుడికి కృతజ్ఞతా సూచకంగా లోగడ నేనూ, నా జాతి వాళ్ళమూ యిచ్చాము," అన్నాడు.

శిఖిముఖి ఆ మాటలకు నవ్వి, "మీరు మేం చెప్పేది సాంతం వినకుండానే మమ్మల్ని కాళికాదేవికి బలి యివ్వ జూపారు. మిమ్మల్ని అపమార్గం పట్టించిన వాడు, ఆ దుర్మార్గుడైన శిథిలాలయ పూజారి. ముందు వాణ్ణి పట్టి బంధించండి. వాడు మాకూ మీకూ కూడా చేసిన ద్రోహం చాలా వుంది," అన్నాడు.

అభ్యుకులపెద్ద పళ్ళు కొరుకుతూ తన కులంవాళ్ళ కేసి తిరిగి, "ఆ నీచు డెక్కడ? లాక్కు రండి! కాళీమాతకు బలి యివ్వండి!" అంటూ అరిచాడు.

మందిరంలో వున్నవాళ్ళంతా చుట్టూ కలయ చూశారు. అక్కడ పూజారిగాని, అతడి అనుచరులుగాని లేరు. అభ్యుకుల పెద్దతోపాటు అందరూ, "ఆ నీచుణ్ణి పట్టు కొండి!" అంటూ మందిరం నుంచి బయటికి పరిగెత్తుకొచ్చారు.

కాళీదేవి మందిరం వున్న గుట్టకు పక్కనే వున్న ఒక పెద్ద కొండ మీద శిథిలాలయ పూజారీ, అతడి బంట్లూ నిలబడి వున్నారు. అభ్యుకులపెద్దను చూసి అతడు, "ఈ మహా శక్తిమంతులు, మీకు పట్టు బడతారా! ఇన్నాళ్ళకు వాడు శిథిలాలయం ఎక్కడున్నదీ తెలిసిపోయింది. చేవ వుంటే అక్కడికి రండి, మీరో నేనో తేల్చుకుందాం!" అంటూ కేక పెట్టాడు.

అభ్యుకులపెద్ద తనవాళ్ళ కేసి తిరిగి, "ఆ సంకరజాతి వెధవను ప్రాణాలతో పట్టు కొచ్చినవాడికి నా పదో భార్య చిన్న కూతు ర్నిచ్చి పెళ్ళి చేస్తాను," అన్నాడు పెద్దగా.

అభ్యుక యువకులూ, నడి వయసు వాళ్ళూ పులుల్లా రంకెలు వేస్తూ, పూజారి నిలబడి వున్న కొండమీదికి వేగంగా పరిగెత్తసాగారు. —(ఇంకా వుంది)





25

[శిఖిముఖిని కాళికాదేవికి బలిచేయబోయే సమయంలో, ఇభ్యులకులపెద్ద, అతడి మెడ లోని కాళీమాత రూపంగల రక్షరేకు చూసి ఆశ్చర్యపోయాడు. తరవాత సంగతి తెలుసుకుని, పూజారిని దేవికి బలిపెట్టమన్నాడు. కాని, పూజారి కొండ మీదికి పారి పోయాడు. ఇభ్యులు అతణ్ణి పట్టుకునేందుకు కొండ మీదికి పరిగెత్తసాగారు. తరవాత—]

తనను పట్టుకునేందుకు వచ్చే ఇభ్యులను చూసి పూజారి ఏమీ తొణక్కుండా, శిర స్త్రాణంలో నుంచి ఒక పొడవాటి తాళపత్రం బయిటికి తీసి, దాన్ని శిఖిముఖీ, విక్రమ కేసరుల కేసి ఊపుతూ నిలబడ్డాడు. విక్రమకేసరి తన దుస్తుల్లో తాళపత్రం కోసం వెతికాడు. అది అక్కడ లేదు.

"శిఖీ! వాడు మన కేసి చూపుతున్న తాళపత్రం ఏమిటో తెలుసా? దాని మీదే శిథిలాలయానికి వెళ్ళే దారి మార్గానికి సంబంధించిన వివరాలన్నీ వున్నవి. కాళికా దేవి గుడిలో జరిగిన గొడవలో అది, నా దుస్తుల్లో నుంచి కింద పడివుంటుంది. దాన్ని ఆ దుర్మార్గుడు దొరక పుచ్చుకున్నాడు," అన్నాడు విక్రమకేసరి.

శిఖిముఖి ఓ క్షణం నిస్పృహలో మునిగిపోయి, అంతలోనే తెప్పరిల్లి, "జరి గిందానికి విచారించి లాభం లేదు. ఇప్పుడు





"ఇభ్యనాయకా, మీ సలహా ఏదో చెప్పండి, వింటాం!" అన్నాడు శిఖిముఖి.


"ఆ లంకను దూరాన వుండి చూసిన వాళ్ళున్నారు తప్ప, నా ఎరుకలో దాని మీదికి పోయి, ఆ శిథిలాలయాన్ని చూసిన వాళ్ళు మాత్రం లేరు. ఆ లంక చాలా భయంకరమైనది. కొండ చేంతాడంత పాములూ, రాక్షసి తేళ్ళూ ఆ లంక నిండా వున్నవని మా వాళ్ళు చెప్పుకుంటారు. దాని పేరే వృశ్చికలంక! ఇంతకూ మీ రా లంకకు వెళ్ళవలసిన అవసరం ఏమిటి?" అని ప్రశ్నించాడు ఇభ్యకులపెద్ద.

ఈ ప్రశ్న చాలా సబబైనదిగా శిఖిముఖికి తోచింది. తాత విక్రమకేసరి సజీవుడేమో అన్న అనుమానంతో తాము బయలు దేరారు. ఆయన చాలా కాలం కిందటే మరణించినట్టు తెలిసిపోయింది. ఇక యిప్పుడు శిథిలాలయాన్ని చూడబోయే ప్రయత్నంలో అనవసరమైన యిక్కట్లు తెచ్చుకోవటం ఎందుకు?

శిఖిముఖి తన అభిప్రాయం విక్రమ కేసరికి చెప్పాడు. విక్రమకేసరి ఓ క్షణం ఆలోచించి, "శిఖీ! మా తాతగారు చూడ దలిచి విఫలుడైన ఆ శిథిలాలయాన్ని నేను చూడాలనుకుంటున్నాను. మా తాతగారు

ఆ శిథిలాలయం చేరటానికి వున్న ఉపాయం ఒకటే. మనం ఆ పూజారిగాణ్ణి వెన్నంటి పోవటం, వీలైతే పట్టుకోవటం," అన్నాడు.

వీళ్లిద్దరి సంభాషణా విన్న ఇభ్యులకుల పెద్ద, వాళ్ళకు ధైర్యం చెబుతూ, "విచా రించకండి. ఆ శిథిలాలయం వున్న లంకకు వెళ్ళ దలిస్తే, అందుకు మీకు సహాయ పడేందుకు అవసరం అయినవాళ్ళు ఒక రిద్దరు, మా జాతివాళ్ళలో వున్నారు. మా దళనాయకుడు నాంగ్‌సోమ్ చిన్నతనంలో తండ్రి వెంట ఆ లంక సమీపానికి వెళ్లి వచ్చాడు. అతడు మీకు దారి చూపగలడు. కాని, నా సలహా...." అంటూ ఆగిపోయాడు.






అక్కడ దొరికే బంగారాన్నే కాక, అపూర్వ మైన శిల్ప కళాఖండాలను కూడా మా రాజధానికి తేవాలనుకున్నారు. ఆ పని సాధ్యమైతే నేను చేసి, ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని వున్నది," అన్నాడు.

"అలా అయితే నేనూ నీ తోటివాణ్ణే. మన కిన్ని యిక్కట్లు కలిగించిన ఆ పూజారి దుర్మార్గుడి అంతం ఒకటి చూడాలి. అంతే కాక....నాగుమల్లి వాడి శిఖ తరిగి తెమ్మన్నది. అది లేకుండా నేను మళ్లీ ఆవిడ ముఖం ఎలా చూసేదీ?" అన్నాడు శిఖిముఖి.

ఆ మాటలకు విక్రమకేసరి చిరునవ్వు నవ్వి, "ఇంకేం, ఆ శిథిలాలయం ఎక్కడున్నదో వెతుక్కుంటూ వెళ్ళేందుకు మన ఇద్దరికీ అవసరం అయిన కారణం, ప్రోత్సాహం కూడా వున్నది. ఆ పూజారి మనకు ఆ శిథిలాలయం దగ్గిరగాని దొరకడు," అన్నాడు.


"అంత దూరం ఎందుకు, మా వాళ్ళు యిప్పుడే ఆ వెధవను పట్టుకుని కాళ్లూ చేతులూ కట్టి మనదగ్గిరకు తీసుకువస్తారు," అన్నాడు ఇభ్యకులపెద్ద.


కులపెద్ద మాటముగించే లోపలే, పూజారి వెనక నుంచి నవరభేరుండం హఠాత్తుగా



ముందుకు వచ్చి, అక్కడున్న ఒక పెద్ద బండను పైకెత్తి పట్టుకుని, "ఈ భేరుండం పక్కనుండగా పూజారి దొరను ఎవరూ పట్టుకోలేరు. కావాలంటే యీ కొండనే దొర్లించేయగలను!" అంటూ కొండ ఎక్కి వస్తున్న ఇభ్యుల కేసి బండను విసిరాడు.

తమ మీదికి దొర్లి వస్తున్న రాతిబండను తప్పుకుని ఇభ్యులు మరింత బిగ్గరగా అరుస్తూ కొండ ఎక్కసాగారు. పూజారి తాళపత్రాన్ని శిరస్త్రాణంలో దాచి, తన అనుచరుల కేసి తిరిగి, "చూస్తారేం, అందరూ బండరాళ్ళను ఆ చవట వెధవల మీదికి ఒకేసారి దొర్లించి, బిలం ప్రవే





శించండి," అని కొంచెం ముందుకు వచ్చి, శిఖిముఖి వాళ్ళతో, "ప్రాణాలమీద ఆశ లేకపోతే, మీరంతా వృశ్చికలంకకు రండి! అక్కడ మహా శిథిలేశ్వరికి మిమ్మల్ని బలి పెట్టి, యీ బ్రహ్మపుత్రా లోయల్లో ఒక ఇభ్య మహాసామ్రాజ్యాన్ని స్థాపించి, చక్రవర్తి నవుతాను," అంటూ పెద్ద గొంతుతో అరిచాడు.

"చూస్తున్నారు గదా, వాడు పట్టి వాచాలుడు! మా వాళ్ళు వాణ్ణి తప్పకుండా బంధిస్తారు," అన్నాడు ఇభ్యకులపెద్ద.


శిఖిముఖి, విక్రమకేసరులకు మాత్రం పూజారి ఒక పట్టాన దొరుకుతాడన్న నమ్మకం లేదు. వాళ్ళు అజిత వీరభద్రుల్ని హెచ్చరించి త్వరత్వరగా కొండ మీదికి పోయారు. వాళ్లు వెళ్లేసరికి అక్కడ కొందరు ఇభ్యులు నిలబడి, నీటితో నిండివున్న ఒక బిల మార్గం కేసి చూస్తున్నారు. పూజారిముఠా ఆ బిలంలో ప్రవేశించి, పక్కనేవున్న చిన్న కొలనులోని నీరు అందులో ప్రవేశించేలా రాళ్ళను తొలగించారు.

"వీడు మహా జిత్తులమారి! పారిపోవటానికి ముందుగా మార్గం చూసుకునే మనతో అంతసేపు మాటలు పెట్టుకున్నాడు," అన్నాడొక ఇభ్యుడు.

"వాడి జిత్తుల సంగతి మీ కన్న మాకు బాగా తెలుసు. మీరు యిక్కడ కాలం వృధా చెయ్యక, కొండ మీద అన్ని వైపులకూ పోయి, వాడు తన ముఠాతో ఏ బిలం నుంచి బయటపడతాడో కనిపెట్టండి. ఆ తరవాత ఒకళ్ళిద్దరు వెనగ్గా అనుసరించి పోయి, వా డెళ్ళే మార్గం ఏదో మాకు వార్త పంపండి," అన్నాడు విక్రమకేసరి.

ఇభ్యులు కొండ మీద అన్ని వైపులకూ పరిగెత్తారు. శిఖిముఖీ, విక్రమకేసరులు తమ అనుచరు లిద్దరితో కొండ దిగివచ్చి, అక్కడ తాము చూసిందంతా ఇభ్యుల నాయకుడికి చెప్పారు.


CHITRA



"అయితే, ప్రస్తుతానికి వాడు మన నుంచి ప్రాణాలతో పారిపోయినట్టే. శిథిలాలయం చేరటానికి వాడికి దగ్గిరవున్న తాళపత్రం సాయపడుతుంది. మరి మీ సంగతేమిటి? మీరు అక్కడికి వెళ్ళాలనే పట్టుదలలోనే వున్నారా?" అని అడిగాడు ఇభ్యుల నాయకుడు.

"ఆ దారి తెలిసిన నాంగ్‌సోమ్ అనే మీ దళనాయకుణ్ణి మాకు సాయం యిస్తే, మేము తప్పక బయలుదేరి పోతాం. మాకు ఆ ఆలయంలో వున్న ధనకనకాల మీద ఎలాంటి ఆశా లేదు. ఏవైనా గొప్ప శిల్పాలు వుంటే వెంట తెచ్చేందుకు ప్రయత్నిస్తాం.




అన్నిటికన్నా మాకు ముఖ్యం; మా పూర్వ మహారాజు విక్రమకేసరి నెరవేరని కోర్కెను, నెరవేర్చి ఆయన ఆత్మకు శాంతి కలిగించటం," అన్నాడు శిఖిముఖి.

"ఆ మహారాజు సమాధి చూద్దురుగాని రండి. వృశ్చికలంకకు వెళ్ళటానికి అవసరం అయిన పడవలూ వాటి సంగతి తీరిగ్గా రాత్రికి మాట్టాడుకోవచ్చు," అని ఇభ్యుతుల నాయకుడు, శిఖిముఖీ వాళ్ళను తన పూర్వులు సమాధి అయిన చోటుకు తీసుకుపోయాడు.

ఒక విశాలమైన ప్రాంగణంలో, ఎత్తుగా నిర్మించిన పదీ పన్నెండు సమాధులు శిఖిముఖీవాళ్ళు చూశారు. ప్రతి సమాధి మీదా వింత వింత ఆకారాలు గల బొమ్మలు చెక్కబడి వున్నవి. వాటిల్లో కొంచెం పెద్దదిగా వున్న ఒక సమాధి దగ్గిరకు ఇభ్యు నాయకుడు పోయి, భక్తితో నమస్కరించి, "విక్రమా! యిదే మీ తాతగారైన విక్రమ కేసరి మహారాజు సమాధి. మా ఇభ్యుశిల్పి తనకు చాతనైనంతలో ఆయన రూపం సమాధి మీద చెక్కాడు. ఆయన రూపం నీకు బాగా గుర్తున్నదా?" అని అడిగాడు.

విక్రమకేసరి సమాధిపై నున్న తన తాతగారి రూపశిల్పం కేసి కొంచెం సేపు



పరీక్షగా చూసి, "సందేహం లేదు, ఇందులో మా తాతగారి ముఖలక్షణాలన్నీ వున్నవి. ఆయన్ని నేను చాలా చిన్న వయసులో చూసివున్నా, ఆ ముఖం నాకు బాగా గుర్తే!" అన్నాడు.

ఇభ్య నాయకుడు చెప్పగా ఒకడు పరుగు పరుగున పోయి, రెండు పుష్ప మాలలు తెచ్చాడు. విక్రమకేసరీ, శిఖిముఖీ ఆ మాలలను సమాధి మీద వేసి నమస్క రించారు. ఆ తరవాత అందరూ తిరిగి గ్రామ మధ్యంలో వున్న చుట్టు గుడిశెకు వచ్చారు. గుడిశె దగ్గిర ఎర్రగద్దు శిఖి ముఖికి ఎదురై, చిన్నగా మొరుగుతూ అతడి చుట్టూ గిరికీలు కొట్టసాగింది. శిఖిముఖి దాని తలను ఆప్యాయంగా నిమిరాడు.

అందరూ మధ్యాహ్న భోజనాలు ముగించి మాట్లాడుకుంటూ విశ్రాంతిగా కూర్చున్న సమయంలో ఇద్దరు ఇభ్యులు వచ్చి పూజారి అయిపూ అజా లేకుండా ఎటో పోయాడనీ, తామూ మరి కొందరూ కొండ ప్రాంతాలనే కాక, నదీతీరాన్ని కూడా వెతికామనీ తమ కులపెద్దకు చెప్పారు.

"వాడు ఆ కొండల్లోనే ఎక్కడో ఏదో బిలాన్నొకదాన్ని ఎంచుకుని అక్కడే గబ్బిలంలా దాగి వుంటాడు. చీకటి పడితే



గాని వాడు బైటికి రాడు.. కాపలా వేయండి," అన్నాడు ఇభ్యనాయకుడు.

ఆ రాత్రి ఇభ్యనాయకుడు మరికొందరు ఇభ్య ముఖ్యులతో సంప్రతించి, రెండు పడవలు అవసరం కాగలవని నిర్ణయించారు. అందులో ఒకటి శిఖిముఖి అతడి అను చరులూ ప్రయాణించేందుకూ, రెండవది శిథిలాలయంలో ఏవైనా అమూల్యవస్తువులు దొరికితే వాటిని తెచ్చేందుకూ ఉపయోగ పడగలదని తేల్చారు. పోతే ఆ రెండు పడవలకు వెనకగా మరొక పెద్ద పడవలో కొందరు ఇభ్యులను వాళ్ళకు రక్షణగా పంపగల నన్నాడు ఇభ్యనాయకుడు.




ఆ మర్నాటి ఉదయం ఇఖ్యులు నదిలో వున్న పెద్ద పడవల్లో మూడింటికి కొత్తగా ఖడ్గమృగచర్మం తాపడం చేసి మధ్యాహ్నం వేళకు వాటిని ప్రయాణానికి సిద్ధం చేశారు. శిఖిముఖీ, విక్రమకేసరీ, అజితుడూ ఒక పడవలోనూ, దళనాయకుడు నాంగ్‌సోమ్, వీరభద్రుడూ మరొక పడవలోనూ ఎక్కారు. నాంగ్‌సోమ్ వున్న పడవలో నెల రోజులకు సరిపడా ఆహారపదార్థాలు నిలవచేశారు.

నాంగ్‌సోమ్ వున్న పడవ ముందు దారి చూపుతూండగా, రెండు పడవలూ నది దిగువకు బయలుదేరినై. మరొక పెద్ద పడవలో మరికొందరు ఇఖ్యులు కొంచెం వెనగ్గా ప్రయాణమయారు. ముందు బయలుదేరిన పడవలు రెండూ నది దిగువకు రెండు మూడు కోసులు ప్రయాణం చేసిం తరవాత, ఉత్తరం వైపు నుంచి వచ్చి నదిలో కలిసే ఒక పాయ వెంట ఎగువకు కొంతదూరం ప్రయాణించి, సరస్సులా కంటిచూపు అనేంతవరకూ జలమయంగా వున్న ప్రదేశాన్ని చేరారు. వాళ్ళకు అందులో కొన్ని లంకలూ, వాటి మీద ఎత్తయిన వృక్షాలూ, ఎగిరే నీటిపక్షులూ కనిపించినై.

నాంగ్‌సోమ్‌కు ఆ ప్రాంతమంతా బాగా పరిచయమైనదే. అతడు అనేకసార్లు మరి కొందరు తన జాతివాళ్ళతో కలిసి, చేపల వేటకు అటుకేసి వచ్చాడు. ఆ జలమయ ప్రదేశంలో పెద్దపెద్ద చేపలేకాక, భయంకర మైన వింత జలచరాలు కూడా వుండటం అతడికి తెలుసు. వృశ్చికలంక చేరే ముందు, చిన్నా పెద్ద లంకలను అనేకం దాటి పోవలసి వుంది.

తెడ్లు వేసి అతి జాగ్రత్తగా పడవలు నడుపుతున్నవాళ్ళకు, నీటిలో తమ చుట్టూ కదిలే పెద్దపెద్ద మొసళ్ళూ, తిమింగిలం లాటి ఆకారాలుగల కొన్ని చేపలూ కంట బడినై. అవి పడవల్ని అనుసరించి ఈదుతూ వస్తున్నవి. —(ఇంకా వుంది)





26

[శిథిలాలయ పూజారి, ఇభ్యులను మోసపుచ్చి ఒక బిలమార్గం ద్వారా పారిపోయాడు. ఇభ్యకులపెద్ద, తన దళనాయకుడైన నాంగ్‌సోమ్‌ను శిథిలాలయం వున్న వృశ్చిక లంకకు దారి చూపేందుకు శిఖిముఖీ వాళ్ళతో పంపటానికి ఒప్పుకున్నాడు. రెండు పెద్ద పడవలు సిద్ధం చేయబడినై. అందరూ వృశ్చికలంకకు ప్రయాణమయారు. తరవాత—]

సూర్యాస్తమయం వరకూ శిఖిముఖీ వాళ్ళు ప్రయాణం చేసి, ఆ రాత్రికి విడిది చేసేందుకు అనుకూలంగా వుండే లంక కోసం ప్రయత్నించారు. పావుగంట ప్రయాణ దూరంలో వాళ్ళకో లంక కనబడింది. చీకటి పడుతుండగా వాళ్ళా లంక చేరి, పడవలను ఒడ్డునున్న చెట్లకు కట్టి, వంట పనులు ప్రారంభించారు. తాము చేసిన మంట నుంచి వెలువడుతున్న పొగను గుర్తించి, మూడవ పడవవాళ్ళు కూడా కొంచెం ఆలశ్యంగా అక్కడికి రాగలరని వాళ్ళు భావించారు.

క్రమంగా చీకటి కమ్ముకున్నది. వంట పూర్తి కాగానే అందరూ భోజనాలు చేసి, నెగడొకటి వెలిగించి, దాని చుట్టూ కూచుని పిచ్చాపాటీ మాట్టాడుకోసాగారు. మూడవ పడవ యింకా ఆ లంక చేరలేదు. శిఖిముఖికి, శిథిలాలయ పూజారి తమ కన్న



ముందుగా వృశ్చికలంకకు ప్రయాణం కట్టాడని గట్టి నమ్మకం కలిగింది. ఒకవేళ తమ పడవలూ, వాడున్న పడవా ఎక్కడో మార్గమధ్యాన తారసపడితే, పోరు తప్పదు. అప్పుడు తమలో కొందరైనా జలజంతువులకు ఆహారం అయిపోతారు....

ఇలా ఆలోచిస్తున్న శిఖిముఖికి లంకమీది చెట్లలో నీటిపక్షులు చేసే కలకలంతో పాటు, తీరం వెంట నీటిలో మొసళ్ళూ యితర నీటిజంతువులూ చేసే ధ్వనులు కూడా వినిపిస్తున్నవి. అతడు విక్రమకేసరితో, "ఈ చీకట్లో, యీ లంకా, చుట్టూ వాతావరణం ఎంత భయంకరంగా వున్నదో




చూశావా? దీనికన్న క్రూరమృగాల నడుమ మహారణ్యంలో కాలంగడపటం వేయింతలు సుఖంగా వుంటుంది," అన్నాడు.

నాంగ్‌సోమ్ అవునన్నట్టు తల వూపాడు. విక్రమకేసరి, "నువ్వీ లంకను గురించి ఆలోచిస్తున్నావా? నాకు పూజారి గుర్తు కొస్తున్నాడు. వాడీ లంకలోనే మరో ప్రాంతాన బస చేశాడేమో అన్న అనుమానం నాకు కలుగుతున్నది," అన్నాడు.

ఆ మాటలకు శిఖిముఖి నవ్వి, పక్కనున్న ఎండుకట్టెలు నెగడులో వేయసాగాడు. ఉన్నట్టుండి హఠాత్తుగా లంకలో ఒకమూల నుంచి గుండెలవిసే లాంటి కేక ఒకటి వినిపించింది. ఎర్రగండు అటుకేసి తిరిగి మొరగసాగింది. శిఖిముఖి చప్పున లేచి నిలబడి, "అది మనిషి గొంతా, లేక ఏదైనా వింతమృగానిదా?" అన్నాడు.

"ఎవరో మనిషి ప్రమాదంలో చిక్కుకున్నాడు, లేక మనను ప్రమాదంలో చిక్కించేందుకు శిథిలాలయ పూజారి ఎత్తు వేస్తూండవచ్చు. ఆయుధాలు సిద్ధంగా పట్టుకుని బయలుదేరండి," అన్నాడు విక్రమకేసరి.

అజితవీరభద్రులు చప్పున రెండు కాగడాలు వెలిగించి ముందు బయలుదేరారు.






ఈ సారి ఎవడో మనిషి అరుస్తున్నట్టుగా స్పష్టంగా కేకలు వినిపించినై. అందరూ అక్కడికి పరిగెత్తే సరికి, కుంటికాలువాడు ఒకడు అటూ యిటూ గెంతుతూ, చేతిలో వున్న దుడ్డుకర్ర సాయంతో, తన మీదికి ఉరుకుతున్న రెండు మొసళ్లతో పోరాడుతున్నాడు.

శిఖిముఖి ఆ కుంటివాడి రక్షణకు ముందుకురికే లోపలే ఎర్రగండు భయంకరంగా మొరిగి వాడి మీదికి లంఘించింది. కుక్క అరుపు వింటూనే కుంటివాడు వణికిపోతూ, "శిఖిదొరా! నన్ను ముందు మొసళ్ళ నుంచి కాదు, ఈ ఎర్రగండు నుంచి కాపాడండి! తరవాత మీ యిష్టం వచ్చిన శిక్ష విధించండి!" అన్నాడు.

ఆ కంఠస్వరం విని అందరూ ఆ కుంటివాడు తమకు ద్రోహంచేసి పారిపోయిన జాంగ్లా అని గుర్తించారు. ఎంత దుర్మార్గుడైనా చిత్రహింసలకు గురిచేయటం మానవత్వం అనిపించుకోదు గనక, శిఖిముఖి ముందుగా ఎర్రగండును దగ్గిరకు పిలిచి, తనచేతి కత్తితో ఒక మొసలిని తల మీద గట్టిగా కొట్టాడు. ఇంతలో అజితుడు ఈటెతో రెండవ మొసలిని నడుం మీద పొడిచాడు.



మొసళ్ళు రెండూ తాము తిన్న దెబ్బల కన్నా కాగడాల వెలుగుకు ఎక్కువగా భయపడిపోయి దాపులనున్న నీటి కేసి చరచరా పాకి, దభీమంటూ అందులో పడినై. జాంగ్లా ఆయాసపడుతూ నేల మీద కూలబడ్డాడు. అతడేదో చెప్పాలని చూశాడుగాని, నోట మాట పెగలలేదు.

శిఖిముఖీ అతడి మిత్రులూ హఠాత్తుగా ఎదురైన యీ వింత సంఘటనకు ఆశ్చర్యపడ్డారు. జాంగ్లా యీ రాత్రివేళ యీ లంకకు ఎలా చేరాడో వాళ్ళు ఊహించలేకపోయారు. శిథిలాలయ పూజారి తమ మీద వేగుచేసేందుకు జాంగ్లాను తాము దిగిన





చోటుకు పంపాడేమో అన్న అనుమానం మాత్రం విక్రమకేసరికి కలిగింది.


శిఖిముఖి, జాంగ్‌లాను ఏదో ప్రశ్నించ బోయేంతలో విక్రమకేసరి కత్తి ఎత్తి, "జాంగ్‌లా! నిజం చెప్పు. అబద్ధం ఆడావో రెండో కాలు కూడా నరికి ప్రాణం వుండ గానే నిన్ను మొసళ్ళ దగ్గిరకు తోయించు తాను. నీ యజమాని ఆ పూజారిగాడు, యీ లంకలో ఏ మూల దిగాడు?" అని ప్రశ్నించాడు.

జాంగ్‌లా ఆ ప్రశ్నకు భయపడినట్టు లేదు. అతడు బతుకుమీద రోసినవాడిలా ఒక నిట్టూర్పు విడిచి, "కేసరిదొరా! నేను మీకు చేసిన ద్రోహానికి, యిప్పుడు నే నెంత నిజం చెప్పినా నమ్మరు. నాకు మీ యిష్టం వచ్చిన శిక్ష విధించండి," అన్నాడు.

"ఈ దొంగ నాటకం నా దగ్గిర సాగదు. నిజం చెపుతావా, లేదా?" అంటూ విక్రమ కేసరి కత్తిని జాంగ్‌లా మెడమీద పెట్టాడు.

శిఖిముఖి నవ్వుతూ, "కేసరీ! అప్పుడే నీ ప్రతిజ్ఞమాట మరిచిపోయి వాడి తల నరకబోతున్నావు. ప్రాణాలతో గదా వాణ్ణి మొసళ్ళకు వేస్తానని నీ వింతకు ముందు అన్నది? కొంచెం ఆగు....జాంగ్‌లా! ఇప్పటి నీ పరిస్థితి చూస్తూంటే నువ్వు సుఖ మైన చావుకోసం ఎదురుచూస్తున్నట్టు కన బడుతున్నావు. కాని నిజం చెప్పకపోతే కేసరి నిన్ను ప్రాణాలతోనే మొసళ్ళకు వేసి భయంకరమైన చావుకు నిన్ను గురిచేస్తాడు. తెలిసిందా?" అన్నాడు.

జాంగ్‌లా ఓ క్షణకాలం మౌనంగా వూరు కుని, "శిఖిదొరా! ద్రోహి చచ్చేముందు నిజం పలికినా, అబద్ధం మాట్టాడినా ఒకటే. కాని, చావుకు ముందు నేను చెప్పే నిజం మీకు కొంత ఉపకరిస్తుంది. పూజారి యీ రోజు మధ్యాహ్నం ప్రాంతాలే రెండు పడవల్లో శిథిలాలయం వున్న లంక కేసి పోయాడు. మీ రా లంక చేరే సమయానికి వాడు





మీ కోసం మాటువేసి వుంటాడు. తగు జాగ్రత్తలో వుండండి," అన్నాడు.

జాంగ్‌లా మాటల్లో మోసం లేదన్న నమ్మకం శిఖిముఖికి కలిగింది. "అయితే, జాంగ్‌లా! నువ్వు నీ యజమానితో వెళ్ళక యీ మొసళ్ళ లంక మీద ఎందుకు దిగబడిపోయావు?" అని ప్రశ్నించాడు.

"చచ్చేముందైనా నిజం చెప్పి చావదలిచాను, దొరా! వినండి. నేను మీకు తలపెట్టిన ద్రోహంవల్లే చిరుతపులికి చిక్కి అవిటివాణ్ణయిపోయాను. నా పాపమే నన్నణచింది. కామాఖ్యనగరంలో గౌరవంగా బతికే నన్ను, డబ్బాశ చూపి దుర్మార్గుణ్ణిగా చేసినవాడు పూజారి! వాణ్ణి సమయం వచ్చినప్పుడు హతమార్చ దలిచాను. కాని, వాడు నీచగ్రహోపాసకుడు! నా ఆలోచనలు పసిగట్టాడో ఏమో నన్ను, ఏదో భయంకరమైన జలజంతువుకు ఆహారంగావేసి పోజూశాడు," అన్నాడు జాంగ్‌లా.

"నిన్ను జలజంతువుకు ఆహారంగా వేశాడా! అదెలా జరిగింది?" అన్నాడు శిఖిముఖి ఆశ్చర్యపడుతూ.


జాంగ్‌లా యిలా చెప్పాడు:

"గోల్‌ఖరా గ్రామప్రాంతంలోని నది దగ్గిర్నుంచి, యీ జలప్రదేశానికి వాడి పడ



వలు సాగినప్పటి నుంచీ, నేను చుట్టు పక్కల వున్న అన్ని లంకల్నీ పరిశీలించి చూస్తూ, ఒక్కొక్కదాన్నే గుర్తు పెట్టుకోసాగాను. నేను గజయీతగాణ్ణి. ఆ పూజార్ని వాడి ముఠాతో ఏదో ఒకచోట పడవలతో పాటు నీట ముంచి, ఏ తెప్పకొయ్య మీదో తిరిగి గోల్‌ఖరా చేరాలన్నది నా పథకం.

"వాడు నా ఆలోచనలు గ్రహించినట్టున్నాడు. ఈ మధ్యాహ్నం పడవలు, యీ లంకపక్క నుంచి పోతూండగా, వాడు పడవ మీంచి నీట్లోకి తొంగి చూసి, 'ఆహాఁ, శిథిలేశ్వరి కంఠాభరణం అయిన మహాజలసర్పం దర్శన మిచ్చిందా? ప్రసాదం



సమర్పించాలా ? తప్పక సమర్పిస్తాను ! ఆ ఒక్క సజీవ ప్రసాదాన్నీ స్వీకరించి మా అందరికీ ఏ హానీ కలగకుండా శిథిలేశ్వరీ ఆలయానికి చేర్చు,' అంటూ కళ్ళు మూసుకుని ఉష్ణీషాన్ని ఎగరవేశాడు. అది గురిగా వచ్చి నా తలమీద పడింది. వెంటనే వాడు, 'ఓహో, ఎంత అదృష్టం నీది, జాంగ్‌లా ! శిథిలేశ్వరి సేవికకు ఆహారమై, వచ్చే జన్మలో ఇభ్యజాతి కంతకూ నాయకుడివిగా జన్మించబోతున్నావు!' అన్నాడు.

"ఆ దుర్మార్గుడు ఏం చేయబోతున్నాడో నేను ఊహించే లోపలే వాడు సవర భేరుండానికి సైగ చేశాడు. భేరుండం ఒక్క దూకున వచ్చి పడవ మీంచి నన్ను నీటిలోకి గిరవాటు వేశాడు. నేను మునిగిపోయినట్టు నటించి, నీటి అడుగునే ఈదుకుంటూ దాపుల నున్న యీ లంక చేరాను. ఆకలితో, బడలికతో సగంచచ్చివున్న నామీద యింతకు ముందు మొసళ్ళు వచ్చి పడినై. మీరు రక్షించారు. ఇదీ నా కథ!"

శిఖిముఖి కొంచెం సేపు ఆలోచించి, "కేసరీ! నీ అభిప్రాయం ఏమిటి? జాంగ్‌లా చెప్పింది నమ్మటమా, మానటమా?" అని అడిగాడు.

"అతడు నమ్మదగిన విధంగా కథ చెప్పాడు!" అన్నాడు విక్రమకేసరి.

శిఖిముఖి ఆ మాటలకు నవ్వి, అజిత వీరభద్రుల్నీ నాంగ్‌సోమ్‌నూ ప్రశ్నించాడు. వాళ్ళు జాంగ్‌లా చెప్పింది నిజంలా కనబడుతున్నదన్నారు.

"అయితే మనం ఉదయం బయలుదేరి పోయేప్పుడు జాంగ్‌లాను వెంట తీసుకుపోదాం. ఏమంటావ్, కేసరీ?" అని అడిగాడు శిఖిముఖి.

"తప్పకుండా మన పడవల్లో తీసుకుపోదాం. మళ్ళీ ఏదైనా ద్రోహం తల పెట్టే సూచనలు కనబడితే, యీసారి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా కత్తులతో ముక్కలు



ముక్కలుగా నరుకుదాం," అన్నాడు విక్రమకేసరి.

అందరూ అక్కణ్ణించి కదిలి, తాము విడిది దిగిన చోటుకు బయలుదేరగానే జాంగ్‌లా, శిఖిముఖి, విక్రమకేసరుల పాదాలు తాకి వారి వెనకగా కర్రసాయంతో కుంటుతూ నడిచాడు.

సూర్యోదయంతోనే అందరూ నిద్ర మేల్కొని, కాలకృత్యాలు తీర్చుకుని పడవ లను ప్రయాణానికి సిద్ధపరిచారు. జాంగ్ లాను శిఖిముఖి, విక్రమకేసరీ వున్న పడవ లోకి ఎక్కించారు. అవసరం అయినప్పుడు తెడ్లు వేయటానికి అతడు వీరభద్రుడికి సాయంగా వుండగలడని శిఖిముఖి అలా చేశాడు. వాళ్ళు లంక నుంచి బయలు దేరుతూ, మరికొందరు ఇభ్యులతో కొంచెం వెనకగా ప్రయాణం కట్టిన పడవ కోసం చుట్టుపక్కల అంతా పరీక్షించి చూశారు. పడవ జాడలేదు. బహుశా పడవలోనివాళ్లు దారి తప్పారేమో అన్న అనుమానం శిఖి ముఖికీ, విక్రమకేసరికీ కలిగింది.

గాలివాలు బాగా వుండటంతో తెడ్లు వేయటం మాని పడవలకు తెరచాపలెత్తారు. నాంగ్‌సోమ్, అజితుడూ వున్న పడవ ముందుకు పోసాగింది. మధ్యాహ్నం



భోజనాలవేళ సమయంలో, ఏ లంక మీద దిగి వంటలు చేసుకుందామా అని శిఖిముఖీ వాళ్ళు ఆలోచిస్తూండగా, ఒక లంక మలు పులో నుంచి నీరు అల్లకల్లోలమవుతూ, వాళ్ళ పడవల కేసి రాసాగింది. అప్పటి వరకూ ప్రశాంతంగా వున్న నీటిమీద అంత లేసి అలలు ఎందుకు లేస్తున్నవో ఎవరికీ అర్థం కాలేదు.

నాంగ్‌సోమ్ తన పడవను దాపునవున్న లంక కేసి తెడ్లసాయంతో మళ్లిస్తూ, శిఖి ముఖీ వాళ్ళను కూడా హెచ్చరించాడు. అంతలో లంక మలుపు తిరిగిన చోటు నుంచి హఠాత్తుగా రెండు పడవలు అలల

తాకిడికి కిందు మీదులవుతూ వాళ్ళ కేసి కొట్టుకు రాసాగినై.


ఆ పడవలలో ఉన్నవాళ్ళను శిఖిముఖీ, విక్రమకేసరీ వెంటనే గుర్తించగలిగారు. ఒక పడవలో వున్న శిథిలాలయ పూజారి చేతులెత్తి పెద్దగా అరుస్తూ, "జలసర్పం మనను మింగజూస్తున్నది! పడవల్ని లంకకు పట్టించండి!" అంటున్నాడు.

చూస్తూండగానే పూజారి చెప్పే ఆ జల సర్పం కూడా శిఖిముఖి వాళ్ళ కంట బడింది. ఆ సర్పం మెడా, తలా మాత్రం పాముకు వున్నట్టు వున్నది. కాని శరీరం మటుకు పదీ పన్నెండు ఏనుగుల ప్రమాణంలో లావుగా వున్నది. అది తన కాళ్లతో నీటిని అల్లకల్లోల పరుస్తూ, పూజారి పడవలలో వున్న వాళ్ళను పట్టుకునేందుకు తల కిందికీ పైకీ తిప్పుతున్నది.

ఆ దృశ్యం చూసి శిఖిముఖితో పాటు అందరూ గజగజ వణికిపోయారు. అదృష్ట వశాత్తూ వాళ్ళ పడవలు లంకకు సమీపాన వుండటంతో, అతి త్వరలోనే వాళ్ళు తీరాన్ని చేరుకోగలిగారు. శిథిలాలయ పూజారివాళ్ళ పడవలు మాత్రం జలజంతువు వల్ల లేచిన అలలలో చిక్కుకుని కిందు మీదులవుతూ నీటి వెంట కొట్టుకు పోసాగినై.

ఒడ్డుచేరిన శిఖిముఖీ వాళ్ళు చూస్తూండగానే జలజంతువు పూజారి వున్న పడవలోపలికి తలపెట్టి ఒకణ్ణి నోట కరుచుకున్నది. పూజారీ, అతడి వెంట వున్నవాళ్లూ పిచ్చిగా అరుస్తూ పడవలను తెడ్లసాయంతో దూరంగా నడపసాగారు. జలజంతువు తాను పట్టినవాణ్ణి మింగేందుకు ఓ క్షణకాలం ఆగి, తిరిగి వాటి వెంటబడింది.

"శిఖీ! పనిలోపని, ఆ పూజారి దుర్మార్గుడు నా బాణం దెబ్బకు అందుతాడేమో చూస్తాను!" అంటూ విక్రమకేసరి పూజారి వున్న పడవ కేసి గురిగా బాణాలు వదలసాగాడు. —(ఇంకా వుంది)





శిథిలాలయం

27

[వృశ్చికలంకకు పోయేదారిలో ఒకచోట, జాంగ్లా శిఖిముఖి వాళ్ళకు తటస్థపడ్డాడు. తనను శిథిలాలయపూజారి చంపబోతాడని అతడు శిఖిముఖికి చెప్పాడు. సూర్యోదయంతో అందరూ తిరిగి ప్రయాణమయ్యారు. ఒక ఏటి మలుపులో, పూజారి పడవలు వాళ్ళకు కనిపించినై. విక్రమకేసరి పూజారి కేసి బాణాలు వదలసాగాడు. తరవాత—]

విక్రమకేసరి వదిలిన బాణాలు శిథిలాలయ పూజారికి కాదుగదా, అతడున్న పడవ కూడా తగలలేదు. జలజంతువు కదలిక వల్ల లేచే నీటి అలల మీద పూజారి పడవలు అటూ యిటూ ఒరుగుతూ వేగంగా కొట్టుకు పోతున్నవి. జలజంతువు తానంతకు ముందు పట్టుకుతిన్న వాటితో కాస్త తృప్తిపడినట్టుగా, పడవలను లోగడంత వేగంగా తరమటం లేదు. ఒకటి రెండు నిమిషాలు గడిచినై. జలజంతువు నీటిలో వున్న చోటునే ఆగి, మెడ అటూ యిటూ తిప్పి ఒకసారి చుట్టూ కలయ జూసింది.

ఆ భయంకర జంతువు దృష్టి తమమీద పడుతుందేమో అన్న భయంతో శిఖిముఖి అతడి అనుచరులూ, దాపులనున్న రెల్లు పొదలచాటుకు తప్పుకున్నారు. ఎర్రగండు మొరగకుండా శిఖిముఖి దాని తల నిమర సాగాడు. అతడికి జలజంతువు తమను



పట్టుకుని కబళిస్తుందన్న భయంకన్న, ఒడ్డున వున్న తమ పడవల్ని నీట ముంచుతుందేమో అన్న భయం అధికంగా వున్నది. అలా జరిగితే, తాము యీ నిర్జనమైన లంక మీద చిక్కుకుపోతారు...

చూస్తూండగానే శిథిలాలయ పూజారి వున్న పడవలు లంక మలుపు తిరిగి, కనబడకుండా పోయినై. జలజంతువు తృప్తిగా ఒళ్ళు విరుచుకుంటున్నట్టు నీటిలో అటూ యిటూ కొంచెం సేపు పొర్లి లేచి, తల మాత్రం నీటి బయటికి పెట్టి, దూరంగా వున్న మరో చిన్న లంక కేసి బయలుదేరింది. అది కనబడకుండా పోయేవరకూ



ఆగి, శిఖిముఖివాళ్ళు దాగిన చోటునుంచి బయటికి వచ్చి, తిరిగి తమ పడవల మీదికి వెళ్ళారు.

తమ ప్రయాణం జంతువు వెళ్ళిన దిక్కు కాకపోవటం వాళ్ళకు కొంత ధైర్యాన్నిచ్చింది. కాని, ఈ జలమయ ప్రదేశంలో అటువంటి భయంకర ప్రాణులు మరికొన్ని వుండవచ్చునన్న అనుమానం వాళ్ళను బాధించసాగింది. వీటన్నిటికి తోడు శిథిలాలయ పూజారి తమ ప్రయాణాన్ని ముందుగానే పసి గట్టటం — అన్నిటినీ మించిన సంకటాన్ని తెచ్చి పెట్టవచ్చు.

పడవలు రెండూ కదలబోయే సమయంలో శిఖిముఖి అందరికీ వినబడేంత పెద్ద గొంతుతో, "వృశ్చికలంకకు వెళ్ళాలనే ప్రయత్నంలో వున్న సాధకబాధకాలు, ఈసరికి అందరికీ తెలిసి వచ్చినై అనుకుంటాను. నేనూ, కేసరి ఏ పరిస్థితుల్లోనూ అక్కడికి వెళ్ళక తప్పదు. కాని, మిగతా వాళ్ళెవరైనా, అక్కడ దిగబడిపోదలిస్తే నా అభ్యంతరం లేదు. తిరుగు ప్రయాణంలో అలాంటివాళ్ళను తీసుకుపోతాం. ఈలోపల వాళ్ళకు అవసరం అయిన ఆహారపదార్థాలు యీ లంకలో వదులుతాం," అన్నాడు.






ఈ మాటలకు ఒక్క క్షణం అందరూ ఆశ్చర్యపోయారు. నాంగ్‌సోమ్, అజిత విరభద్రులతో పాటు, కుంటి జాంగ్‌లా కూడా ఎన్ని కష్టాలు ఎదుర్కోవలసి వచ్చినా, వృశ్చికలంకకు వెళ్ళితీరవలసిందే అన్నాడు. శిథిలాలయ పూజారి అంతం చూడవలసి వున్నదనీ, కనక తాను ఒంటరిగానైనా సరే, వృశ్చిక లంకకు వెళ్ళక తప్పదనీ అన్నాడు, జాంగ్‌లా.

తమ అనుచరుల పట్టుదలనూ, ధైర్యాన్నీ, విశ్వాసాన్నీ శిఖిముఖీ, విక్రమకేసరులు మెచ్చుకున్నారు.

పడవలు కదిలినై. గాలి అనుకూలంగా వుండటంతో తెరచాపలు ఎత్తారు. తమకన్న ముందు లంక మలుపు తిరిగిపోయిన పూజారి వాళ్ళ పడవల కోసం అందరూ జాగ్రత్తగా చుట్టు పక్కల ప్రదేశాన్ని పరికించసాగారు. కాని, సూర్యాస్తమయ సమయమవుతున్నా వాళ్ళకు పూజారి పడవలు ఎక్కడా తారసపడలేదు. చీకటి పడుతూండగా పడవలను ఒక చిన్న లంక ప్రదేశాన ఒడ్డు చేర్చి, తాళ్ళతో వాటిని ఒడ్డునున్న చెట్లకు కట్టి, ఆ దాపులనే అందరూ వంట ప్రయత్నాలు ప్రారంభించారు.



వంట పూర్తయి అందరూ భోజనాలు చేసేసరికి జాముపొద్దు గడిచిపోయింది. ఈ లంక తీరంలో మొసళ్ళున్న సూచనలు లేవు. కాని, లంక మీది చెట్లు చేమల్లో మాత్రం అనేక రకాల నీటిపక్షులు వున్నవి. అవి పొద్దు పోతున్నకొందికీ మరింత బిగ్గరగా గీబా అంటూ గోల చేయసాగినై.

నెగడు వెలిగించి శిఖిముఖీ అతడి అనుచరులూ దాని చుట్టూ చేరి మాట్లాడుకోసాగారు. వాళ్ళ కళ్ళంత దూరంలో పడవలు రెండూ అలల తాకిడికి లేచి పడుతూ, ఆ చీకట్లో నాట్యం చేస్తున్న రెండు పెద్ద భూతాల్లా కనిపిస్తున్నవి. కొంచెం సేపు





మాట్లాడుతున్న తరవాత ఒకరొకరుగా శశిముఖి వాళ్ళు నెగడు చుట్టూ ముడుచుకు పడుకున్నారు. రెండవ జామున కాపలా పని నాంగ్‌సోముది.

నాంగ్‌సోమ్ ఈటె పట్టుకుని ఒకసారి పడవల దగ్గిరకుపోయి చూసి, తిరిగి నెగడు దగ్గిరకు వచ్చి కూచున్నాడు. నీటిపక్షుల చేసే గోల అతడికి తల దిమ్మెక్కిస్తున్నది. అతడొకసారి బద్ధకంగా ఆవలించి, పక్కనే నిలబడి వున్న ఎర్రగండు తలను నిమరబోయాడు.


ఎర్రగండు మెడ పక్కకు తిప్పి, పడవ లున్న దిక్కుకేసి ఓ అడుగువేసి, గాలిలో




తలను అటూ యిటూ ఓమారు తిప్పి చిన్నగా మొరిగింది. పసికట్టటంలో ఎర్రగండు కున్న శక్తి బాగా తెలిసినవాడు కావటంతో నాంగ్‌సోమ్, అది తల తిప్పిన దిక్కుకేసి పరీక్షగా చూశాడు. పడవల్లో ఒకటి ఓ క్షణకాలం పక్కకు ఒరిగి, రెండవ దాన్నుంచి కొంచెం దూరం కదిలినట్టు అతడికి తోచింది.

నాంగ్‌సోమ్ ఎర్రగండు మొరగకుండా దాని తల నిమిరి, ఈటెను గట్టిగా గుప్పిట బిగించి, నేల మీద వంగి నడుస్తూ పడవల దగ్గిరకు వెళ్ళాడు. అతడింతకు ముందు చూసినట్టు ఒక పడవ రెండవ దానికి భిన్నంగా నీటి మీద వుండి వుండి చప్పున ఒక పక్కకు ఒరిగి, మళ్ళీ యథాప్రకారం నిలబడుతున్నది.

పడవ కింద ఏవో మొసళ్ళు చేరి పోట్లాడు కుంటున్నవేమో అన్న అనుమానం నాంగ్‌సోమ్‌కు కలిగింది. కాని, పరీక్షగా చూడగా అక్కడ నీటిలో పెద్ద కదలిక ఏమీ అతడికి కనిపించలేదు. దానితో అతడికి శత్రువెవరో పడవ కింద దాగివుండి పడవకు చిల్లి పొడవటమో, లేక దొంగిలించుకు పోవాలనే ప్రయత్నమో చేస్తున్నాడన్న అనుమానం కలిగింది.


CHITRA






నాంగ్‌సోమ్ ఎర్రగండును నీటి ఒడ్డునే వుంచి, నిశ్శబ్దంగా నీటిలో దిగి పడవను చేరి, దానిమీద ఎక్కి నిలబడ్డాడు. ఆ సమయంలో పడవ కొంచెంగా అటూ యిటూ ఒరిగింది. వెంటనే దాని అడుగు నుంచి ఒక నల్లని ఆకారం చప్పున నీటిమీదికి తేలింది. గుడ్డి వెన్నెట్లో ఒకరినొకరు గుర్తించారు.

కన్ను మూసి తెరిచేంతలో నాంగ్‌సోమ్ చేతిలోని ఈటెను బలంగా ఆ నల్లని ఆకారం కేసి విసిరాడు. అదే సమయంలో నీటిలో వున్నవాడు చప్పున ఈటెను నాంగ్‌సోమ్ మీదికి ప్రయోగించాడు. ఆ ఈటె పడవ అంచును తాకటం, నాంగ్‌సోమ్ ఈటె వాడి వెన్నులో దిగబడటం ఒకేసారి జరిగిపోయింది.

నీటిలో వున్నవాడు ఒక్క చావుకేక పెట్టాడు. వెంటనే నాంగ్‌సోమ్ నీటిలోకి దూకి వాణ్ణి చేతులతో బలంగా పట్టుకుని ఒడ్డు కేసి ఈడ్చుతూ, పెద్ద గొంతుతో, "శత్రువులు! శత్రువులు!" అని కేకలు పెట్టసాగాడు.

ఆ కేకలు వింటూనే శిఖిముఖివాళ్ళు అదురుకుంటూ నిద్రలు లేచి నాంగ్‌సోమ్ వున్న చోటుకు పరిగెత్తు కొచ్చారు. ఆ సరికి నాంగ్‌సోమ్ గాయపడినవాణ్ణి బాగా ఒడ్డు మీదికి ఈడ్చుకు వచ్చాడు. వాడి వెన్నులో దిగిన ఈటె అలాగే దిగబడి వున్నది. వాడు బాధతో ఆయాస పడుతున్నాడు. ఒకడి చేతిలో వున్న కాగడా తీసుకుని, దాని కాంతిలో శిఖిముఖి వాడి ముఖం పరీక్షించి చూశాడు. వాడు మరెవరో కాదు, తిమ్మ గూడెం ప్రాంతాలగల అడవుల్లో దారి దొంగల్లా బతికే ముఠాలోనివాడు. ఆ ముఠా వాళ్ళు ఇద్దరు ముగ్గురు శిఖిలాలయ పూజారి జంట్లుగా గోల్‌ఖరా వచ్చారు.


నాంగ్‌సోమ్, శిఖిముఖికి జరిగిందంతా ఒకటి రెండు మాటల్లో టూకీగా చెప్పేశాడు.





శిఖిముఖి దొంగతో, "నువ్వు చేసిన దురంతాలకు తగిన చావే నీ కెదురైంది. నీ వెన్నులో దిగబడి వున్న ఈటెను లాగేయించుతాను. కాని వెంటనే చస్తావు. చచ్చేముందు ఒక్క మాట చెప్పు. మా పడవలకు అడుగున చిల్లులు పొడిచి ముంచాలనే గదా నువ్వొచ్చింది? పూజారి ఏ లంకలో దిగాడు?" అని ప్రశ్నించాడు.

దొంగ ఓసారి మూలిగి మొదటి ప్రశ్నకు అవునన్నట్టు తల వూపి, అక్కడికి దాపులనే వున్న మరొక లంక కేసి బాధగా చేయి ఎత్తి చూపాడు. ఆ వెంటనే శిఖిముఖి, నాగసోమును ఈటె లాగివేయమన్నాడు. నాగసోము ఈటెను వెన్నులో నుంచి బయటికి గుంజగానే, దొంగ గిలగిలా ఓ క్షణకాలం తన్నుకుని కొయ్యదుంగలా నిగడదన్నుకుపోయాడు.



"శిఖీ! ఆ పూజారి వెధవ లోగడ మనను అరణ్యంలో వెన్నంటి గేలిశరా వచ్చినట్టే, ఇప్పుడు వృక్షకలంక కన్నా మన వెనకనే వస్తున్నాడు!" అన్నాడు విక్రమకేసరి.

"వాడు వూరికే రావటం లేదు, దారిలోనే మనను నాశనం చేయాలని చూస్తున్నాడు. మన పడవల్ని నీటముంచితే, మనం యీ దిక్కుమాలిన లంక మీద ఆకలికి అలమటించి చస్తామని వాడి ఆశ. ఏమైనా, యిక ముందు మనం పడవల విషయంలో మరింత గట్టికాపలా ఏర్పాటు చేసుకోవటం క్షేమం," అన్నాడు శిఖిముఖి.

నాగసోము ఆ చీకట్లోనే శిథిలాలయపు పూజారి దిగిన లంకకుపోయి, వాణ్ణి హతమార్చటం బాగుంటుందని సలహా యిచ్చాడు. కాని, అది కేవలం దుస్సాహసం అవుతుందని, ఏ చెట్టుచాటునో వుండి, వాడూ, వాడి అనుచరులూ తమ మీద దొంగదెబ్బ తీయగలరని శిఖిముఖి చెప్పి—ఆ ఆలోచనను వ్యతిరేకించాడు.





ఆ రాత్రి మరే అవాంతరం లేకుండా తెల్లవారి పోయింది. శిఖిముఖి అతడి అనుచరులూ పడవలను సిద్ధంచేసి, ముందుగా దొంగ చెప్పిన లంకను సమీపించి, జాగ్రత్తగా దాని మీద దిగారు. వాళ్ళు ఎంతో వెతకగా ఒకచోట రాత్రి పూజారి మనుషా వాళ్ళు వేసుకున్న నెగటి గుర్తులు మాత్రం కనిపించినై. వాళ్ళు ఏ తెల్లవారుజామునో లంక వదిలిపోయారు.

తరవాత నాలుగు రోజులపాటు వాళ్ళు చిన్నా పెద్ద లంకల పక్కగా ప్రయాణం చేసి, అయిదవనాటి సంధ్యాసమయానికి, ఎత్తయిన కొండలతో, మహావృక్షాలతో వున్న ఒక పెద్ద లంకను చూశారు. ఈ మధ్య కాలంలో వాళ్ళకు శిఖిలాలయ పూజారి వున్న పడవలు ఎక్కడా కనబడలేదు.

తాను తన జాతి ముఖ్యపెద్దల ద్వారా విన్న వృశ్చికలంక యిదేనని నాంగ్‌సోమ్ గుర్తించాడు. అతడు యిదే వృశ్చికలంక అని శిఖిముఖి, విక్రమకేసరులతో చెప్పగానే, వాళ్ళు ఎక్కడలేని సంతోషంతో పడవలను తీరానికి నడపమన్నారు.

కొద్దిసేపటి తరవాత పడవలు రెండూ తీరాన్ని చేరినై. అందరూ పడవల్లోంచి ఒడ్డుకు దిగారు. ఇంకా వెలుతురు వుండగానే, దాపుల వున్న కొండ ఎక్కి లంక ఎలా వున్నదీ చూసేందుకు విక్రమకేసరి, శిఖిముఖి బయలుదేరారు. మిగతావాళ్ళు పడవల దగ్గిరే వుండిపోయారు.

వాళ్ళిద్దరూ కొండ పై భాగం చేరి, దూరంగా లంకలో అంతకన్న చాలా ఎత్తుగా వున్న మరికొన్ని కొండల కేసి కొంచెం సేపు చూసి, వెనుదిరగబోయేంతలో వాళ్ళదృష్టి దిగువనున్న చిన్న గుట్ట మీద పడింది. ఆ వెంటనే వాళ్ళకు కలిగిన ఆశ్చర్యం అంతా యింతా కాదు. ఆ గుట్ట మీద పాడుబడి కూలిపోవటానికి సిద్ధంగా వున్న ఒక దేవాలయం వున్నది. —(ఇంకా వుంది)






శిథిలాలయం

28

[శిఖిముఖి వాళ్ళు రాత్రివేళ ఒక చిన్న లంకలో విడిది చేశారు. వాళ్ళ పడవలను నీట ముంచ వచ్చిన శిథిలాలయ పూజారి బంటు ఒకడు నాంగ్‌సోమ్ చేత చంపబడ్డాడు. నాలుగు రోజుల ప్రయాణం తరవాత వాళ్ళు వృశ్చికలంక చేరారు. అక్కడ శిఖిముఖి, విక్రమకేసరులకు పాడుబడ్డ దేవాలయం ఒకటి కనిపించింది. తరవాత—]

గుట్ట మీద కనిపించిన పాడుబడ్డ దేవాలయం కేసి శిఖిముఖి, విక్రమకేసరులు బయలుదేరారు. ఎంతో శ్రమకోర్చి, ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొని యీ వృశ్చిక లంకకు వాళ్ళు చేరారు. శిథిలాలయం తమకు యింత సునాయాసంగా కళ్ళపడుతుందని వాళ్ళు కలలో కూడా అనుకోలేదు.

సూర్యాస్తమయమై, నాలుగు వైపులా చీకటి ముసురుకుంటున్న సమయంలో వాళ్ళిద్దరూ దేవాలయాన్ని చేరారు. కాని, ఆలయప్రాంగణంలో అడుగు పెడుతూనే వాళ్ళు పొందిన ఆశాభంగం అంతా యింతా కాదు. ఆలయం పూర్తిగా శిథిలావస్థలో వున్నమాట నిజం! కాని, తాత విక్రమకేసరి ఊహించినట్టు అందులో శిల్పకళాఖండాలు గాని, స్తంభాలకు బంగారు తొడుగులు గాని ఏమీ లేవు. అంతా వట్టి రాతి కట్టడం. గర్భగుడిలో కాళీదేవిమూర్తిని



స్ఫురింపజేసే ఒక రాతి విగ్రహం, ఒక పక్కకు ఒరిగి వున్నది. గోడలలో వున్న గూళ్ళలో కొన్ని రాతి ప్రతిమలు చెల్లాచెదురుగా పడివున్నవి. ఆలయం ఏదో భూకంపం తాకిడికి గురి అయినట్టుగా శిఖిముఖి, విక్రమకేసరులకు తోచింది.

"కేసరీ, యిది మనం వచ్చిన శిథిలాలయం లాగా లేదు. మీ తాతగారు విన్నదీ, మనకు ఇధ్యుజాతివాళ్ళు చెప్పిందీ ఎంతో అద్భుత శిల్పంతో వున్న ఆలయం గదా?" అన్నాడు శిఖిముఖి.

విక్రమకేసరి, శిఖిముఖి మాటకు అవు నన్నట్టు తలవూపి, విగ్రహాన్ని సమీపిం



చాడు. అదే సమయంలో ఒక పెద్ద తేలు విగ్రహం వెనకనుంచి గోడవైపుకు చరచరా పాకిపోసాగింది. అది మామూలు తేళ్ళకన్న పది పన్నెండంతలు పెద్దదిగా వున్నది. విక్రమకేసరి దాన్ని చంపేందుకు కత్తి ఎత్తేంతలో మరి రెండు తేళ్ళు విగ్రహం వెనక నుంచి బయటికి వచ్చినై.

శిఖిముఖి, విక్రమకేసరి చేయి పట్టుకుని, "కేసరీ, వాటిని చంపేందుకు లేనిపోని శ్రమపడకు. అది వృశ్చికలంక! ఈ రాకాసి తేళ్ళను చంపదలిస్తే, మనకు మరొక పని చూసుకునేందుకు తీరికే వుండదు," అన్నాడు నవ్వుతూ.

"ఆ మాట నిజమే. మనం వీటి వాత పడకుండా తప్పుకు తిరగటం ఒక్కటే సరైన మార్గం. సరే—యిది మనం అనుకున్న శిథిలాలయం కాదు. ఇప్పుడేమిటి చేయటం?" అన్నాడు విక్రమకేసరి.

శిఖిముఖి తలవంచుకుని ఆలోచిస్తూ దేవాలయం నుంచి బయటికి వచ్చి, చుట్టూ వున్న కొండల కేసి ఓసారి తలతిప్పి చూసి, "మనం అసలు శిథిలాలయాన్ని కనుక్కోవటానికి, యీ కొండలూ, గుట్టలూ వెతక్క తప్పనిసరిలా వున్నది. కాని, ఆ ప్రయత్నంలో మనం పూజారి దుర్మార్గుణ్ణుంచి





ఏలాంటి ఆపదా రాకుండా తగు జాగ్రత్తలో వుండటం అవసరం," అన్నాడు.

"నా కొక అనుమానం కలుగుతున్నది, శిఖీ! పూజారి మనకన్న ముందుగానే, యీ వృశ్చికలంక చేరాడు; అందుకు సందేహం లేదు. ఒకవేళ వాడు యీ సరికే ఆ శిథిలాలయాన్ని కనుక్కొని, అక్కడి అమూల్యమైన వస్తువులను హరించి పారిపోయి వుండడు గదా?" అన్నాడు కేసరి.

ఆ మాటలకు శిఖిముఖి నవ్వి, "అనుమానాలతో, సందేహాలతో మనం బుర్రలు వేడెక్కించుకోవటం మంచిది కాదు. రేపు సూర్యోదయంతోనే మనం యీ లంక అంతా శిథిలాలయం కోసం గాలిద్దాం. ఒకవేళ పూజారి మనకా సమయంలో తటస్థపడితే, వాడి అంతు చూద్దాం. ఈ సరికే వాడు శిథిలాలయం చేరటం కల్ల," అన్నాడు.

ఆ తరవాత యిద్దరూ మౌనంగా పడవల దగ్గిరకు వచ్చి, అక్కడ వున్న వాళ్ళకు తాము చూసిన శిథిలదేవాలయాన్ని గురించి చెప్పారు. ఈ లంకలో అలాంటి శిథిలాలయాలు చాలా వుండవచ్చునన్నాడు, నాంగ్ బోమ్. ఒకప్పుడీ లంకలో ఆటవికజాతివాళ్ళు వేలసంఖ్యలో వుండేవాళ్ళని కులపెద్దలు చెప్పగా విన్నానని అతడు చెప్పాడు.



తరవాత వంట పని ముగించి, అందరూ భోజనాలు చేశారు. ఆ సరికి బాగా పొద్దుపోయింది. చంద్రకాంతిలో చుట్టూ వున్న కొండలూ, మహా వృక్షాలూ మిలమిలా మెరిసి పోతున్నవి. పడవలకు జాంగ్‌లాను కాపలా పెట్టి, అందరూ నిద్రలకు ఉపక్రమించారు.

బాగా అదమరిచి నిద్రపోతున్న శిఖిముఖి, నడి రాత్రివేళ దాపుల నేదో చప్పుడై చప్పున కళ్ళు తెరిచాడు. జాంగ్‌లా కుంటుతూ అతణ్ణి సమీపిస్తున్నాడు. వాడేదో ద్రోహం తలపెట్టాడన్న ఆలోచన శిఖిముఖి మెదడులో మెరుపులా కదిలింది. ఆ వెంటనే



అతడు పక్కన వున్న కత్తిని చేతికి తీసుకుని, లేచి నిలబడ్డాడు.

జాంగ్లా ఓ క్షణకాలం నిర్విణ్ణుడై, అంతలోనే స్థిమితపడి, "శిఖి దొరా! నేను దొంగలా మిమ్మల్ని చంపటానికి వచ్చాననుకుంటున్నారా? ఇంకా నన్ను తమరు నమ్మ లేదన్నమాట! నేను వచ్చింది, తమను అపాయం రాబోతున్నదని హెచ్చరించటానికి!" అన్నాడు.

తన తొందరపాటుకు శిఖిముఖి కొంచెం సిగ్గుపడి, "అపాయమా? ఎవరా శత్రువులు? శిథిలాలయ పూజారా?" అని అడిగాడు.

"ఎవరైందీ తెలియటం లేదు. నేల బారున పడుకుని జాగర్తగా వినండి. ఏదో డప్పుల మోత అస్పష్టంగా వినబడుతున్నది...అదుగో, ఇప్పుడు మరింత స్పష్టంగా వినవస్తున్నది!" అంటూ జాంగ్లా దాపుల నున్న చెట్ల కేసి తల తిప్పాడు.

ఆ సరికి శిఖిముఖికి కూడా ఆ డప్పుళ్ళు స్పష్టంగా వినిపించినై. ఆ వెంటనే అతడు విక్రమకేసరి, తతిమ్మా వాళ్ళు కూడా వినేట్టుగా పెద్ద గొంతుతో, "శత్రువులు! లేవండి!" అన్నాడు.

విక్రమకేసరితో పాటు అందరూ ఒక్కసారిగా నిద్రమేల్కొన్నారు. ఏదో ప్రమాదం రానున్నదని గుర్తిస్తూనే ప్రతి ఒక్కడూ ఆయుధాలు చేతికి తీసుకోబోయారు. కాని అంతలో వాళ్ళను అన్ని వైపుల నుంచి పాతికా ముప్ఫై మంది వికృతాకారులు చుట్టు ముట్టారు. వాళ్ళల్లో ఒకడికి తల మీది నుంచి కళ్ళను కప్పి వేస్తూ, తోలు ఆకారంగల టోపీ వున్నది. దానికి పొడిచిన రంధ్రాల్లో నుంచి వాడి కళ్ళు మిలమిలా మెరుస్తున్నవి.

తోలుటోపీ వాడు చేతిలో వున్న రాతి గొడ్డలిని పైకెత్తి తన అనుచరులతో, "నాకు కలలో వృశ్చికమాత కనిపించి చెప్పింది

వీళ్ళను గురించే! వీళ్ళలో యోగ్యులైన వాడిని బలియిస్తే, ఏ ప్రమాదం లేకుండా మనం వృశ్చికమాత మందిరంలో ప్రవేశించ వచ్చు," అన్నాడు.

ఈ వికృతాకారులు వృశ్చికలంకలోని ఆదిమవాసులనీ, యిప్పటి పరిస్థితుల్లో వాళ్ళను ఎదిరించటం ప్రమాదకరమనీ శిఖిముఖి గ్రహించాడు. విక్రమకేసరితో అతడా మాట అనగానే, అతడు కూడా అందుకు అంగీకరించాడు.




ఈ లోపల నాంగ్‌సోమ్, శిఖిముఖిని సమీపించి, "వీళ్ళు మాట్లాడే భాష మా ఋభ్యుజాతివాళ్ళు మాట్లాడేదానికి చాలా దగ్గిరగా వున్నది!" అన్నాడు.

"అందువల్ల మనకేమైనా మేలు కలుగుతుందంటావా? మనం ఏ దురుద్దేశంతోనూ యీ లంకకు రాలేదనీ, తుఫాను దెబ్బకు పడవలు యీ లంక చేరినవనీ చెప్పు!" అన్నాడు శిఖిముఖి.

నాంగ్‌సోమ్ వాళ్ళ నాయకుణ్ణి సమీపించి, శిఖిముఖి చెప్పమన్న విధంగా చెప్పి, "మనమంతా ఒకే ఋభ్యుజాతికి చెందిన వాళ్ళం. మనలో మనకు శత్రుత్వం ఎందుకు? ఉదయం కాగానే మా దారిన మేం పోతాం," అన్నాడు.

ఆ మాటలకు నాయకుడు ఆశ్చర్యపడి నట్టు తనవాళ్ళ కేసి చూసి, నాంగ్‌సోమ్‌తో, "మేం ఋభ్యుజాతివాళ్ళ మన్నది ఏనాటి మాట! మాది వృశ్చికజాతి. రెండు రోజుల క్రితం యీ లంకలో శిథిలాలయపు పూజారిననే వాడొకడు దిగి, తామూ ఋభ్యుజాతివాళ్ళమనీ, శిథిలేశ్వరి ఆలయం వెతుక్కుంటూ వచ్చా మనీ అంటున్నాడు. అతననే శిథిలేశ్వరి ఆలయం, మేం చెప్పే వృశ్చికమాత మందిరం ఒకటేననీ నాకు అనుమానం కలిగింది. రేపు మిమ్మల్ని అతడి గుంపులో చేరుస్తాము. అప్పుడుగాని అసలు మీరంతా ఎందుకు యీ లంక కొచ్చిందీ బయట



పడదు. ఎల్లుండి పౌర్ణమినాడు నేను వెర్రి వెలగపండు తిని, భూగర్భంలో ఆ మందిరం ఎక్కడ ఉన్నదో కనుక్కుని, మిమ్మల్నందర్నీ వృశ్చికమాతకు బలిపెడతాను," అన్నాడు.

శిఖిముఖి ఏదో మాట్లాడబోయాడు. కాని వృశ్చికజాతి వాళ్ళ నాయకుడు అతడి కేసి రాతిగొడ్డలి చూపి, తన అనుచరులకు, బందీ లందర్నీ వెంట తీసుకురమ్మని చెప్పి, ముందు బయలుదేరాడు.

శిఖిముఖీ వాళ్లు చేసేది లేక వాళ్ల వెంట బయలుదేరారు. శిఖిలాలయ పూజారి యీ లంక చేరాడనీ, ఏదో ఎత్తులు వేసి శిఖిలాలయం ఎక్కడ వున్నదీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడనీ శిఖిముఖికి అర్థమై పోయింది. వృశ్చికజాతివాళ్ళ నాయకుడు చెప్పేదాన్ని బట్టి, ఆ ఆలయం యీ లంకలో ఎక్కడో భూగర్భాన కప్పబడి వున్నది. వాడనే వెర్రివెలగపండు సంగతేమిటి?

శిఖిముఖికి కలిగిన యిలాంటి సంశయమే నాంగ్‌సోమ్‌కు కూడా కలిగింది. అతడు తన పక్కగా నడుస్తున్న ఒక వృశ్చికజాతి వాణ్ణి, "వెర్రి వెలగ పండేమిటి? దానికి అంత మహత్తున్నదా? ఎక్కడ దొరుకు తుంది?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు వృశ్చికజాతివాడు చేయెత్తి, దాపుల వున్న రెండు కొండ శిఖరాలను చూపుతూ, "ఆ వెలగపండు వుండే చెట్లు నాలుగైదు ఆ శిఖరాల దిగువనున్న చిన్న కొలను ఒడ్డున వున్నవి. ఆ పండు తిన్న వాడికి భూగర్భంలో ఎక్కడ ఏమున్నదీ తెలిసి పోతుంది," అన్నాడు.

ఈ వెర్రి వెలగపండు మహత్తును గురించి నాంగ్‌సోమ్ గోలఖరా గ్రామంలో అభ్యజాతి పెద్దలు మాట్లాడుకుంటూండగా చాలాసార్లు విన్నాడు. ఆ పండు ఒక్క వృశ్చికలంక లోనే దొరుకుతుందనీ, అది తిన్నవాడికి లోకం మరోరకంగా కనబడు తుందనీ, వాళ్ళనుకోవటం కూడా అతడికి

తెలుసు. కాని, యీ భూగర్భ రహస్యాలు కనుక్కొనే శక్తి దాని కున్నదని అతడు మొదటిసారిగా యిప్పుడే వింటున్నాడు.

ఏదో విధంగా ఆ వజ్రవెలగపండు సంపాయించి, తినగలిగితే శిథిలాలయం కనుక్కోవటం తేలిక అనీ, తమ సమస్యలన్నీ సునాయాసంగా పరిష్కారమైపోతవనీ, నాంగ్‌సోమ్ ఆలోచించాడు. కాని, ఆ వెలగపండు వున్న చోటుకు చేరాలంటే, తను వృశ్చికజాతివాళ్ళ కళ్ళు కప్పవలసి వుంటుంది....

నాంగ్‌సోమ్ యిలా ఆలోచిస్తున్నంతలో వృశ్చికజాతివాళ్ళ నాయకుడు ఒక కొండ గుహ దగ్గిర ఆగి, పెద్ద గొంతుతో, "బందీలందర్నీ యీ రాత్రికి యిక్కడే నిద్రపొమ్మనండి. ఉదయం కాగానే వాళ్ళ నేంచేయాలో ఆలోచిస్తాను," అని, కొండగుహలోకి పోయాడు.

శిఖిముఖివాళ్ళు గుహ ముందున్న చెట్ల కింద పడుకున్నారు. వాళ్ళను పట్టుకున్న వృశ్చికజాతివాళ్ళు కూడా దగ్గిరలో అక్కడక్కడా బండరాళ్ళకు చేరగిలబడి కునికిపాట్లు పడసాగారు.

నాంగ్‌సోమ్‌కు యిది మంచి అవకాశంగా కనిపించింది. తాను వజ్రవెలగపండు కోసం శిఖరం కింద వున్న కొలను దగ్గిరికి పోతున్నట్టు శిఖిముఖితో చెప్పదామనుకున్నాడు



గాని, ఒకవేళ అందుకతడు అభ్యంతరం తెలుపుతాడేమో అన్న భయం కలిగింది. ఆ కారణంగా నాంగ్‌సోమ్ పడుకున్న చోటు నుంచి మెల్లిగా లేచి, కొండ శిఖరం దిగువ నున్న కొలను కేసి బయలుదేరాడు.

నాంగ్‌సోమ్ కొలను ప్రాంతాన్ని చేరేసరికి ఒక వృశ్చికజాతివాడు కొలను పక్కనున్న వెలగచెట్ల కింద అటూ యిటూ పహరా తిరుగుతున్నాడు. వాణ్ణి దెబ్బ తీయకుండా తాను వెలగపండు సంపాయించటం సాధ్యం కాదని నాంగ్‌సోమ్ గ్రహించాడు. ఆ వెంటనే అతడు, ఒక రాతి చాటున దాక్కుని చిన్నగా ఈల వేశాడు.

నాంగ్‌సోమ్ వేసిన ఈల వినపడగానే పహరావాడు, "ఎవరక్కడ?" అంటూ నాంగ్‌సోమ్ దాగివున్న రాతి దగ్గరకు పరి గెత్తుకు వచ్చాడు. నాంగ్‌సోమ్ చప్పున రాతి వెనక నుంచి లేచి, పహరావాడి ముఖంమీద బలంగా ఒక దెబ్బ కొట్టాడు. పహరావాడు కిక్కురుమనకుండా కింద పడిపోయాడు. నాంగ్‌సోమ్ అతడి కాళ్ళూ చేతుల్ని ఒక బలమైన చెట్టుతీగతో బంధించి, వాణ్ణి రాతికి ఆనించి కూచోబెట్టి, వేగంగా వెర్రివెలగచెట్ల కేసి పరిగెత్తాడు.

ఒకటి రెండు నిమిషాల్లో వృశ్చికజాతి పహరావాడికి స్పృహ వచ్చింది. వాడు వెలగచెట్ల కేసి తలతిప్పి చూశాడు. వాడికి అటుకేసి పరిగెత్తుతున్న నాంగ్‌సోమ్ కని పించాడు. వెంటనే వాడు కట్లు విప్పుకునేం దుకు పెనుగులాడసాగాడు. కట్లు తెగలేదు కాని, పక్కనున్న బండరాయి కదిలింది. అది మీద పడుతుందేమో నన్న భయంతో వాడు భుజం ఆనించి దాన్ని వెనక్కు తోయ బోయాడు. బండరాయి స్థానంతప్పి కిందకు దొర్లసాగింది. దానితో పాటు పహరావాడు కూడా శిఖిముఖివాళ్ళు నిద్రపోతున్న కొండ దిగువకు దొర్లుకు రాసాగాడు.

—(ఇంకా వుంది)





శిథిలాలయం

29

[రాత్రివేళ శిఖిముఖి వాళ్ళను వృశ్చికలంక లోని ఆదిమవాసులు పట్టుకున్నారు. వాళ్ళ నాయకుడు చెప్పిన వ్యక్తి వెలగపండు కోసం నాంగపాము వెళ్ళి, అక్కడ కాపలా వున్న వాణ్ణి పట్టుకుని, కాళ్ళూ చేతులూ కట్టివేశారు. వాడు పక్క నున్న బండరాయితో పాటు, శిఖిముఖి వాళ్ళు నిద్రపోతున్న కొండ దిగువకు దొర్లుకు రాసాగాడు. తరవాత—]

గుహలో నిద్రపోతున్న వృశ్చికజాతి వాళ్ళ నాయకుడికి, గుహముందు కునికిపాట్లు పడుతున్న శిఖిముఖి అతడి అనుచరులకూ, కొండపై నుంచి దొర్లుకు వస్తున్న బండ రాయీ, కాపలావాడూ కలిసి చేసే పెద్ద ధ్వని భయం కలిగించింది. ఏదో పెను తాకిడికి కొండ శిఖరం తునాతునకలై కింద పడుతున్న దనుకున్నాడు, శిఖిముఖి. అతడు గొంతెత్తి తనవాళ్ళను హెచ్చరించే లోపలే, గుహలో నుంచి వృశ్చికజాతివాళ్ళ నాయకుడు మెరపులా బయటికి వచ్చాడు.

"కొండ అంచు నుంచి దూరంగా పరిగెత్తండి. భూకంపం! భూకంపం!" అంటూ అరిచాడు వాడు.

ఆ హెచ్చరిక వింటూనే అందరూ పారిపోబోయేంతలో, పెద్ద ధ్వనితో బండ రాయీ, ఓ క్షణం ఆలస్యంగా కాపలా వాడూ కొండ మీది నుంచి కిందపడ్డారు.





అదృష్టవశాన బండరాయి మనుషులెవరూ లేని చోట పడింది. కాని కావలావాడు మాత్రం కీచుమని అరుస్తూ తన జాతివాళ్ళిద్దరి మీద దభీమంటూ పడిపోయాడు.

వృశ్చికజాతి నాయకుడు కిందపడి మూలుగుతున్న కావలావాణ్ణి సమీపించి, "ఇదేమిటి? కాళ్ళూ చేతులూ కట్టుకున్నావేం?" అని ప్రశ్నించాడు.

వాడు తడబడుతూ లేచి నిలబడి, "మనం పట్టుకున్న యీ ఇక్ష్వజాతి వాళ్ళల్లో ఒకడు నేను కావలాకాసే చోటుకు వచ్చి, దొంగదెబ్బ తీసి నా కాళ్ళూ చేతులూ కట్టివేశాడు. ఈ సంగతి చెప్పేందుకు నేను కొండ మీది నుంచి దిగి వచ్చాను." అన్నాడు.

ఈ మాటలు వృశ్చిక నాయకుణ్ణీ, శిఖిముఖీ, విక్రమకేసరుల్నీ కూడా ఆశ్చర్య పరిచినై. శిఖిముఖి తన అనుచరుల కేసి చూసి, వాళ్ళల్లో నాంగ్‌సోమ్ లేడని తెలుసుకున్నాడు. అతడు విక్రమకేసరితో యీ సంగతి చెప్పబోయేంతలో వృశ్చిక నాయకుడు గడగడ వణికిపోతూ, "మీలో ఒకడు రహస్యంగా ఆ వెర్రివెలగపళ్ళ కోసం వెళ్ళాడు. ఒకవేళ దుస్సాహసం కొద్దీ వాడా పండు తిన్నాడో, చాలా చిక్కుల్లో పడిపోతాడు. ఇప్పుడేం చేయటం?" అన్నాడు.

"అలా అయితే మనం త్వరగా పోయి నాంగ్‌సోమ్ ఆ వెలగపండు తినకుండా ఆపే ప్రయత్నం చేద్దాం. అంతకీ ఆ పండు తింటే రాబోయే ప్రమాదం ఏమిటి?" అన్నాడు శిఖిముఖి.

"వృశ్చికజాతి వాళ్ళ నాయకుడు తప్ప మరెవరూ ఆ వెర్రివెలగపండు తిని నిభాయించుకోలేరు. ఆ మధ్య నాకు పట్టుబడ్డ శిఖివాడికి — వాడు పెట్టుకున్న పేరు — శిథిలాలయపూజారి కామాలు — వాడి చేత ఆ పండు తినిపించి, నిజం మాట్లాడేట్టు





చేద్దామనుకున్నాను." అన్నాడు వృశ్చిక నాయకుడు.

శిఖిముఖి వృశ్చిక నాయకుడితో, "నాంగ్‌సోమ్ ఎవర్నీ మోసగించి వెర్రి వెలగపండు కోసం వెళ్ళలేదు. అతడికి మధ్య, ఈ ప్రాంతాల గాలీ నీరూ పడక మనస్థిమితం కాస్త తప్పింది. మనం మనం అంతా మిత్రులం. శిథిలాలయం ఎక్కడుండో కనుక్కోవటంలో నీకు అన్ని విధాలా సాయపడగలం. ముందు నాంగ్‌సోమ్ ఎక్కడున్నాడో వెతికి పట్టుకుందాం పదండి," అన్నాడు.



నాంగ్‌సోమ్ వెర్రివెలగపండు తినివుంటే అతణ్ణి తప్పక వృశ్చికమాతకు బలి ఇస్తానని వృశ్చిక నాయకుడు తన వాళ్ళతో చెప్పి, శిఖిముఖి వాళ్ళతో, "పదండి! పండు తిని మీ వాడు ప్రాణం మీదికి తెచ్చుకోక ముందే పట్టుకుందాం." అన్నాడు.

అందరూ వృశ్చిక నాయకుడి వెంట వెర్రివెలగపండు చెట్టున్న కొలను కేసి బయలుదేరారు. కాని, ఈ లోపలే నాంగ్‌సోమ్ వెలగచెట్టెక్కి ఒక పండు కోసుకుని తిన్నాడు. అది తిన్న కొద్ది క్షణాల కల్లా అతడికి ఏదో మైకం కమ్మినట్టయి పోయింది. తాను నిలబడ్డ భూమీ, చెట్టు చేమలూ, కొండలూ—అన్నీ గిర్రున తిరిగి పోతున్నట్టు తోచింది.

"నేను తిన్నది వెర్రివెలగపండు! నాకేదో వెర్రెత్తుతున్నట్టున్నట్టున్నది. ఈ వెర్రితోగాని భూగర్భంలో వున్న శిథిలాలయం కనుక్కోలేనేమో! అసలు శిథిలాలయం, వృశ్చికమాత మందిరం ఒకటేనా? ఒకటే! అదుగో శిథిలాలయం! అదుగో, వృశ్చికమాత మందిరం!" అంటూ నాంగ్‌సోమ్ తల పీక్కుని, అరుస్తూ కొండదార్ల వెంట పరిగెత్తసాగాడు.

అతణ్ణి పట్టుకునేందుకు బయలుదేరిన శిఖిముఖి వాళ్ళకు అతడు చెట్లల్లో నుంచి,





కొండకోనల్లో నుంచి అరిచే అరుపులు తప్ప మనిషి మాత్రం కనిపించలేదు. ధ్వని వచ్చిన దిక్కుగా వాళ్ళు సూర్యోదయం అయే వరకూ అతడి కోసం గాలించి, బాగా అలిసిపోయి, ఒక కొండ అంచున వున్న చెట్ల కింద కూలబడ్డారు.

వెర్రివెలగపండు చెట్లున్న కొలనుకు అవల వున్న అరణ్యంలో వృశ్చికజాతివాళ్ల కాపుదలలో వున్న శిథిలాలయ పూజారికి, నాంగ్‌సోమ్ పిచ్చిగా వేసే కేకలు, ఆ రాత్రి వేళ వినిపించినై. అతడు తన అనుచరులైన నవరభైరుండాన్ని, తతిమ్మావాళ్ళనూ హెచ్చరించి, వృశ్చికజాతి కాపలా వాళ్లతో,



ఆ కేకలు పెట్టేవాడు వృశ్చికమాత ఆవేశించిన మహాభక్తుడని, అతణ్ణి అనుసరించి పోతే, మాతమందిరం కనబడుతుందని నమ్మబలికాడు.

మాయమర్మాలు అంతగా ఎరగని వృశ్చిక జాతివాళ్ళు, శిథిలాలయ పూజారి వెంట నాంగ్‌సోమ్ కోసం బయలుదేరారు. తూర్పు తెలతెలవారుతూండగా వాళ్ళకు ఒక గుహ ముందు నాంగ్‌సోమ్ కనిపించాడు. గుహ ముఖం చిక్కని సాలెగూటితో కప్పబడి వున్నది. అందులో ఒక రాక్షసితేలు చిక్కుకుని, బయట పడేందుకు నానా ప్రయాస పడుతున్నది.

నాంగ్‌సోమ్ ఆ సాలెగూటి ముందు కత్తి పట్టుకుని అటూ యిటూ గెంతుతూ, "రక్షించండి! రక్షించండి! భయంకర జలజంతువు నన్ను మింగబోతున్నది!" అంటూ అరుస్తున్నాడు.

ఆ అరుపులూ, నాంగ్‌సోమ్ భయంతో వణికిపోతున్న తీరూ చూసి, శిథిలాలయ పూజారి అతడికి వెర్రి వెలగపండు తిన్న కారణంగా మతిస్థిమితం తప్పిందని గ్రహించాడు. వృశ్చికజాతివాళ్ళు నమ్ముతున్నట్టు బహుశా ఆ స్థితిలోనే అతడు నిజమైన శిథిలాలయం ఎక్కడ వున్నదో





కనుక్కోవచ్చునన్న నమ్మకం కూడా అతడికి కలిగింది.

పూజారి అతణ్ణి సమీపించి, "నువ్వు ఐభ్యజాతి వాడివి కాదా? నిన్ను గేల్‌ఖరా గ్రామంలో చూశాను. నీ పేరు నాంగ్‌సోమ్, అవునా?" అని ప్రశ్నించాడు.

నాంగ్‌సోమ్ ఆ మాటలు వింటూనే ఉలిక్కిపడి వెనక్కు తిరిగి, "నెత్తి మీద శిఖతో యిక్కడ అవతరించిన మహానుభావులు మీ రెవరు? సిద్ధుల్లా వున్నారు. నన్ను యీ ఖడ్గమృగం నుంచి కాపాడాలి," అంటూ పూజారికి సాష్టాంగపడ్డాడు.

పూజారి అతణ్ణి భుజాలు పట్టుకుని లేపి నిలుచో పెట్టి. "అది ఖడ్గమృగం కాదు. రెండు తలల గండభేరుండం. ఒక్క క్షణంలో చంపేయిస్తాను," అంటూ పక్కనున్న సపరభేరుండంతో. "భేరుండం! ఆ పిశాచిని నరుకు," అన్నాడు.


ఆ వెంటనే భేరుండం కత్తితో తేలును బలంగా కొట్టాడు. అది రెండుగా తెగిపోయి, రక్తంతో సాలెగూడు తడిసిపోయింది. నాంగ్‌సోమ్ ఆ నెత్తురు చూస్తూనే వణుకుతూ పూజారి పాదాలు పట్టుకుని, "మహా సిద్ధులు నన్ను రక్షించాలి! నెత్తుటి ప్రవాహంలో కొట్టుకుపోతున్నాను. ఉతకాయ!" అన్నాడు.



శిథిలాలయ పూజారి అతడికి అభయం యిస్తున్నవాడిలా చేతిని తల మీద పెట్టి, "నీ కొచ్చిన భయం ఏమీ లేదు. రక్తపు టేరును, సెలయేటి జాలుగా మార్చాను. నువ్వు దాని వెంట బయలుదేరి భూగర్భంలో శిథిలాలయం వున్నచోటు చేరు," అన్నాడు.

"గురుసిద్ధా. తమ ఆజ్ఞ!" అంటూ నాంగ్‌సోమ్ అక్కణ్ణించి కదిలి వేగంగా నడవసాగాడు.

శిథిలాలయపూజారి తన బంట్లతో, "బల్లి తోక పట్టుకుని బ్రహ్మపుత్రానది యీద చూసినట్టుంది మన పని! అయినా ఏ పుట్టలో ఏ పాముందో చెప్పలేం. వీడి



వెర్రి మనసు శిథిలాలయం చేర్చినా చేర్చ వచ్చు. వీడు పారిపోకుండా జాగ్రత్త పడాలి." అని చెప్పి నాంగ్‌సోమ్ వెంట నడవసాగారు.

నాంగ్‌సోమ్ వాళ్ళను ఆ చుట్టు పక్కల గల గుట్టల్లో, చెట్లల్లో నానా గిరికీలూ కొట్టించాడు. వెర్రి వెలగపండు విషం అతడి మస్తిష్కాన్ని బాగా వశపరుచుకున్నది. అతడికి ప్రతి చిన్న ప్రాణీ ఏనుగంత ఆకారంలో భయంకరంగా కనబడసాగింది. అలాంటి సమయాల్లో అతడు పెద్దగా, "గురుసిద్ధా, ఏదీ రక్ష!" అంటూ కేకలు పెట్టసాగాడు.



మిట్టమధ్యాహ్నం వేళకు నాంగ్‌సోమ్ అందర్నీ ఒక ఎత్తయిన పర్వతం మీదికి చేర్చాడు. దిగువను ఒక చిన్న లోయ వున్నది. ఆ లోయలో చాలా ఎత్తుగా, గుబురుగా పెరిగిన వటవృక్షాలు అసంఖ్యాకంగా వున్నవి.

నాంగ్ లోయ కేసి ఓ మారు చూసి జుట్టు గట్టిగా పీక్కుని, "గురుసిద్ధా! శిథిలాలయం ఆ అగాధంలో వున్నది. ఎంత బంగారం! ఎన్ని మణిమాణిక్యాలు! ఆలయం మీది కలశం....అదుగో, మెరుస్తున్నది!" అన్నాడు.

శిథిలాలయపూజారి లోయలోకి తొంగి చూశాడు. నాంగ్‌సోమ్ చెప్పిన దేమీ అతడికి కనిపించలేదు. పెద్ద పెద్ద ఊడలు దించుకున్న వటవృక్షాలు మాత్రం అతడి కంటబడినై.

"అది వెర్రి వాగుడు! వెధవ మనల్ని గుట్టలూ పుట్టలూ తిప్పి నానా హైరానా పెట్టాడు, లోయలోకి తోసేస్తే సుఖపడి పోతాం," అన్నాడు శిథిలాలయపూజారి కోపంగా.

ఆ మాట వింటూనే నవరభేరుండం ముందుకు వచ్చి, "గురుప్రభో! వీణ్ణి వున్న పళంగా తోయమన్నారా, ముక్కలుగా నరికి విసరమన్నారా?" అన్నాడు.





మరుక్షణం వృశ్చికజాతివాళ్లలో కలకలం లేచింది. వాళ్ళు రాతి గొడ్డళ్ళను పైకెత్తి ముందుకు వచ్చి, "ఈ అభ్యజాతి వాడికి ఎలాంటి హాని జరగ్గూడదు. అతడు వృశ్చికమాత గణాచారి. అతడు చెప్పినట్టు ఆ లోయలో వృశ్చికమాత మందిరం వున్నదేమో ఎవరు చూశారు!" అన్నారు.

పూజారి ఏదో అనబోయేంతలో నవరభైరుండం చేతులు వూపుతూ, "అది నిజమే, గురుప్రభో! అలా గాల్లోకి ఎగిరి లోయలో వాలమన్నారా?" అన్నాడు.



శిథిలాలయపూజారి అతణ్ణి గట్టిగా కసిరి, "నువ్వు మళ్ళీ అతిగా తాగటం మొదలు పెట్టినట్టుంది, జాగర్త. కొండ ముచ్చుగా మార్చి, యిక్కడి చెట్ల మీద వదిలి పోతాను," అన్నాడు.

"గురుప్రభో! అలా చేయకండి. కొండ ముచ్చులు కొండల్లో తప్ప చెట్ల మీద బతకటం...."

నవరభైరుండం మాట పూర్తి చేసే లోపలే పూజారి కీచుమంటూ ఒక్క ఎగురెగిరి, "అదె, వచ్చె వచ్చె! శంబరకంఠ శిఖిముఖి వాడిదంతా!" అన్నాడు.

శిఖిముఖి కొండ మీదికి వస్తూనే, "నాంగ్‌సోమును కొండ అంచు నుంచి యివతలికి లాగండి." అని శిథిలాలయపూజారిని చూసి, "దుర్మార్గుడా, యింత కాలానికి దొరికావ్! పారిపోవాలని చూశావో వీపులో కత్తో, బాణమో గుచ్చుకుంటుంది," అన్నాడు.

ఎలా పారిపోవటమా అని ఆలోచిస్తున్న పూజారికి, శిఖిముఖి మాటల్తో ఒక ఉపాయం తోచింది. అతడు చప్పున ముందుకు దూకి నాంగ్‌సోమును భుజాన వేసుకుని, కొండ అంచునే పరిగెత్తుతూ ఇరుకు రాళ్ల మధ్య దూరబడ్డాడు.

పాము బారి నుంచి తప్పుకుని పులినోట పడినట్టయింది, పూజారి పని. అటు వైపు నుంచి కుంటుతూ వస్తున్న జాంగ్‌లా ఒక్క



గావు కేక పెట్టి. "పాపాత్ముడా! ఇక నువ్వు ప్రాణాలతో పారిపోలేవు!" అంటూ అతడి మీదికి ఉరికాడు.

శిథిలాలయపూజారి, నాంగ్‌సోమ్‌ను భుజం మీది నుంచి కిందికి జార్చి, మొలను వేలాడుతున్న చురకత్తితో జాంగ్‌లా గుండెలకు గురి చేసి పొడవ బోయాడు. కాని అంతలో జాంగ్‌లా వచ్చి మీద పడటంతో, కత్తి గురి తప్పి అతడి భుజంలో గుచ్చుకున్నది. జాంగ్‌లా అంత బలమైన కత్తి పోటునూ లెక్క చేయకుండా పూజారి మెడ పట్టుకోబోయాడు. కాని, పూజారి తల పక్కకు తిప్పి కొండ అంచుకు ఒరిగి పోవటంతో, అతడి నెత్తిమీది శిఖ జాంగ్‌లా చేతికి దొరికింది.

జాంగ్‌లాకు తగిలిన గాయం నుంచి రక్తం కారుతున్నది. కాని, అతడు పూజారి శిఖ వదలకుండా గట్టిగా పట్టుకుని కొండ మీదికి లాగేందుకు ప్రయత్నిస్తున్నాడు. పూజారి తాను కింది లోయలో పడిపోతానన్న భయంతో గిలగిల తన్నుకుంటున్నాడు.

ఆ పరిస్థితుల్లో శిఖిముఖి అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చి, "జాంగ్‌లా, నీ స్వామిభక్తి మెచ్చదగింది. నవరగండు పోతు కూతురు నాగుమల్లి, ఏది శిఖ కావాలన్నది!" అంటూ కత్తితో శిథిలాలయ పూజారి శిఖ మొదటికంటా కోశాడు. మరుక్షణం శిథిలాలయపూజారి ఒక్క చావుకేక పెట్టి లోయలోకి పడిపోయాడు.

ఆ క్షణం వరకూ నాంగ్‌సోమ్ ఏం చేస్తున్నదీ ఎవరూ గమనించలేదు. అతడు లోయలోని మహా వటవృక్షాల కేసి కన్నార్పకుండా చూడసాగాడు. అతడికి శిథిలాలయ పూజారి పెట్టిన చావుకేక వినిపించింది. ఆ వెంటనే నాంగ్‌సోమ్, "అదుగో, శిథిలాలయం!" అని అరిచి లోయలోని వటవృక్షాల కేసి దూకేశాడు.

—(ఇంకా వుంది)





30

[వెర్రి వెలగపండు తిన్న నాంగ్‌సామ్ మతిచెడి కేకలు పెట్టసాగాడు. పూజారి అతణ్ణి పట్టుకుని, శిథిలాలయం కనుక్కొనేందుకు బయలుదేరాడు. కొండ మీద శిఖిముఖీ వాళ్ళు అతణ్ణి ఎదిరించారు. ఆ సందర్భంలో జాంగ్‌లా గాయపడ్డాడు. శిథిలాలయ పూజారి కింది లోయలో పడిపోయాడు. నాంగ్‌సామ్ లోయలోకి దూకేశాడు. తరవాత—]

నాంగ్‌సామ్ శిథిలాలయం అంటూ అరిచి లోయలోకి దూకటం చూస్తూనే శిఖిముఖీ, విక్రమకేసరి నిర్విణ్ణులై పోయారు. గేల్ ధరా నుంచి ఎంతో నేర్పుగా అతడు పడవను నడిపి, ఇలా నృశ్శృకలంకకు చేర్చాడు. మార్గంలోనూ, ఇక్కడికి చేరింతరవాతా మొక్కవోని ధైర్యంతో తమకు సహాయ పడ్డాడు. అటువంటి విశ్వాసపాత్రుడు మతి భ్రమతో లోయలోకి దూకి ప్రాణాలు కోల్పోవటం, వాళ్ళిద్దరికీ అంతులేని ఆవేదనను కలిగించింది

"శిఖీ! మనం గొప్ప మిత్రుణ్ణి పోగొట్టు కున్నాం. ఆ వెర్రివెలగపండులో ఏదో మహత్తర శక్తి ఉన్నదని నమ్మి, తిని, ఘోరమైన చావు తెచ్చుకున్నాడు." అన్నాడు విక్రమకేసరి.

శిఖిముఖీ ఏదో జవాబు చెప్పబోయేంతలో జాంగ్‌లా పెద్దగా మూలుగుతూ,



"శిఖిదొరా! నాంగ్‌సోమ్ చచ్చిపోయి వుండడు. ఆ దూకటంలో ఏ మహావృక్షం మీద అయినా పడివుంటే, దాని కొమ్మలు అతణ్ణి కాపాడే అవకాశం వుంది. పైగా, అతడు శిథిలాలయం కనబడినట్టు కేక వేసి మరీ లోయలోకి దూకాడు. అందులో ఏమైనా వాస్తవం వుండవచ్చు," అన్నాడు.

ఆ మాటలు వినగానే శిఖిముఖి మనసులో కొంత ఆశ మొలకెత్తింది. అతడు జాంగ్‌లాను సమీపించి భుజం మీద చేయి వేసి ఆప్యాయంగా నిమిరి, "జాంగ్‌లా! నీ స్వామిభక్తే కాక, ధైర్యసాహసాలు కూడా నా కెంతో ఆనందం కలిగిస్తున్నవి. నువ్వు పట్టుకోకపోతే ఆ శిథిలాలయ పూజారి మళ్ళీ జారిపోయివుండేవాడు," అని జాంగ్‌లా భుజం మీద తగిలిన గాయం నుంచి కారిన రక్తం గడ్డకట్టిపోవటం చూసి, "అరెరె! గాయానికి యింకా కట్టుకట్ట లేదా?" అంటూ చుట్టూ కలయచూశాడు.

అదంతా గమనిస్తున్న వృశ్చికజాతి నాయకుడు చప్పున దాపుల నున్న పొదల్లోకి పోయి ఏదో ఆకుపసరు తెచ్చి, జాంగ్‌లా గాయానికి పూసి, కట్టు కట్టాడు. అప్పుడు విక్రమకేసరి, జాంగ్‌లాతో, "జాంగ్‌లా! నువ్వు చెప్పేదాన్నిబట్టి నాంగ్‌సోమ్ మాత్రమే కాక, దుష్టుడైన శిథిలాలయ పూజారి కూడా ఏ చెట్టుకొమ్మల మీదనో పడి బతికి వుండవచ్చుగదా?" అని అడిగాడు.

"అవును, దొరా! అలా జరిగితే ఆశ్చర్య పడవలసిందేమీ లేదు," అన్నాడు జాంగ్‌లా.

ఆ మాట వింటూనే వృశ్చికనాయకుడు కోపంగా ఒక గెంతు గెంతి, "బతికుంటే వాళ్ళిద్దర్నీ పౌర్ణమినాడు వృశ్చికమాతకు బలి ఇస్తాను. వాళ్ళల్లో ఒకడు మోసకారి, రెండవవాడు వృశ్చికజాతి నాయకుడు మాత్రమే తినే అర్హత గల వెర్రివెలగపండు తిని మాతకు అపచారం చేశాడు," అన్నాడు.



అతని మాటలు విక్రమకేసరికి చాలా కోపం తెప్పించినై. అతడు చఱ్ఱున కత్తి దూసి, "నువ్వు మొదటి నుంచీ ఈ లంకె కంతా మహారాజువైనట్టు మాటాడుతున్నావు. మనుషుల్ని బలిపెట్టటం అంత చులకన అనుకున్నావా? ఏదీ నీ శక్తి చూస్తాను. నీ ఆయుధం తీసుకుని ఇవతలికి రా!" అంటూ కొంచెం దూరంగా పోయి నిలబడ్డాడు.



వృశ్చికజాతివాళ్ళలో కలకలం బయలుదేరింది. వాళ్ళు వాళ్ళ నాయకుడి చుట్టూ చేరి గొడవగొడవగా మాట్లాడసాగారు. ఇలా నాలుగైదు నిమిషాలు గడిచింతరవాత వృశ్చికనాయకుడు, తన వాళ్ళను తొలగ దోసుకుని, రాతిగొడ్డలి పైకెత్తి విక్రమకేసరిని సమీపించాడు,

అప్పుడు బలి కన్న ఘోరమైన హత్య జరిగిపోనున్నదని శిఖిముఖి గ్రహించాడు. కేసరి ముందు వృశ్చిక నాయకుడు ఎందుకూ కొరగాడు. ఒక్క కత్తి విసురుతో అతడు వాణ్ణి ముక్కలుగా నరకగలడు!

శిఖిముఖి ఒక పెద్ద కేకతో వాళ్ళిద్దర్నీ వారించి జాంగ్‌లాను వెంటబెట్టుకుని వాళ్ల మధ్యకు పోయి నిలబడి వచ్చిరాని ఆఖ్య జాతివాళ్ళ భాషలో, "వృశ్చికనాయకా! నువ్వు తొందరపడకు. కేసరి చేతిలో ఉన్న కత్తి పదును ముందు, నీ రాతిగొడ్డలి నిరుపయోగం. అసలీ పోట్లాటకు అర్థం లేదు. నువ్వింత వరకూ వృశ్చికమాత మందిరం ఎక్కడున్నదో కనుక్కోలేదు. అంతే కాక నాంగ్‌సోమ్ బతికి ఉన్నదీ లేనిదీ కూడా మనకు తెలియదు," అన్నాడు.

జాంగ్‌లా వృశ్చికనాయకుడికి అర్థమయ్యే విధంగా శిఖిముఖి అన్న మాటలు వివరించి చెప్పాడు. నాయకుడు కోపంతో ముక్కుపుటాలు అదురుతూండగా, "ఈ లంక నాది! ఇక్కడికి వచ్చిన వాళ్లంతా నా బానిసలు!" అన్నాడు.





కోపంతో విక్రమకేసరి కత్తి ఎత్తబోయేంతలో శిఖిముఖి అతణ్ణి ఆపి, "ఎవరూ ఎవరికీ ఇష్టమై బానిసలు కారుగదా? మా కన్న శక్తిమంతుడవని రుజువు చేసుకుని మాత్రమే నువ్వు మమ్మల్ని బానిసలుగా చేసుకోగలవు. నీ మంచి కోసం చెబుతున్నాను; చూడు; ఈ కత్తి, నీ రాతి గొడ్డలి కన్న పదునైనది, గట్టిది, బలమైనది. నీవు దీన్ని మించిన ఆయుధం, శక్తీ సంపాయించుకున్న నాడు, మేము బహుశా నీకు బానిసల మవుతాం." అన్నాడు.

వృశ్చికనాయకుడికి, శిఖిముఖి చెప్పింది నాలుగు వాక్యాల్లో గబగబా చెప్పి, జాంగ్లా కేసరి చేతిలో ఉన్న కత్తి మీద తన మణికట్టును గట్టిగా అనించి, పైకి తీసి బొటబొట కారుతున్న రక్తాన్ని వృశ్చిక నాయకుడికి చూపుతూ, "కత్తి పదును ఎలాంటిదో తెలిసిందా? ఇక శిఖిదొర చెప్పినటు విను." అన్నాడు.

వృశ్చిక నాయకుడు కళ్ళెర్రజేసి, ఒక పొలికేక పెట్టి, చేతిలో ఉన్న రాతిగొడ్డలిని దూరంగా విసిరి, "ధర్మయుద్ధం! ఆయుధం లేకుండా వట్టి చేతులతో పోరాడుదాం." అంటూ రొమ్ము చరిచాడు.

కత్తి కిందకు జార్చి, వృశ్చికనాయకుడితో కలియబడేందుకు విక్రమకేసరి పోబోయేంతలో, శిఖిముఖి అతణ్ణి ఆపి, "ఈ వృశ్చిక తెగ నాయకుడితో పోరాడే హక్కు మరో తెగ నాయకుడి కొడుకుది! అతడి అనుచరుల్ని మాత్రం ఒక కంట కనిపెట్టి ఉండండి." అంటూ వృశ్చిక నాయకుడి మీదికి లంఘించాడు.

ఇద్దరూ మహారోషంతో ముష్టిఘాతా లిచ్చుకుంటూ, ఒకళ్ళనొకళ్ళు కింద పడదోసేందుకు తీవ్రంగా పోరాడసాగారు. వృశ్చిక నాయకుడు దేహబలంలో శిఖిముఖి కన్న మిన్న అయినా, శిఖిముఖి కున్న నేర్పు ఒడుపూ లేనందున, శిఖిముఖి





అతణ్ణి తల మీదా, రొమ్ముల మీదా బలంగా పొడిచి, చివరకు ఒక్క తూపుతో నేల మీదికి పడదోసి, ఒక చేత్తో అతడి గొంతు బిగబట్టి, రెండవచేత్తో జుట్టు పట్టుకుని, తలను ఒకటి రెండుసార్లు నేలకు వేసి గట్టిగా కొట్టాడు.

వృశ్చికనాయకుడు కళ్ళు తేలవేస్తూ, చేతులు రెండూ పైకెత్తి చిన్న గొంతుతో ఏదో అనసాగాడు. జాంగ్‌లా అతడి పక్కన వంగి, ఆ మాటలు విని, శిఖిముఖితో, "శిఖి దొరా! ఇక వాణ్ణి వదలండి. అజన్మ బానిసనని వేడుకుంటున్నాడు," అన్నాడు.

శిఖిముఖి చప్పున లేచి నిలబడ్డాడు. వృశ్చిక నాయకుడు కూడా లేచి కూర్చుని ముందుకు వంగి శిఖిముఖి పాదాలు పట్టుకుని ఏమో గొణిగాడు. తమ నాయకుడు అలా చేయగానే వృశ్చికజాతి వాళ్ళంతా వున్న చోటనే ప్రాణాచారం పడ్డారు.

శిఖిముఖి, వృశ్చిక నాయకుణ్ణి లేవనెత్తి, "మనిషి మరో మనిషికి ఏ పరిస్థితుల్లోనూ బానిస కానవసరం లేదు. జరిగిపోయింది యిద్దరం మర్చిపోదాం. ఇకనుంచి మనం మిత్రులం!" అన్నాడు.

వృశ్చిక నాయకుడి కళ్ళ నుంచి నీళ్ళు జలజలా కింద రాలినై. అతడు శిఖిముఖికి, విక్రమకేసరికి తన కృతజ్ఞత చెప్పుకుని, తన జాతివాళ్ళతో, "ఇకనుంచి మనకందరికీ నాయకుడు, యీ శిఖిదొర! ఆయన మాటకు తిరుగులేదు." అన్నాడు.

తరవాత అందరూ చెట్ల కింద కూర్చుని, వెంట తెచ్చుకున్న ఆహారం తిన్నారు. అప్పుడు శిఖిముఖి, విక్రమకేసరితో ముందు తాము చేయవలసిన పనిని గురించి సంప్రతించాడు. ఆ ఇద్దరికీ నాంగ్‌సోమ్ లోయలో ఎక్కడో సురక్షితమైన స్థానంలో పడి బతికే వుంటాడన్న నమ్మకం వున్నది. ఆ సంభాషణ విన్న జాంగ్‌లా, నాంగ్‌సోమ్ ప్రాంతాలలో వుంటే, శిఖిలాలయ పూజారి కూడా బతికే వుండొచ్చు అన్నాడు.





వృశ్చిక నాయకుడు తనకున్న శంకను మరోసారి బయట పెట్టాడు; వెర్రివెలగ పండు మహత్తు అమోఘమైనది. నాంగ్ సామ్ లోయలోకి దూకేముందు శిథిలాలయం అంటూ కేకపెట్టటం మతిభ్రమవల్ల కాదు. అతడికి శిథిలాలయం కనబడే వుంటుంది!

"శిథిలాలయం మాట దేవు డెరుగు, ముందు ఆ లోయలోకి పోయి అతడు బతికున్నాడేమో చూసి, రక్షించవలసిన బాధ్యత మనమీద వున్నది. జాంగ్‌లా అన్నట్టు శిథిలాలయపూజారి కూడా ఏ చెట్టు కొమ్మల్లోనో సురక్షితంగా దిగివుంటే, వాళ్ల వేటాడవలసిన పనికూడా వున్నది. వెలుగు వుండగానే మనం ఆ లోయలోకి దిగుదాం." అన్నాడు శిఖిముఖి.

"మీ ఆజ్ఞ, దొరా! కాని, ఆ లోయ చాలా భయంకరమైనది. అక్కడ మహా సర్పాలూ, తేళ్ళు కాక, ఏనుగులూ, సింహాలూ, పులులూ...."

వృశ్చికనాయకుడు మాటలు ముగించక ముందే శిఖిముఖి అడ్డువచ్చి, "ఈ లంకలో భయంకరంగా కాక, ప్రశాంతంగా, సౌమ్యంగా వున్న ప్రదేశం ఎక్కడుంది? నువ్వనే వృశ్చికమాత మందిరం ఆ లోయలోనే గదా వున్నది. ఆ ఆలయాన్ని కనుక్కొని, తిరిగి వృశ్చికమాతకు పూజా పునస్కారాలు చేయవలసిన బాధ్యత మీ జాతి వాళ్ళకు మాత్రం లేదా?" అని అడిగాడు.

"ఆ మాత కోసం ప్రాణాలిస్తాం, దొరా! కాని, నేను వెర్రివెలగపండు తిని వున్నట్టయితే, పౌర్ణమినాడు మాతమందిరం చేరి, నరబలి ఇచ్చి వుండేవాణ్ణి. నరబలి లేందే మాత కరుణించదు," అన్నాడు వృశ్చిక నాయకుడు.

"ఆ బలుల సంగతి తరవాత మాట్లాడదాం. ముందు లోయలోకి దారి తీయండి." అన్నాడు శిఖిముఖి.





అందరూ కొండమీది నుంచి లోయలోకి దిగసాగారు. వృశ్చికనాయకుడు ముందు ఉండి దారితీశాడు. అతడు చెప్పినట్టు లోయ చాలా భయంకరంగా వున్నది. అక్కడ వున్న మహావృక్షాల్లో ఎక్కువ భాగం పెద్దపెద్ద ఊడలు దించుకున్న మర్రి చెట్లు. వాటి నీడల్లో ఏనుగులు తారట్లాడుతున్నవి. మరి కొన్నిచోట్ల సింహాలు కోరలు చాచి గర్జిస్తున్నవి. చెట్లకొమ్మల్లో మహా సర్పాలూ, వాటి తోడెల నంటుకుని పెద్ద పెద్ద తేళ్ళూ పారాడుతున్నవి.

శిఖిముఖీ అతడి అనుచరులూ ఆయుధాలు సిద్ధంగా వుంచుకుని, తమ పరిసరాలు జాగ్రత్తగా పరీక్షించి చూసుకుంటూ లోయ అడుగుకు చేరారు. శిఖిముఖి చెప్పగా, వృశ్చిక నాయకుడు కొండమీది నుంచి నాంగ్‌సోమ్ కిందికి దూకిన ప్రాంతానికి దారితీశాడు. ఆ ప్రదేశమంతా ఎత్తయిన వృక్షాలతో, వాటిని చిక్కగా అల్లుతూ పెరిగిన లతలతో క్రిక్కిరిసి వున్నది.

వృశ్చిక నాయకుడు తల ఎత్తి చెట్ల కొమ్మల కేసి చూస్తూ కొంత దూరం నడిచి, చప్పున ఆగి, "దొరా! నాంగ్‌సోమ్ దూకిన కొండ అంచు దిగువన మనం వున్నాం. అదుగో, ఆ కొమ్మల్లో ఏదో ఆకారం కనబడుతున్నది. కాని, చెట్టును సమీపించటం ప్రమాదం, శిఖి దొరా! దానికింద ఏనుగు కుటుంబం కాపరం పెట్టినట్టున్నది." అన్నాడు.

శిఖిముఖీ, విక్రమకేసరీ తల ఎత్తి పైకి చూశారు. వాళ్ళకూ ఆ చెట్టుకొమ్మల్లో ఏదో మానవాకారం లాంటిది అస్పష్టంగా కనబడింది. అది నాంగ్‌సోమ్ అవునో కాదో తేల్చుకోవాలంటే, ముందు చెట్టుకింద వున్న ఏనుగుల్ని చెదరగొట్టి పారదోలాలి. ఇంతా చేస్తే, ఆ కనబడేది నాంగ్‌సోమ్ కాక కొండమీంచి కాలుజారి పడిన ఏ ఎలుగుబంటో కావచ్చు........





శిఖిముఖి, విక్రమకేసరి యిలాంటి సంశయాలతో కొట్టుమిట్టాడుతూండగా ఎర్రగండు పెద్దగా మొరిగింది. కుక్క అరవటం, అది తలఎత్తి చూస్తూన్న దిక్కు గమనిస్తూనే శిఖిముఖికి ఆ చెట్టుకొమ్మల్లో చిక్కుకుని వున్న ఆకారం నాంగ్‌సోమ్ అయివుంటుందన్న నమ్మకం కలిగింది.


"కేసరీ! మనం నెమ్మదిగా ఆ చెట్లకింద వున్న ఏనుగుల్ని దూరంగా తరమాలి. తరవాత చెట్టెక్కి, ఆ కనబడేది నాంగ్‌సోమే నేమో చూడవచ్చు," అన్నాడతను.

శిఖిముఖి మాట ముగించే లోపలే, చెట్టు కింద వున్న ఏనుగుల్లో రెండు పెద్దవి, భయంకరంగా ఘీంకరించి, తొండాలెత్తి వాళ్ళ కేసి రాసాగినై. అది చూస్తూనే వృశ్చికనాయకుడు, "అందరూ త్వరగా ఆ రాళ్ళ చాటుకు పరిగెత్తండి. అక్కణ్ణుంచి బండ రాళ్ళు తోసి ఏనుగుల్ని బెదరగొట్టటం సాధ్యమేమో చూద్దాం," అన్నాడు.

ఆ హెచ్చరిక వింటూనే అందరూ కొంత అంచున వున్న రాళ్ళ వెనక్కు పారిపోయారు. ఏనుగులు చెవులు టపటప లాడిస్తూ, తొండాలతో నేలను తాడిస్తూ, వాళ్ళు దాగివున్న వైపుకు కొంతదూరం పరిగెత్తుకు వచ్చి, అక్కడ వున్న బండ రాళ్ళ మధ్య కాళ్ళకు పట్టు దొరక్క వెనక్కు పోసాగినై. అదే అదనుగా శిఖిముఖివాళ్ళు అక్కడ అనవాటుగా వున్న బండరాళ్ళను వాటి కేసి దొర్లించారు. ఏనుగులు ఘీంకరిస్తూ వెనుదిరిగి అక్కణ్ణించి దూరంగా పరిగెత్తినై.

ఇప్పుడు అందరూ రాళ్ళ చాటునుంచి బయటికి వచ్చి, జాగ్రత్తగా చెట్ల కిందికి పోయారు. వృశ్చికనాయకుడు తన జాతి వాళ్ళొకణ్ణి చెట్టెక్కమని చెప్పేంతలో కుంటి జాంగ్‌లా పట్టుకర్రను చెట్టుబోదెకు ఆనించి, కోతిలా చెట్టు మీదికి గబగబా ఎగబాకి పోయారు. —(ఇంకా వుంది)





శిథిలాలయం


31

[వృశ్చికనాయకుడు శిఖిముఖితో కలియబడి ఓడిపోయాడు. శిఖిముఖి అతన్ని క్షమించి కొండ కింది లోయలోకి బయలుదేరారు. అక్కడ వాళ్ళు చెట్టు కింద వున్న ఒక ఏనుగుల మందను పారదోలారు. చెట్టు పైన కనిపించే ఆకారం నాంగ్‌సోము దేమో అన్న అనుమానం కలిగి జాంగ్‌లా గబగబా చెట్టు పైకి ఎగబాకి పోయాడు. తరవాత—]

శిఖిముఖివాళ్ళు చెట్టు కింద నిలబడ్డారు. జాంగ్‌లా గుబురుగా వున్న కొమ్మల్లోంచి ఆశ్చర్యంగా చిన్న కేక పెట్టి, "శిఖి దొరా! ఇక్కడున్నది నాంగ్‌సోమే! స్పృహ లేదు. కాని ఊపిరాడుతున్నది. మరొకళ్ళిద్దర్ని పంపితే, జాగ్రత్తగా కిందికి దించవచ్చు," అన్నాడు.

ఆ మాటలు వింటూనే వృశ్చికజాతివాళ్ళిద్దరు చెట్టెక్కారు. తరవాత కొద్ది సేపటికి జాంగ్‌లా, వాళ్ళిద్దరూ కలిసి చచ్చు పట్టు పడివున్న నాంగ్‌సోముకు లతలు పెనవేసి కట్టిన తాళ్ళతో నిదానంగా నేల మీదికి జార్చారు.

శిఖిముఖి, విక్రమకేసరి కలిసి నాంగ్‌సోము బతికివున్నాడో లేదో అని పరీక్షించబోయేంతలో, వృశ్చికనాయకుడు అల్లంత దూరంలో వున్న పొదలోంచి యింత ఆకు తెచ్చి, దాని పసరును నాంగ్‌సోము



ముక్కుల్లో పోశాడు. మరుక్షణమే నాంగ్ పెద్దగా తుమ్మి, ఎగిరి లేచి కూర్చున్నాడు.

"నాంగ్! కొండమీది నుంచి లోయ లోని చెట్టుకొమ్మల మీద పడి చిన్న దెబ్బలు తగిలినా, ప్రాణాలతో బయటపడ్డావ్!" అన్నాడు శిఖిముఖి.

నాంగ్‌సోమ్ పిచ్చివాడిలా చుట్టూ వున్న వాళ్ళనోసారి కలయచూసి, "శిథిలాలయం! శిథిలాలయం! అదుగో!" అంటూ గుంపుగా వున్న చెట్ల కేసి చేయిచూపి, లేచి పరిగెత్తబోయాడు.

శిఖిముఖి అతడి నడుం పట్టుకుని బలవంతాన కూర్చోబెట్టి, విక్రమకేసరితో, "నాంగ్‌సోమ్‌కు యింకా ఆ వెర్రివెలగ పండు విషం దిగినట్టు లేదు. ఏమిటి చేయటం?" అన్నాడు.

విక్రమకేసరి ఏదో చెప్పబోయేంతలో, చెట్లల్లో నుంచి, "రక్షించండి! రక్షించండి!" అన్న కేకలు వినిపించినై.

అందరూ అటుకేసి తలలు తిప్పారు. ఎర్రగండు పెద్దగా మొరిగింది. శిఖిముఖి ఆశ్చర్యంగా, "అది ఏకాదం అరుపా? లేక శిథిలాలయ పూజారి కంఠధ్వనా?" అంటూ కత్తిదూసి, ఆ ఆర్తనాదం వచ్చిన దిక్కుగా బయలుదేరాడు.

వటవృక్షాల నీడల్లో నుంచి శిఖిముఖి వెలుగులోకి వచ్చి ఆర్తనాదం వచ్చిన దిక్కు కేసి పరీక్షగా చూసేంతలో తిరిగి, "రక్షించండి!" అన్న అరుపు వినబడింది. ఈసారి ఆ కంఠ స్వరంలో మొదట వున్న దృఢత్వం లేదు; కొనఊపిరితో వున్నవాడి మూలుగులా వున్నది.

"కేసరీ! ఆ గొంతు శిథిలాలయ పూజారిదే, అనుమానం లేదు. వాడు నిజంగానే ఏదో ప్రమాదంలో చిక్కుకున్నట్టున్నది." అన్నాడు శిఖిముఖి.

కేసరి జవాబివ్వబోయేంతలో ఎర్రగండు పొదలమీంచి దూకి ముందుకు పోయి



పెద్దగా మొరగసాగింది. అందరూ దాని వెనకగా పొదల్లో నుంచి బయటికి వెళ్ళారు. వాళ్ళకు అక్కడ కనబడిన దృశ్యం భయాశ్చర్యాలను కలిగించింది.

ఒక పెద్ద సర్పం శిథిలాలయ పూజారిని దాదాపు మోకాళ్ళవరకు మింగింది. పూజారి రెండు చేతులతోనూ నేలమీద వున్న ఏదో వస్తువును గట్టిగా పట్టుకుని, అటూయిటూ కదులుతూ పెద్దగా అరిచేందుకు ప్రయత్నిస్తున్నాడు.

"ఈ పూజారి ఎంత దుర్మార్గుడైనా, వీణ్ణి, పాము బారినుంచి రక్షించటం మన కనీస మానవధర్మం." అంటూ శిఖిముఖి పరుగు పరుగున ముందుకు పోయి, కత్తితో పాము నడుం మీద బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు పాము అటూయిటూ పొర్లింది. దాని నోటిలో వున్న శిథిలాలయ పూజారి బయటపడ్డాడు. శిఖిముఖి వెంట వున్న వృశ్చిక జాతివాళ్ళు తమ చేతుల్లో వున్న రాతి ఆయుధాలతో పామును ఎడాపెడా బాదసాగారు.

శిఖిముఖి, విక్రమకేసరి పూజారిని సమీపించారు. పాము నోటి నుంచి బయటపడిన అతడి కాళ్ళు రెండూ రక్తం ఓడుతున్నవి. పాదాల ఆకారమే పూర్తిగా మారిపోయింది. అవి మాంసపు ముద్దల్లా ఎర్రగా







ఎందుకు డంభాలు పలుకుతావు?" అన్నాడు శిఖిముఖి కొంచెం కోపంగా.

శిఖిముఖి అలా అనగానే, పూజారి తల ఎత్తి సూటిగా అతడి కళ్ళల్లోకి చూశాడు. తరవాత ఒక క్షణం ఆగి, "నేను దుర్మార్గుణ్ణని, మోసగాణ్ణని నీ అభిప్రాయం! అంతేనా? నేను శిథిలేశ్వరి కోసమే తుచ్ఛ మానవులు కొందరికి హాని కలిగించ వలసి వచ్చింది. ఆ దేవి ముందు యీ మానవు లెంత! ఇదిగో, శిథిలాలయపు గోపుర కలశం! చూడు!" అంటూ చేతులు రెండూ పైకెత్తాడు.

అంతవరకూ శిఖిముఖి, విక్రమకేసరి పూజారి చేతులతో బలంగా పట్టుకుని వున్న వస్తువు కేసి చూడలేదు. అప్పుడు వాళ్ళకు సూర్యకాంతిలో ధగధగ మెరుస్తున్న కలశం ఒకటి కంట బడింది. వాళ్ళకు కలిగిన ఆశ్చర్యం అంతా యింతా కాదు. ఆ కలశాన్ని చూస్తూనే వృశ్చికజాతి వాళ్ళందరూ నేల మీద మోకరిల్లారు.

మెరుస్తున్నవి. పూజారి బాధతో గిలగిల కొట్టుకుంటూ పెద్దగా మూలుగుతున్నాడు. అతడి చేతులు మాత్రం ఏదో వస్తువును బలంగా పట్టుకునే వున్నవి.


శిఖిముఖి వంగి, అతణ్ణి లేవనెత్త బోయేంతలో పూజారి చిన్నగా అరిచి, "శిఖీ, నన్నిక్కడే చావనియ్యి. నేనెలాగైతేనేం, చచ్చే ముందు శిథిలాలయాన్ని కనుక్కొన్నాను! నా మంత్రశక్తి, శిథిలేశ్వరి పై నా భక్తీ వృధాపోలేదు," అన్నాడు.

"నువ్వు శిథిలాలయాన్ని కనుక్కొన్నావా! ఎక్కడుందది? మా కంటికి కనబడదేం! చావబోయే ముందు కూడా

ఒకటి రెండు క్షణాలు ఎవరి నోటి నుంచీ మాట వెలువడ లేదు. శిఖిముఖికి యిదేదో శిథిలాలయ పూజారి తమ మీద ప్రయోగించిన కనుకట్టు విద్య ఏమో అన్న అనుమానం కలిగింది. విక్రమకేసరి ఏమాలో







చించాడో ఏమో, కలశాన్ని రెండు చేతుల తోనూ బలంగా పట్టుకుని పైకెత్తాలని చూశాడు. కాని అది కదలలేదు.

అంత ప్రాణాపాయ స్థితిలోనూ శిథిలాలయపూజారి అది చూసి, పకపక మంటూ నవ్వి, "ఆ కలశమేదో నేలమీద పళ్ళెంలా బోర్లించి వున్నదనుకుంటున్నావా, చినకేసరీ! ఇప్పుడు చెపుతున్నాను. నేను నీ తాత నెరుగుదును. అయనలో వున్న మొండితనం నీలోనూ వున్నది." అన్నాడు.

"నువ్వనే దేమిటి, పూజారీ! శిథిలాలయం గోపుర కలశం వరకూ భూమిలో కూరుకు పోయిందనా?" అని అడిగాడు శిఖిముఖి.

"ఎన్నో ఏళ్ళ క్రితం భూకంపం కారణంగా అదే జరిగింది. ఆలయం కొన్ని అడుగుల లోతు భూమిలోకి దిగిపోయింది. పక్కన వున్న కొండరాళ్ళు దొర్లి దాన్ని కప్పివేసినై. ఆ రాళ్లూరప్పలూ తొలగించావంటే శిథిలాలయం, అందులోని శిథిలేశ్వరీ దేవీ కనబడుతుంది, శిఖీ! అయినా మీ శబర జాతివాళ్ళకు ఆ దేవితో పనిలేదు గదా. అక్కడ దొరికే బంగారం తప్ప!" అన్నాడు పూజారి యీసడిస్తున్నట్టుగా.

శిఖిముఖి, విక్రమకేసరి కేసి చూశాడు. చావబోయే ముందు కూడా శిథిలాలయ పూజారి తమ మీదకు ఋక్ష్యజాతివాళ్ళనూ, వృశ్చికజాతివాళ్ళనూ రెచ్చగొట్టి చూస్తున్నాడని వాళ్లిద్దరూ గ్రహించారు. పూజారిని ఏమి చేయుటమా అని వాళ్లు ఆలోచించేంతలో, నాంగ్‌సోమ్ అడుగులో అడుగు వేసుకుంటూ కలశం దగ్గిరకు వచ్చి, రెండు మూడు క్షణాలు కన్నార్పకుండా చూసి దాన్ని తాకాడు. ఆ వెంటనే అతడిలో ఏదో కొత్త శక్తి ప్రవేశించినట్టయింది.

నాంగ్‌సోమ్ ఒకసారి పెద్దగా నిట్టూర్చి, "కేసరివీరా! ఇప్పటికి నాకు వెర్రివెలగపండు తిక్క వదిలిపోయింది. ఈ కలశంలో ఏదో మహత్తున్నది. దీని అడుగున ఆలయం



వున్నదనేందుకు సందేహం లేదు. రాళ్లూ రప్పలూ తొలగిద్దాం," అన్నాడు.

"ఇది చాలా కష్టంతో కూడిన పని. అయినా తప్పదు. ఏమంటావ్, శిఖీ?" అని అడిగాడు విక్రమకేసరి.

"ఎంత కష్టకార్యమైనా మనం సాధించి తీరవలసిందే. ఇంతదూరం వచ్చి శిథిలాలయంలో ప్రవేశించకుండా ఎలా వెళ్ళటం? మీ తాతగారి ఆత్మకు శాంతి కలిగించవద్దా? మీ తండ్రిగారి ఆజ్ఞ నెరవేర్చవద్దా? కాని యీ పూజారి మాట ఏమిటి? పేడి బింట్లు ఎక్కడ? తనవాళ్ళను ఉసికొల్పజూస్తున్నాడు," అన్నాడు శిఖిముఖి.



నాంగ్‌సోమ్, శిఖిముఖి అభిప్రాయం ఏమిటో గ్రహించినవాడిలా నవ్వుతూ ముందుకు వచ్చి రహస్యం చెపుతున్న వాడిలా, "కాళ్లు రెండూ నజ్జు నజ్జయి పోయిన పూజారి వాయుకమ్మ త్వరలోనే చస్తాడు. వాడి మాటలు మీరు పట్టించుకోకండి—నాకూ, యీ కలశం శిథిలాలయానికి సంబంధించినదే అన్న నమ్మకం వున్నది," అన్నాడు.

"మనం యిక్కడ గుట్టగా పడిపోయిన చిన్నా పెద్దరాళ్ళను ఎత్తి దూరంగా పారేస్తే తప్ప వాటి అడుగున వున్న ఆలయాన్ని చేరలేం. ఇది చాలా రోజులమీద జరగవలసిన పని. మనం యీ దాపులనే నివాసాలు ఏర్పరుచుకోవలసి వుంటుంది. అందుకు అవసరం అయిన ఇళ్ళు కొమ్మలతో, ఆకులతో ముందు నిర్మించుకుని, తరవాత యీ పని ప్రారంభిద్దాం," అన్నాడు శిఖిముఖి.

నాంగ్‌సోమ్ తలవూపి వృశ్చికజాతివాళ్ళ కేసి చూశాడు. వృశ్చికనాయకుడు చేతులు కట్టుకుని శిఖిముఖి ముందుకు వచ్చి నిలబడ్డాడు. శిఖిముఖి అతడు చేయవలసిన పని చెప్పాడు. వాడు అంతా విని, "శిఖీ దొరా! ఆ ఇళ్లు కట్టటం ఏమంత పెద్ద



పనికాదు. మాతమందిరాన్ని కప్పినవాళ్ళను తొలగించటమే బహుకష్టం. ఒకటి రెండు మచ్చిక చేసిన ఏనుగులుంటే పని సులకన అవుతుంది." అని శిథిలాలయ పూజారిని వేలితో చూపుతూ, "వాడు ఎలానూ చస్తాడు. కాని మందూ మాకూ లేకుండా చావనివ్వటం బావుంటుందా?" అన్నాడు.

"వాడైతే ఏదైనా చికిత్స చేసి వాడి బాధ కాస్త తగ్గించండి. నేనా మాటే మరిచాను," అన్నాడు శిఖిముఖి.

వృశ్చికజాతి నాయకుడు చెప్పగానే అతడి అనుచరులు చెట్లల్లోకి పోయి ఏవో ఆకులూ అవీ తెచ్చి పూజారి కాళ్ళకు కట్లు కట్టబోయారు. పూజారి గట్టిగా అభ్యంతరం చెప్పుతూ, అల్లంత దూరంలో వున్న ఒక చెట్టుకొమ్మకు ఉయ్యాల వేసి తనను అందులో కూర్చోబెట్టమన్నాడు.

"నేను మరి నాలుగైదు సూర్యోదయాల కంటె ఎక్కువ చూడలేను. ఈ లోపల మీరు శిథిలాలయాన్ని వెలికి తీయండి. శిథిలేశ్వరిని చూసి సుఖంగా ప్రాణాలు వదులుతాను." అన్నాడతను.

చావబోయేవాడి కోర్కె నెరవేర్చటం ధర్మం అని శిఖిముఖీ, విక్రమకేసరీ వృశ్చికజాతివాళ్ళకు అలాగే చేయమని చెప్పారు.



వాళ్ళు శిథిలాలయ పూజారి కాళ్ళకు కట్లు కట్టి, దాపులనున్న ఒక చెట్టుకొమ్మకు అమర్చిన ఉయ్యాలలాంటి దాంట్లో అతణ్ణి కూర్చోబెట్టారు.

ఆ సాయంకాలానికల్లా అందరూ కలిసి చెట్లకొమ్మలు నరికి భూమిలో పాతి, వాటి మీద పెద్దపెద్ద ఆకులు కుట్టి, వృశ్చికజాతి వాళ్లూ, శిఖిముఖీ అతడి అనుచరులూ వుండేందుకు వీలుగా చిన్న చిన్న గుడిసెల్లాంటివి తయారుచేశారు. ఆ రాత్రి వాళ్లెవరికీ సరిగా నిద్రల్లేవు. చుట్టూ అడవి ఏనుగులు ఘీంకరించటం, క్రూరమృగాల అరుపులూ వాళ్ళ కర్ణపుటాలను బద్దలు

చేయసాగినై. గుడిశెల చుట్టూ నెగళ్ళు వేసుకుని, కునికిపాట్లు పడుతూ వాళ్ళు సూర్యోదయం వరకూ కాలంగడిపారు.

మరునాటి రోజు సూర్యోదయం నుంచీ అందరూ కలిసి పెద్ద పెద్ద రాళ్ళకు అడవి తీగలతో అల్లిన మోకులు బిగించి కట్టి, దూరంగా లాక్కుపోయి గుట్టగా వేయసాగారు. అది ఎంతో శ్రమతో కూడిన పని. దానికి అంతరాయం కలిగిస్తూ, మధ్య మధ్య అడవి ఏనుగులు కొన్ని అక్కడికి వచ్చి ఘీంకరిస్తూ వాళ్ళ మీద పడేందుకు ప్రయత్నించ సాగినై. అలాంటి సమయాల్లో అందరూ పనులు మాని ఏనుగులను బెదర కొట్టేందుకు డప్పులు వాయించటం, రాళ్ళు విసరటం చేయసాగారు.

సూర్యుడు పడమటి దిక్కుకు వాలే వరకూ వాళ్ళ పనికి పెద్ద ఆటంకం ఏమీ కలగ లేదు. శిఖిముఖి యిక ఆ నాటికి పని విరమించి, వంటపనుల సంగతి చూద్దాం అనుకునేంతలో, హఠాత్తుగా ఆ ప్రదేశానికి చుట్టూ వున్న గుట్టల మీద నాలుగు ఏనుగులు కనిపించినై. వాటిమీద పెద్దపెద్ద త్రిశూలాలు ధరించిన భయంకరాకారులున్నారు.

శిఖిముఖి, విక్రమకేసరి తమ అనుచరుల్ని హెచ్చరించి ఆయుధాలు చేత పట్టబోయేంతలో, ఏనుగుల మీద వున్నవాళ్లు పెద్దగా, "ఎక్కడి వాళ్ళక్కడ కదలకుండా నిలబడండి. మా వెనక నూరు ఏనుగుల మీద మరికొందరు అఘోరీలు వస్తున్నారు. పారిపోజూస్తే మీ ప్రాణాలు దక్కవు. జాగ్రత్త!" అన్నారు.

శిఖిముఖి, విక్రమకేసరి యిప్పుడు ఏమి-చేయటమా అని, వాంగ్‌సామ్ కేసీ, వృశ్చిక నాయకుడి కేసీ తలలు తిప్పారు. వాళ్ళిద్దరూ తమ చేతుల్లోని ఆయుధాలు పైకెత్తి త్రిశూలాలు ధరించిన వాళ్ళ కేసి బయలుదేరారు. —(ఇంకా వుంది)





32

[విపవర్మం నోట చిక్కిన శిథిలాలయ పూజారిని, శిఖిముఖివాళ్ళు కాపాడారు. వాళ్ళకు గోపురకలశం ఒకటి కనబడింది. శిఖిముఖి, తన అనుచరుల సాయంతో, దాని చుట్టూ వున్న రాళ్ళను తొలగించసాగాడు. ఆ సమయంలో పెద్ద పెద్ద త్రిశూలాలు ధరించిన నలుగురు అఘోరీలు ఏనుగుల మీద వచ్చి వాళ్ళను చుట్టుముట్టారు. తరవాత—]

తమను చుట్టుముట్టిన ఆ నలుగురు అఘోరీలే కాక, వాళ్ళకు సాయంగా మరి వంద మంది అఘోరీలు ఏనుగుల మీద వస్తున్నట్టు వినగానే విక్రమకేసరితోపాటు అందరూ భయకంపితులయ్యారు. పోరాటం లేకుండా లొంగిపోవటం అవమానకరం; అట్లని అంత మంది శత్రువులను, యీ కొద్దిమంది అనుచరులతో ఎదిరించజూడటం ఆత్మహత్యతో సమానమవుతుంది....

విక్రమకేసరి యిలా ఆలోచిస్తున్నంతలో శిఖిముఖి చిన్నగా అరిచి, ఎగిరి గంతేసి, "అజితా, వీరభద్రా! వృశ్చిక నాయకుణ్ణీ, నాంగ్‌సోమ్‌నూ వెనక్కు లాక్కురండి. ఏనుగుల మీద వున్న అఘోరీలతో వాళ్ళిలా పోరాడగలరు!" అన్నాడు.

వెంటనే అజిత వీరభద్రులు ముందుకు పరిగెత్తి, నాంగ్‌సోమ్‌నూ, వృశ్చికనాయకుణ్ణీ భుజాలు పట్టుకుని నిలిపి, శిఖిముఖి



ఆజ్ఞ ఏమిటో వాళ్ళకు చెప్పారు. వాళ్ళిద్దరూ కోపంగా తమ చేతిలోని ఆయుధాలను అఘోరీల కేసి చూపి, అయిష్టంగా వెను దిరిగి శిఖిముఖి వున్న చోటుకు వచ్చారు.

శిఖిముఖి, రాళ్ళు లాగుతున్న తనవాళ్ళ నందర్నీ పనులు ఆపమని ఆజ్ఞాపించి, "ఈ అఘోరీల వల్ల మన కెలాంటి హాని కలగదు. గోల్‌ఖరా గ్రామానికి వచ్చే దారి లోని అరణ్యాల్లో మనం వీళ్ళందర్నీ ఒకసారి కలుసుకున్నాం గదా!" అన్నాడు.

"అవును, కలుసుకున్నాం, దొరా! వీళ్ళు మహా క్రూరులు, నరభక్షకులు!" అన్నాడు కుంటి జాంగ్‌లా.



"ఆ మాట నిజమే! వీళ్ళ నాయకుడు ఘోరచిత్తుడు మనకు అభయహస్తం యిచ్చాడు. స్వయంగా యిదిగో, యీ రుద్రాక్షమాల నా చేతికి కట్టాడు." అంటూ శిఖిముఖి చేతి నున్న మాలను అందరూ చూసేందుకు వీలుగా పైకెత్తాడు.

ఆ సరికి విక్రమకేసరికి బ్రహ్మపుత్రా నదీలోయ లోని మహారణ్యాల్లో లోగడ తాము అఘోరీలను కలుసుకున్న సంఘటన గుర్తుకొచ్చింది. అతడు చిరునవ్వు నవ్వుతూ శిఖిముఖి కేసి తిరిగి, "శిఖీ! నువ్వన్నట్టు మనకు ఈ అఘోరీల నుంచి ఎలాంటి ప్రమాదం రాదు. పైగా వీళ్ళ పెంపుడు ఏనుగుల సాయంతో, యిక్కడ వున్న రాళ్ళగుట్టలను తొలగించి, త్వరగా శిథిలాలయాన్ని బయటికి లాగవచ్చు." అన్నాడు.

"నేనూ అదే అనుకుంటున్నాను. కాని, ఒక సంగతి. వీళ్ళు ఆ ఘోరచిత్తుడి శిష్యులు కాకపోతే చిక్కుల్లో పడతాం. ఆ సంగతి తెలుసుకోవడం ఎలా?" అన్నాడు శిఖిముఖి.

"వీళ్ళు మహాకాలుడి భక్తులు. ఆ కాలుణ్ణి పూజించే వారికి మాత్రం హాని చేయరు." అన్నాడు కుంటి జాంగ్‌లా.






"ఆ మాట నిజం, శిఖిదొరా!" అన్నాడు వాంగ్‌సోమ్.

"వృశ్చికమాతను మించిన దైవం లేదు. ఎవరా మహాకాలుడు? మా వృశ్చికజాతి వాళ్ళం చావనైనా చస్తాంగాని, ఈ అఘోరీల దేవుణ్ణి ఒప్పం!" అంటూ వృశ్చిక నాయకుడు రాతిగొడ్డలి ఎత్తి, తన జాతి వాళ్ళందర్నీ తన దగ్గరకు రమ్మని హెచ్చరించాడు.

వృశ్చిక నాయకుడి మూర్ఖత్వం, మొండితనం బాగా ఎరిగిన శిఖిముఖి, అనవసర రక్తపాతం జరగబోతున్నదని గ్రహించి, అతడితో శాంతంగా, "వృశ్చికనాయకా! ఈ అఘోరీల విషయంలో నువ్వేమీ ప్రమేయం పెట్టుకోనవసరం లేదు. నువ్వలా చూస్తూవుండు." అని చెప్పి, రుద్రాక్షమాల వున్న చేతిని పైకెత్తి "ఘోరచిత్తుడికీ, జై! జై, మహాకాళా!" అంటూ పెద్దగా కేక పెట్టాడు.

ఆ కేక వింటూనే ఏనుగులపై నున్న నలుగురు అఘోరీలూ త్రిశూలాలను దించి, "జై, మహాకాళా!" అని అరిచారు. తరవాత శిఖిముఖి వాళ్ళను సమీపించారు. వాళ్ళల్లో ఒకడు శిఖిముఖి కేసీ, విక్రమ కేసరి కేసీ అనుమానంగా చూస్తూ,




"అందులో ఏమీ మోసం లేదుకదా? మీ నాయకుడు పూజారి మహాజిత్తులమారి అని విన్నాం. వాడెక్కడ? మా గురువుగారైన ఘోరచిత్తుడి పేరు మీ కెవరు చెప్పారు?" అని అడిగాడు.

శిఖిముఖి, అఘోరీలకు నమస్కరించి, "మేము శిథిలాలయపూజారి అనుచరులం కాము. వాడు మాకు ప్రబల విరోధి. ఘోరచిత్తుడు స్వయంగా నా చేతికి కట్టిన రుద్రాక్షమాల యిదిగో!" అంటూ చేతిన వున్న మాలను చూపాడు.

ఆ అఘోరీలు ఆశ్చర్యపోతూ ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు. వాళ్ళల్లో ఒకడు





పక్కన వున్న వాడితో, "ఇది వింతగా లేదా? మనం శత్రువుల్ని వేటాడ వస్తే, వాళ్ళు మనకు మిత్రులం అని చెప్తు తున్నారు. ఆ రుద్రాక్షమాల సంగతి నమ్మ దగిందేనా?" అన్నాడు.

ఆ ప్రశ్నకు రెండవ అఘోరీ అరచేత్తో నుదుటి మీద కొట్టుకుని, "ఈ అనుమానాలతో కాలయాపన జరిగిపోతున్నది. లాభంలేదు, మన గురువునే పిల్చుకు వస్తాను," అంటూ ఏనుగును దాపుల నున్న మిట్ట మీదికి దౌడు తీయించి, అక్కడ దాని మీద నిలబడి చేతులు ఊపుతూ పెద్దగా ఏవో కేకలు పెట్టసాగాడు.



నాలుగైదు నిమిషాలు గడిచీ గడవక ముందే, పర్వతాకారంలో వున్న ఒక ఏనుగు మీద వృద్ధు డొకడు మిట్ట వెనక వున్న పల్లంలో నుంచి మిట్ట మీదికి వచ్చారు. అతడి వెనకగా మరి కొందరు అఘోరీలూ, అటవ్యజాతివాళ్ళూ కాలినడకన ఏనుగు వెనగ్గా కదిలి వచ్చారు.


అంత దూరంలో వుండే, ఏనుగు మీద వున్న వృద్ధుణ్ణి గుర్తించిన శిఖిముఖి, సంతోషంగా ఒక కేక పెట్టి, "ఘోరచిత్తుడికి, జై!" అన్నాడు.

ఘోరచిత్తుడు తాపీగా ఏనుగును నడుపుకుంటూ శిఖిముఖి వాళ్ళున్న చోటుకు వచ్చి, అందర్నీ ఓసారి కలయజూసి, మౌనంగా ఏనుగు మీంచి దిగి, శిఖిముఖిని గట్టిగా కౌగలించుకున్నాడు. ఆ దృశ్యం చూస్తూనే విక్రమకేసరికి తమ కష్టాలన్నీ తొలగిపోయినవని, వచ్చిన పని విజయవంతంగా నెరవేరబోతున్నదని, గట్టి నమ్మకం కలిగింది. అతడు ఉత్సాహంగా, "ఘోరచిత్తుడికి, జై!" అన్నాడు. అతడి అనుచరులంతా జై అంటూ ఏకకంఠంగా పలికారు.

ఘోరచిత్తుడు చిరునవ్వు నవ్వుతూ విక్రమకేసరిని సమీపించి, "కేసరీ! మీ తాత విక్రమకేసరి గురువు మాకు చేసిన




CHITRA





ఎత్తుగా వున్న గుట్ట వెనక భాగాన్నుంచి కొందరు అభ్యుజాతివాళ్లూ, అఘోరీలూ తమ కేసి రావటం అతడి కంటబడింది. ఇంతమంది అభ్యుజాతివాళ్ళను ఘోర చిత్తుడు ఎలా కూడగట్టుకున్నాడో అతడికి అర్థంకాలేదు.

కేసరి ఏనుగు మీంచి దిగి ఘోరచిత్తుడికి తన కృతజ్ఞత తెల్పుకుని, శిఖిముఖికీ, నాంగ్‌సోమ్‌కూ తాను చూసిన అభ్యుజాతి వాళ్ళను గురించి చెప్పాడు. శిఖిముఖి కూడా ఆశ్చర్యం కలిగి, అతడు ఘోర చిత్తుణ్ణి ప్రశ్నించాడు.

"అంతా ఆ మహాకాలుడి దయ!" అంటూ ఘోరచిత్తుడు ఆకాశం కేసి చేతులెత్తి నమస్కరించి, "మహారణ్యంలో మిమ్మల్ని కలుసుకున్న తరవాత, శిథిలాలయ పూజారిని గురించి మరి కొన్ని వివరాలు తెలుసుకోవటమే గాక ఈ లంక లోని శిథిలాలయం సంగతి ఒక అభ్యు వృద్ధుడి ద్వారా వివరంగా విన్నాను. ఆ పూజారి దుర్మార్గుడూ, మీరూ ఇక్కడికి బయలుదేరారని తెలిసి, వాణ్ణించి మీకు ప్రమాదం రాకుండా చూసేందుకు నేనూ మరొక పడవలో నా శిష్యులతో ప్రయాణం కట్టాను. దారిలో మీ పడవ వెనక కొంచెం అల

ఉపకారానికి ప్రత్యుపకారం చేసే అవకాశం కలిగినందుకు చాలా ఆనందంగా వుంది. ఆయన చూడాలనుకున్న శిథిలాలయాన్ని మనవడివైన నువ్వు చూడగలిగావు. ఆ ఆలయ ప్రాంగణంలో వున్న అపురూప శిల్పాలూ, నిధులూ అన్నీ నీవే. అదుగో, భద్రకాళి పైన ఎక్కి చూడు! ఆ సంపదనంతా మోసుకు పోయేందుకు మరి కొందరు అభ్యుజాతివాళ్ళు కూడా వస్తున్నారు," అంటూ విక్రమకేసరిని అనాయాసంగా ఏనుగు పైకి ఎత్తాడు.

ఏనుగు పై నుంచి విక్రమకేసరి పరిసర ప్రాంతాలను ఓసారి కలయచూశాడు.



శ్యంగా బయలుదేరి దారితప్పిన, గోల్ఖరా అభ్యుల పడవ తటస్థపడింది. అందరం కలిసి యీ వృక్షకలంక చేరాం." అన్నాడు.

"మీ సహాయానికి ఎంతో కృతజ్ఞులం. ఇక్కడ వున్నది నిజంగా తాతకేసరి చూడా లనుకున్న శిథిలాలయం అయివుంటే, మనం త్వరత్వరగా దీన్ని కప్పిన రాళ్ళగుట్టలను తొలగించాలి." అన్నాడు శిఖిముఖి.

"అదెంతపని! నా వెంట మరికొన్ని మచ్చిక చేసిన ఏనుగులు వున్నయి. వాటి చేత పనిచేయించటంలో సమర్థులైన అభ్యజాతి వాళ్ళు కొందరున్నారు." అన్నాడు, ఘోరచిత్తుడు.



ఇంతలో ఘోరచిత్తుడి వెంట పడవలో వచ్చిన అభ్యజాతివాళ్లంతా చిలవిలమంటూ అక్కడికి వచ్చారు. వాళ్లు తమ గ్రామం వాడైయున్న నాంగ్‌సోమ్‌నూ, శిఖిముఖి, విక్రమకేసరులనూ గుర్తించారు. అందరూ వాళ్ళ చుట్టూచేరి ఆనందం పట్టలేక నాట్యం చేయసాగారు.

ఈ కోలాహలం మధ్య నుంచి ఘోరచిత్తుడు శిఖిముఖిని, విక్రమకేసరిని దూరంగా తీసుకుపోయి, "ఇంతకూ ఆ శిథిలాలయ పూజారినని చెప్పుకునే దుష్టుడు ఏమయ్యాడు? ఈ లంకలో వాడి శిష్యుల్ని ముగ్గురిని పట్టుకున్నాం. వాళ్ళు మా దగ్గిర బందీలుగా వున్నారు. తమ గురువు ఏమైందీ తెలియదంటున్నారు." అన్నాడు.

"ఇంతవరకూ మీకు ఆ పూజారిని గురించి చెప్ప మరిచాం. మీరు పట్టుకున్న ఆ ముగ్గురూ వాడి శిష్యులు కాదు, బంట్లు. మా ప్రాంతాల్లోని తిమ్మగూడెం అరణ్యాలలో వాళ్ళు దారిదొంగలు. దబ్బాశ చూపి ఆ దుర్మార్గుడు వాళ్ళను యింత దూరం తీసుకు వచ్చాడు. ఇక వాడు ఏమయా డంటారా? చావుబతుకుల్లో వున్నాడు." అంటూ శిఖిముఖి, ఘోరచిత్తుణ్ణి చెట్ల కేసి తీసుకుపోయి, కొమ్మలకు కట్టిన ఉయ్యా

లలో కూర్చుని వున్న శిథిలాలయ పూజారిని చూపించాడు.

పూజారి కళ్లు తెరిచేవున్నవి. కాని, మనిషిలో చలనం లేదు. పాము నోటి నుంచి బయటపడినప్పటికీ, అప్పుడు తగిలిన గాయాలు మాననందువల్ల అతడు ప్రాణాపాయ స్థితిలో వున్నాడు.

శిఖిముఖి కొద్ది మాటల్లో తాము వృశ్చిక లంకలో దిగిన క్షణాన్నుంచి జరిగినదంతా ఘోరచిత్తుడికి చెప్పి, "ఆ విషసర్పం నుంచి నేను కాపాడకపోతే, యీ సరికి దాని పొట్టలో జీర్ణమై పోయివుండేవాడు, పూజారి," అన్నాడు.

ఆ మరుక్షణానే పూజారిలో చలనం కన బడింది. అతడు చేతులు రెండూ ఎత్తి ఘోరచిత్తుడికి నమస్కరిస్తూ, "నువ్వు మహాకాలుడి భక్తుడివి. నేను శిథిలేశ్వరి పూజారిని. ఆ విధంగా ఇద్దరం ఒకేరకం భక్తులం. నేను మరి ఎంతో కాలం బతకను. రాళ్ళతో కప్పబడిన శిథిలేశ్వరిని త్వరగా వెలికి తీయించు, చూసి, ప్రాణాలు విడుస్తాను." అన్నాడు. ఈ మాటలు అంటూండగానే అతడి కళ్ళ నుంచి నీళ్ళు ఏకధారగా ప్రవహించసాగినై.

ఘోరచిత్తుడు నాలుగైదు క్షణాలపాటు కన్నార్పకుండా శిథిలాలయ పూజారి ముఖం కేసి చూసి, ఒక్కసారిగా నిలువెల్లా కంపించిపోయి, బొంగురుపోయిన గొంతుతో, "అతడు ఎంత దుర్మార్గుడైనా మహాభక్తుడు! సందేహం లేదు!" అంటూ వెనుదిరిగి, తన శిష్యులతో, "ఏనుగుల్ని తోలుకు వచ్చి ఆలయాన్ని కప్పిన రాళ్ళను త్వరగా ఎత్తించివేయండి!" అని చెప్పాడు.

గురువు ఆజ్ఞ వింటూనే అఘోరీలూ, వాళ్ళ వెంట వచ్చిన భిక్షుకులూ ఏనుగుల మీద ఎక్కి వాటిని ఆలయం కేసి పరిగెత్తించుకు రాసాగారు.

—(ముగింపు వచ్చేసంచికలో)






33

[ఆలయాన్ని కప్పి వున్న రాళ్ళను, శిఖిముఖి, విక్రమకేసరీ తొలగిస్తూండగా, అఘోరీల గురువైన ఘోరచిత్తుడు అక్కడికి వచ్చి, శిఖిముఖి ద్వారా జరిగినదంతా విన్నాడు. మరణావస్థలో వున్న శిథిలాలయ పూజారిని పలకరించి, అతడు తన శిష్యుల్ని, ఆటవికజాతి వాళ్ళనూ ఏనుగుల సాయంతో రాళ్ళను తొలగించమని ఆజ్ఞాపించాడు. తరవాత—]

ఘోరచిత్తుడి శిష్యులూ, ఆటవికజాతి వాళ్ళూ శిథిలాలయాన్ని కప్పివేసిన బండ రాళ్ళను తొలగించే పనికి పూనుకున్నారు. వాళ్ళు మోకులను రాళ్ళకు కట్టి, రెండవ కొసను ఏనుగుల నడుములకు బిగించి, వాటిని గట్టిగా అదలించగానే, అవి ఘీంకరిస్తూ రాళ్ళను దూరంగా లాక్కుపోసాగినై.

శిఖిముఖి, విక్రమకేసరీ ఘోరచిత్తుడి పక్కన నిలబడి ఎప్పుడు శిథిలాలయం బయటపడుతుందా అని, కుతూహలంగా చూడసాగారు.

సూర్యాస్తమయ సమయానికి రెండు మూడు గంటలు ముందుగానే రాళ్ళన్నీ తొలగించటంతో శిథిలాలయం బయట పడింది. అక్కడ వున్న దేవీవిగ్రహాన్నీ, ఆ విగ్రహం ముందు గుట్టలు గుట్టలుగా పడి వున్న బంగారు కణికెల్నీ చూసి, శిఖిముఖి, విక్రమకేసరులు నివ్వెరపడి





పోయారు. కాని, వాళ్ళకు ఆ బంగారం మీద ఏలాంటి ఆశా లేదు. తాత విక్రమకేసరి, తన రాజధానికి తీసుకు పోవాలనుకున్న అపురూపశిల్పాల కోసం ఆ శిథిలాలయం లోని అన్ని గదులూ వెతకసాగారు.

ఒక చీకటి గది వెనకవైపు నుంచి సన్నని కాంతి రావటం ముందుగా శిఖిముఖి చూశాడు. అతడు విక్రమకేసరికి ఆ సంగతి చెప్పి, ఆ కాంతి వస్తున్న చోటుకు వెళ్ళాడు. అక్కడ ఏడెనిమిది అడుగుల ఎత్తున, పలకలు తీర్చి చెక్కబడిన ఒక రాయి వున్నది. వెలుగు ఆ రాయికి ఒక పక్క నుంచి వస్తున్నది.

"కేసరీ! దీని వెనక ఏదో పెద్ద గది వున్నట్టున్నది. లోపలి నుంచి కాంతి బయటికి వస్తున్నదంటే – దాని పై భాగాన కప్పు వుండి వుండదు." అన్నాడు శిఖిముఖి.

"నాకూ అదే అనుమానం కలుగుతున్నది. కాని, ఈ రాయి ఒక పట్టాన కదిలేట్టు లేదే!" అన్నాడు విక్రమకేసరి రాతిని కదిలించే ప్రయత్నం చేస్తూ.


శిఖిముఖి తన అనుచరుల్ని కేక వేశాడు. అందరూ కలిసి తలుపులా నిటారుగా వున్న రాతిని ఒక పక్కన గట్టిగా పట్టుకుని, వెనక్కు గుంజారు. రాయి దఢీమంటూ వెనక్కు పడిపోయింది. ఆ వెంటనే వారికి గదిలో దేదీప్యమానంగా వెలిగిపోతున్న బంగారు, లోహ విగ్రహాలు—అన్ని రకరకాల దేవీమూర్తులవి కనిపించినై.

ఆ విగ్రహాలను చూసి శిఖిముఖి, విక్రమకేసరులు పరమానందం చెందారు. తమ దేశంలో అలాంటి గొప్ప శిల్పాలను తయారు చేయగల శిల్పు లెవరూ లేరు. తాత విక్రమకేసరి ఆభ్యుజాతి వాళ్ళ ద్వారా ఆ కళాఖండాలను గురించి విన్నదాంట్లో అబద్ధం ఏమీ లేదు....

శిఖిముఖి, విక్రమకేసరి తాము చూసిన కళాఖండాలను గురించి ఘోరచిత్తుడితో








చెప్పేందుకు ఆలయం నుంచి బయటికి వచ్చారు. వాళ్ళకు ఆలయం ఎదురుగా వున్న ఒక రాతి మీద ఘోరచిత్తుడూ, పక్కనే తన బంట్లయిన అడవి దొంగల భుజాల మీద చేతులు వేసి నిలబడి, గర్భ గుడిలోని దేవీవిగ్రహం కేసి చూస్తున్న పూజారీ కనిపించారు. సమరభేరుండుడు ఆటూ యిటూ దూకుతూ పూజారికి ఏమో చెప్పుతున్నాడు.

శిఖిముఖి తనను సమీపించగానే, శిథిలాలయ పూజారి అతడికి నమస్కరిస్తూ, "శిఖీ, ఆటవికుడివైనా, చిన్నవాడివైనా నీకు నమస్కరించకుండా వుండలేను. నీ ధైర్య సాహసాలూ, చివరికి ఘోరచిత్తుడి సహాయం వల్లనే నేను శిథిలేశ్వరిని చూడ గలిగాను. అక్కడ దొరికే వెండి బంగారాలతో నేను మహారాజులా జీవించాలని తలచాను. కాని, శిథిలేశ్వరి మరోలా తలచింది. నేను వెయ్యేళ్ళుగా యీ ఆలయానికి పూజారినంటే—యీ ఒక్క జన్మలోనే అని కాదు; నా పూర్వజన్మలన్నీ కలిపి అన్న మాట! నాకు పూర్వజన్మ జ్ఞానం వున్నది." అంటూ శివమెత్తిన వాడిలా అటూ యిటూ తూలిపోతూ, కళ్ళు మూసుకుని ఏదో గొణుగసాగాడు.

శిఖిముఖి, పూజారిని పట్టుకున్న అడవి దొంగలను హెచ్చరిస్తూ, "జాగ్రత్త, గట్టిగా పట్టుకోండి. కాలు జారి ముందుకు పడ్డాటంటే, చావు తప్పదు!" అన్నాడు.

పూజారి ఆ మాటలు వింటూనే కళ్ళు తెరిచి, "శిఖీ, నే నెలాగూ ఎక్కువ కాలం బతకను. ఒకవేళ బతికినా నుజ్జయి పోయిన కాళ్ళు నరికించుకుని కుంటి పూజారిగా హీనమైన బతుకు బతకాలి. సరే, మువ్వూ, విక్రమకేసరీ, నా శిష్యులైన సమరభేరుండాన్నీ, యీ ఇద్దరు అరణ్య జీవుల్నీ శిక్షించక, క్షమించి వదిలి పెట్ట కోరుతున్నాను," అన్నాడు.





శిఖిముఖి, విక్రమకేసరి కేసి చూశాడు. విక్రమకేసరి అలాగే చేద్దాం. అన్న సూచనగా తలాడించాడు. అప్పుడు శిఖిముఖి పూజారితో, "వాళ్ళ విషయమై నీ కేలాటి చింతా వద్దు. వాళ్ళు సొంత బుద్ధి అంటూ లేనివాళ్ళు; కొత్త సమర్థుడైన వాడెవడికైనా వాళ్ళు విశ్వాసంగా సేవ చేస్తారు. ఈ క్షణం నుంచీ వాళ్ళు, నా అనుచర వర్గంలోని వాళ్ళు. తృప్తి కలిగిందా?" అని అడిగాడు.

పూజారి బాధతో చిన్నగా మూలిగి, బలవంతంగా పెదాల మీదికి చిరునవ్వు తెచ్చుకుని "తృప్తి కలిగిందా అంటున్నావా?



ఈ క్షణాన యీ లోకంలో నా కన్న ఎక్కువ తృప్తి, ఆనందం అనుభవిస్తున్న వాడెవడు? ఈ కళ్ళతో శిథిలేశ్వరిని చూశాను! అదుగో, దేవి పిలుస్తున్నది....పిలుస్తున్నది!" అంటూ పెద్దగా అరిచి, దొంగల పట్టు వదిలించుకుని రాతి మీంచి కిందికి దూకేశాడు.

శిఖిముఖి, ఘోరచిత్తుడూ, వాళ్ళ అనుచరులూ తలలు వంచి పూజారి పడిన చోటు కేసి చూశారు. పూజారి నెత్తురుతో తడిసి పోయిన రాళ్ళ మీద ఒకటి రెండు క్షణాలు గిలగిలా తన్నుకుని కదలా మెదలక వుండిపోయాడు.

"దుర్మార్గుడూ, మహాపాపీ అయినవాడు చావవలసిన చావే చచ్చాడు!" అన్నాడు కుంటి వాంగ్‌లో ఉత్సాహంగా.

"అట్లనకు. పుణ్యాత్ముడూ, మహా భక్తుడూ అయినవాడు చావవలసిన చావు చచ్చాడు, పూజారి! మహాదేవి సమక్షంలో యిలాంటి చావు ఎందరికి లభ్యమవుతుంది!" అన్నాడు ఘోరచిత్తుడు విచారంగా.

"దొర దారిన దొర పోయాడు! నాకు గండభేరుండంలా ఆకాశంలో ఎగిరే శక్తి కూడా పోయింది!" అంటూ సవరభేరుండం కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.





శిఖిముఖి అతణ్ణి కసురుతూ, "ఏయ్, భైరుండం! నీ కేనాడూ ఆకాశంలో పక్షిలా ఎగిరే శక్తి లేదు. తాగిన మైకంలో అలా అనుకుంటూండేవాడివి. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని, మంచి మార్గాన పడక పోయావో, నిన్ను సవరనాయకుడు గండు పోతుకు ఒప్పచెప్పుతాను," అన్నాడు.

"అలాగే చేయి దొరా! వింధ్యకు దక్షిణాన్నుంచి, హిమాలయాలు చేరిన సవరజాతి వారెవరున్నారు? గండుపోతు తప్పక నాకు మంచి మర్యాదలు చేస్తాడు. అతని కూతురు నాగమల్లి నుంచి మాత్రం నన్ను రక్షించండి!" అన్నాడు సవరభైరుండం.

అతడి మాటలకు అందరూ విరగబడి నవ్వారు.


సూర్యోదయంతోనే అందరూ ప్రయాణ సన్నాహాలు ప్రారంభించారు. శిథిలాలయంలోని అపూర్వ శిల్పాలను, అక్కడి నుంచి తమ దేశానికి తరలించుకు పోయేందుకు శిఖిముఖి, విక్రమకేసరి వృశ్చికనాయకుడి అనుమతి కోరారు. వృశ్చిక నాయకుడు తన జాతివాళ్ళతో సంప్రతించి, "ఆ శిల్పాలే కాదు, వృశ్చికమాత మందిరంలో వున్న బంగారు కలికెల్ని కూడా మీరే ఎత్తుకు పొండి. ఈ వృశ్చికలంకలో వాటి అవసరం



మాకు లేదు. మాకు వృశ్చికమాత వున్నది. అరణ్యంలో కావలసినంత వేటా, పండ్లూ ఫలాలూ వున్నవి!" అన్నాడు.

శిఖిముఖి వృశ్చికనాయకుడికి తన కృతజ్ఞత చెప్పుకుని విక్రమకేసరితో, "కేసరీ! నేను ఆటవికుడిగా మాట్లాడుతున్నాను; బంగారమనేది మనిషిని బాధలా, కష్టాలా పాలు చేస్తుంది. ఇది వేటాడి జీవించే మా శబరజాతి వాళ్ళ నమ్మకం!" అన్నాడు.

ఆ మాటలకు విక్రమకేసరి నవ్వి, "నీ నిజాయితీ మెచ్చదగిందే. కాని, క్షత్రియుడిగా, శూరసేనదేశ రాజకుమారుడుగానే మాట్లాడుతున్నాను. సమర్థుడూ, వివేకి



ఆయన రాజు చేతిలో ఆ బంగారం ప్రజలకు మేలు చేస్తుంది. శత్రువుల్ని సంహరిస్తుంది!" అన్నాడు.

"అలా అయితే, నా అభ్యంతరం ఏమీ లేదు. ఆ అపూర్వ శిల్పాలతో పాటు, బంగారాన్ని కూడా నీ రాజధాని నగరానికి ఎత్తుకుపో," అన్నాడు శిఖిముఖి.

"ఆ ఎత్తుకుపోయేది నేనొక్కణ్ణి కాదు. నువ్వూ ముందుగా మా రాజధాని నగరం వస్తున్నావు. ఆ తర్వాత మనిద్దరం కలిసి మీ కుంభారమిట్ట పల్లెకు వెళతాం. శిథిలాలయపూజారి శిఖి కోశావుగదా! జాగ్రత్తగా దాచావా? నవరనాయకుడు గండు



పోతు కూతురు నాగుమల్లి అది కావాలన్నది గదా?" అన్నాడు విక్రమకేసరి.

"అవును, నేను ఇల్లు వదిలి ఇంత దూరం ఉత్తరంగా ప్రయాణించింది, ఆ శిఖ కోసమే అన్నట్టుగా ఇప్పుడు అనిపిస్తున్నది. ఆ నాగుమల్లిది ఎలాంటి పగ!" అన్నాడు శిఖిముఖి నవ్వుతూ.

"అది నాగుమల్లి కాదు, నాగుపాము! అలాంటి వాళ్ళల్లో పగా, ప్రేమాకూడా అంత బలంగానే వుంటవి. అవునా?" అన్నాడు విక్రమకేసరి.

శిఖిముఖి చిరునవ్వు నవ్వుతూ వూరుకున్నాడు. ఆ తరవాత వాళ్ళిద్దరూ తమ అనుచరుల సాయంతో, శిథిలాలయంలోని బంగారాన్ని, శిల్పాలనూ పడవలకు ఎక్కించారు. మిట్టమధ్యాహ్నం వేళ పడవలు రెండూ గోలేశ్వరం కేసి తిరుగు ప్రయాణం అయినై. వీడ్కోలు ఇచ్చేందుకు వచ్చిన వృశ్చికనాయకుడికి శిఖిముఖి, విక్రమకేసరీ తమ కృతజ్ఞత చెప్పుకున్నారు. ఘోరచిత్తుడు అతడికి, సంవత్సరానికి ఒకసారి వచ్చి, దేవీదర్శనం చేస్తానని మాటయిచ్చాడు.

దారిలో ఎలాంటి ప్రమాదాలూ జరక్కుండా వారంరోజుల తరవాత పడవలు రెండూ గోలేశ్వర గ్రామం చేరినై. అక్కడ







అఘోరజాతి కులపెద్ద, అందరినీ ఆహ్వానించి, రెండురోజులపాటు గొప్పగా విందువినోదాలు ఏర్పాటు చేశారు. విక్రమకేసరి శిథిలాలయం నుంచి తెచ్చిన శిల్పాలలో సాటిలేని చమత్కున్న ఒక దేవతా విగ్రహాన్ని తన తాత విక్రమకేసరి సమాధికి ఎదురుగా స్థాపన చేశారు. నాంగ్‌సొమ్‌కూ, తదితరులకూ తను తెచ్చిన బంగారంలో కొంత పంచిపెట్టాడు.

మూడవ నాటి ఉదయం గోల్‌ఛరా అఘోరీలకు వీడ్కోలు చెప్పి, శిఖిముఖీ వాళ్ళు ప్రయాణమై రెండువారాల తరవాత కామాఖ్యా నగరం చేరి, అక్కడ తాము పూర్వం విడిది చేసిన సత్రంలోనే దిగారు. సత్రపు యజమాని వాళ్ళను గుర్తించి ఎంతో మర్యాద చేసి, కుంటి జాంగ్‌లా ద్వారా శిథిలాలయాన్ని గురించి సర్వం విన్నాడు.

కామాఖ్యా నగరంలో ఒక వారం రోజులు విశ్రాంతి తీసుకున్న తరవాత ఘోరచిత్తుడు తన శిష్యులతో హిమాలయాల్లోని తీర్థాలకు మళ్ళీ ప్రయాణమైపోతూ, విక్రమకేసరిని కౌగలించుకుని, "గురువు విక్రమకేసరి, మా అఘోరీలకు చేసిన మేలుకు, ఆయన మనవడివైన నీకు, మా చేతనైన సహాయం చేశాం. ఎంతో తృప్తిగా వుంది! నీకు నూరేళ్ళు ఆయుస్సు. ఆ తరవాత శివసాయుజ్యం ప్రాప్తించాలని కోరుకుంటున్నాను.'' అన్నాడు.

కామాఖ్యానగరం నుంచి ప్రయాణమయ్యేప్పుడు శిఖిముఖి కుంటి జాంగ్‌లాను తన వెంట రమ్మన్నాడు. బతికున్నంత వరకూ సుఖంగా జరిగేలా చూస్తానన్నాడు. కాని అతడు ఆ నగరం వదిలేందుకు ఇష్టపడలేదు. అప్పుడు విక్రమకేసరి అతడికి కొంత బంగారం ఇచ్చి, దానితో బతికినన్నాళ్ళూ సుఖంగా బతకమన్నాడు.

ఆ బంగారం చూసి కుంటి జాంగ్‌లా కృతజ్ఞతతో కళ్ళనీళ్ళ పర్యంతమై "దొరా!

నేను మొదట్లో మీకు ద్రోహం చేశాను. అయినా మీ రిద్దరూ నన్ను క్షమించారు. నేను యిక్కడే మరేదైనా సత్రం కట్టి సుఖంగా జీవిస్తాను. బహుశా, మీ కుమారు లెవరైనా, యీ ప్రాంతాలు చూసేందుకు వస్తే, వారికి నా సత్రంలోనే ఆతిథ్యం జరుగుతుంది." అన్నాడు.

శిఖిముఖి, విక్రమకేసరి అతడి మాటలకు చాలా సంతోషించారు. తరవాత తాము తెచ్చిన శిల్పాలనూ, బంగారాన్నీ మోసేందుకు గుర్రాలనూ, వాటిని తోలేందుకు మనుషులనూ కుదుర్చుకుని, తమ అనుచరులైన అజిత వీరభద్రులతో కలిసి దాదాపు మూడునెలల ప్రయాణం తర్వాత శూరసేనదేశ రాజధానీనగరం చేరారు.

విక్రమకేసరి తండ్రి జయపాలుడు వాళ్ళకు రాజోచితమైన సన్మానం చేశాడు. భటుల ద్వారా సవరనాయకుడు గండుపోతు కుటుంబానికీ, శిఖిముఖి తండ్రి శివాలుడికీ కబురు చేసి, వాళ్ళను తన రాజధానీ నగరానికి పిలిపించాడు.

గండుపోతు కూతురు నాగుమల్లి, శిఖిముఖిని చూస్తూనే, "శిథిలాలయం పూజారి శిల తెచ్చావా?" అని అడిగింది.

ఎంతోకాలంగా భద్రంగా తన నడుముకు బిగించుకున్న ఆ శిలను శిఖిముఖి ఆమె కిచ్చాడు. నాగుమల్లి ఆనందం అంతాయింతా కాదు. విక్రమకేసరి చెప్పగా వాళ్లిద్దరి ప్రేమను గురించి విన్న రాజా జయపాలుడు, వాళ్ళ తల్లిదండ్రులతో మాట్లాడి, ఒక శుభ ముహూర్తాన, శిఖిముఖికీ, నాగుమల్లికీ వైభవంగా వివాహం చేశాడు.

శబర, సవరజాతి పెద్దలూ, వాళ్ళ పిల్లలూ, అనుచరులూ, ఒక నెలరోజుల పాటు జయపాలుడి ఆతిథ్యంలో విందులూ, వేడుకలతో కాలం గడిపి, తరవాత ఎవరి గ్రామాలకు వాళ్ళు వెళ్ళిపోయారు.

—(అయిపోయింది)

